



అదో చిన్న పల్లెటూరు. అయినా అందులోనూ అన్నిరకాలవాళ్ళూ వున్నారు. ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు, చదువుకున్నవాళ్ళు, చదువు రానివాళ్ళు, ఏ చదువూ లేకపోయినా ఎంతమందినైనా ఏకకాలంలో మోసగించగల నేర్పరులు, సంస్కారవంతులు, సదుద్దేశాలతో గ్రామాన్ని ఉద్ధరిద్దా మనుకునేవాళ్లు, స్వార్థచింతనతో ఏవో చేస్తామని వాగ్దానాలు చేసి, సమయానికి అవి మర్చిపోయే వాళ్లు, ఎందరో వున్నారావూళ్లో.

అయితే ఆ వూరందరికీ పూజ్యులు, అభిమానపాత్రులు గౌరవనీయులు, తరతరాలుగా మంచితనానికి పేరెన్నిక గన్న వంశస్థులు శ్రీ రావుబహద్దూర్ రఘుపతిరావుగారు రఘుపతిరావుగారికి చాలాకాలంవరకూ సంతాన భాగ్యం కలగలేదు. వంశం నిర్వంశ మవుతుందేమో! తమకింక సంతాన సుఖం ప్రాప్తం లేదేమో! అని బాధపడుతున్న తరుణంలో అతికాల అనావృష్టి తర్వాత కురిసి మురిపించే వర్షధారలా వారికి నలభై యేళ్ళు నిండిన శుభ ఘడియల్లో వంశాంకురంగా పుట్టాడు శేఖర్.

తలిదండ్రులు ఎంత గారాబంగా పెంచినా క్రమశిక్షణకు లోటులేక పోవడంవల్ల వున్నవూళ్లో హైస్కూలు వరకూ చదివి ఆ తర్వాత కాలేజీ చదువుకోసం పట్నం చేరాడు శేఖర్. ప్రతి సంవత్సరం క్లాస్ ఫస్టు తెచ్చు

కుంటూ, తన కత్యంత అభిమాన పాత్రమైన బి యస్సి. ఎగ్రికల్చర్ ఆఖరి సంవత్సరం పరీక్షలు వ్రాసి, ఉరుకుల పరుగులతో స్వగ్రామం బయలు దేరాడు.

శేఖర్ పట్నంలో చదివినా, పల్లె వాతావరణమంటేనే మక్కువ ఎక్కువ. రణగొణధ్వనులతో, అనుక్షణం దుమ్మెత్తి పోస్తూ పోయే వాహనాలతో, ఎప్పుడు చూసినా ఏదో కొంపలంటుకుపోతున్నట్లు పనులతో క్షణం విశ్రాంతిలేకుండా తిరిగే జనాభాతో నిండివుండే ఆ కలకత్తా మహా నగరంకంటే... ప్రశాంతమైన ప్రకృతి సౌందర్యాన్ని నింపుకున్న పచ్చటి చేలతో, ఆత్మీయంగా పలకరిస్తూ, అపేక్ష పంచే అమాయక ప్రజలంటే వారిలో పొంగిపొర్లే ప్రేమవాహినంటేనే చిన్నప్పటినుండీ అదోరకమైన అభిమా నాన్నీ, ఆత్మీయతను పెంచుకున్నాడు.

ఆఖరి సంవత్సరం పరీక్షలు వ్రాసి యింక గుడ్‌బై టు కలకత్తా అనుకొంటూ ట్రెయినెక్కిన శేఖర్ స్వేచ్ఛగా గాలి పీల్చుకున్నాడు కాలేజీలో అతని గాంభీ ర్యాన్ని చూసి దగ్గరైన ఫ్రెండ్స్‌కూడా చాలా తక్కువ.

అయితే శేఖర్ ఫ్రెండ్స్‌కు ఎంత దూరంగా ఉండిపోయినా, శిరీష్ నుంచి తప్పించుకోడం సాధ్యంకాలేదు. విన్నా, వినకపోయినా ఎక్కడెక్కడివో కబుర్లు చెప్పి నవ్విస్తూ, నవ్వుతూ వుండే క్లాస్ మేట్, రూమ్‌మేట్. అయిన శిరీష్ నుంచి మాత్రం తప్పించుకోడం సాధ్యం కాలేదు. ముత్యాల్లాంటి పలువరుస కన్పిం చేలా ఎప్పుడూ నవ్వుతూవుండే శిరీష్ నవ్వులో ఏదో ఆకర్షణ. అమాయకమైన ముఖం చూస్తే తప్పించుకోవాలని ఎవరూ అనుకోరు. ఎంత కొత్తవారినైనా ఇట్టే పరిచయం చేసుకొనగల నేర్పు అతని సొంతం. కలకత్తా వదిలి వస్తూంటే బాధపెట్టిన జ్ఞాపకం ఒక్కటే. శిరీష్‌ను వదిలి రావల్సి వస్తుందని. శిరీష్ వాళ్ళది కలకత్తాయే. అయినా ఇంట్లో చదువు సాగదని వంకపెట్టి ఫ్రెండ్స్‌కోసం హాస్టల్లో చేరాడు. అనుకోకుండానే శేఖర్‌కు అత్యంత ప్రీతిపాత్రుడయ్యాడు.

హాస్టల్ వదిలి వచ్చేస్తుంటే తనూ సామాను సర్దుకుంటూ కళ్ళలో తిరిగే నీటిని శేఖర్‌కు కన్పించకుండా చేయా లనే ప్రయత్నంలో అటూ ఇటూ చూపులు తిప్పుకుంటున్న శిరీష్‌నుచూస్తే శేఖర్‌కు ఆపేక్షతో మనసు నిండి పోయింది. ఇన్నాళ్లూ తనకు తమ్ముడు లేడనే కొరత శిరీష్ ద్వారా తీర్చుకు న్నాడు. అల్లరి చేస్తున్న శిరీష్‌కు అన్నలా శేఖర్ అప్పుడప్పుడూ అతనిమీద అధి కారం చలాయించేవాడు. చెల్లెలు లేదనే కొరత ప్రతి ఆదివారం శిరీష్‌ను కలవ డానికి వచ్చే శిరీష్ చెల్లెలు సుషమ తీర్చింది. వాళ్ళకు తనెంతో ఋణపడి వున్నాడు, గొంతువిప్పి మాట్లాడబోతే

గొంతుకేదో అడ్డం పడ్డట్టయింది. ఆప్యాయంగా శిరీష్‌ను దగ్గరకు తీసుకుని "ఒరే ఫూల్ ఎందుకురా అలా ఏడుస్తావ్! ఇన్నాళ్ళూ నీకు నవ్వడం నవ్వించడం తప్ప ఏడవడం వచ్చని నాకు తెలియదే. నీ ముఖాన నవ్వు చూడడమంటే నా కెంతో యిష్టంరా అయినా నే నెక్కడికి పోతున్నానురా? మనం ఎప్పుడు కావాలంటే అప్పుడు కల్సుకోవచ్చు. గంగాపూర్ ఎంత దూరముందని? ఇక్కడ రైలెక్కితే అక్కడ ఉండవచ్చు. కొన్ని గంటల్లో. నువ్వు మావూరొచ్చినా సరే...లేకపోతే నే నే కలకత్తా వచ్చేస్తాను చూడాలనుకున్నప్పుడల్లా. నవ్వరా బాబూ. నిన్నిలా చూడలేను" అంటున్న శేఖర్ని చూసి మెల్లిగా నవ్వుతూ "విష్‌యూ హేపీ జర్నీ అండ్ బెస్ట్ ఆఫ్ లక్" అన్నాడు.

ఇంతలో సుషమ వచ్చింది. నవ్వుతూ "అన్నయ్యా యింకా మీకి రాజప్రసాదాన్ని వదిలి పెట్టాలని లేదా?" అంటూ. "హాస్టల్ వదిలినా వీడు నన్ను వదలడంలేదమ్మా." అంటూ శిరీష్‌వైపు చూసి నవ్వాడు శేఖర్.

శిరీష్ సామాను తీసుకొని రెడీ అయ్యాడు."మనం స్టేషనుకు వెళ్ళడం లేదా అన్నయ్యా?" అంది సుషమ. శిరీష్ మౌనంగా అడ్డంగా తలవూపి, శేఖర్ చేయిపట్టుకుని సున్నితంగానొక్కి వదిలేస్తూ, భారమైపోతున్న గొంతుతో "శేఖర్! వెళ్ళగానే లెటర్ వ్రాస్తావు కదూ?" అన్నాడు. మౌనంగా చిన్నబోయిన శిరీష్ ముఖం చూస్తూ, తల వూపాడు శేఖర్. వాళ్ళిద్దరి మౌనాన్ని గంభీరతనూ చెదరగొట్టాలని సుషమ అల్లరిగా నవ్వుతూ "నిలబడే మరేదో లోకంలో విహరిస్తున్నట్లున్నారన్నయ్యా. నే నొకదాన్ని వున్నానిక్కడ. వచ్చే నెలలో నేనూ అన్నయ్యా నువ్వు పిలవకపోయినా మీ వూరొస్తాం. జాగ్రత్త! యేర్పాట్లన్నీ గ్రాండ్‌గా వుండాలి." అంటూ ఇద్దర్నీ నవ్వించింది.

శిరీష్, సుషమ కనుమరుగయ్యేంత వరకూ చూసి వాచ్‌మన్‌ను పిలిచి, సామాను టాక్సీలో పెట్టించి వార్డెన్ దగ్గర శలవు తీసుకొని బయలుదేరి స్టేషన్ చేరి అప్పటికే సిద్ధంగా వున్న ట్రెయినెక్కాడు. శేఖర్ ఒంటరిగా, తోడుగావున్న సామానుతో. శిరీష్ స్టేషన్‌కు రానికారణం వూహించుకొని మెల్లిగా నవ్వుకున్నాడు. మరీ సున్నితహృదయం వాడిది. వాడి కళ్ళముందు తను ట్రెయినెక్కి వెళ్ళిపోతూంటే చూడలేడట. ఆ క్రితం రోజే ఆ మాట చెప్పి "నేను సెండ్ ఆఫ్ ఇవ్వడానికి స్టేషన్‌కు రాను శేఖర్" అన్నాడు.

మరో పది నిమిషాల్లో ట్రెయిన్ బయలుదేరింది. కలకత్తా దాటి తమ వూరివైపు పరుగులు తీస్తున్న ట్రెయిన్‌తో పాటు ఆలోచనలు కూడా వూరివైపు

పరుగెత్తడం మొదలెట్టాయి ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంటు అదృష్టమో దురదృష్టమో మరెవ్వరూ ఎక్కలేదు. శేఖర్ ఆలోచనలకు అంతరాయం కల్గించే వారెవ్వరూ లేరు. "తమ వూరు చిన్నదే అయినా అందంగా, అపురూపంగా అన్పిస్తుంది. శేఖర్‌కు పురజనులకోసమైతేనేం తన కొడుకు కళ్ళ ఎదురుగా వుంటాడని అయితేనేం, మిడిల్ స్కూలుగా వున్న స్కూల్‌ను హైస్కూల్ చేయించగలిగారు, రఘుపతిరావుగారు తమ పరపతి వల్ల. కొంత స్వంతడబ్బు ఫండ్‌గా ఇచ్చి, అలా ఆ వూరికో హైస్కూల్ వుందనే కానీ వసతులు పెద్దగా ఏమీలేవు. హాస్పిటల్ లాంటి అత్యవసరాలకు కూడా వాళ్ళు కలకత్తా పరిగెట్టాల్సిందే. పేరుకు ఓ ప్రైవేట్ డాక్టర్ వున్నాడు కలకత్తా నుంచి వచ్చే కొన్ని ప్యాసింజర్స్‌మాత్రం అక్కడ ఆగుతాయి.

అందమైన ఊహలతో అనంతమైన ఆశలతో స్వగ్రామంలో అడుగు పెట్టాడు శేఖర్. ఇంక ఎప్పటికీ తలిదండ్రుల దగ్గరే ఉండవచ్చు. పచ్చని పంట పొలాలను మరింత సారవంతం చేసే పథకాలు ఆలోచిస్తూ. గంగాపూర్‌లో ఒకో్కవసతీ ఎలా ఏర్పాటు చేయాలనీ, ఆ గ్రామాన్నెలా ఉద్ధరించాలనీ, రకరకాలుగా ఆలోచిస్తూ గ్రామం వైపు నడుస్తున్నాడు. శేఖర్ తను కోరుకున్న డిగ్రీ చదువు పూర్తయింది. ఫస్టుక్లాసు రావడం ఖాయం. ఇంక తన యిష్ట ప్రకారం స్వంత పొలాలు చూసుకుంటూ గ్రామ పురోభివృద్ధికి తనకు చేతనైనంత వరకూ పాటుబడుతూ హాయిగా స్వచ్ఛమైన గాలిపీలుస్తూ తిరగవచ్చని ఏవేవో కలల్లో తేలిపోతూ నడుస్తున్న శేఖర్‌కు ఏదో కలకలం విన్పించింది. ఆ రోజు ఆ చిన్న వూళ్ళోని పెద్ద భవనానికి అధిపతి ఏకైక వారసుడు. జమిందారు బిడ్డ, స్ఫురద్రూపి అయిన ఇరవైయేళ్ళ శేఖర్‌ను పరీక్షగా చూడాలని ఎన్నో జతల కళ్ళు తలుపు సందుల్లోంచి కిటికీలోంచీ ఆత్రంగా చూస్తూ గాజుల శబ్దాన్ని ఆపే ప్రయత్నంలో మరింత శబ్దం చేస్తూ, ఉత్సుకత ఉట్టిపడే కళ్లతో ఆరాటంగా, ఆతృతగా చూస్తున్నాయి. అందర్నీ క్రీగంట గమనిస్తూ తనలో తాను నవ్వుకుంటూ తమ యింటివైపు అడుగులేస్తున్నాడు శేఖర్.

హఠాత్తుగా శేఖర్ కాళ్ళు అతనిమాట వినటం మానేశాయి. నిలుచున్నచోటే కాళ్లు భూమికి అంటుకు పోయినట్లు నిలబడిపోయాడు. కారణం మరేమీలేదు, ఎదురుగా కర్పూరం వెలిగించినపళ్ళెంతో ఆ వెలుగుతో పోటీపడే కళ్ళతో చిరునవ్వు నవ్వుతూ కొంటెగా చూస్తున్న పదహారేళ్ళ పదహారణాల పల్లెపడుచు. తనని తాను నిగ్రహించుకుంటూ అయోమయంగా మారిన ముఖానికి గాంభీర్యం పులుముకుంటూ "ఏమిటిది ?" అన్నాడు

"మరేమో ! మరేమో ! మీరు అంత దూరంనుంచీ నడిచి వస్తున్నారుకదండీ! మరి దారి పొడుగునా ఆ గంగమ్మ సూరమ్మ, లక్ష్మమ్మ, గిరిజమ్మ, సరసు, ఇందిర వాళ్ళంతా కళ్ళింతింత చేసుకొని అలాచూశారుకదా ! మరి మీకు దిష్టి తగలదూ అందుకనీ..మరేమో..మరేమో.." అంటూ నసుగుతున్నట్టున్న ఆ అమ్మాయి అమాయకత్వానికి ఫక్కున నవ్వు వచ్చింది శేఖర్‌కు. "ఊ ! మరి త్వరగా కానివ్వు" అన్నాడు చేతులుకట్టుకొని బుద్ధిగా నిలబడుతూ. ఆ అమ్మాయి మునిపంట పెదాల్ని నొక్కి నవ్వునాపుకుంటూ నెమ్మదిగా ఆ హారతి పళ్ళాన్ని శేఖర్ చుట్టూ మూడుమార్లు తిప్పింది. గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్లే ప్రయత్నంలో వున్న ఆ అమ్మాయిని, "ఏయ్ అమ్మాయ్" అంటూ వెనక్కి పిలిచిన శేఖర్ వైపు తిరిగి ప్రశ్నార్థకంగాచూస్తూ నా పేరు అమ్మాయి కాదు, 'మాధవి' అంది. మరేంలేదమ్మాయ్ ! అదే మాధవీ మరి వాళ్ళుఅలా చాటుగా చూస్తేనే నాకు దిష్టి తగులుతుందనుకొని యింత శ్రద్ధగా దిష్టి తీశావే ! మరి నువ్వు చెంపకు చారెడేసి కళ్లు పెట్టుకొని ఎదురుగా నిల్చుని రెప్పవాల్చకుండా ఇంతసేపు చూశావే మరీ...నీ దిష్టి తగలదూ !" అన్నాడు కొంటెగా నవ్వుతూ.

మాధవి సిగ్గుపడుతూ నెమ్మదిగా తల వంచుకొని...ఇంటికెళ్ళి మీ అమ్మగారితో దిష్టి తీయించుకోండి " అని నాలుక కొరుక్కుంటూ "క్షమించండి. అసలు ఈ దిష్టి తీయడమంతా ఒట్టి నాటకం. అలా చేయగలిగితే నాకు అయిదు రూపాయలిస్తామని వాళ్ళంతా సవాల్ చేశారు. అందుకనీ..." అంటూ ఇబ్బందిగా కదుల్తున్న మాధవిని చూస్తే నవ్వాగలేదు శేఖర్‌కు..."ఓహో అదా సంగతి. పోనీలే వాళ్ళ పందెం పుణ్యమా అంటూ నిన్నుచూసే అదృష్టం కలిగింది. లేకపోతే మా పల్లెలో ఇంతటి ధైర్య సాహసాలుగల ఓ సౌందర్యరాశి ఉందని నాకెప్పటికీ తెలిసేదికాదు. అందుకు నీ స్నేహితురాళ్ళకు కృతజ్ఞతలు చెప్పుకోవాలి" అంటూండగానే నెమ్మదిగా కదిలి శేఖర్‌కు కొంచెం దూరంగానే ఛెంగు ఛెంగున గంతులేస్తూ దూరంగా నుంచుని యిటే చూస్తున్న స్నేహితుల్ని కల్సుకుని నవ్వుకుంటూ వెళ్ళిపోయింది మాధవి.

అంతరంగంలో తరంగాలు సృష్టించి దూరంగా వెళ్ళిపోతున్న మాధవిలో ఏదో రీవి, రాజసం తొణికిసలాడుతున్నాయి. అమాయకత్వం, అణువణువునా మూర్తీభవించినట్లున్న ఆ ముఖంలో ఏదో తెలీని సాహసం ఏ పనినైనా పట్టుదలతో సాధించగల నేర్పు కన్పిస్తున్నాయి. ఇన్నాళ్ళూ కన్పించని ఈ మెరుపుతీగ ఎవరు ? ఆలోచనతో అలాగే నిలబడిన శేఖర్‌ను, వెనుకే సామానుతో

వస్తున్న రామయ్య "పదండి చినబాబూ! అలా నిలబడిపోయారేం?" అన్న పిలుపు ఈ లోకంలోకి తెచ్చింది. నెమ్మదిగా తమబంగళావైపు అడుగులు వేస్తుండగా రామయ్య ప్రారంభించాడు.

"మాధవమ్మ వచ్చాక మనూరికే కళ వచ్చిందబ్బాయిగారూ. పాపం! వాళ్ళ అమ్మగారు ఆ మద్దెనే పోయారట. తండ్రీ యీ మద్దెనే పోయారట. మన గోపాలం గారు లేరూ మన పొలాలు కౌలుకు తీసుకున్నారే ఆరికి సయాన చెల్లెలి కూతురే నంట యీ మాధవమ్మ. పాపం! తల్లీ, తండ్రీ పోయిన ఆ యమ్మను, ఆళ్ళ తమ్మణ్ణీ దొడ్డ బుద్ధితో పట్నంనుంచీ తీసుకొచ్చి తమకాడే పెట్టుకున్నారు గోపాలం బాబు. ఆరికీ పిళ్ళు వచ్చింతరువాత హాయిగా వుందిలెండి. మాధవమ్మ వచ్చింతర్వాత సావిత్రమ్మగారికి మహా సుఖంగావుంది. పాపం దాదాపు పనంతా మాధవమ్మే ఆడుతూ పాడుతూ చేసుకుపోతుంది సావిత్రమ్మగారికిశ్యాంబాబుతో బాగా కాలచ్చేప మయితంది. ఆరికీ పిల్లల్లేరుగా పాపం. ఆ అక్కా తమ్మిళ్ళిద్దరినీ తమ బిడ్డల్లాగే సూసుకుంటున్నారండి గోపాలం బాబు. సావిత్రమ్మగారికి శ్యాంబాబంటే మా చెడ్డముద్దండీ.." అంటూ ఫుల్‌స్టాప్ లేకుండా మాధవిని గురించి అడక్కుండానే చెప్పుకుపోతున్న రామయ్య మాటలకు వూ కొడుతూ ఊరంతటికి ఉన్నతంగా కన్పించే తమ బిల్డింగులోకి అడుగుపెట్టాడు శేఖర్. ఆనందంగా ఎదురు వస్తున్న తల్లి అడిగినవాటికి సమాధానాలిస్తూ, తండ్రి ఆరోగ్య వివరాలు కనుక్కుంటూ ఇంట్లో వున్న నౌకర్లందరినీ పేరుపేరునా పలకరిస్తూ తృప్తిగా వారు చెప్పే సమాధానాలు వింటూ ఆ పగలంతా గడిపేశాడు. ఆ ఇంట్లోవాళ్ళకూ నౌకర్లకీ కూడా చాలా కాలానికి కనిపించిన చినబాబును చూస్తే కన్నుల పండువుగా వుంది. ఆ రోజు పండుగలాగే స్వీట్ చేయించి అందరికీ పంచారు శ్యామలా దేవి.

సాయంత్రం అలా గంగాతీరానికి వెళ్ళి తిరిగిరావాలని బయలుదేరాడు శేఖర్. మామిడితోట మీదుగా వెళ్ళి నదీ తీరానికి వెళితే బావుంటుందని కొంచెం పెందలాడే బయలుదేరి మామిడి తోట చేరుకున్న శేఖర్ కళ్ళు తెలీని వింత ఆనందంతో వెలిగాయి.

ఎదురుగా నలుగు రమ్మాయిలు బిందెలు బోర్లించుకొని కూర్చుని మామిడి కాయలు తింటున్నారు. అయిదవ బిందె ఖాళీగా వుంది. దానికి సొంతదారు మామిడి చెట్టెక్కి కూర్చుని మామిడికాయ తింటూ "సరసూ! నీకు ఇంకోటి ఇమ్మంటావేమిటే? ఫర్వాలేదు తిను." అంటూ మరో కాయ చటుక్కున కోసి క్రింద కూర్చున్న అమ్మాయి మీదకు విసిరింది. మిగతా అమ్మాయిలు కూడా

లేచి "మధూ! మాకూ ఇవ్వవే" అంటూ ఎగబడుతూంటే — ఉండండీ బాబూ! దోరకాయలు దొరికిచావడంలేదు. అంటూ ఆ తోటకంతటికి సర్వాధికారి ఐలా వాళ్ళందరికీ కోసి క్రిందపడేసి తనూ మరో కాయ కోసుకుని, కొమ్మ మీద కూర్చొని దర్జాగా కాళ్లూపుతూ హాయిగా మామిడి కాయలు తింటున్న మాధవిని చూస్తే శేఖర్ కు నవ్వాగలేదు. బలవంతంగా పెదాలు బిగబట్టి చెట్టు చాటునుంచి యీ తతంగమంతా చూసి ముందుకు వెళదా మనుకునేంతలో అందులో ఓ పిల్ల మాధని కాలందు కుంటూ "మధూ ఈ రోజు నువ్వోపాట పాడాలే. చాలా రోజులైంది నీ పాట విని" అంది.

అంతే......మిగతా వాళ్ళందరూ మాధవి కాళ్లు రెండూ పట్టుకొని ఊపుతూ "పాడవే మధూ, నిజంగానే చాలా రోజులైంది నీ పాట విని మాకూ వినాలనే వుంది." అంటూ బలవంతం చేయడం మొదలెట్టారు. "బాబోయ్! నేను క్రింద పడతానర్రా. నా కాళ్లుపట్టుకు లాగకండి. మొద్దు రాచ్చిప్పల్లా ఏవిటా మోటు పనులు వదలండి నా కాళ్లు, పాడతాను గానీ" అంటూ కాళ్ళు రెండూ పైకి లాక్కుని కొమ్మ ప్రక్కగా జరిగి, ఏటవాలుగా వున్న ఆ కొమ్మమీద హాయిగా ఆనుకొని నిర్లక్ష్యంగా తన చేతిలోని మామిడి కాయను బలంగా విసిరింది దూరంగా. సరిగ్గా శేఖర్ వైపే రావడంతో ఒడుపుగా అందుకున్నాడు. మాధవి ధ్యాస విసిరిన కాయవైపు లేక పోవడంవల్ల శేఖర్ అందుకోడం గమనించలేదు.

"ఊ! పాడతానుగానీ మరి నాకు లంచమేమిస్తారే?" అంది మాధవి చిన్నగా నవ్వుతూ.

అమ్మాయిలందరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. "ప్రొద్దున్నే కదే హారతి పందెంతో మా దగ్గర అయిదు రూపాయలు కాజేశావు?" అంది సరసు. శాంత ముందుకొస్తూ, అబ్బ ఏడవకే సరసూ! నీ రూపాయి నీ కిస్తాంలే అని మధువైపు తిరిగి పోనీ నీ బిందె నీళ్ళు కూడా తీసుకొచ్చి మీ ఇంట్లో అంది స్తాను. పాడు మధూ!" అంది.

"పోనీలే ఆ చెయ్యాల్సిందేదో తర్వాత చెబుతాను. ఆలస్య మవుతోంది. అత్తయ్యా శ్యాం ఎదురు చూస్తుంటారు. ఒక్కటంటే ఒక్కటే పాడతాను. ఆ తర్వాత మరోటి మరోటి అంటూ రాగాలు తీశారంటే ఒక్కొక్కళ్ళ వీపు సాపు చేస్తాను." అంది మధు వేలితో బెదిరిస్తూ

"సరే నీయిష్టమొచ్చినట్లు చేద్దువుగాని లేమ్మా తల్లీ! ముందు ఓ పాట పాడవే మమ్మవుకదూ! మా బుజ్జివి కదూ" అన్నారందరూ ఏక కంఠంతో.

శేఖర్ ఊపిరిబిగబట్టి నుంచున్నాడు.

ముచ్చటైన ఆలాపనతో ప్రారంభమైంది మాధవి పాట. చక్కటి రాగం యింపైన గొంతు ... అంతకు మించి చక్కటి భావంతో ఉన్న ఆ పాట మనస్సును పుర్రూత లూగిస్తోంది, భావానికి తగ్గట్టు భంగిమలూ మారుతూ హృదయాన్నే సృతిచేసి పాడుతున్నట్లున్న అపూర్వ మాధుర్యంలోని వంపులు అలా...అలా గాలిలో తేలి వస్తున్న ఆ గానంలో తేలిపోతూ ఆ రూప సౌందర్యానికి పరవశించి మోకరింప జేసుకోగల గాత్రం ప్రసాదించిన భగవంతుడు మంచి జస్టిస్ చేశాడు' అని అనుకుంటూ చెవు లా గాన మాధుర్యాని కప్పగించి కళ్ళతో అపురూప సౌందర్యాన్ని తదేకంగా చూస్తున్నాడు శేఖర్.

చప్పట్లు కొడుతూ స్నేహితులంతా నవ్వుతూ లేచారు బిందెలు చేతుల్లోకి తీసుకుని అంతవరకూ మామిడిచెట్ల మధ్య వాళ్ళ చిలిపి కయ్యాలు, మాధవి రాజరీవితో న్యాయాధికారిణిలా జడ్జిమెంట్ చేసే పద్ధతీ, రమ్యాతి రమ్యమైన మాధవి గొంతుతోవిన్న సుమధురమైన పాట, వింటూ తన్మయత్వంలో వున్న శేఖర్ వాళ్ళ చప్పట్లు విని తనూ చప్పట్లు కొడుతూ వాళ్ళ మధ్యకు వచ్చాడు. ఎక్కడి వాళ్ళక్కడి నుండి బిందెలు పట్టుకుని నదివైపు పరుగు లంకించుకున్నారు శేఖర్ని చూసి.

తొందరగా చెట్టుదిగి తనూ పారిపోదామనే ప్రయత్నంలోవున్న మాధవి శేఖర్ పట్టుకోపోతే ఆ కొమ్మమీదినుంచి అమాంతంగా క్రిందపడి వుండేది. శేఖర్ చేతుల్లోంచి తప్పించుకొని, బిందె తీసుకుని "శాంతా ఆగవే" అంటూ పరుగెత్తబోయిన మాధవి చెయ్యి పట్టుకొని ఆపాడు శేఖర్. అమాయకత్వం ప్రతిఫలించే ఆ కళ్ళల్లో భయం, సిగ్గూ కలగా పులగంగా కన్పించాయి. ఒక్క క్షణం ఆ కళ్ళల్లోకి పరిశీలనగా చూసిన శేఖర్ చెయ్యి వదిలేశాడు. "సారీ అంటూ అ దేఅసను అనుకొని ముందుకు అడుగు వేయబోయిన మాధవి శేఖర్ గొంతు విని ఆగిపోయింది. "ఏయ్! అమ్మాయ్? ఏవిటిది? ఎవరినడిగి ఇక్కడి కాయలుకోసి పంచిపెడుతున్నావ్ ?" అన్నాడు తెచ్చిపెట్టుకున్న కోపం నటిస్తూ

"నా పేరు అమ్మాయ్కాదు. ఏయ్ అమ్మాయ్ అంతకన్నా కాదు మాధవి అని ఎన్నిసార్లు చెప్పాలండీ ?" అంది చికాకు నటిస్తూ.

"సరి...సరి మాధవీ దేవిగారూ! తమరు ఎవరినడిగి ఈ కాయలు కోశారో తెల్సుకోవచ్చా ?" అన్నాడు శేఖర్ చిన్నగా నవ్వుతూ.

ఆశ్చర్యంగా కళ్ళు మరింత పెద్దగా చేసి చూస్తూ, "మహా చక్కగా అడుగుతున్నారే ! మే మేమన్నా దొంగలమను

కున్నారా ? ఇందాకటినుంచీ చూస్తు న్నాను ఏవిటండీ మీ దబాయింపు?మంచీ మర్యాద లేకుండా ఏవీనా అడగటం ? కావాలంటే మీరూ రెండు కాయలు కోసుకోండి ఈ తోటలో మిమ్మల్నెవరూ అడ్డుపెట్టరు అసలు ఈ తోట ఎవరిదో తెలుసా ? మా మామయ్య గారిది మీరు కోసుకున్నట్లు చెప్పనులెండి మా మామ య్యతో ఏదో పన్నం నుంచి వచ్చారు కదా ? సరదాగా తినాలన్పించిందేమో నన్నడిగారు నేనే కోసి ఇచ్చాను మావయ్యా అని చెప్తాలెండి మీకేం భయంలేదు కోసుకోండి అంటున్న మాధవి మాటలకు మతి ఏ్పనట్లు ఆమెనే చూస్తూ ఆశ్చర్య పోతున్న శేఖర్‌ను అలాగే ఆలోచనలకు వదిలేసి నవ్వుకుంటూ బిందె పట్టుకొని ముందుకు పరిగెత్తింది మాధవి జడకుచ్చులు ఓ చేత పట్టుకుని వూపుకుంటూ గంతు లేసే లేడిపిల్లలా ముందుకు వెళుతున్న మాధవిని చూస్తూ చిన్నగ భుజాలెగరేసి నవ్వుకున్నాడు

అసలు విషయం ఆ తోట జమీందారు గారిదేనని ఈ మధ్య అస్వస్థత కారణంగా అలాగే వదిలేయడం జరిగిందనీ మాధవికి తెలీదు పాపం నడుస్తూ ఆలో చనలో పడ్డాడు శేఖర్ పొలాల్లో నుంచి వీచే చల్లగాలి ఎదురుగా కన్పించే నదిలో అలల్ని కదిలిస్తుంటే సంధ్యకిర ణాలు పడి అందంగా మెరుస్తున్నాయవి

మాధవి మాటల్ని దబాయింపును తల్చుకుంటూ అందమైన సాయంత్రపు సౌందర్యాన్ని అనుభవిస్తూ నదీతీరంలో ఇసుకపైన కూర్చున్నాడు శేఖర్

ఆరోజు తెల్లవారుఝామునే శేఖర్‌కి వంటగదిలోంచి చల్ల కవ్వం తిప్పుతున్న అదోరకమైన శ్రావ్యమైన శబ్దంతో ఆహ్లా దంగా అన్పించింది బహుశా ఆ శబ్దమే శేఖర్ని అంత త్వరగా లేపేసిందేమో మళ్ళీ చాలా రోజులకు వింటున్న ఆ శబ్దాలు ఉత్సాహాన్ని కల్గిస్తుంటే ఒక్క గంతులో మంచంమీదనుంచి క్రిందకు వురికి తనకోసం నాన్నగారు ప్రత్యేకంగా కట్టించిన బాత్‌రూమ్‌లో కెళ్ళి ముఖం కడుక్కొని అలాగే ఆ చల్లటి నీళ్ళతో స్నానము కానిచ్చి డ్రస్ చేసుకుని వంటగదిలో అమ్మదగ్గర చేరాడు శేఖర్ని చూసి చిన్నగా నవ్వుతూ వంటమనిషిని ఏవేవో పురమా యిస్తున్నదల్లా అప్పటికే చేసి రడీగా వుంచిన కాఫీ ఫ్లాస్కులోనుంచి కప్పులో పోసి శేఖర్‌కు అందించారు శ్యామలా దేవి "అప్పుడే లేచావేంబాబూ! కొంచెం సేపు పడుకోపోయావా ? అంటున్న తల్లివైపు ఆప్యాయంగా చూస్తూ ఇవ్వాళ నేనూ పొలం వెళతానమ్మా మధ్యాహ్నం భోజనం అక్కడికే పంపించు అన్నాడు కాఫీ సిప్ చేస్తూ

నువ్వేం చేస్తావురా పొలం వెళ్ళి గోపాలంగారు అన్నీ చూసుకుంటారులే

నాల్గురోజులు యింటిపట్టున వుండి హాయిగా విశ్రాంతి తీసుకోక యిప్పుడే ఈ పొలం పుట్రా పనులు నీ కెందుకు బాబూ !" అంటూ దగ్గరగా వచ్చి క్రాప్ సరిచేస్తున్న తల్లిచేయి తన చేతిలోకి తీసుకొంటూ "ఇంక ఎప్పుడూ నీ కళ్ళ ముందే వుంటానుకదమ్మా! ఇంక రోజూ యీ ప్రసాదాన్నే తింటాను. నేను చదివింది మన పొలాల్ని ఇంకా మంచిపద్ధతుల్లో అభివృద్ధిలోకి తీసుకొచ్చే చదువమ్మా ! మరి మనం స్వంతంగా చూసుకోపోతే అన్నీ తెలిసేదెలా ? ఇక రోజూ నేను పొలం వెళ్ళక తప్పదు. అందులోనే నా కానందముందమ్మా. గోపాలం గారినడిగి వివరాలు తెలుసుకుంటాను. అవసరమైనవన్నీ కలకత్తా వెళ్ళి తీసుకొస్తాను. ఇంక మన పొలాలెలా పండుతాయో చూడు." అంటూ బాధ్యత తెలిసిన పెద్దమనిషిలా మాట్లాడుతున్న శేఖర్ని చూస్తే...మొన్న మొన్నటి వరకూ తన కొంగుపట్టుకుని వెన్న ముద్దలకోసం గొడవచేసిన శేఖరేనా? అప్పుడే ఇంత పెద్దవాడయి పోయాడా?" అని ఆలోచనల్లో పడిపోయిన శ్యామలా దేవి, శేఖర్ పిలుపుతో యీ లోకం లోకి వచ్చింది.

"అమ్మా ! మరి నా మామూలేదీ ?" అంటూ నవ్వుతూ చేయిచాపిన శేఖర్ మళ్ళా ఎప్పటి చిన్న చిలిపి శేఖర్గానే కన్పించడంతో నవ్వుకుంటూ చల్ల చేస్తున్న రాముదగ్గరకువెళ్ళి చేతినిండుగా వెన్నముద్ద తీసుకొచ్చి శేఖర్ చేతిలో పెట్టింది. ఆపేక్షగా ఆ వెన్నంతా తినేసి చేయి కడుక్కొని బయలుదేరబోతున్న శేఖర్ని ఆపి టిఫిన్‌చేసి వెళ్ళమని చెప్పి అప్పుడే వాయి తీసి అక్కడ పెడుతున్న వంటమనిషి సుందరమ్మ దగ్గరికెళ్ళి ప్లేటులో నాలుగిడ్లీ, గిన్నెనిండా నెయ్యి, కారప్పొడి తీసుకొచ్చి శేఖర్ ముందు పెట్టారు. అంత ప్రొద్దున్నే యిడ్లీ తినాలంటే యిబ్బందిగా ఫీలయినా వూరికి వచ్చిన మొట్టమొదటిరోజే అమ్మను నొప్పించడం యిష్టంలేక ఎలాగో ఆ నాలుగిడ్లీ తిని నెమ్మదిగా పొలం వైపు నడక సాగించాడు శేఖర్.

తెల్లవారకముందే లేచే పల్లె వాతావరణంలో ప్రతి యింటి ముందూ కళ్ళాపి జల్లి ముగ్గులతో ముచ్చట గొలిపే ముంగిళ్ళను దాటుకుంటూ ముందుకు నడుస్తున్న శేఖర్ తనకు పది గజాల దూరంలో ముందునడుస్తున్న వ్యక్తిని పరిశీలనగా చూసి "ఒరె చంద్రూ !" అంటూ కేకేశాడు. శేఖర్ పిలుపుతో వెనుదిరిగిన చంద్రం. శేఖర్ని చూసి నవ్వుతూ రెండడుగులు వెనక్కి వేశాడు. ఆగమని సైగచేసి శేఖర్ ముందుకు పరుగెట్టి చంద్రాన్ని కలుసుకున్నాడు. ఆప్యాయంగా శేఖర్ చెయ్యి నొక్కుతూ "ఎప్పుడొచ్చావురా ? పరీక్షలు ఎలా వ్రాశావు ? ఏమిటింత ప్రొద్దున్నే

పొలాలవైపు బయలుదేరావు" అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్న చంద్రాన్ని ఆపుతూ "ఆగరా బాబూ! ఒక్కటొక్కటిగా అడుగు. అన్ని ప్రశ్నలు ఒక్కసారిగా గుమ్మరిస్తే బదులెలా చెప్పను?" అంటూ నవ్వుతూ చంద్రం ప్రశ్నలకు జవాబులు చెబుతూ ముందుకు నడిచాడు శేఖర్. భుజాలమీద చేతులు వేసుకుని చిన్నప్పటి కొంటె కబుర్లతో కడుపుబ్బ నవ్వుకుంటూ మధ్య మధ్య కలకత్తా కాలేజీ కబుర్లు నంజుకుంటూ కలిసి పోతున్న వాళ్ళిద్దరూ చంద్రంవాళ్ళ పొలానికి వెళ్ళవలసిన చోటు చెరో ప్రక్కా చీలిపోతూ. సాయంత్రం గంగా నది ఒడ్డున కల్సుకుందామని చెప్పుకొని విడిపోయారు.

శేఖర్ తమ పొలం చేరుకునేసరికి తెల్లవారింది. అప్పటికే పొలం చేరిన గోపాలంగారు పనివాళ్ళకు పనులు పురమాయిస్తూ కూర్చున్నవాడల్లా శేఖర్ని చూసి నవ్వుతూ ఎదురొచ్చి పలకరించాడు మధ్యాహ్నం వరకూ వాళ్ళు చేస్తున్న పనులు చూస్తూ వాటిలో లోపాలు ఎత్తి చూపుతూ పొలాల్ని గురించిన మంచిచెడ్డలు వాటికి తెప్పించి వేయవలసిన ఎరువులు వాటిని గురించి గోపాలం గారితో చర్చించాడు శేఖర్. పదకొండు గంటల ప్రాంతంలో గోపాలంగారు ఓ పనివాణ్ణి పిలిచి తాటి ముంజలు కొబ్బరి బొండాలు తెప్పించారు. ఇద్దరూ కూర్చొని తాటిముంజలు తిని కొబ్బరినీళ్ళు తాగి మరోసారి



పొలం సర్వేచేస్తూ బయలుదేరారు. అన్ని పొలాలు చుట్టి వచ్చేసరికి ఒంటిగంటైంది పంటకాలువలో పడుతున్న పంపునీళ్లతో కాళ్ళూ, చేతులూ, ముఖం కడుక్కొని నిమ్మచెట్టు క్రిందకెళ్ళి కూర్చున్నారు. ఇంకా భోజనాలు రాలేదు.

ఏవో కబుర్లు చెప్పుకుంటుండగానే ఎర్రటి పావడామీద తెల్లటి వోణీ ఎర్రటిదే జాకెట్ వేసుకుని వోణీనడుం చుట్టూ తిప్పి దోపి ఓ చేత జడకుచ్చులు వూపుకుంటూ మరో చేత క్యారియర్ పట్టుకొని గట్టుమీద వయ్యారంగా నడిచి వస్తున్న మాధవి కన్పించి శేఖర్ కళ్ళు ఒక్కసారి ఆశ్చర్యంతో మెరిసాయి. మరుక్షణం అటు చూడనట్లే గోపాలం గారితో ట్రాక్టర్ తెస్తే అందరికీ ఎలా లాభసాటిగా ఉంటుందో! మధ్య మధ్య వున్న గట్లు తెగ్గొట్టి, సమిష్టి వ్యవసాయం చేయడంవల్ల ప్రయోజనమేమిటో అనే విషయాలమీద చర్చ మొదలెట్టాడు. శేఖర్ మాటలు శ్రద్ధగా వింటున్న గోపాలంగారు మాధవి ఎదురుగా వచ్చి 'మామయ్యా !' అని పిల్చే వరకూ అటు చూడలేదు మాధవిని చూసి నవ్వుతూ "ఈ ఎండలో పడి నువ్వెందుకొచ్చావమ్మా ? రాముడికిచ్చి పంపకూడదూ ?" అన్నాడు ఆప్యాయంగా, క్యారియర్ అందుకుంటూ.

ఓరకంట ఓసారి శేఖర్ని చూసి "రాముడికివాళ జ్వరమట, అందుకని వాడివాళ రాలేదు. అత్తయ్య వస్తానంటే నువ్వెందుకత్తయ్యా నే వెళతానులెమ్మ నేనే వచ్చాను. ఆ శ్యాం ఒకటే గోల చేస్తాడు. నా మాట వినడు" అంటూ బుంగమూతి పెట్టి గోపాలంగారి ప్రక్కన కూర్చుంది. ఇంతలో శేఖర్ కారియర్ తీసుకుని రామి వచ్చింది

వాళ్ళిద్దరూ భోజనాలు చేస్తుంటే రామితో కబుర్లేసుకుంది మాధవి. క్లుప్తంగా మాధవిని పరిచయం చేశాడు గోపాలంగారు. వివరాలు ముందే రామయ్య ద్వారా వినివుండటంవల్ల నెమ్మదిగా భోంచేస్తూ "శ్యాం ఏంచేస్తున్నాడండీ?" అని అడిగాడు. ప్రశ్న గోపాలంగారి నడిగినా చూపులు మాధవి వైపున్నాయి. "ప్రస్తుతం భోంచేస్తున్నాడు అత్తయ్య దగ్గర కూర్చుని." తక్కున సమాధానం చెప్పి కిసుక్కున నవ్విన మాధవివైపు చూసి మురిపెంగా నవ్వుతూ "ఏవిటా కొంటె సమాధానం మధూ ! అని" మందలించి "నాలుగో క్లాస్ చదివేవాడట కలకత్తాలో. మళ్ళీ అందులోనే చేర్చాము మనవూళ్ళో ఇంక మధు స్కూల్ ఫైనల్ పూర్తయింది. కాలేజీలో చేర్చాలంటే మనకు దగ్గరలో కాలేజీ లేదు. మళ్ళీ పట్నం వెళ్ళాలి. ఆడపిల్లను ఒంటరిగా అక్కడ ఉంచటం ఇష్టంలేక వూరుకున్నాను," అంటూ త్వరగా తన భోజనం పూర్తిచేసి చేతులు కడుక్కోడానికి లేచి వెళ్ళారు గోపాలంగారు. (సశేషం)

---

Printed and Published by A. Chandra Sekar Rao at 5-9-88, Public Garden Road Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor : A. SUDHAKARA RAO




( గత సంచిక తరువాయి )

శేఖర్ భోజనం పూర్తిచేసి మాధవి వెనకే కాలవదగ్గరకు వెళ్ళి చేతులు కడుక్కుంటున్నాడు. నెమ్మదిగా కేరియర్ కడిగి వరసగా పేర్చుతున్న మధువైపు వోసారిచూసి నవ్వి మళ్ళీ గోపాలంగారి దగ్గరికెళ్ళి కూర్చున్నాడు.

కారియర్ పట్టుకొని వాళ్ళదగ్గర కొచ్చి "నే వెళ్తున్నా మావయ్యా!" అంది మాధవి. "ఎండలో వెళ్ళి ఏం చేస్తావమ్మా! చల్లబడిన తర్వాత వెళ్ళవచ్చులే, కూర్చోమ్మా!" అన్నాడు గోపాలం. "ఎండ పెద్దగా ఏంలేదు మావయ్యా! ఇంటిదగ్గర కొంచంపనుంది అత్తయ్యతో వెంటనే వస్తానని చెప్పాను. ఎదురుచూస్తుంటుంది. వెళుతున్నా!" అంటూ ప్రక్కనే కూర్చున్న శేఖర్ వైపు చూసి కళ్ళతోనే చెబుతూ చిన్నగా నవ్వుకుంటూ బయలుదేరింది.

నాలుగుగంటల వరకూ పొలంలో గడిపి, ఇంటికొచ్చి స్నానంచేసి టీ త్రాగి చంద్రంయింటివైపు వెళ్ళాడు శేఖర్. అప్పటికే స్నానంచేసి రెడీగా వున్న చంద్రం గుమ్మంలో శేఖర్ని చూసి, "శాంతా! శేఖర్కూ నాకూ కాఫీ పట్రామ్మా!" అంటూ కేకేసి కుర్చీ ముందుకు జరిపాడు.

"ఇప్పుడే టీ తాగి వస్తున్నారా. మళ్ళీ కాఫీ ఎందుకూ?" అంటుండగానే అప్పటికే రెడీగావున్న కాఫీ పట్టుకొచ్చింది శాంత రెండుగ్లాసుల్లో. కాఫీ

అందుకుంటూ "బావున్నావా శాంతా? చదువై పోయిందేమిటి? గంగాతీరాన నీళ్ళకు చేరి, బిందెలనిండా మామిడి కాయలు దొంగతనం చేయడంవరకూ వచ్చావన్నమాట!" అంటున్న శేఖర్‌ను చూసి సిగ్గుపడుతూ తలవంచుకున్న శాంతను చూసి చంద్రం బదులుచెప్పాడు. "ఒరే శేఖర్! ఈ వూరికి కలకత్తా కాళి వచ్చిందిరా. చూశావా? చూసివుండవులే. ఆ మధు వచ్చింతర్వాత వూర్లో ఈ కారు పిల్లలందరూ మహా మాటకారులై పోయారులే. మునుపటిలా మగవాళ్ళను చూసి తప్పుకుపోవడం లాంటివేంలేవు. ఇప్పుడు మనమేమన్నా ధైర్యంగా బదులు చెప్పడం నేర్చుకున్నారు. ఆ గయ్యాళి మధూ..." అన్నాడు చంద్రం.

"ఊ! నిన్నేం చేసిందేం! పేద్ద! గయ్యాళట! గయ్యాళి! వున్న మాటంటే మీకందరికీ వులుకెక్కువ. అందుకే దానికి గయ్యాళని పేరుపెట్టారు. పాపం అదేం చేసింది మిమ్మల్ని?" అంది వుక్రోషంగా చంద్రంవైపు చూస్తూ. శాంత ముఖం చూసి యిద్దరికీ నవ్వాగలేదు. నవ్వాపు కుంటూ శాంత చేయిపట్టి దగ్గరకు లాగిన చంద్రం "ఏవిటి చెల్లాయ్! వున్న మాటంటే వులుకెక్కువా? ఎవ రికే? అర్థమైందా? ఇప్పుడు మీ మధుని గయ్యాళన్నానని నువ్వే కదే వుడుక్కు న్నావు!" అంటూ పకపకా నవ్వుతున్న చంద్రాన్ని చూసి, మరింకేమీ చేయలేక చెయ్యి వదిలించుకొని వెక్కిరిస్తూ వెళ్ళి పోయింది శాంత.

మెత్తటి యిసుకలో కూర్చొని వూరి విశేషాలు, మిగతా క్లాస్‌మేట్స్ ఏమేం చేస్తుందీ, ఊరి రాజకీయాలు మొదలైన ఎన్నో విషయాలు వాళ్ళ చర్చలోకి వచ్చాయి. పొలాల గురించి అడిగి తెలుసుకున్నాడు శేఖర్. ఇద్దరూ ప్రక్క ప్రక్కనే కూర్చొని చిన్నప్పటినుంచీ జరిగిన ఎన్నో సంఘటనలు, సన్ని వేశాలు మననం చేసుకుంటూ, గంగా పూర్ గ్రామం యింకా ఎన్నో విష యాల్లో వెనకబడి వుండటాన్ని గురించి చర్చించుకుంటూ అందుకు చేయవలసిన ప్రయత్నాల గురించి ఆలోచిస్తూ చాలా ప్రొద్దుగూకేంతవరకూ కూర్చొని లేచి యిళ్ళకు బయలుదేరారు.

ఆ రోజు నెమ్మదిగా తండ్రిదగ్గర చేరిన శేఖర్ నెమ్మదిగా ట్రాక్టర్ ఆవశ్య కతను గురించి ఆయనకు వివరంగా చెప్పాడు. పంటలు ఎలా వేస్తే బాగా వస్తాయో, నారుగా వున్నప్పుడు కూడా ఎరువుల ఆవశ్యకత గురించి, సీడ్స్ ఎలాంటివి సెలెక్ట్ చేసుకోవాలో, ఒక్క కుదుములో ఎన్ని మొక్కలు నాటాలో, అవి ఎంత దగ్గర దగ్గరగా వేస్తే అంత రాబడి గురించి, మొట్టమొదటిసారిగా తండ్రిదగ్గర ధైర్యంగా అన్ని మాట్లాడ గల్గినందుకు తనకే ఆశ్చర్యంగా వుంది శేఖర్‌కు.

ఇనాళ్ళూ దాదాపు ఆయన జీవిత కాలమంతా పొలాల మధ్యే గడిపినా శేఖర్ మూడేళ్ళలో తెలుసుకున్నదాంట్లో తనకు నాలుగోవంతు కూడా తెలియదని తెలిసి రఘుపతిరావుగారు తనలో తానే నవ్వుకున్నారు. శేఖర్ని అత నిష్ట ప్రకారం బి యస్సి. ఎగ్రికల్చర్ చదివించడం ఎంత మంచిదైందో అర్థం చేసుకున్నారు. రఘుపతిగారు మొదట శేఖర్ని యింజనీరింగ్ చదివించాలని అనుకున్నారు. మొదటినుంచి శేఖర్‌కు పొలాలమీద విపరీతమైన మక్కువ వుండటంతో అతను తన కిష్టమైన సబ్జక్ట్ చదివేలా చేసింది. ''అదిప్పుడు ఫలితాన్నదించబోతుంది. దానికి తనెందు కడ్డు రావాలి? బాధ్యత తెలుసుకున్న కొడుకు. యింక తను వేరే చెప్పేదేముంది?" అందుకే శేఖర్ చెప్పినవన్నీ శ్రద్ధగా విన్న రఘుపతిగారు "మంచిరోజు చూసి కలకత్తా వెళ్ళి ట్రాక్టర్ కొనడానికి కావలిసిన ఏర్పాట్లన్నీ చేసుకొమ్మని" చెప్పారు.

ఉత్సాహంగా తన గదిలో కెళ్ళిన శేఖర్ విషయాలన్నీ తెలియజేస్తూ వివరంగా శిరీష్‌కు లెటర్ వ్రాశాడు. మరోవారానికి శిరీష్ దగ్గర్నుంచి లెటర్ వచ్చింది. "ఏర్పాట్లన్నీ నాన్నగారు చూస్తామన్నారు, నువ్వు సాధ్యమైనంత త్వరలో బయలుదేరి రమ్మని." గంగాపూర్ గ్రామం చిన్నదైనా దానికో గుర్తింపు, ఓ ప్రాముఖ్యత సంపాదించాలనే ప్రయత్నంలోనే శేఖర్ మనస్సు పథకాలు, ప్రణాళికలు వేస్తూ చంద్రంతో కలసి అభివృద్ధి కార్యక్రమాలకు ఆలోచనలు సాగిస్తోంది.

అనుకున్న ప్రకారం ఓ మంచిరోజు చూసి కలకత్తా బయలుదేరిన శేఖర్, శిరీష్‌తో కలిసి శ్రీధర్‌గారి సహాయంతో పనులన్నీ పూర్తిచేసుకొని ఆ వారం రోజులూ పనయ్యేంతవరకూ శిరీష్ బలవంతంమీద వాళ్ళింట్లోనే గడిపి వాళ్ళ కుటుంబానికి మరింత సన్నిహితుడయ్యాడు. శేఖర్ తిరిగి గంగాపూర్ బయలుదేరినరోజు సుషమ "అన్నయ్యా! నాకు పళ్ళెటూళ్ళంటే చాలా యిష్టం. నేనూ నీతో వస్తున్నాను. మాకిప్పుడు హాలీడేస్ వున్నాయి" అంది. శేఖర్ బాగ్ సర్దుతూ. అప్పుడే అక్కడికివచ్చిన శిరీష్ "ప్రస్తుతం నేనూ, శేఖర్ వెళుతున్నాం. నువ్వు మరోసారి వెళ్దువుగానిలే" అన్నాడు సుషమను ఏడిపించాలని. అంతకుముందే తనూ సుషమ వస్తున్నట్లు శేఖర్‌తో చెప్పివున్నందువల్ల, నెమ్మదిగా నవ్వుతూ సుషమవైపు చూశాడు శేఖర్, ఏమీ తెలీనట్లే. బాగ్ సర్దటం ఆపిన సుషమ శిరీష్‌వైపు కోపంగాచూస్తూ "ఏంకాదు. నువ్వుకావాలంటే తర్వాత రా! నేను శేఖరన్నయ్యతో వెళతాను. నాన్నగారితో అన్నయ్య ఎప్పుడో చెప్పాడు నన్ను తీసుకెళతానని" అంది పెంకెగా.

"ఓ.కే. ఒప్పుకున్నాం. యిద్దరం వెళు తున్నాం. యింక ఆ సీరియస్ ఫోజ్ తీసేసి వోసారి నవ్వమ్మా!" అంటూ గడ్డంపట్టుకున్న శిరీష్ చెయ్యివిదిలించి, శేఖర్ బాగ్ సర్దుతున్న సుషమ బిక్క-ముఖంవేసి కూర్చున్న శిరీష్‌నుచూసి ఫక్కు-న నవ్వింది. వాతావరణం నవ్వులతో ఆహ్లాదంగా తయారయింది. మొత్తానికి ముగ్గురూ బయలుదేరి గంగాపూర్ చేరుకున్నారు.

గంగాపూర్ చేరిన దగ్గర్నుంచీ సుషమకు ప్రతిదీ వింతగా, విచిత్రంగా కన్పిస్తోంది. ప్రతిక్షణం శ్యామలాదేవి వెంట తిరుగుతూ "అమ్మా ఇదేవిటి?" అంటూ రోజంతా శ్యామలాదేవి ద్వారా తన సందేహాలు తీర్చుకుంటూంది. ప్రొద్దునవెళ్ళి శిరీష్, శేఖర్ పొలంనుంచీ సాయంత్రానికి యింటికి చేరుకునేవారు. సాయంత్రం స్నానాలుచేసి దారిలో గంద్రాన్ని కలుపుకొని గంగాతీరానికే చేరుకునేవాళ్ళు. కావల్సినన్ని కబుర్లు. ఒక్కో-రోజు సుషమ వాళ్ళతో కలిసి షికారెళ్ళేది. ఎంతమాట్లాడినా వాళ్ళ ముగ్గురిమధ్యా సుషమ ఒక్క-దానికీ కొద్దగా బోర్ అన్పించేది. తనకు యింట్రస్టు లేని ఎరువులు, మందులు గురించిన మాటలంటే మరీ చికాగ్గా వుండేది. అయినా చక్కటి ప్రకృతి సౌందర్యాన్ని సాయంత్రపు నీరెండలో చూసే అవకాశాన్ని వదులుకోలేక వాళ్ళతో కలిసి వెళ్ళేది. వారంరోజులు రొటీన్‌లా గడిచిపోయేసరికి సుషమకు మళ్ళీ కలకత్తా జ్ఞాపకం వచ్చింది.

ఓరోజు అన్నయ్యలతో షికారు బయలుదేరిన సుషమ నెమ్మదిగా ముందు నడుస్తున్నదల్లా చంద్రాన్ని పిలవడానికి వాళ్ళింటికి వెళ్ళి శేఖర్ శిరీష్ సుషమలనుకూడా లోపలికిరమ్మని పిలవడంతో చంద్రం ఇంట్లోకి వెళ్ళారు.

పెద్ద ఉయ్యాలబల్ల హాలుకు మధ్యగా వుంది. ఓ ప్రక్క-గా పేర్చిపెట్టిన ధాన్యం బస్తాలు, హాల్లో కొంచెం ముందుకు రెండుకుర్చీలు ఓ ప్రక్క-గా నవారు మంచం వేసివుంది నవ్వుతూ లోపలికి ఆహ్వానించిన చంద్రం "ఒక్క- నిముషం కూర్చోండి యిప్పుడే వస్తాను," అంటూ లోపలికి వెళ్ళాడు.

శిరీష్ ప్రక్క-న మంచంమీదకూర్చొని పాతకాలంనాటి ఆ యింటి అందాన్ని ఎక్క-డివక్క-డ అందంగా అమర్చినట్లున్న వస్తువుల్ని చూస్తూ కూర్చుంది. సుషమ. ఓ పళ్ళెం నిండుగా సున్నివుండలు, కారపుపూస పెట్టిన ప్లేట్లు పట్టుకొని నెమ్మదిగా లోపలికి అడుగు పెట్టిన శాంత సుషమను చూసి చిన్నగా నవ్వి ప్లేట్లు బల్లమీద పెట్టింది. ఇంతలో మంచినీళ్ళతో వచ్చిన చంద్రం శిరీష్‌కు సుషమకు తన చెల్లెలు శాంతను పరిచయం చేశాడు. తన ఏజ్‌గ్రూప్ శాంతను చూడగానే ప్రాణంలేచివచ్చి

నట్లుంది సుషమకు. "ఇన్నిరోజులూ చెప్పలేదేం మీకో చెల్లాయ్ వుందని?" అన్నాడు శిరీష్ చిన్నగా నవ్వుతూ.

"పాపం! మీ చెల్లాయ్ రోజూ పడే అవస్థ చూడలేక తనతోటివాళ్ళు నలుగురూ పరిచయమైతే తనకూ బావుంటుందనీ ... మా శాంతను పరిచయం చేయాలనే అయిడియా వచ్చింది." అన్నాడు నవ్వుతూ చంద్రం సుషమ వైపుచూసి, కృతజ్ఞతతో చంద్రంవైపు చూసిన సుషమ "నలుగురు చెల్లెళ్ళున్నారా మీకు?" అంది. "నోనో నాకు ఈ గడుగ్గాయి ఒక్కతేనండీ చెల్లెలు. ఇందాక నలుగురు అన్నమాటకు శాంత వానరసైన్యాన్ని వుద్దేశించి. యిప్పుడే మరో అయిదు నిముషాల్లో వస్తారు కబురుచేశాం. అంతలో మీ టిఫిన్ కానివ్వండి" అంటూ తలా ఓ ప్లేటూ చంద్రం అందిస్తుండగానే శాంత సున్ని వుండలపళ్లెం తీసుకొని ఒకో ప్లేట్‌లో రెండు రెండు పెట్టింది. వాళ్ళ టిఫిన్ కాఫీలు పూర్తయ్యేసమయానికి ముగ్గురమ్మాయిలు లోపలికి రాబోయి వెనక్కు తగ్గారు. కొత్తవాళ్ళెవరో కూర్చుని ఉండటంచూసి వెనక్కుతిరిగి వెళ్ళే ప్రయత్నంలో వున్నవాళ్ళను శాంత పిల్చింది "ఫర్వాలేదు రండే" అంటూ. నెమ్మదిగా లోపలికొచ్చి శాంతతోపాటు వుయ్యాలబల్లమీద కూర్చున్నారు, బెదురు బెదురుగా చూస్తూ. శేఖర్‌కళ్ళు మాధవి కోసం వెదుకుతున్నాయి. "సరసు, ఇందిర రమ" అంటూ మళ్ళీను సుషమకు పరిచయం చేశాడు చంద్రం. "సుషమ, శిరీష్ యింక వీడు మన శేఖర్ తెలుసుగా" అంటూ వాళ్ళకు పరిచయం చేశాడు. వాళ్ళు తలలు వంచుకొని కూర్చున్న తీరు, ఆ బెదురుచూపులు చూస్తే పెళ్ళిచూపులకెవరో వస్తే బుద్ధిగా కూర్చున్న అమ్మాయిల్లా ఉన్నారు. వాళ్ళవైపుచూస్తూ నవ్వుతూ ద్వారబంధం పట్టుకొని నుంచున్న చంద్రాన్ని ఒక్క తోపుతోసి "తప్పుకో బావా! అర్జంటని కబురుపెట్టింది శాంత" అంటూ సుడిగాలిలా లోపలికివచ్చిన మాధవి-ఎదురుగా కన్పించిన కొత్తవాళ్ళను చూసి సిగ్గుతో లోపలికి పరుగెత్తబోయి, ఉయ్యాలబల్లమీద సైలెంట్‌గా ఎవరో బంధించిపడేసినట్లున్న స్నేహితురాళ్ళను చూసి ప్రశ్నార్థకంగా శాంతవైపు చూసింది. వెనకనుంచీ వచ్చిన చంద్రం గబుక్కున మాధవి జడ చేతపట్టుకొని లాగి శిరీష్, సుషమ కూర్చున్నదగ్గరకు తీసుకెళ్ళాడు, "అబ్బ! వదులు బావా!" అంటున్నా విన్పించుకోకుండా. "ఇది మాధవి. మా మరదలని యీపాటికి తెలిసే వుంటుంది. కోపం వచ్చిందంటే మీ కలకత్తా కాళిస్వరూపం ఎత్తుతుంది." వీరు శిరీష్, వీరు వారి చెల్లెలు సుషమ వీరు..." అంటూ శేఖర్‌వైపు చూసే సరికి మాధవి మధ్యలోనే అందుకొని

తెలుసు" అంటూ శేఖర్ని వెక్కిరించి, సుషమకు, శిరీష్‌కు, శేఖర్‌కు నమస్కరించింది బుద్ధిగా.

"సుషమగారూ! ఇంక మెజారిటీ మీది. మీ మధ్య యింకాసేపు మేం వున్నామంటే ఇంక ఓటమి అంగీకరించక తప్పదు. కనుక మేం శలవు తీసుకుంటున్నాం" అంటూ వాళ్ళ మధ్య సుషమను వదలి శేఖర్, శిరీష్‌లను తీసుకొని షికారెళ్ళిపోయాడు చంద్రం.

బెల్‌బోటమ్ వేసుకున్న సుషమను వాళ్ళంతా విచిత్రంగా చూస్తూ తమ సందేహాలు, కలకత్తా విశేషాలు, ఆ అమ్మాయి అలంకరణగురించి ఎలా అడిగి తెల్సుకోవాలా అని ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసుకుంటున్న వాళ్ళనుచూసి కొంచెం యిబ్బందిగా ఫీలైంది సుషమ. మాధవి అంతక్రితమే ఆడపిల్లలు అలాంటి డ్రెస్సులు వేసుకోడం చూసివున్నది కనుక సుషమ డ్రస్సేమీ విచిత్రంగా అన్పించలేదు. సుషమ ప్రక్కన మంచంమీద కూర్చుంటూ స్నేహంగా నవ్వింది. ఆ నవ్వుతో ధైర్యంవచ్చిన సుషమ తనూ నవ్వుతూ మాధవితో మాటలు మొదలు పెట్టింది. పక్కింటూళ్ళంటే తన కెంత యిష్టమో సుషమ చెబుతుంటే మిగతా పిల్లలందరూ కలకత్తాను గురించి తాము కంటున్న కలలగురించి చెప్పి అక్కడి విశేషాలు అడిగి చెప్పించుకున్నారు.

మాధవి కలకత్తాగురించి యింట్రెస్టు చూపించకపోవడం సుషమకు కొంత ఆశ్చర్యం కల్గించింది. ఏమైనా మిగతా పిల్లలకు మాధవికి చాలా తేడావుంది. అనుకుంది. ఆ రోజు మళ్ళీ శేఖర్ వచ్చి పిలిచేవరకూ అంతా యిళ్ళదగ్గర పనులు కూడా వదిలేసి సుషమతో కబుర్లు చెబుతూ కూర్చున్నారు.

శేఖర్ పిలవగానే లేచి వెళ్ళింది సుషమ. "నాకు అందరిలోకీ చంద్రంగారి మరదలు మాధవి నచ్చిందన్నయ్యా" అంది సుషమ! చంద్రం మాధవితో చనువుగా మాట్లాడటం, మాధవి,మాటకు మాట అందించడం,చనువుగా చంద్రాన్ని నెట్టుతూ లోపలికిరావడం, చంద్రం జడ పట్టుకొని లాగటం...అన్నీ జ్ఞాపకం వచ్చి ఏదో అర్థంకాని అసంతృప్తి మనస్సు నావరించింది, శేఖర్‌కు. ఆ రోజు కొత్తగా పరిచయమైన ఫ్రెండ్స్ గురించి వాళ్ళ అమాయకత్వాన్ని గురించీ ఆగకుండా చెప్పుకుపోతోంది సుషమ. "చంద్రంగారు ఎంత మంచి వారన్నయ్యా! నాకు బోర్‌కొడుతోందని నేను చెప్పకుండానే గ్రహించి ఎంతమంది ఫ్రెండ్స్‌ను పరిచయం చేశారో చూడు. నువ్వు గ్రహించలేదు నాకెంత బోర్‌గావుండేదో! ఇంక ఎన్నాళ్ళుండమన్నా నాకు ప్రొద్దుపోదన్న బాధలేదు. ఇంక నా వెర్రిప్రశ్నలతో అమ్మను బోర్‌కొట్టించను,"అంటూంటే,

ఏదో పరధ్యానంగావున్న శేఖర్ అన్నిటి లాగే "అవును" అన్నాడు. అప్పటికి గానీ సుషమకు అర్థంకాలేదు శేఖర్ తను చెబుతున్న మాటలు - వినడం దలేని. ఏదో ఆలోచనలో వున్నాడు లెమ్మని శేఖర్ని వదిలి ఆవాళ్టి విశే షాలు చెప్పడానికి రఘుపతిరావుగారి దగ్గర చేరింది.

* * *

ఈ వారంరోజుల్లో సుషమ ఆ యింట్లో ఆడపిల్లలు లేనిలోటు తీర్చిం దన్నట్లుగా అన్పిస్తోంది చూసే వాళ్ళకు మోడరన్‌గావుండే ఆ డ్రస్సులు చూడ టానికి కొంత యిబ్బందిగా అన్పించినా కల్మష మెరుగని కబుర్లతో రఘుపతి రావుగా ి మనసును యిట్టే ఆకట్టు కుంది సుషమ. ఆయన చింతగా కూర్చున్నప్పుడల్లా "అమ్మాయ్ సుషమా!" అంటూ కేకవేయగానే "యస్ డాడీ" అంటూ ఎదురుగా వచ్చి అల్లరిగా నవ్వేది. తనూ నవ్వేస్తూ "డాడీ! డాడీ ఏవిటమ్మా! చక్కగా నాన్నా అని పిలువు" అంటూ ప్రక్కన కూర్చోబెట్టుకొని కొంత సేపు తన చిన్నప్పటి కథలు చెబుతూ, కొంతసేపు సుషమ కబుర్లువింటూ మరి కొంతసేపు తను చిన్నప్పుడు చేసిన చిలిపిపనులు చెబుతూ నవ్వించేవారు. ఆ వయసులో ఆయనకూ చక్కటి కాలక్షేపంగాసుషమ దొరికిన తర్వాతగానీ, ఆడపిల్లలులేని లోటెలాంటిదో అర్థంకాలేదు.

ఆ రోజూ అలాగే ఏవో కబుర్లు చెప్పు కుంటుంటే శ్యామలాదేవి నవ్వుతూ వచ్చి "మీ కూతుర్ని ఓసారిలా పంపుతారూ!" అంది. రఘుపతిరావుగారి దగ్గర్నుంచి లేచి శ్యామలాదేవి చేయిపట్టుకుంటూ "మీ కూతుర్నికాదామ్మా?" అంది సుషమ చిరుకోపం నటిస్తూ. మమ్మీ, అమ్మీ ఏవిటవి? మొదటిరోజే అమ్మా అని పిలవడం అలవాటుచేశారు శ్యామలా దేవి.

"పిచ్చిపిల్లా! ఆయనకు కూతురైతే నాక్కాకుండా ఎలా పోతావమ్మా! ఇలా రా ఓసారి నీతో పనుంది" అని తన గదిలోకి తీసుకెళ్ళి, ఆ క్రితంరోజు సుషమ వద్దని గోలచేస్తున్నా వినకుండా కొలతలు తీసుకెళ్ళి ఈ రోజు పావడా జాకెట్ కుట్టించి అవి వేసుకొమ్మన్నారు శ్యామలాదేవి. ప్రక్కనే ప్రత్యేకంగా సుషమకోసం తెప్పించిన జార్జెట్ ఓణీ మొదటిరోజు వద్దని గొడవచేసినా, ఈరోజు కలిసిన ఫ్రెండ్సంతా అదేరకం డ్రస్సు వేసుకొని వుండటంవల్ల మరే అభ్యంతరం చెప్పకుండా ఆ పావడా జాకెట్ వేసుకొని వోణీ ఎలావేసుకో వాలని అటూ యిటూ తిప్పిదోపు తుండగానే లోపలికెళ్ళిన శ్యామలాదేవి నవ్వుతూ వచ్చి, వోణీవేసి, కుచ్చెళ్ళు పోసి ఎలా దోపుకోవాలో చూపించారు. ఆ డ్రస్సులో తనను తానుచూసుకున్న సుషమకు మొట్టమొదటిసారిగా సిగ్గు

లాంటి భావం కల్గింది. జారిపోతున్న పవిటను పైకి వేసుకుంటూ మరోమారు అద్దంలో చూసుకొని, "ఎలావున్నానమ్మా?" అంటూ శ్యామలాదేవి మెళ్ళో రెండుచేతులూ హారంలా వేసి అడిగింది. శ్యామలాదేవి సుషమను దగ్గరకు తీసుకొని "మహాలక్ష్మిలా వున్నావమ్మా. మీ అన్నయ్యలకు నాన్నగార్కి చూపించు వెళ్ళి," అనగానే పరుగు తీయబోయి పట్టుపావడా అడ్డంపడి పడబోయిన సుషమను చేయిపట్టుకొని ఆపుతూ, "ఒక్క క్షణం వుండమ్మా" అని లోపలికెళ్ళి బీరువాలో తన నగల పెట్టెలోనించి జడకుచ్చులూ, నెక్లెసూ తీసి, సుషమ రెండుజడలూ విప్పి అందంగా ఒకజడ అల్లి చివరనకుచ్చులా వేసి మెళ్ళో నెక్లెస్ పెడుతుంటే... "ఇవన్నీ ఎందుకమ్మా?" అంటున్న సుషమ కళ్ళలో అప్రయత్నంగా నీళ్ళు తిరిగాయి.

"ఉంచమ్మా! అచ్చు మహాలక్ష్మిలా ఉన్నావు. ఇప్పుడు వెళ్ళి చూపించు అన్నయ్యవాళ్ళకు. అరే! కళ్ళలో ఆ నీళ్ళేమిటి?" అంటూ కంగారుపడుతున్న శ్యామలాదేవివైపు తిరిగి "అబ్బే, ఏంలేదమ్మా! కంట్లో ఏదో నలకపడింది" అంటూ నెమ్మదిగా నడిచివెళుతున్న సుషమ కళ్ళకు తనకు ఆరుసంవత్సరాలు నిండకముందే చనిపోయిన తల్లి జ్ఞాపకం వచ్చింది. అనుక్షణం తల్లి ఫోటో చూస్తుండటంవల్ల ఆ జ్ఞాపకం అలాగే నిల్చిపోయింది. తననెంతో ఆప్యాయంగా చూస్తున్న శ్యామలాదేవిని చూస్తుంటే ఎన్నో సంవత్సరాల క్రితం అనుభవమైన ఆ అనుభూతి కొత్తగా మళ్ళీ అమ్మే అన్నీ అలంకరిస్తున్నట్లుగా అన్పించింది.

ఉన్నంతలో సుషమ నాన్నగారు పిల్లకేమీ తక్కువ చేయలేదు. వాళ్ళు కోరిన ప్రతికోరికా తీర్చారు. చిన్నప్పటి నుంచీ మోడరన్ డ్రస్సుకు అలవాటు పడిన సుషమ ఇలాంటి డ్రస్సులు చాలా రేర్‌గా చూసేది. ఎప్పుడైనా కథల్లో చదవడం, ఏదైనా తెలుగు పిక్చర్‌లో ఆ డ్రస్సు వాడితే చూడటం తప్ప సుషమ ఇలా పావడావోణీ వేసుకుంటే ఎలా వుంటుందని కలలోకూడా ఊహించలేదు. ఆలోచనలతో నెమ్మదిగా రఘుపతిరావుగారున్న రూమ్‌లో అడుగు పెట్టింది.

అప్పటివరకూ శిరీష్ చెబుతున్న జోక్స్‌కు నవ్వలేక పొట్టచేతపట్టుకొని నవ్వుతున్న రఘుపతిరావుగారు, శేఖర్, యిద్దరూ ఒక్కసారి నవ్వాపేశారు. ఏవిటాని? వెనక్కుతిరిగిన శిరీష్ తన కళ్ళను తాను నమ్మలేకపోయాడు— "సుషమా!" అన్నాడు ఆశ్చర్యంగా చిన్నగా నవ్వుతూ రఘుపతిరావుగారి దగ్గరకెళ్ళి పాదాభివందనంచేసింది. "శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తుః."

అని మనస్ఫూర్తిగా దీవించి చేయి పట్టుకొని ప్రక్కనకూర్చోబెట్టుకున్నారు. శేఖర్ తను కూర్చున్నదగ్గరనుంచీ లేచి సుషమ ప్రక్కకుర్చీలో కూర్చుంటూ,

"సుషమా! ఈ డ్రెస్సులో నువ్వెంత బావున్నావో తెలుసా? ఇకెప్పుడూ యిదే డ్రస్సు వేసుకోమ్మా!" అంటుండగానే శేఖర్ని ఆపేసి "అవునమ్మా! ఇంక యిప్పటినుంచీ ముసలిదాని వయ్యే వరకూ యిదే డ్రస్సువేసుకో!" అంటూ నవ్వాడు శిరీష్.

అలా కులాసాగా కబుర్లుచెప్పుకుంటూండగా, శ్యామలాదేవి భోజనాలకు పిల్చింది.

ఆ మరునాడే చంద్రం తోటలో వన భోజనాలు. ఆ పిక్నిక్‌ను గురించి సుషమ మనస్సులో ఎంతో వూహించుకొని మురిసిపోయింది.

శ్యామలాదేవి తెల్లవారుఝామునే లేచి అన్ని ఫలహారాలు సిద్ధంచేయించి కారియర్లలోకి సర్దించింది, ఓ పెద్ద స్టీల్ కారియర్ నిండుగా పులిహోరా మరో కారియర్ నిండా సేమ్యా పాయసం కావల్సిన ప్లేట్లు, స్పూన్లు, గరిటలు, ఒక బుట్టనిండుగా కమలాలు, మావిడి పండ్లు అన్నీ సిద్ధంచేయించి నెమ్మదిగా సుషమను లేపారు. సుషమ లేచి రడీ అయ్యే టైమ్‌కు, శిరీష్, శేఖర్ రెడీ అయి క్రిందకు వచ్చారు. కాఫీ తాగి ఇద్దరూ చంద్రం దగ్గరకు వెళ్ళి వస్తామని బయలుదేరారు.

వీళ్ళు వెళ్ళేసరికి చంద్రం గిత్తలకు అలంకారం పూర్తిచేస్తున్నాడు. రెండూ సమానమైన ఎత్తులో తెల్లగా, కాటుకపెట్టినట్లున్న పెద్దపెద్ద అందమైన కళ్ళతో మెరుస్తున్నట్లున్నాయి వాటి పోషణకు చంద్రం ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకుంటాడని చూస్తూనే అర్థమౌతోంది. "ఏరా శేఖర్ మనకు రెండుబళ్ళు చాలవూ ?" అన్నాడు శేఖర్ని చూడగానే" ఒరే బళ్ళెందుకురా ఎంత దూరముందని మీతోట! సరదాగా అంతా నడిచే వెళ్ళవచ్చుగా" అన్నాడు శేఖర్ నవ్వుతూ, ఓ చేత్తో ఎద్దువీపు నిమురుతూ.

"భలేవాడివిరా ! మనం మగవాళ్ళం ఎంత దూరమైనా నడవగలం. మరి ఆడపిల్లల మాటేమిటి ? ఇంకొంచెం సేపట్లో మంచి ఎండ కాస్తుంది. అందులోనూ మీ చెల్లాయి మన పొలంగట్లంట యీ ఎండలో ఆ డొంకలోపడి నడవాలంటే ఇంక ఛస్తే మీవూరు రాను బాబోయ్ ! అని పారిపోతుంది కలకత్తా దారి వెతుక్కుంటూ" అంటున్న చంద్రం మాటలు నిజమే అన్పించాయి, చంద్రం వాళ్ళతో మాట్లాడుతూనే గిత్తల మెళ్ళో మువ్వలు కడుతున్నాడు.

ఇంతలో శాంత వచ్చింది నవ్వుతూ. అప్పటికే రెడీగా వుంది. "మధువాళ్ళను పిల్చుకు రానా అన్నయ్యా అంటూ

ముందుకు వెళ్ళబోయిన శాంతను పిల్చి "రాత్రి చెప్పావుగా రెడీఅయివుంటారులే వెళుతూ దారిలో అందర్నీ ఎక్కించుకు వెళ్ళవచ్చు. ముందు ఆ సామాను పంపించు లోపలకెళ్ళి" అన్నాడు చంద్రం

శేఖర్‌కు ఎదురుగా చేతిలో కారియర్ పట్టుకొని హుషారుగా వస్తున్న మాధవి కన్పించింది. రెప్పపాటు కాలంలో కారియర్ నవువుగా చంద్రం చేతిలో పెట్టి నవ్వుతూ శిరీష్‌కు, శేఖర్‌కు నమస్కరించింది. వాళ్ళిద్దరూ ఓ క్షణం తబ్బిబ్బై అప్పుడు స్పృహవచ్చి ప్రతి నమస్కారం చేశారు. మాధవి ఎప్పుడేం చేస్తుందో ఎవరికీ తెలీదు. ఇంతలో "ఏవిటి మధూ యిది ? మనకే...తినడానికే" అన్నాడు చంద్రం నవ్వుతూ... "కాదు పారేయ డానికి ముఖం చూడు" అంది మాధవి.

వెళ్ళడానికి సిద్ధంగా ఉన్న శేఖర్ని ఉద్దేశించి, "మావయ్య ఇప్పుడే బండికట్టి మీ యింటికి పంపించారు" అంది. ఓ క్షణం ఏ మావయ్య మామిడితోట మావగారేనా ? అని అడుగుదామని నోటిదాకా వచ్చినా చంద్రంఏమైనా అనుకుంటాడేమోనని మౌనంగా తలవూపి ముందుకు వెళ్ళిపోయాడు శేఖర్, శిరీష్‌తోపాటు.

ఆ రోజు ఆకుపచ్చ పావడా ఎర్రటి బోర్డర్, అదేరంగు అదే అంచు జాకెట్, పచ్చటి వోణీ వేసుకుని అందంగా తయారయిన మాధవి పచ్చదనాన్ని శరీరానికి


# చందాదారులకు ఉచితం

ఆగస్టు 15 వ తారీకు నుంచి నవంబరు 1 వ తేదీలోగా యువకు చందాదారులుగా చేరువారికి దీపావళి సంచికతో యువ చందా 40–00 రూపాయలు మాత్రమే. దీపావళి సంచిక రిజిష్టరు పోస్టుద్వారా పంపగోరువారు అదనంగా రెండురూపాయలు పంపవలెను.

యువ రెండు సంవత్సరముల చందా 80 రూపాయలు. దీపావళి సంచికలు మా ఖర్చులతోనే రిజిష్టర్డ్ చేసి పంపెదము. చందాదారులు ఈ అవకాశం ఉపయోగించుకోవలెనని మనవి. సంవత్సరమునకు తక్కువ చందా స్వీకరించబడదు.

ఇట్లు,
పబ్లిషర్, యువ

అందంగా కప్పుకున్న ప్రకృతి కన్యలా కన్పించింది. శిరీష్ మరోమాటు పిలవడంతో ఆలోచనలకు స్వస్తిచెప్పి "ఎవిటిరా ?" అన్నాడు.

"ఏంలేదురా! చంద్రం మాధవిని మారేజ్ చేసుకుంటాడా ? చాలా చనువుగా వుంటారిద్దరూ. భలే సరదాగా మాట్లాడుకుంటారు" అన్నాడు. శేఖర్ మనస్సులో అదో రకమైన స్పందన ప్రారంభమైంది. ఉద్వేగాన్ని అపుకోడానికి ప్రయత్నిస్తూ "ఛ! అదేంలేదురా బావా మరదళ్ళు ముఖ్యంగా పల్లెటూళ్ళలో అలా సరదాగా మాట్లాడుకోవడం సహజం అంతమాత్రాన వాళ్ళు పెళ్ళి చేసుకుంటారని ఎందుకనుకోవాలి ?" అన్నాడు. మనసున మరో కోణం నుంచి చేసుకోగూడదని ఎందు కనుకోవాలి ? ఎందుకు చేసుకోరు ? అని నిలదీస్తున్నట్లడుగుతున్న మనసును కావాలని అణచిపెట్టాడు. గోపాలంగారి వదిన కొడుకు చంద్రం. ఆ వరసని మాధవి బావా అని పిలుస్తోంది. హుషారయిన వాళ్ళు కాబట్టి సరదాగా మాట్లాడుకుంటున్నారు. అలా సమర్థించుకొని తేలికపడ్డ హృదయంతో యిల్లు చేరుకుని సుషమను రెడీ అయి రమ్మని సామానులన్నీ వెనగ్గా సర్దించి మెత్తగా గోపాలంగారు వేయించిన పరుపుమీద దుప్పటి సరిగ్గా వేయించి "సుషమా తొందరగా రావాలి."అంటూ కేకేశాడు.

"వస్తున్నా అన్నయ్యా!" అంటూ మరోసారి అమ్మ వేసిన జడను తిప్పి తిప్పి చూసుకొని శ్యామలాదేవితో చెప్పి బయటకు వచ్చిన సుషమ ఎడ్లబండిని చూసి ఓ క్షణం బిత్తరపోయి, మళ్ళీ తమాయించుకొని చిన్నగా నవ్వుతూ గిత్త పొడుస్తు దేమోనని భయం భయంగా దానివైపే చూస్తూ నెమ్మదిగా బండెక్కి కూర్చుంది శిరీష్‌కూడా ఎక్కి కూర్చున్నతర్వాత శేఖర్ బండెక్కాడు. ఆ రోజు శేఖర్ శిరీష్‌లుకూడా పంచాలాల్చీల్లో నిండుగా హుందాగా కన్పిస్తున్నారు. రామయ్య వచ్చి బండి కట్టాడు. పదే పదే భుజంమీద నిలవకుండా జారిపోతున్న పవిట సర్దుకుంటూ ఉత్సాహంగా ముందుకు చూస్తోంది సుషమ. రామయ్యను అక్కడే ఉండమని తను తొట్లోకి జరిగి ఛర్నాకోల అందుకున్నాడు శేఖర్. ఇంకొంచెం ముందుకు జరిగి "అన్నయ్యా నీకు ఎడ్లబండి డ్రైవ్‌చేయడంకూడా వచ్చా? నాకు నేర్పవూ ? "అంటున్న సుషమను వెనక్కులాగి తను ముందుకు జరిగి కూర్చుంటూ" సర్లె ఇక నీకు నేర్పితే మేంఇంట్లో కూర్చుని వంటచేయాలి," అంటూ నవ్వాడు శిరీష్. బుంగమూతి పెట్టి తలవంచుకు కూర్చున్న సుషమను చూసి "అదిగో మీ ఫ్రెండ్ మాధవి," అంటూ గోపాలంగారింటి ముందు నుంచున్న మాధవిని చూపించాడు.

శిరీష్. శేఖర్ నెమ్మదిగా పగ్గాలులాగి బండి ఆపేశాడు. గోపాలంగారిల్లు సమీపించగానే, సుషమ కోపం మర్చిపోయి బయటకు చూస్తూ "మాధవీ రండి" అంటూ నవ్వుతూ పిల్చింది. "ఇప్పుడే వస్తాను" అంటూ లోపలికి పరుగెత్తి అత్తయ్యతో చెప్పి వచ్చి నెమ్మదిగా రోజా మీదుగా బండెక్కుతున్న మాధవిని ఆశ్చర్యంగా చూస్తోంది సుషమ.

లోపల శిరీష్‌కూడా ఉండటంతో రోజా మీదినుంచీ కాలు లోపల పెట్టడానికి సందేహిస్తూ అలా రోజా మీదే ఆగిపోయిన మాధవిని చూసి చిన్నగా నవ్వుతూ తొట్లో మరికొంచెం ముందుకు జరిగి "ఇలారండి" అన్నాడు. గిత్త మీదుగా తొట్లో ఓ కాలువేసి లోపలికెక్కింది మాధవి. శిరీష్ ముందుకు జరిగాడు. ఆడపిల్లలిద్దరూ ఒక్కచోట చేరారు. సుషమ డ్రస్‌చూసి మెచ్చుకుంటున్నట్లుంది మాధవి. సుషమ సిగ్గుగా "అమ్మ కట్టించారు నిన్న" అని చెబుతోంది మాధవితో.

కొంచెం ముందుకు వెళ్ళి చంద్రం యింటిముందు ఆగింది బండి. 'చందూ' అంటూ కేకేశాడు శేఖర్. అప్పటికే కట్టి సిద్ధంగా వున్న బండిలో ఆడపిల్లలంతా ఎక్కారు. శాంత బండెక్కుతూ "మధూ వచ్చిందా" అని అడిగింది. "వచ్చాను" అంటూ తలపైకెత్తి కేకేసింది మాధవి. "శాంతను కూడా యిక్కడకు రమ్మందామా" అన్న సుషమతో అదికూడా వచ్చేస్తే మిగతావాళ్ళంతా గొడవ పెడతారు. వూరుకోండి అక్కడెలాగూ కలుస్తాంగా" అంది మాధవి.

రెండుబళ్లూ ఒకదాని వెనుకొకటి బయలుదేరాయి. వూరు దాటగానే గిత్తలను పరుగెత్తించడం మొదలెట్టారు. మొదట ఆ పరుగుకు ఆ కుదుపులకు భయపడింది కానీ మాధవి హుషారు చూసి "అన్నయ్యా యింకా త్వరగా పోనివ్వు" అనడం మొదలెట్టింది. మరికొంచెం సేపట్లో వెనుక వస్తున్న చంద్రం బండి వీళ్ళ బండిని దాటేసుకొని పరుగులు తీసింది. శాంతా మిగతా పిల్లలూ చప్పట్లు కొడుతూ అల్లరిగా నవ్వారు. 'బండిలో నుంచొని అంత స్పీడుగా ఎలా నడుపుతున్నాడో చంద్రం!' అని తనలో తానే అనుకుంది.

(సశేషం)

Printed and Published by A. Chandra Sekar Rao at 5-9-88, Public Garden Road Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500001. Editor : A. SUDHAKARA RAO




"మీ అన్నయ్యకు బండి నడడటం అంతగా తెలిసినట్లులేదు. వెనక్కు-రమ్మనండి సుషమా! నేను నడుపుతాను. మా బావ బండిని దాటుకొని వెళ్ళిపోతుంది మన బండి," అంటూ చిన్నగా నవ్వుతున్న మాధవిని వెనక్కి-తిరిగిచూసి, పౌరుషంగా తనూ లేచి నుంచుని చర్నాకోల తీసుకొని గట్టిగా కొట్టాడు, రెండు గిత్తల్నీ. మువ్వలు ఘల్లు ఘల్లున మ్రోగించుకుంటూ పరుగులుతీశాయి ఎడ్లు. ఆ పరుగుకు నిలదొక్కు-కుని నిలబడటం కష్టంగా వున్నా పట్టుదలగా బండి పరుగులు తీయిస్తున్నాడు శేఖర్. మరో రెండు ఫర్లాంగుల దూరం పోయేసరికి చంద్రం బండి వెనుకబడింది. శేఖర్ బండి ముందు కెళ్ళింది. అప్రయత్నంగా శేఖర్ చేయి సన్నటి మీసాలమీదకు పోయింది. ముఖాన ఓ గర్వ పీచిక తొంగిచూసింది. నవ్వుతూ వెనక్కి- చూసిన శేఖర్ని చూసి 'అలా వుండాలి పౌరుషమంటే' అంటూ ఫక్కు-న నవ్వింది మాధవి. శిరీష్ శేఖర్లు నృతి కలిపారు. వెనక్కు- తిరిగి చంద్రాన్నే చూస్తున్న సుషమ నవ్వుతోంది, కానీ వీళ్ళ మాటలు విని కాదు. చంద్రం కావాలని బండి నెమ్మదిగా చేయడం గమనించి తనలో తాను నవ్వుకుంది. చంద్రం దూరాలోచనతోనే బండి

నెమ్మదిగాతోలసాగాడు. శేఖర్ పౌరుషానికి పోయిబండి ముందుకుపరుగెట్టిస్తే అంతగా అలవాటులేని శేఖర్ బండిఎక్కడ బోల్తా కొట్టిస్తాడోనని భయమేసింది. అంతా ఆడపిల్లలున్నప్పుడు జాగ్రత్తగా వుంటే మంచిదని బండి నెమ్మదిగాచేసి శేఖర్‌కి దారిచ్చాడు చంద్రం. సుషమ కళ్ళతో కలిసిన చంద్రం కళ్ళు నవ్వుతున్నాయి.

మరో గంటలో అంతా తోటలో వున్నారు. ఆ రోజంతా రకరకాల ఆట లతో, మాటలతో, పాటలతో హాయిగా గడిచిపోయింది. మధ్యాహ్నం భోజనాల టైమ్‌లో తోటలో దుప్పట్లు పరిచి అంతా సర్దుతున్న మిగతా పిల్లలు సుషమను, "మీరేం చెయ్యక్కర్లేదు. అలా కూర్చోండి" అన్నారు. చంద్రం దగ్గరగా నడిచిన సుషమ ఎటో చూస్తూ ఆలోచనలో వున్న చంద్రంతో "నాకు మీ తోటంతా చూపించరూ?" అంది. అప్పటికే శిరీష్ శేఖర్‌లు, ఎవరెవరు ఏమేమి తెచ్చారో కనుక్కుంటూ అవన్నీ రుచి చూస్తూ, ప్లేట్లలో సర్దిస్తున్నారు.

చంద్రం మరో మాట మాట్లాడే అవకాశంఇవ్వకుండా "అన్నయ్యాఇప్పుడే వస్తామని" శిరీష్ వాళ్ళతో చెప్పి ముందుకు అడుగువేసిన సుషమను అప్రయత్నంగా అనుసరించిన చంద్రం మనసులో భయంగా ఏదో తెలీని గుబు లుగా ఉంది. శేఖర్, శిరీష్‌లు ఏమను కుంటారోనని మనసులో వున్నా సుషమ పిలుపును కాదనలేని ఏదో బలహీనత ఆమె ననుసరించేలా చేసింది. పది నిముషాల్లో గిర గిరా తోటంతా తిరిగారు. నిజంగా సుషమ తోట చూస్తోందా? ఒక్కోసారి అలా రెప్పవేయకుండా నా ముఖంలో ఏం చూస్తోంది? ఆ కళ్ళతో ముడిపడ్డప్పుడు నా కళ్ళు విడివడలేక పోతున్నా యెందుకు? తనకంటే అన్ని విధాల ఉన్నతురాలు సుషమ. తను ఏ విధంగానూ ఆమె అంతస్థుకు చేరు కోలేడు. అయినా అన్నీ తెలిసినా, ఆ ఆకర్షణనుంచి తను తప్పుకోలేక పోతున్నాడు. వెనక్కు తిరిగి వాళ్ళంతా వున్న ప్రదేశానికి చేరుకునే సమయానికి అంత మౌనంగా వున్న చంద్రం భాష కందని భావోద్రేకంతో—

"సుషమా! మీ రివ్వాళ చాలా అందంగా వున్నారు. అచ్చం మా వూరి అమ్మాయిలా వున్నారు" అన్నాడు నెమ్మదిగా వణుకుతున్న గొంతుతో.

సుషమ కళ్ళు చంద్రంవైపు తిరి గాయి ఆనందంగా. ఆ కళ్ళలో మరేదో భావాన్ని గ్రహించాలని ఆత్రపడుతోంది సుషమ మనస్సు. చిన్నగా నవ్వుతూ జడకుచ్చులు చేతిలోకి తీసుకొని, ఆ చూపుల నలాగే చంద్రం చూపులతో కట్టేసి నిలదీస్తున్నట్లే అడిగింది. "మీ మధుకన్నా అందంగా ఉన్నానా?" అని. అనుకోని యీ ప్రశ్నకు చంద్రం ఓ క్షణం తెల్లబోయాడు. అంతలోనే

చిన్నగా నవ్వేస్తూ "నా కళ్ళు పెట్టుకొని చూడగలిగితే మీకే తెలుస్తుంది. పదండి, వాళ్ళంతా మనకోసమే ఎదురు చూస్తు న్నట్లున్నారు. అంటూ త్వరగా ముందుకు అడుగులు వేస్తున్న చంద్రం అడుగులో అడుగు వేస్తూ నడుస్తున్న సుషమ మనసు ఆనందంతో మయూర నాట్యం చేసింది.

తినడం ప్రారంభించడానికి సిద్ధంగా వున్నారు వాళ్ళంతా సుషమ, చంద్రం వెళ్ళగానే చెరో ప్లేటు ఇచ్చారు శాంతా, మాధవి. అప్పటికే అన్నీ వడ్డించి వుండటంతో అంతా కబుర్లు చెప్పుకుంటూ భోజనాలు పూర్తిచేశారు.

భోజనాలైన తర్వాత "తర్వాత కార్య క్రమమేమిటి ?" అని అడిగిన శిరీష్‌కు, ఎవ్వరూ సమాధానం చెప్పలేదు కొందరు విశ్రాంతిగా అలా చెట్లకు ఆనుకొనే కళ్ళుమూసుకున్నారు. శిరీష్‌కు దగ్గరలో ఉన్న సుషమ "అదిగో నిద్ర పోవడం" అంటూ చెట్ల కానుకొని కళ్ళు మూసుకొన్న శాంతా, సరసులను చూపించింది. సుషమ మాటలతో ఓసారి నవ్వులతో నిండిపోయిందా ప్రదేశం

దూరంగా ఓ చెట్టుకొమ్మన వున్న దోర మామిడికాయను కోయడానికి ఎగురుతున్న మాధవిని చూపించి, "కాదు సుషమా, మామిడికాయల దొంగ తనం యింక ఇప్పటి కార్యక్రమం" అన్నాడు శేఖర్. మళ్ళీ మరో మారు నవ్వులతో మారుమ్రోగిందా ప్రదేశం

మాధవికి వీళ్ళ నవ్వులు, మాటలు విన్పించటంలేదు. అందని పండును అందుకోవాలని మహా పట్టుదలగా ఉంది. అలసిపోతోంది, పండు అందడంలేదు. ఓ క్షణం విశ్రాంతి తీసుకుని మళ్ళీ ఎగురుతోంది ఆ పండుకోసం. "పోనీ నువ్వెళ్ళి కోసివ్వరా పాపం." అన్నాడు శేఖర్ చంద్రాన్ని వుద్దేశించి "నాకు ఓపిక లేదురా ! భుక్తాయాసంగా వుంది. అంతగా పాప మన్పిస్తే నువ్వెళ్ళి కోసివ్వు. !" అన్నాడు ప్రక్కనేవున్న చెట్టుకు చేరగిలబడుతూ

"ఇప్పుడే వస్తా నుండరా" అని మళ్ళీ శిరీష్ వెంటబడకుండా ఆ మాటతో ఆపేసి లేచి మాధవిని అంతగా అవస్థ పెడుతున్న మావిడిచెట్టు దగ్గరకు చేరు కొని నెమ్మదిగా వెళ్ళి మాధవి వెనగ్గా నుంచొని, కొంతసేపు పైకి ఎగురుతూ ఆయాసపడుతున్న మాధవిని చూసి, చిన్నగా నవ్వుతూ "కోసివ్వనా ?" అన్నాడు.

గిరుక్కున వెనక్కుతిరిగిన మాధవి, శేఖర్ని అంత దగ్గర్లో చూసి సిగ్గుపడి పోయింది "ఎక్కడికెళ్ళినా మామిడి తోటలన్నీ మావగారివే కావడం మీ అదృష్టం" అంటూ ఒక్కసారి పైకి ఎగిరి, కొమ్మ అందుకొని కాయకోసి మాధవి కిస్తూ, అంతటితో ఊరుకోకుండా

"కడుపునిండా భోంచేయలేదా? మావిడి కాయల కెగబడ్డారు" అన్నాడు చిలిపిగా నవ్వుతూ చురుక్కున చూసిన మాధవి కళ్ళలోని భావమేమిటో బోధపడక ముందే సమాధానం చెప్పింది నవ్వుతూ. "మీరు మిగిల్చితేకదూ, మా కడుపులు నిండటానికి!" అని.

''నేను మిగిల్చింది తింటారని తెలిస్తే మిగిల్చేవాడినేనే ..." అన్నాడు శేఖర్ అంతకంటే కొంటెగా మాధవి కళ్ళలోకి చూస్తూ.

ఆ చూపుల్లో వున్న ఆరాధన మాధవిని ఓ క్షణం మైమరచి శేఖర్ కళ్ళలోకి చూసేలా చేసింది. అంతలోనే కళ్ళు వాల్చేసుకుంది బలవంతంగా.

" మొట్టమొదటిరోజే ఆ కళ్ళలోని ఏదో అయస్కాంతశక్తికి కట్టుబడి పోయిన శేఖర్ మాధవితో మనసువిప్పి మాట్లాడమని మనసుచేసే అల్లరిని చంద్రాన్నిచూసి కంట్రోలు చేసుకుంటూ వచ్చాడు కానీ ఈ రోజు మాధవికళ్ళలో కనిపించిన ఆ మెరుపు, చూపులు తిప్పేసుకోవడంలోని ఆ బెదురు చూసిన తర్వాత ఎందుకో మాధవి తనకోసమే యీ వూరొచ్చిందని, తమది ఈ జన్మ అనుబంధం కాదని జన్మజన్మలుగా తామిలా కలిసే వుండేవారనీ, అసలు మాధవిని తానింతక్రితమే చూశానని" గట్టిగా అన్పించింది అలాగే మైమరచి మాధవినే చూస్తూ కలల అలలపై తేలి పోతున్న శేఖర్ వైపు కళ్ళెత్తిచూసి "ఇది కలకత్తాకాదు శేఖర్ బాబూ! కళ్ళు కొంచం కంట్రోల్‌లో పెట్టుకోండి," అని నవ్వుతూ ముందుకు సుషమ వాళ్ళున్నవైపు పరుగెడుతున్న మాధవినే చూస్తూ నుంచొని, మొట్టమొదటిసారిగా తనపేరు అంత మధురంగా విన్పించిన మాధవి గొంతును, వీణ మీటినట్లు పలికిన ఆ గొంతులోని మాధుర్యాన్ని పదే పదే తల్చుకుంటూ, వాళ్ళంతా వున్న చోటుకు చేరుకున్నాడు శేఖర్.

ఏవో జోకులు విసురుకుంటూ మామిడిచెట్లమధ్య కులాసాగా నవ్వు కుంటూ కొంతసేపు కాలక్షేపం చేశారు. అంతలో ఓ పాట పాడమని సరసు అడిగింది మాధవిని.

''మధూ పాడతారా! ప్లీజ్ మాధవీ పాడరూ" అంటూ అడగటం మొదలెట్టింది సుషమ. మరీ బ్రతిమిలాడించు కోకుండానే మొదలుపెట్టి, రెండుపాటలు పాడింది. శిరీష్‌కూడా కొన్ని భావ గీతాలు పాడాడు. చంద్రం అడక్కుండా వుండలేకపోయాడు ''సుషమా! మీరూ ఒక పాట పాడకూడదూ!'' అని. ఒకళ్ళు మొదలుపెడితే, యింకా అంతా గొడవే, పాడండి, ఒక్కపాట పాడండి, అంటూ. చివరికి సుషమకూడా పాడింది. ఒక హిందీపాట, ఓ బెంగాలీపాట పాడి విన్పించింది. పాట అంతగా అర్థంకాక పోయినా గొంతులోని ఏదో ఆకర్షణ

శక్తి అందర్నీ ఆకట్టుకుంది. పాట అంతమంది పాడినా అందర్లోకీ ప్రత్యేకంగా కన్పించిందీ, అందర్నీ మైమరపించిందీ మాధవి పాడిన కృష్ణశాస్త్రిగారి పాటలే...

పాటల ప్రోగ్రాం అయిన తర్వాత అంతా బయలుదేరి మళ్ళీ తోటమీద పడ్డారు. ఎవరు కోరిన కాయలు వాళ్ళు కోసుకొని తిన్నారు.బుట్టనిండా పళ్లున్నా అవెవరూ ముట్టుకోలేదు. తమకు కావల్సినవి తామే కోసుకొని తినడంలో అదో ఆనందం. అల్లరిగా ఒక పండుకోసం యిద్దరిద్దరు పోటీపడటం, చివరికది ఏ ఒక్కరికో దక్కటం, రెండోవాళ్ళు మ్మూతి ముడుచుకోడం, మళ్ళీ అంతలోనే ఆ పండు లాక్కొని పరుగెత్తటం, యిలా యిష్టమొచ్చినంతగా ఆటలతో, అల్లరితో గడిపి, కొంతదూర మలా నడుస్తూ వెళ్ళిన సుషమ, చూడాలనుకున్న ప్రకృతి దృశ్యాలు ఒక్కొక్కటే చూస్తూ, ఆ పల్లెమీద, ఆ పల్లెలో పుట్టి పెరిగి, తన నాకర్షించిన చంద్రం మీద అంతు తెలీని అభిమానాన్ని పెంచుకుంది.

సాయంత్రం చల్లబడేవరకూ యిష్టమొచ్చినట్లు తిరిగి చిన్నపిల్లల్లా గంతులువేసి, మధ్య మధ్య చిలిపి తగవులతో, అలకలతో మళ్ళీ రాజీ పడిపోవడంతో యింక వెళ్ళిపోదామనే ఏకాభిప్రాయానికి వచ్చి నెమ్మదిగా బళ్లెక్కి యిళ్ళకు చేరుకున్నారు.

## 2

గంగాపూర్ కావడానికి బెంగాల్ ప్రాంతమే అయినా ఆ ఊళ్ళో తెలుగు వాళ్ళే ఎక్కువ. అంతా ఎప్పుడో ఆంధ్రదేశంనుంచి అక్కడి కెళ్ళి సెటిలైనవాళ్ళే. కొందరు బెంగాలీస్ కూడా లేకపోలేదు. అయితే అంతా చాలా కలివిడిగా వుంటారు. అందరికీ బెంగాలీ వచ్చు. అయినా తమ మధ్య బెంగాలీ వాళ్ళు తక్కువ వుండటంవల్ల, అంతా తెలుగే మాట్లాడతారు. భాషేతరప్రాంతం వచ్చినా, అక్కడ స్థిరపడిపోయినా, తెలుగుదనంలో వున్న తీపి దనాన్ని నలుగురికీ పంచుతూ, నలుగురితో కలిసి మెలిసి తిరుగుతుండటంవల్ల వాళ్ళ మధ్య స్వ పర భేదాలు లేవు. అందుకే బెంగాలీ అమ్మాయిలైన ఇందిర, రమ కూడా మాధవి వాళ్ళతోపాటు పిక్నిక్ ప్రోగ్రాంలో స్వేచ్ఛగా పాల్గొన్నారు. అంతేకాదు వీళ్ళు బెంగాలీ మాట్లాడినంత స్వేచ్ఛగా, స్వచ్ఛంగా వాళ్ళూ తెలుగు మాట్లాడటం నేర్చుకున్నారు. అందువల్ల వాళ్ళ స్నేహానికి భాష, జాతి అడ్డు రాలేదు. వాళ్ళలో ఎవరూ హెచ్చు తగ్గులు ఆలోచించరు. స్నేహానికి అవి అవసరంలేదు కూడా.

మరో వారంరోజులు, శిరీష్, సుషమ గంగాపూర్‌లోనే వున్నారు. ఆ వారం

రోజులూ క్షణాల్లా గడిచిపోయాయి. ఈలోపు సుషమ శాంతను చూసే మిషతో చంద్రం వాళ్ళింటికి రెండు మూడుసార్లు వెళ్ళడం, చంద్రంతో మాట్లాడాలని ప్రయత్నించడం జరిగింది. మాట్లాడింది కూడా, అవకాశం చూసుకొని. చంద్రం సుషమతో మాట్లాడుతున్నప్పుడు అతని కళ్ళు ఆరాధనాభావంతో మెరుస్తుండేవి. కానీ మరుక్షణం సుషమకూ, తనకూ మధ్య నున్న దూరం జ్ఞాపకం వచ్చి కలవర పడిపోయేవాడు. అందని గగన కుసుమంకోసం అర్రులు చాచడం వెర్రితన మౌతుందేమోనని బాధపడే వాడు.

చిన్నప్పటినుంచీ కోరిందల్లా పొంద గల్గిన సుషమకు ఈ కోరికూ్కడా అసాధ్య మన్పించలేదు. ఈ కోరిక కూడా డాడీతో చెప్పి అవలీలగా తీర్చు కోగలనన్న నమ్మకంతో చంద్రంతో స్వేచ్ఛగా మనసు విప్పి మాట్లాడేది. స్కూల్ ఫైనల్ తో చదువాపేసినా చంద్రం, మంచి మంచి పుస్తకాలు చదివేవాడు. కలకత్తా ఎవరు వెళుతున్నా మంచి పుస్తకాలు తెప్పించుకొని చదవడం వాటిని శ్రద్ధగా, నీట్ గా ఓ బీరువాలో భద్రంచేయడం, అలవాటు చేసుకున్నాడు. అతని చిన్న లైబ్రరీలో వున్న ఆ పుస్తకాలు చూసి సుషమ ఆశ్చర్యపోయింది. తను చదవని ఎన్నో గ్రంథాలు, నవలలు మంచి మంచి సెలక్షన్స్ యింగ్లీష్ నవలాలోకంలో పేరెన్నికగన్నవారి రచన లెన్నో వున్నాయి. అవన్నీ చూసిన సుషమ అతని అభిరుచిని అభినందించకుండా వుండలేకపోయింది. శాంతా, మాధవీ కూడా సుషమకు మంచి ఫ్రెండ్స్ అయ్యారు. వాళ్ళిద్దరినీ ఓసారి కలకత్తా రమ్మని ఆహ్వానించింది.

ఆ రోజు సాయంత్రం గంగాతీరాన కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నప్పుడు "నాకూ కలకత్తా చూడాలనే వుంది. అన్నయ్య తీసుకొస్తే వస్తా" నంది శాంత. మాధవి మౌనంగా వుండి పోయింది. "ఏం మధూ నువ్వు మాట్లా డవేం ! నువ్వొప్పు డొస్తావు కలకత్తా ?" అంది సుషమ తలవంచుకు కూర్చున్న మాధవి చుబుకం పట్టుకొని పైకి లేపుతూ. మాధవి కళ్ళనిండుగా నీళ్ళు న్నాయి. "అరే ! యిదేమిటి ? నే నేమన్నానని ! ఎందు కేడుస్తున్నావు మాధవీ ?" అంది సుషమ గాభరాగా. మాధవి కళ్ళు తుడుచుకుని "ఏమీ లేదు ... ఏమీ లేదు సుషమా ! మళ్ళీ రేపు కలుస్తాను" అంటూ ఎవరో తరుముతున్నట్లే పరుగెత్తింది పల్లె వైపు.

మౌనంగా కూర్చున్న శాంతవైపు ప్రశ్నార్థకంగా చూసింది సుషమ. శాంత నెమ్మదిగా మొదలుపెట్టింది...

"మధువాళ్ళు అసలు మొదట కలకత్తా లోనే వుండేవాళ్ళు. అక్కడే వాళ్ళమ్మ గారు పోయారు. శ్యాం పుట్టిన కొద్ది కాలానికే అత్తయ్య పోవడంతో యింట్లో ఓ ఆయాను పెట్టుకొని, ఎలాగో శ్యాంను పెంచుతూ, మాధవిని స్కూలుకు పంపుతూ, తన ఉద్యోగం తను చేసుకుంటూ పిల్లల కే కష్టం లేకుండా చూసుకొనేవారట శ్రీరాం మావయ్య. వాళ్ళకు పెద్దగా ఆస్తి పాస్తు లేంలేకపోయినా, జరుగుబాటుకు తక్కువకాని జీతం వుండటంతో, ఎలాగో వాళ్ళకు హాయిగానే జరిగి పోతుండేది.

వాళ్ళ దురదృష్టమేమో ! భగవం తుడు వాళ్ళు ఆ మాత్రం సుఖంగా వుండటం కూడా చూడలేకపోయాడేమో! ఓ రోజు హడావిడిగా ఆఫీసుకు వెళ్ళే తొందరలో ట్రామెక్కి వెళుతున్న శ్రీరాం మావయ్యను, ఆ త్రొక్కిడిలో ట్రామ్ కదులుతుండగానే, ఎవరో ముందుకు తోశారట. సమయానికి మావయ్య వాళ్ళ ఆఫీసులో పనిచేసే తను ప్రక్కనే వుండటంతో వెంటనే ఆయన్ని ఆస్పత్రిలో చేర్చి, పిల్లలకు కబురంపించారు. మధు కూడా చిన్నదే ఏం తెలుస్తుంది ? ఏం చేయగల్గుతుంది ? తమ్ముడు శ్యాంను, ఆయాను తీసుకొని ఆస్పత్రికి పరుగెత్తింది ఏడుస్తూ. అప్పటికే మావయ్య పరిస్థితి ప్రమాద కరంగా వుంది. ఆ పరిస్థితుల్లో కూడా ఆయన ఆత్మస్థైర్యాన్ని కోల్పోలేదు. కానీ పిల్లల గురించే విపరీతంగా బాధ పడ్డారట. గోపాలం బాబాయితో చాలా రోజులుగా మాటలు లేకపోయినా మిగిలిన బంధువు, అత్తయ్యకు ఆత్మీ యుడు ఆయనే కనుక బాబాయికి వెంటనే టెలిగ్రాం యిప్పించి, ఆయన వెళ్ళగానే మధును, శ్యాంను కన్నీళ్ళతో బాబాయి చేతుల్లో పెట్టి కళ్ళు మూశారట శాశ్వతంగా.

చెల్లెలు వుండగా కూడా గోపాలం బాబాయి కలకత్తా వెళ్ళినా వాళ్ళింటికి వెళ్ళేవాడు కాదు. కారణం సీత అత్తయ్య గోపాలం బాబాయికి యిష్టం లేకుండా శ్రీరాం మావయ్యను ప్రేమించి, పెళ్ళిచేసుకుందట. అదీ ఆమె చేసిన పాపం. చివరికి చెల్లెలు చనిపోయిందని టెలిగ్రాం వచ్చిన రోజు కూడా ఇక్కడే వుండి మూడురోజులు నిద్రాహారాలు మాని బాధపడ్డాడే గాని, వెళ్ళి చెల్లెలి పిల్లలనైనా చూడలేదు. అంతిష్టమైన చెల్లెలి కబుర్లు ఎప్పటి కప్పుడు ఎలాగో తెలుసుకుంటుండే వాడే కాని స్వయంగా ఎప్పుడూ మళ్ళీ తను వాళ్ళ గుమ్మంలో కాలు పెట్ట లేదు. అంత పట్టుదల గోపాలం బాబాయికి.

హఠాత్తుగా మాధవి పేరుతో వచ్చిన టెలిగ్రాం "నా హృదయం పాషాణం,

యిది కరగదు" అనుకున్న గోపాలం బాబాయి హృదయాన్ని కరిగించింది ఇక్కడినుంచి కలకత్తా కదిలించింది. ఒంటరిగా వెళ్ళిన బాబాయి పిల్లలిద్దర్నీ వెంటబెట్టుకొని తిరిగి వచ్చాడు. పాపం! కాలేజిలో చేరాలి, డాక్టరవ్వాలి," అని కలలు కంటున్న మధు అనుకోకుండా, అగమ్యంగా మారిన పరిస్థితులకు లొంగి ఎన్నడూ చూడని ఓ మావయ్య పంచన తలదాచుకునేందుకు యీ మా పల్లెటూరికి రావల్సి వచ్చింది. అప్పుడే మధు వచ్చి సంవత్సరం దాటిపోయింది. కొంతవరకు, ఆపేక్షగా చూసే గోపాలం బాబాయి ప్రేమలో అన్నీ మర్చిపోతుందనే చెప్పవచ్చు. కానీ 'కలకత్తా' అంటే ఓ రకమైన భయంగా, బాధగా ఇద్దరు అత్యంత ఆత్మీయుల్ని పోగొట్టుకున్న ప్రదేశంగా మధు మనస్సులో నాటుకుపోయింది. అంతేకాదు అక్కడే పుట్టి పెరిగి, స్కూల్‌ఫైనల్ వరకూ చదివిన ఆ ఊరి జ్ఞాపకాలు కూడా మధుని బాధపెట్టవచ్చు అందుకే అలా పారిపోయిందది," అంటూ మధు వెళ్ళిన వైపే చూస్తున్న శాంత గొంతు ఆర్ద్రమవడం గమనించింది సుషమ అంత వరకూ మౌనంగా, మధును గురించిన విషయాలన్నీ విన్న సుషమ మనస్సు మధుమీద జాలితో, సానుభూతితో నిండిపోయింది. అనవసరంగా కలకత్తా జ్ఞాపకంచేసి మధు మర్చిపోతున్న విషాదమైన గత జ్ఞాపకాల్ని మళ్ళీ కెలికినట్లయిందని, తనలో తాను బాధపడింది సుషమ.

ప్రశాంతంగా, నిర్మలంగా ప్రవహిస్తున్న గంగానది వైపే చూస్తూ ఆలోచనల్లో పడ్డ సుషమ, శాంత లేచి "పద సుషమా ! ప్రొద్దు గూకుతోంది" అన్నమాటతో నెమ్మదిగా లేచి శాంత చెయ్యందుకొని మౌనంగా ముందుకు సాగింది వాళ్ళతోపాటు ఆలోచనలూ సాగాయి ఏ చీకూ చింతా లేనిదానిలా నవ్వుతూ, నవ్విస్తూ తిరిగే మాధవి మనసులో అంత బాధ దాచుకొని వుందని ఎవ్వర్నూ ఊహించలేరు అన్ని బడబాగ్నులూ తనలో దాచుకొని ప్రశాంతంగా, నిర్మలంగా పారే పవిత్ర గంగానదికీ, మధుకూ చాలా దగ్గర పోలిక ఉన్నట్లుగా అన్పించింది సుషమకు

ఆవేళే సుషమ, శిరీష్ బయలు దేరుతున్నారు. శ్యామలాదేవికీ, రఘుపతి గారికి సుషమను కలకత్తా పంపించాలంటే తమ కన్నకూతుర్ని అత్త వారింటికి పంపుతున్నట్లుగా బాధపడి పోతున్నారు పదిహేనురోజుల్లో, సుషమ వాళ్ళింట్లో అమ్మాయిగా, గారాల కూతురిలా మెసిలింది శ్యామలాదేవి సుషమకు తల్లిప్రేమ ఎంతటి స్వార్థరహితమో ! ఎంతటి తీయనో రుచి చూపించారు. నిజంగా ఆ ఆత్మీయుల్నీ

ఆ పచ్చటి పంట పొలాల్నీ ప్రతి సాయంత్రం షికా రెళ్ళి అనుభవించిన అందాల గంగానదీ తీరశోభను అక్కడి చల్లని ప్రశాంతమైన పిల్లవాయువుల్నీ, అతి తక్కువ వ్యవధిలో అత్యంత సన్నిహితులైన మాధవినీ, శాంతనూ ముఖ్యంగా పోగొట్టుకున్నట్లు అనిపించింది సుషమకు.

ఎంతమంది కాలేజి స్టూడెంట్స్‌కో ఊహాసుందరిగా మెదిలి, ఎవ్వరినీ దరిదాపుల్లోకి చేరనివ్వని సుషమ మనస్సును తనవైపు అయస్కాంతంలా ఆకర్షింపజేసుకున్న చంద్రాన్ని... వదిలి పోవాలంటే సుషమకు తీరని వ్యధగా వుంది. "మళ్ళీ ఈ ప్రశాంత ప్రకృతి శోభలో ఐక్యమవగల రోజు ఎప్పుడొస్తుందో ?" అని తల్చుకుంటూ ... వెంటనే బయలుదేరి రమ్మని వ్రాసిన డాడీ మాట జ్ఞాపకం వచ్చి, తప్పనిసరిగా శిరీష్‌తోపాటు బయలుదేరింది సుషమ. ఇంకో గంటలో వాళ్ళు బయలు దేరుతా రనగా మాధవి పరుగెత్తుతూ వచ్చింది.

తొందరగా రావడంవల్ల ఆయాస పడుతున్న మాధవిని చూసి సుషమ నవ్వుతూ, మంచినీళ్లు తెచ్చి యిచ్చింది. గటగటా నీళ్ళు త్రాగేసి గ్లాసు ప్రక్కన పెట్టి, నెమ్మదిగా పవిటచాటున దాచి తెచ్చిన తెల్లని సన్నజాజుల మాలను సుషమ చేతుల్లో పెట్టింది మాధవి. మాధవి హృదయంలా, స్వచ్ఛంగా మాధవి వేసుకున్న వోణీలా తెల్లగా, మాధవి స్నేహమాధుర్యంలా సుగంధాలు చిందే ఆ పూలను, ముఖ్యంగా తనమీద ఆపేక్షతో పూవులన్నీ చక్కటి మాలగా కట్టి తెచ్చిన ఆ మాల వెనుక మెదిలే మాధవి మృదు హృదయాని గ్రహించిన సుషమ, చిరునవ్వుతో మాల మాధవి చేతి కిచ్చి "నువ్వే పెట్టు మధూ ?" అని వెనుదిరిగి కూర్చుంది

శ్యామలాదేవి అందంగా అల్లిన పొడవైన జడలో చక్కగా పూలు అమర్చి, చటుక్కున సుషమను తన వైపు తిప్పుకొని బుగ్గన ముద్దుపెట్టుకుంది సుషమ ఊహించని పనిచేసి అల్లరిగా నవ్వుతున్న మాధవిని చూసి సిగ్గుపడింది సుషమ. అంతటితో ఊరుకోకుండా మాధవి నెమ్మదిగా సుషమ చెవిలో చెప్పింది. "పూలుమట్టుకు నేను తెచ్చాను. రెండోది మా బావ తరఫున నే నిచ్చాను," అంటూ కొంటెగా నవ్వుతున్న మాధవిని చూసి తెచ్చిపెట్టుకున్న కోపంతో మధు వీపున ఒక్కటిచ్చింది సుషమ.

మొదటినుంచీ సుషమ, చంద్రాలను కనిపెట్టిన మాధవి ధైర్యంగా ఆ మాట అనడానికి తగినంత కారణం లేకపోలేదు. ఆ ముందు రెండురోజుల్నుంచీ చంద్రం పొలం వెళ్ళలేదు. అస్తమానం గదిలో పడుకొని పైకి చూస్తూ ఏవో

ఆలోచనల్లో మునిగి వున్నాడు. పుస్తకాలు కూడా చదవడంలేదు. ఏవిటో ఆ తెగని ఆలోచనలు ఎవరికీ అర్థం కాలేదు. కదిలించి, కవ్వించాలని వెళ్ళిన మాధవిని, శాంతను కూడా కసురుకున్నాడు. బావ సరదాగా లేకుండా అలా వుంటే ఎలాగో వుంది మాధవికి. ఇదికాదు ఉపాయమని గదిలోనుంచి బయటకు వచ్చి..."రా సుషమా! అలా నిలబడిపోయావేం ? పద మా యింటి కెళ్ళాం" అంటూ ముందుకు అడుగు వేసిన మధుని ప్రక్కకు తోస్తూ ముందుకు వచ్చాడు చంద్రం. కానీ అక్క డెవరూ లేరు. మరి మరి సుషమ వచ్చినట్లు మాట్లాడింది మధు. మధు వైపు చూసేసరికి పవిటచెంగు నోటికి అడ్డంపెట్టుకొని నవ్వుతోంది. చంద్రానికీ నవ్వాగలేదు. తన తొందరపాటుకు సిగ్గుపడ్డాడు కొద్దిగా. "కొంటెపిల్లా !" అని మధు నెత్తి నో మొట్టికాయవేసి, నవ్వుతూ లోపలి కెళ్ళాడు. ఆ సాయంత్రం శాంతను పంపి, సుషమను గంగాతీరానికి పిలిపించింది మాధవి. నెమ్మదిగా చంద్రం దగ్గిరచేరి "బావా ! అలా ఎంతసేపు యింట్లో కూర్చొని వాసాలు లెక్కపెడతావు ? ఎలాగూ యీ యిల్లు నీకు చెందిందే. ఎందు కొచ్చిన శ్రమ చెప్పు ? వెళ్ళి అలా గంగాతీరాన, గాలైనా పీల్చుకో కూడదూ" అంది

రెండురోజుల్నించి ఎటూ కదల్లే దేమో, ఆలోచనలతో బుర్ర వేడెక్కి-పోయిన చంద్రం, "శిరీష్ వాళ్ళు రేపే కదూ వెళ్ళేది. వాళ్ళూ వచ్చే వుంటారు" అని లేచి చెప్పులు వేసుకొని బయలుదేరుతుంటే ... "వాళ్ళు జమీందారుగారి తోటవైపు వెళ్ళారు బావా ! త్వరగా వెళ్ళు" అని సంకేతం ప్రకారం చంద్రాన్ని పంపి, పది నిముషా లాగి వెనకే తనూ బయలు దేరింది.

చంద్రం అక్కడికి వెళ్లేసరికి తోటకు ఫర్లాంగుదూరాన యిసుకలో, నదికి అభిముఖంగా కూర్చున్న శాంత, సుషమ కన్పించారు. ఉత్సాహంగా అడుగులు ముందుకువేసి వాళ్ళను చేరుకున్నాడు. సుషమ పలకరింపుగా నవ్వింది. వాళ్ళ దగ్గరలో కూర్చుంటూ "శేఖర్, శిరీష్ ఏరీ ?" అన్నాడు. సుషమ నెమ్మదిగా చెప్పింది. "ఇవాళ అన్నయ్యలిద్దరూ పొలం వెళ్ళారు ! అక్కడ గోపాలంగారికి విత్తనా లవీ ఎలా వేయించాలో వివరించడానికి" అంది. మౌనంగా నవ్వి ఊరుకున్నాడు చంద్రం. వాళ్ళమధ్య మాటలు సాగటం లేదు. అప్పటిదాకా ఏవేవో కబుర్లు చెబుతున్న శాంత కూడా ఠక్కున నో రెవరో మూసేసినట్లే మూగిదానిలా వుండిపోయి, అన్నయ్యా వచ్చిన దారి వైపు చూస్తోంది

ఇంతలో మాధవి శాంతను పెద్దగా పిలుస్తూ వచ్చింది, "అత్తయ్య నిన్ను త్వరగా రమ్మంది శాంతా" అంటూ. దిగ్గున లేచింది శాంత. సుషమ యిబ్బందిగా కదిలింది. వాళ్ళిద్దరూ బయలు దేరడం చూసి మాధవి సుషమవైపు తిరిగి "నువ్విక్కడే వుండు. మేమిద్దరం మళ్ళీ పదినిముషాల్లో వచ్చేస్తాం" అంది నెమ్మదిగా నవ్వుతూ. "ఊహూ, నేనూ వచ్చేస్తాను," అంటూ లేచింది సుషమ. చంద్రం ముఖం ఒక్కసారి దివిటీలా వెలిగి, సుషమ లేవడంతో చిన్నబోయింది. మాధవి, సుషమను మళ్ళీ యిసుకలోకి తోసి, "నిన్నెవరూ ఎత్తుకుపోరు లేవోయ్. అయినా హీరోలా యింతటి మా బావ అండ వుండగా నీకేం భయం ?" అంటూ శాంత చేయి పట్టుకొని లాక్కుపోతూ, "మళ్ళీ వచ్చేస్తాం యిప్పుడే. యిక్కడే వుండు !" అని ఓ హెచ్చరిక జారీచేసి మరీ వెళ్ళింది.

సుషమ, చంద్రం ఎన్నాళ్ళుగానో కోరుకుంటున్న ఏకాంతం లభించింది. కాదు లభింపజేసింది మాధవి. కానీ వాళ్ళకు మాటలు దొరకడంలేదు. ఒకరి వైపొకరు అలా చూస్తూ కూర్చున్నారు. ఆ కళ్ళలో కోటి భావాలు, విడివడని ఆ చూపుల్లో శతకోటి కోరికలు. అలా ఎంతసేపు కూర్చున్నారో తెలియదు. నెమ్మదిగా చంద్రం భంగపరిచాడా నిశ్శబ్దాన్ని

"రేపు వెళ్ళిపోతున్నారు కదూ సుషమా ?"

చూపు మరల్చకుండా చంద్రాన్నే చూస్తూ "ఊఁ" అంది. ఆ 'ఊఁ' అనే శబ్దంలో యిక రేపు తర్వాత చంద్రాన్ని చూడలేననే బాధంతా ధ్వనించింది. చంద్రమే చేతులు చాపాడో ... సుషమే అతని చేతుల్లో వాలిపోయిందో చెప్పడం కష్టం, వాళ్ళిద్దరూ ఏకమయ్యారు. పరిసరాల్ని మరచి, ప్రకృతిని మరచి, హెచ్చుతగ్గుల తారతమ్యాల్ని, యీ ప్రపంచాన్ని విడిచి, చిక్కబడుతున్న చీకటిలో కలిసి, ఒకరి గుండెలను మరొకరికి విన్పించేంత దగ్గిరగా హత్తుకుపోయారు. అప్పుడు వాళ్ళిద్దరి మనసుల్లో ఒక్కటే అనుకున్నారు. "ఈ కలయిక శాశ్వతమైనది. దీన్ని విడదీయగలశక్తి యీ ప్రపంచంలో ఎవ్వరికీ లేదు" అని.

అలా ఎంతసేపు వున్నారో, మరింకెంతసేపు వుండేవారో కానీ అప్పుడే వచ్చి, ఒక్కటై కన్పిస్తున్న యిద్దరినీ దూరంనుంచే చూసి సిగ్గుతో అటు తిరిగి "సుషమా ! ప్రొద్దుగూకింది, వెళ్ళిపోదాం రా !" అంటూ కేకేసింది మాధవి. ఆ పిలుపుతో యీ లోకంలోకి వచ్చిన సుషమ, చంద్రాన్ని వదిలి దూరంగా జరిగింది. జరిగిందేమిటో గ్రహించే లోపల యిద్దరూ సిగ్గుపడి

పోయారు. "వెళతాను" అని లేచిన సుషమ చేయి నెమ్మదిగా నొక్కి పెదవుల కంటించుకొని నవ్వుతూ వదిలేశాడు చంద్రం. హడావుడిగా పరుగెత్తి మధుని కలిసి వెళ్ళిపోయింది సుషమ.

దారిలో యిద్దరూ మాట్లాడలేదు. సుషమను వాళ్ళింటిదగ్గిర వదిలేసి వెళ్ళిపోయింది మాధవి. మనసంతా ఎలాగో వుంది మాధవికి. వచ్చేటప్పుడు వెనుదిరిగి బావను చూడాలని ప్రయత్నించి సిగ్గువల్ల చూడలేకపోయింది. సుషమ, చంద్రం ఒకరంటే ఒకరు యిష్టపడుతున్నారని అర్థమైన తర్వాత, వాళ్ళిద్దరినీ కలపాలని తన కెందు కన్పించిందో అర్థంకాలేదు. చివరికి వాళ్ళిద్దర్నీ కలిపి వాళ్ళు ఒక్కటిగా వుంటే చూసిన తన మనసులో గుబులేమిటో అర్థం కాలేదు. చంద్రం బావంటే అభిమానముంది. మొదటినుంచీ చంద్రంకూడా శాంతతోపాటు మాధవినీ ఆపేక్షగా చూస్తూ, మరదలు కనుక అల్లరి పెట్టేవాడు. ఆ అల్లరి వెనుక అంతు తెలీని ఆపేక్ష తప్ప మరేమీ లేదని తెలిసిన మాధవి కూడా అతన్ని అల్లరి పెడుతుండేది. కొంటె సమాధానాలు యిస్తుండేది. వాళ్ళ వాదనల్లో అదో తెలీని సంతోషం కల్గేది. ఊళ్ళో వాళ్ళందరూ బహుశా చంద్రం, మాధవిని పెళ్ళి చేసుకోవచ్చేమో! అనుకుంటున్నారు అసలైన పెద్దలు రెండిళ్ళలోనూ ఏమీ బయటపెట్టుకోలేదు. అంతా కలసి ఆప్యాయంగా మాట్లాడుకుంటున్నారు. అభిమానంగా వుంటున్నారు అంతే... గోపాలంగారు మాధవిని పెళ్ళిచేసుకునే ప్రసక్తి చంద్రందగ్గిర ఎప్పుడూ తీసుకురాలేదు. ఆయన కింకా మధు పెళ్ళి ఆలోచన వచ్చినట్లులేదు.

శిరీష్‌తో సరదాగా కాలం గడిచిపోయింది. తను నవ్వుతూ అందర్నీ నవ్వించే శిరీష్ అంటే దాదాపు అందరూ యిష్టపడ్డారు. అలాగే తనూ, అంత కంటే అతనంటే ప్రత్యేకత ఏమీలేదు. చంద్రం బావంటే చనువుగా ఓ ఆత్మీయుడిలా తనకు లేని అన్నయ్యలా అన్పిస్తాడు. అంతకంటే అతనితో వున్నప్పుడు, అతనితో మాట్లాడినప్పుడు, అతన్ని చూసి, తన మనసు మరోలా పులకించలేదు. శేఖర్ ?... ఆ ఊహ రాగానే మాధవికి పిక్నిక్ రోజు తను తండ్రి ఎంతో యిష్టంగా దగ్గిర కూర్చొని నేర్పించిన కృష్ణశాస్త్రి గారి భావగీతాలు పాడుతున్నప్పుడు రెప్పవాల్చకుండా తననే చూసిన శేఖర్ కళ్ళలో మెదిలాడు. అంతమంది వున్నారనే ధ్యాసైనా లేకుండా ఆరాధనా భావంతో, ఆర్తిగా చూసిన ఆ చూపుల్లోని ఆకర్షణకో కరిగిపోయి వుండేది మాధవి. తన ప్రక్కన కూర్చున్న వాళ్ళందరి జ్ఞాపకమూ లేకపోతే .



యువ

అదృష్టవశాత్తూ తనను తాను కంట్రోల్ చేసుకోగల్గింది. కానీ ఏవిటిది ? తన ఆలోచన ఎంత అర్థరహితమైంది ? ఎంత అసంభవమైంది. కనీసం ఊహించ డానికి కూడా తన కర్హతలేని ఓ రాజ కుమారుడిని గురించి తన మనసు యిలా వెర్రిగా పులకించడ మేమిటి ? దిక్కులేక మావయ్య పంచను చేరిన తనెక్కడ ? శేఖ రెక్కడ ? తర తరాలుగా పేరెన్నికగన్న జమీందారీ వంశానికి ఏకైక వారసు డతను. మావయ్య ఆశ్రయంలో తనూ, తమ్ముడూ ఎలాగో చీకూ, చింతా లేకుండా కాలం గడప గల్గుతున్నారు. అదే పదివేలు. అదే ఓ వరంలా భావించే తను శేఖర్ని గురించి తీరని కలలు గనటం ఎంత హాస్యాస్పదమో ? కానీ ...ఊహలోనే ఎంతో మధురంగా అన్పించే అతని సాన్నిధ్యంలోని లాలిత్యం శాశ్వతం కాగల్గితే ఎంత బావుండును ? ఊహించుకోవడంవల్ల తనకు కలిగే తృప్తివల్ల ఎవరూ ఏమీ నష్టపోరుకదా ! అలాంటప్పుడు ఊహించుకోడానికి అడ్డ మేమున్నది ? కేవలం ఊహే కదా ! ఈ ఊహ మధు మనస్సుకు కొంత శాంతిని ప్రసాదించింది. తృప్తిగా అన్పించింది.

* * *

సుషమ, మాధవి కూర్చొని మాట్లాడుకుంటుండగానే "టైమైంది, బయలుదేరమ్మా," అంటూ శేఖర్ గదిలోకి వచ్చాడు. మాధవి హడావిడిగా లేచి నుంచుంది, ఊహల్లో మెదిలిన రాజకుమారుడు ఎదుట నిలిస్తే ఏం మాట్లాడాలో తెలీక మూగవోయిన రాజకుమారిలా.

మాధవిని అంత నెమ్మదిగా అంత అణకువగా, అంత భయభక్తుల్తో నుంచొని వుండగా చూడటం ఆదే మొదటిసారేమో ! శేఖర్కు నవ్వొచ్చింది. నవ్వుతూ సుషమవైపు తిరిగి "మీ ఫ్రెండ్ మధు కూడా వస్తుం దేవిటి నీతో ?" అన్నాడు. బదులుగా మాధవి భుజాన చేతులువేసి, శేఖర్ వైపు చూస్తూ "ప్రస్తుతం నాతో అయితే రావడంలేదు గానీ ... నువ్వు తీసుకొస్తే వస్తానని మొన్న నాతో చెప్పింది," అంది సుషమ చిలిపిగా నవ్వుతూ.

కళ్ళెర్రజేసి సుషమవైపు చూసింది మాధవి. ఆ చూపులు చూసి సుషమకు, శేఖర్కు నవ్వాగలేదు. ఇద్దరూ పగల బడి నవ్వుతుంటే సిగ్గుపడి పారిపో బోయిన మాధవిని అప్రయత్నంగా చెయ్యిపట్టుకుని ఆపాడు శేఖర్ యిద్దరికళ్ళూ కలుసుకున్నాయి. అక్కడ సుషమ వున్న విషయమే మరచి ఒకరి మనోభావాలు మరొకరు కళ్ళలో చదువుకుంటూ నిలబడిపోయా రొక్క క్షణం. మరుక్షణం స్పృహలోకి వచ్చిన

శేఖర్ చిన్నగా "సారీ" అంటూ చెయ్యి వదిలేశాడు.

ఇంక అక్కడ ఓ నిముషం నిలబడ లేక పారిపోవాలని ముందుకు పరుగెట్టిన మాధవిని, శిరీష్ హాల్లో అటకాయించాడు. "ఏం మాధవీదేవి ? ఎక్కడికలా ఆఘమేఘాలమీద పరుగెడుతున్నారు ? మేం వెళ్ళిపోతున్నాముండీ యిప్పుడు. కనీసం బస్‌స్టాండ్‌వరకైనా రారూ ?" అన్నాడు. "క్షమించండి. శిరీష్‌బాబూ కొంచెం పనుంది, వెళ్ళాలి," అంటూ తమ యింటివైపు పారిపోయింది మాధవి సుషమ, శేఖర్ నవ్వుతూ హాల్లోకి వచ్చారు.

సుషమ, శిరీష్‌లను రైలెక్కించి యింటికి చేరిన శేఖర్‌కు మనస్సంతా బరువుగా అనిపించింది. సందడిగా, సరదాగా గడచిన ఆ పదిహేనురోజుల తృప్తి ఆవిరై పోయినట్లుగా నీరసంగా పడుకున్నాడు యింటికి రాగానే.

శ్యామలాదేవి కాఫీ తీసుకొచ్చి శేఖర్ కిస్తూ "ఏం శేఖర్! ఎటూ కాని వేళ పడుకున్నావేం ? తల నొప్పిగా వుందా ?" అని అడిగింది, వెల్లకిలా మంచంమీద పడుకొని పైకి చూస్తూ కణతలు నొక్కుకుంటున్న శేఖర్‌ను చూసి. అమ్మ మాట వినిపించగానే నవ్వుతూ లేచి కాఫీ అందుకుంటూ—

"అవునమ్మా ! కొద్దిగా తల నొప్పిగా వుంది. సుషమా వాళ్ళు వెళ్ళిపోతే యిల్లంతా ఏదో బావురుమంటున్నట్లుంది కదూ." అన్నాడు, తల్లి కళ్ళలోకి ఆప్యాయంగా చూస్తూ. చిన్నగా నవ్వుతూ శేఖర్ ప్రక్కన కూర్చొని "అవును శేఖర్ ! శిరీష్, సుషమ వుంటే పదిమంది పెట్టు. ఏమైనా యింటికో ఆడపిల్ల వుండితీరాలిరా ఆడపిల్ల లక్ష్మీదేవిలా నట్టింట తిరుగుతుంటేనే యింటికి కళ వస్తుంది తొందరలో నీ పెళ్ళి చేశామంటే ఆ కొరతా తీరుతుంది. ఆ రోజు తొందరలో రావాలనే నేనూ, మీ నాన్నగారూ ఎదురుచూస్తున్నాం," అంటున్న తల్లి మాటలకు ఆనకట్ట వేసే ఉద్దేశ్యంతో గబగబా కాఫీ పూర్తిచేసి, "అలా గంగాతీరానికి వెళ్లొస్తానమ్మా !" అంటూ లేచి వెళ్ళిపోయాడు శేఖర్ పెళ్ళి మాట రాగానే కొడుకు సిగ్గుపడి, పారిపోతున్నా డనుకొని నవ్వుకుంటూ, రఘుపతిరావుగారి గదివైపు వెళ్ళిపోయిందామె.

రోజులు సాఫీగా గడిచిపోతున్నాయి సుషమా, చంద్రాల మధ్య ఉత్తరాలు సాగుతున్నాయి. అప్పుడప్పుడు మాధవికీ, శాంతకు కూడా సుషమ నుంచి ఉత్తరా లొస్తున్నాయి

శిరీష్‌కు లెటర్స్ వ్రాయాలంటే మహాబద్ధకం. అందుకే చెల్లెలితో చెప్పేసేవాడు, "నువ్వు లెటర్స్ వ్రాస్తే నేను

అందర్నీ అడిగినట్లు వ్రాయి" అని. సుషమకు కోపం వచ్చేది.

"శేఖరన్నయ్యకు ఒక్క లెటర్‌కూ, రిప్లై వ్రాయవేం ? నీ మాట నేనసలు వ్రాయను. అమ్మకు, నాన్నగారికికూడా నిన్ను గురించి వ్రాయను" అని బెదిరించేది. శిరీష్ బద్ధకం తెల్సిన శేఖర్, యిద్దరికీ కలిపి లెటర్ వ్రాసేవాడు. అన్నింటికీ సుషమే జవాబులు వ్రాసేది. అన్నయ్యమీద కోపమొచ్చినా బ్రతిమిలాడేసరికి కరిగిపోయి, వెంటనే అందరికీ శిరీష్ తరపున కూడా తనే వ్రాసేది లెటర్స్. చంద్రం, సుషమల లెటర్స్‌లో ఒక్కో నవలమీద వాళ్ళ అభిప్రాయాలు, సాహిత్యపరంగా చేయాల్సిన చర్చలన్నీ సాగేవి. ఇంకేమో వ్రాయాలని మనసులో తపన కానీ తరతరాలుగా జీర్ణించుకుపోయిన సంస్కారం తాలూకు అడ్డుగోడ. ఏమేమో ! ఎంతెంతో, వ్రాయాలనే ఆరాటం, ఆవేశం, సాహిత్య చర్చలద్వారా తీర్చుకుంటున్నారు. అందులోనే ఏదో తృప్తినీ, ఆనందాన్నీ పొందగల్గుతున్నారు. ఒకరి లెటర్స్ చూడగానే ఒకరి మదిలో కలిగే విచిత్రమైన స్పందన. ప్రతిరోజూ ఒకరి లెటర్స్‌కోసం ఒకరు ఎదురుచూడటంతో ఓ విధమైన తృప్తినీ, హాయినీ పొందగల్గుతున్నారు.

## 3

శేఖర్ పొలాలమీద శ్రద్ధతీసుకొని గోపాలంగారి సాయంతో ట్రాక్టర్ ఉపయోగించి, సమిష్ఠి వ్యవసాయంలో వుండే సుళువు అందరికీ అర్థమయ్యేలా చెప్పి, చెక్కలు చెక్కలుగా, ముక్కలుగా వున్న భూమినంతా ఒక్కటిచేసి, సారవంతమైన ఎరువులు తెప్పించి, ఆ సంవత్సరం అందరిలోకీ శ్రేష్ఠమైన పంట పండించిన కీర్తిని సంపాదించాడు. ఆ సంవత్సరం వ్యవసాయ ఎగ్జిబిషన్‌కు పంపిన పంటల సారం, శేఖర్ కృషికి ఫలితాన్నీ గంగాపూర్ గ్రామానికో విశిష్టమైన స్థానాన్నీ సంపాదించి పెట్టాయి. ఆ సంవత్సరకాలంలో జరిగిన ప్రతి పండుగలో మాధవీ, శాంతా, చంద్రం, శేఖర్ కలిసి తిరగటంతో, ఊళ్ళో పంటలు వచ్చినప్పుడు జరుపుకొనే ఉత్సవాల్లో పాల్గొనటంతో వాళ్ళమధ్య చనువు, స్నేహం పెరిగాయి.

మునుపటిలా శాంత కూడా శేఖర్ దగ్గర సిగ్గుపడటంలేదు. అన్నయ్యతో మాట్లాడినంత స్వేచ్ఛగానూ, స్వచ్ఛంగానూ మాట్లాడగల్గుతోంది. అయితే వాళ్ల నలుగురూ కలిసినప్పుడు మాధవి ఒక్కతీ అయిపోయేది. వాదనకు వాళ్ళు ముగ్గురూ ఒక్కటయ్యేవాళ్లు. అప్పుడప్పుడూ ఆడపిల్ల కనుక అభిమానంతో మధును సపోర్ట్ చేసినా, అన్నయ్యలను ఆటపట్టించే మధుని తనూ ఆటపట్టించి సరదా తీర్చుకునేది శాంత. వాళ్ళు

కలిసినప్పుడల్లా శిరీష్, సుషమల కబుర్లు వచ్చేవి. ఓసారి కలకత్తా వెళ్ళి రావాలనుకుంటూనే ఎప్పటికప్పుడు పనుల ఒత్తిడివల్ల కుదరడంలేదు చంద్రానికి. ఈ సంవత్సరకాలంలో నాలుగుసార్లైనా వెళ్ళి వచ్చాడు శేఖర్. కలకత్తా వెళ్ళి వచ్చినప్పుడల్లా సుషమ పంపిందని రసగుల్లా టిన్నులు మాధవికీ, శాంతకూ యిచ్చేవాడు. చంద్రానికి మంచి పుస్తకాలు తెచ్చి యిచ్చేవాడు. సుషమ మర్చిపోయినా తను కొని, ముగ్గురికీ యిచ్చేవాడు శేఖర్.

ఎన్నో రకాలుగా పనుల ఒత్తిడిలో నలిగిపోతున్నా, ప్రశంసల తాకిడికి కరిగిపోతున్నా, శేఖర్‌లో ఏదో అసంతృప్తి చోటుచేసుకుంది. రోజు రోజుకూ అది పెరిగి పెద్దదవుతోంది. చంద్రం, మాధవీ చనువుగా మాట్లాడుకుంటుంటే ... మనసులో ఏదో బాధ మొదలవుతుంది. మళ్ళీ అంతలోనే తన సంకుచిత మనస్తత్వానికి పశ్చాత్తాపం కలుగుతుండేది. ఏది ఏమైనా తను ఒంటరివాణ్ణనే భావం రోజురోజుకూ పెరిగిపోతోంది. ఇంటిదగ్గర అమ్మ ఎంత ఆప్యాయంగా చూసినా, నాన్న గారెంత ఆపేక్షగా పలకరించినా ఏదో వెలితి, ఏదో తెలీని అసంతృప్తి, మనస్సులో చోటు చేసుకుంటోంది.

అలా మనసు మరీ బాధగా వున్నపుడు గంగాతీరానికి చేరి ప్రశాంతమైన ప్రవాహంలోకి చూస్తూ ఏవేవో అంతు తెలీని ఆలోచనలతో గడిపేసేవాడు. మనస్సును, శరీరాన్నీ ఏదో తెలీని నిర్లిప్తత ఆవేశించింది. ఆవేశంగా పొలం పనులు చేసేటప్పుడు అలసట తెలిసేదికాదు ఒంటరిగా గంగాతీరానికి చేరినప్పుడు ఆలోచనలు పిచ్చివాణ్ణి చేసేవి. ఇంతవరకూ తను గడిపిన రోజులన్నీ నిస్సారంగా సాగినట్లు ఒక అనూహ్యమైన అతి విచిత్రమైన, గొప్ప మార్పు యిప్పుడే జరిగినట్లూ అన్పిస్తుందేది. అదేవిటో అతనికే అర్థమయ్యేది కాదు. అర్థంచేసుకునే అనుభవమూ లేదు.

ఈ సంవత్సరకాలంలో మాధవిని ఎన్నోసార్లు కలిశాడు, మాట్లాడాడు. కానీ ఏకాంతంగా కాదు. అందుకేనేమో ఆ అసంతృప్తి. అతనికి ప్రేమ గురించి అంతగా తెలీదు. అతను చూసిన సినిమాల్లోనూ, చదివిన నవలలోనూ తప్ప ప్రేమ స్వరూపం యిలా వుంటుందని అనుభవపూర్వకమైన నిదర్శనం యిచ్చినవాళ్ళు ఎవ్వరూ లేరు. శేఖర్ మాధవిని ప్రేమిస్తున్నాడా ? అంటే చెప్పడం కష్టం. ఓ పదహారేళ్ళ పడుచుగా తమ పల్లెలో ప్రత్యక్షమై మొట్టమొదటి చూపులోనే ఆకట్టుకున్న ఆ అందమైన కదలికలోని ఆకర్షణను, ఆ అనుభవాన్ని అమితంగా

ప్రేమిస్తున్నాడు. ప్రతి కలయిక ఒక వినూత్నమైన ఆనందాన్ని కల్గిస్తోంది శేఖర్‌కు.

మెత్తటి యిసుకలో వెల్లకిలా పడుకొని తలక్రింద చేతు లుంచుకొని కళ్ళు మూసుకొని చిన్మయానందమూర్తిలా చిన్నగా నవ్వుతూ మాధవి ఆలోచనలలో మునిగి వున్న శేఖర్ ముఖాన పడిన చల్లటి చిరుజల్లుకు వులిక్కిపడి కళ్ళు విప్పాడు. ఎదురుగా నవ్వుతూ నుంచొని వుంది మాధవి వెంట శాంత లేదు. చేతిలో ఖాళీ బిందె. శేఖర్‌ను చూసి చిన్నగా నవ్వుతూ "భయపడ్డారా ?" అంటూ బిందె ప్రక్కన పడేసి కొద్దిదూరంలో కూర్చుంది.

ఆనందమో, అయోమయమో తెలీని అవస్థలో వున్న శేఖర్ గాభరాగా, భయం, భయంగా చుట్టూ చూశాడు. చుట్టుప్రక్కల నరసంచారం లేదు. ఎదురుగా, నిండుగా ప్రవహించే గంగానది. పశ్చిమానికి కృంగిపోతూ, ఎర్రగా మెరిసిపోతున్న సూర్యుడు తప్ప మరెవ్వరూ లేరు. సృష్టి చైతన్య రహస్య స్వరూపంలా ఎదురుగా మాధవి. ఆ సమయంలో మధు ప్రత్యక్షమైన దేవతలా మెరిసిపోతోంది. శేఖర్‌లో ఎన్నడూ లేని అధైర్యం తొంగిచూసింది. నోరు విప్పి మాట్లాడటం కష్టమైపోతోంది. మనిషి భావావేశంలో నిండా మునిగిపోయినప్పుడు మాటలకంటే మూగతనమే ఎక్కువ సహకరిస్తుంది. అంతేకాదు చూడగల్గిన వాళ్ళకు మనసులోమె లే మూగభావాలు ఎక్స్‌రే తీసినట్లే, కళ్ళలో ప్రతి ఫలిస్తాయి. ఆవేశంగా, ఆర్ద్రంగా, అర్థింపుగా ఏదో తెలీని వింత ఆనందంతో మెరిస్తున్న శేఖర్ కళ్ళ చూడగానే విచిత్రమైన పులకింత కల్గింది మాధవిలో. శేఖర్ కళ్ళతో కలిసిన చూపులు విడిపోయే భావనకే భయపడి అలాగే నిలచిపోయాయి. మాటలు కరువైన మనుషుల్లా ఒకరి కళ్ళలో ఒకరి కళ్ళ కలిపిన వాళ్ళిద్దరిలో అలజడేదో ఆరంభమైంది.

అప్పటివరకూ నవ్వుతూ ఉన్న మాధవి చిరుగాలి తాకిడి తట్టుకోలేని చిగురుటాకులా వణికిపోయింది. ఇంక అక్కడ కూర్చోలేక దిగ్గున లేచి బిందె తీసుకొని "వస్తాను" అంటూ ముందుకు అడుగువేసింది మధు. "మధూ !" అంటూ శేఖర్ చేయి పట్టుకోగానే వెనుదిరిగి శేఖర్‌వైపు చూసింది. సృష్టిలోని ఆత్మీయతంతా యిముడ్చుకున్న ఆ చూపులకు అందులోని ఆర్ద్రతకు గాలి తగిలిన మంచులా క్రమక్రమంగా కరిగిపోతున్న మనస్సును ధృడపరచుకొనే ప్రయత్నం చేస్తున్నా ... మనసు తన కంట్రోల్‌లో ఉన్నట్లే ఉన్నా... శరీరం తనకు తెలీకుండానే తూలి క్రిందకు జారింది. శేఖర్ అతి

జాగ్రత్తగా ఆపేక్షగా మధును దగ్గిరకు తీసుకొని ఆపుకోలేని ఆవేశంతో ఆర్తిగా మధుని హృదయానికి హత్తుకున్నాడు.


మధుకు తెలీకుండానే కళ్ళు వర్షిస్తున్నాయి. మాధవి చెవిలో మెల్లగా మృదువుగా విన్పిస్తున్న మాటలు మనసున పాకి రక్తంలో కలిసిపోతున్న అనుభూతి కలిగింది. "మధూ ! నువ్వు నాకు కావాలి మధూ ! నువ్వు తోడు లేని బ్రతుకు భారంగా, శూన్యంగా తోస్తోంది. నీ మనస్సేమిటో, తెలీక యిన్నాళ్ళూ నా మనసు బయటపెట్ట లేకపోయాను. ఈ రోజు యీ శుభ ఘడియలో, నీ మనసంతా విప్పి చెప్పిన నీ కళ్ళకు నేను సదా కృతజ్ఞుడిని మధూ ! మనం పెళ్ళిచేసుకుందాం. ఈ వేసవికే నిన్ను నా అర్ధాంగిగా చేసుకుంటాను. ప్రేమపక్షుల్లా గంగాతీరాన హాయిగా, స్వేచ్ఛగా విహరిద్దాం. ఈ ప్రశాంత గంగాతీరాన, నీ సువిశాలమైన కళ్ళలోని సుకుమారమైన భావాలకు పులకిస్తూ కాలం గడిపేయాలన్నదే నా కోరిక. అందుకు నీ అంగీకారంకోసమే యిన్నాళ్ళూ చూశాను. అది దొరికిపోయిందీవేళ. యింక నాకు ఏ అనుమానాలూ లేవు. ఆలోచనలూ లేవు," అంటూన్న శేఖర్ కౌగిలినుంచి నెమ్మదిగా తప్పుకుంది. నెమ్మదిగా కళ్ళు వాల్చుకొని సన్నని చిరునవ్వుతో, సిగ్గుతో ఎరుపెక్కిన బుగ్గలను రెండు చేతులతో దాచుకొని "మావయ్యతో మాట్లాడండి" అంటూ లేచి బిందె అందుకొని ఒక్కపరుగులో నదివైపు వెళ్ళి, నీళ్ళు తీసుకొని పల్లెవైపు నెమ్మదిగా సాగిపోతున్న ఆ సజీవ శిల్ప సౌందర్యాన్ని. కన్నుల్లో నింపుకొని మధు కనుమరుగై పోయేంతవరకూ నవ్వుతూ చూస్తూండిపోయాడు శేఖర్.

ఆనందం నిండిన మనస్సు మహా తేలిగ్గా అన్పిస్తోంది. లేచి గంతులేయాలన్పిస్తోంది. ఇన్నాళ్ళూ అనుభవించిన మానసిక సంఘర్షణ అంత త్వరగా, అంత తేలిగ్గా తేలిపోయిందన్న తృప్తితో మనసు పరవశ్ళు త్రొక్కుతోంది. ఆ పిచ్చి ఆనందంలో, మామిడికొమ్మలో దాగిన కోయిల కూత విని, మళ్ళీ దాన్ని అనుకరిస్తూ కుహూ ... అని కుస్తూ, యిసుకనుంచి లేచి, స్వేచ్ఛగా... అప్పుడే రెక్కలు వచ్చిన విహంగంలా పొలం గట్లవెంబడి, యీలవేసుకుంటూ, పచ్చగా, ఏపుగా పెరిగిన వరిచేలను మృదువుగా స్పృజిస్తూ, ఆ స్పర్శలోని చల్లదనాన్ని మనసున నింపుకుంటూ తీయటి కలల్లో తేలిపోతూ, హాయిగా నడిచిపోతున్న శేఖర్‌కు హడావిడిగా పరుగెత్తు కొస్తున్న రామయ్య కన్పించాడు. (సశేషం)

---

**Printed and Published by A. Chandra Sekar Rao at 5-9-88, Public Garden Road Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor : A. SUDHAKARA RAO**

లేదు గనుక జగన్నాథం
మొద…




# ప్రేమవాహిని

"చినబాబుగారూ! చినబాబుగారూ! ఘోరం జరిగిపోనాది బాబూ! గోపాలం బాబుగారిని పురుగు ముట్టిందండి. చానా ప్రమాదంగా ఉంది. పెద్దయ్యగారు కూడా అక్కడే ఉన్నారు. మిమ్మల్ని ఎంటనే రమ్మంటున్నారయ్యా," అంటున్న వాడి మాటలు... ఆకాశంలో విహరిస్తున్న శేఖర్ మనస్సును అధఃపాతాళానికి తోసేసినట్లుగా తోచి, అయోమయంగా చూస్తున్న శేఖర్‌ను మరోసారి హెచ్చరించాడు రామయ్య. "బాబూ! బేగి రండి బాబూ!" అంటూ.

అప్పుడే స్పృహలోకి వచ్చినవాడిలా వేగంగా రామయ్య ననుసరించి వాళ్ళ పొలం చేరుకున్న శేఖర్‌కు అక్కడి పరిస్థితి చూసి, ఏంచేయాలో తెలీలేదు. తండ్రి గోపాలంగారి దగ్గిరగా కూర్చొని ఏదో మాట్లాడాలని ప్రయత్నిస్తున్న గోపాలంగారిని మాట్లాడవద్దన్నట్లు సైగచేస్తున్నారు. పాముకాటుకు మంత్రంవేసే మల్లయ్యకోసం ఊళ్ళోకి పరుగెత్తిన రంగడు తిరిగివచ్చి, మల్లయ్య పొరుగూరు వెళ్ళాడని చెప్పాడు.

అప్పటికే గోపాలంగారి నోట్లోనుంచి నురగలు విపరీతంగా వస్తున్నాయి. గురక ప్రారంభమైంది. అన్ని

పనులూ స్వయంగా తన చేతులమీదుగా చేయడం అలవాటైన గోపాలంగారు ఆ రోజు పాకలో ఏవో పాత సామాను లుంచే, అవన్నీ తీసేయించి శుభ్రం చేయిద్దామని, అడ్డుగాఉన్న గడ్డిమోపులు ప్రక్కకు లాగబోయారట. ఎలా చేరిందో ఆ గడ్డిమోపుల్లో దాగి ఉన్న నల్లత్రాచు బుస్సున పైకి లేచి గోపాలం గారు తప్పుకొనే అవకాశం కూడా లేకుండా చేతిమీద కాటు వేసింది. ఆ తర్వాత దాని దారిన అది మళ్ళీ తప్పు కొని పారిపోయింది. చేతిమీద ఉన్న రెండు సూది బెజ్జాల్లాంటి గుర్తులను చూసి అది త్రాచుపామని నిర్ధారణ చేసుకున్న గోపాలంగారు ధైర్యాన్ని కోల్పోయారు. దగ్గరలో పనిచేస్తున్న పనివాళ్ళను పిలిచి చెప్పారు. వాళ్ళు వచ్చి పాకంతా వెదకి త్రవ్వి, ఓ కన్నంలో దాగిఉన్న త్రాచును బయటకు లాగి చంపేశారు. కానీ యీ లోపల బయట కూర్చున్న గోపాలంగారికి నురగలు రావడం ప్రారంభం కావడంతో కొంతమంది వాళ్ళ యింటివైపు, కొందరు జమీందారు గారింటివైపు పరుగెత్తి విషయం వివరించారు.

రఘుపతిరావుగారు వెంటనే బయలు దేరి పొలంవెళుతూ పాముల మల్లయ్యకు కబురుచేశారు. దురదృష్టం, అతనూ ఆ టైమ్‌కు ఊళ్ళోలేడు. శేఖర్ అక్కడకు చేరిన అయిదు నిముషాలకే మాధవీ, సావిత్రమ్మ, శ్యాం పరుగెత్తు కుంటూ వచ్చారు. అప్పటికే గోపాలం గారి పరిస్థితి చేయి దాటిపోయింది. మాట రావడంలేదు. మత్తుగా మూసుకు పోతున్న కళ్లు బలవంతంగా పైకి లేపుతూ భార్యను, మేనకోడలిని, మేనల్లుడినీ దగ్గరకు రమ్మని సైగ చేశారు.

ఏడుపు బలవంతంగా ఆపుకుంటూ దగ్గిర చేరిన భార్య చేయి పట్టుకొని, మరోచేత ఏడుస్తూ నిలబడ్డ మాధవి చేయి పట్టుకొని రెండు చేతులూ కలప డానికి ప్రయత్నిస్తూ విఫలులై తల ప్రక్కకు వాల్చేశారు. మాధవిని సావిత్రమ్మ కప్పగించారో, సావిత్ర మ్మనే మాధవి కప్పగించారో కనిపిం చని లోకాలకు కదలివెళ్ళిన ఆయనకే తెలియాలి. గుండె లవిసేలా ఏడుస్తున్న ఆ ముగ్గురినీ ఆపటం ఎవరితరమూ కాలేదు.

ఆనందంగా మొదలైన చల్లటి సాయంత్రం యింత విషాదంగా ముగు స్తుందని ఊహించని శేఖర్ హృదయం మూగగా రోదించింది. గోపాలంగారి అంతిమయాత్రకు సంబంధించిన అన్ని ఏర్పాట్లూ రఘుపతిగారు దగ్గిరుండి చేయించారు. తమ దగ్గరున్న అతి ముఖ్యుడు, విశ్వాసపాత్రుడు గోపాలం పోవడం రఘుపతిరావుగారికి కుడిభుజం విరిగినట్లనిపించింది. ఆ రాత్రికి తనూ

వాళ్ళతోపాటు ఏర్పాట్లన్నీ అయ్యేంత వరకూ ఉండటమే కాకుండా, శ్యామలా దేవిని పిలిపించి, వాళ్ళకు తోడుగా ఉండమన్నారు. శ్యామలాదేవి ఓదార్పు మాటలతో శ్యాంని ఎంగిలిపడేలా చేయ గలిగింది కానీ మాధవీ, సావిత్రమ్మ పచ్చి గంగ మింగకుండా ఏడ్చి, ఏడ్చి అలాగే సొమ్మసిల్లిపోయారు. శాంత వచ్చి వాళ్ళతోపాటే ఏడుస్తూ కూర్చుంది. చంద్రం తన తండ్రి పోయి నప్పటికంటే తనను పెంచి, ప్రేమగా చూసిన బాబాయి ఆకస్మాత్తుగా దూరం కావడాన్ని భరించలేకపోయాడు. ఆ రోజు వాళ్ళు జీవితంలో మరిచిపోలేని విషాదాన్ని మిగిల్చింది.

గోపాలంగారు చనిపోయి నెలరోజు లైంది. ఆ నెలరోజుల్లోనూ శేఖర్ చాలా సార్లు గోపాలం గారింటికి వెళ్ళాడు. మూర్తీభవించిన శోకదేవతలా ఉన్న సావిత్రమ్మను, ఆవిడ ప్రక్కనే బిక్కు బిక్కుమంటూ కూర్చున్న శ్యాంనీ చూస్తే, గుండెలు బరువెక్కి నోటమాట రాకపోయేది. ఓదార్పుగా ఎలా మాట్లా డాలో తెలీని శేఖర్ యింట్లో పనులతో యిటూ అటూ తిరుగుతున్న మధుతో మాట్లాడాలని ప్రయత్నించి, విఫలు డయ్యేవాడు. ఒక్కోసారి మధు వచ్చి, ఒకటి రెండు మాటలు మాట్లాడేది. ఒక్కోసారి అసలు బయటకు వచ్చేది కాదు

గోపాలంగారు అలా అకస్మాత్తుగా మరణించడం వాళ్ళకు తీరని లోటుగా తయారయింది. ఆయన నిష్క్రమణ వాళ్ళ జీవితాల్లో ఊహించని మార్పును తెచ్చింది. మరో మగదిక్కు లేని యిల్లు, యింటా బయటా అన్నింటికీ మాధవే కల్పించుకొని చేస్తోంది. ఓ రకంగా గోపాలంగారికి పిల్లలు లేరనే బాధ. మాధవి, శ్యాంలవల్ల తీరిపోయింది. అంత బాధలో కూడా బాధ్యతా యుతంగా అన్నిపనులూ చేసుకు పోతున్న మాధవి గోపాలంగారికి కొడు కులు లేరనే బెడదను తప్పించింది. తనే కొడుకులా సమర్థించుకుపోతోంది కుటుంబాన్ని.

గోపాలంగారి మరణం శేఖర్ మనసుమీద పెద్దదెబ్బ తీసింది. మళ్ళీ శేఖర్ మనస్సు శూన్యంగా తయా రయింది. దహనసంస్కారం చేయ డానికి గోపాలంగారికి కొడుకులు లేనందువల్ల చంద్రం ఆ బాధ్యత స్వీక రించి శ్మశానానికి వెళ్ళి అక్కడి తతంగ మంతా పూర్తిచేసుకొని రాగానే, ఎదురుగా హృదయవిదారకంగా చూసే వాళ్ళ మనసులు ద్రవించేలా ఏడుస్తున్న మాధవిని చూసి, చంద్రానికి కన్నీ రాగలేదు. అప్పటివరకూ బిగపట్టు కున్న దుఃఖం ఒక్కసారే కట్టలు త్రెంచుకుంది. శేఖర్‌కూ మాధవిని చూస్తే ఎంతో బాధగా ఉంది అయినా

ధైర్యంచేసి మాధవిని ఓదార్చగల చనువూ, సాహసం లేకపోయాయి.

చంద్రం నెమ్మదిగా మాధవి దగ్గిరగా వెళ్ళి తలమీద చేయివేసి "ఊరుకో మధూ ! బాబాయికీ, మనకూ రుణం తీరిపోయింది. మనం ఎంత ఏడ్చినా బాబాయి తిరిగి రాడు," అంటూ మధు గడ్డం పైకెత్తి కన్నీళ్ళు తుడుస్తుంటే... అతని చేతుల్లో తలదాచుకొని వెక్కి-వెక్కి ఏడ్చింది మాధవి. "బావా ! నేను దురదృష్టవంతురాల్ని. నన్నిక్కడికి తీసుకురావడంవల్లే మావయ్య యిలా అర్ధాంతరంగా పోయారు. అమ్మ ఆప్యాయతలోని ఆనందాన్ని పూర్తిగా అనుభవించకుండానే అమ్మ పోయింది. ఎవ్వరూ లేకపోయినా కొండంత అండగా నాన్న ఉన్నారు, ఆయన ఆపేక్షలో అన్నీ మరిచిపోగలం అని ఆనందంగా కాలం గడుపుతుంటే, విధి మరోసారి వెక్కిరించి మాకు నాన్నను దూరంచేసింది. నాన్న పిలుపుతో, దేవుడిలా వచ్చిన మామయ్య ఆదరణలో నాన్నను కూడా మర్చిపోయే ప్రయత్నంలో ఉన్న మమ్మల్ని, దేవుడు మళ్ళీ ఆ ఆత్మీయుణ్ణి కూడా దూరం చేసి, మరోసారి నా దురదృష్టాన్ని ఎత్తి చూపాడు నేను నష్టజాతకురాల్ని బావా ! నావల్లే మావయ్య పోయాడు. నావల్లే మావయ్య పోయాడు" అంటూ పిచ్చిగా మాట్లాడుతూ ఏడుస్తున్న మాధవిని చూసిన ఏ హృదయమైనా కరగకమానదు. గట్టిగా హృదయానికి హత్తుకొని "నీకు నేనున్నాను మధూ ! నువ్వు బాధపడితే చూడలేని మరో మనసుంది," అని బిగ్గరగా చెప్పాలనే కోరికను అతి ప్రయత్నంమీద అపుకున్న శేఖర్, చంద్రం చేతుల్లో ఒరిగి పసిపిల్లలా ఏడుస్తున్న మధుని అలా చూస్తూ ఉండిపోయాడు నిస్సహాయంగా.

"ఊరుకో మధూ ! అలా అనుకోకు. ఇందులో నీ తప్పేముంది ? విధి చేతిలో మనమంతా ఆట బొమ్మలం. నిమిత్త మాత్రులం. ఏది ఎలా జరగాలని ఉంటే అది అలా జరిగి తీరుతుంది. మన మెవ్వరమూ దాన్ని ఆపలేం మధూ !" అని శాంతను పిలిచి "మధుని లోపలికి తీసుకెళ్ళమ్మా ?" అని చెప్పి లోపలకు పంపించి, భారమైపోతున్న తల పట్టుకొని కూర్చున్నాడు చంద్రం. అవిరాళంగా వర్షిస్తున్న కళ్ళను తుడుచుకొనే ప్రయత్నం కూడా చేయకుండా శూన్యంలోకి చూస్తూ...

శేఖర్ చంద్రం దగ్గిరగావెళ్ళి "చందూ! ఏం పనిరా ? నువ్వూ ధైర్యాన్ని కోల్పోయి ఏడిస్తే వాళ్ళను ఓదార్చేవాళ్లెవరు?" అంటూ భుజంమీద చెయ్యివేసిన శేఖర్‌ను చూసి, రెండుచేతుల్తో శేఖర్ని చుట్టేశాడు చంద్రం. అంతవరకూ అతి ప్రయత్నంమీద అపుకున్న ఆవేదన ప్రియమిత్రుడి ఓదార్పు మాటలతో

బయటపడిపోయింది. కొంచెం సేపు చంద్రాన్నలాగే ఏడవనిచ్చి, నెమ్మదిగా చంద్రాన్ని తననుంచి విడదీసి కూర్చో బెట్టాడు శేఖర్. అప్పటికి ఉధృతంగా వచ్చిన ఆవేదన వేగం కొంత తగ్గింది చంద్రానికి.

చంద్రం చిన్నతనమంతా గోపాలం గారింట్లోనే గడిపాడు. పిల్లలు లేని కారణంగా మొదటినుంచీ చంద్రమంటే అపారమైన అభిమానం, ఆపేక్ష గోపాలంగారికి ... బయట చేరిన జనం మాట్లాడుకుంటున్నారు. "పాపం ! గోపాలంబాబు, చంద్రంబాబుని సొంత కొడుకునానే చూసుకున్నారు. పెద్దో రయ్యాక ఆరింటికి ఆరు పోయినా చంద్రంబాబుకు బాబాయంటే మా చడ్డ ఆపేచ్చ", "పాపం ! గోపాలంగోరు మాధవమ్మని తన పెంపుడు కొడుకు చంద్రంబాబుకే యిచ్చి పెళ్ళిసేయా లనుకుంటున్నారంట," "ఇంతకీ ఆరికి పాప్తం లేకపోనాది. అంతా దురదృష్టం" అంటూ నలుగురూ నాలుగు రకాలుగా మాట్లాడుకునే మాటలు వద్దనుకున్నా శేఖర్ మనసులో దూరి ఆవేదన పెంచుతున్నాయి.

"ఇప్పుడు ఏ దిక్కూలేని మధుని చంద్రం అలా వదిలేసి వేరే పెళ్ళెం దుకు చేసుకుంటాడు ? అందులోనూ బాబాయి కోరిక అది అని ఊరుకో గలడా ?" భవిష్యత్ అంతా భయం కరంగా, ప్రశ్నలమయంగా, పిచ్చెత్తిం చేట్లుగా ఉంటే యింక అక్కడ నిలువ లేక, ఆ మాటలు వినలేక ఆ పరిస రాలకు దూరంగా పారిపోయాడు శేఖర్

## 4

మనస్సుకు శాంతి నిచ్చే చోటు వెదు క్కుంటూ గంగాతీరాన చాలా దూరం నడిచివెళ్ళాడు శేఖర్. మనసులో లేని శాంతి ఏ ప్రదేశానికి వెళ్ళినా ఎలా దొరుకుతుంది ? అది ఎండమావుల వెంట పరుగులు తీయడమే అవుతుంది. శాంతి, అశాంతిలకు కేంద్రమే మనస్సై నపుడు వేరే వెదుక్కుంటూ పోవడం వెర్రితనమే, అయినా ఏదో ఆశ.

దూరంగా యిసుకతో గూళ్ళూ, గోపురాలూ కట్టడానికి ప్రయత్నిస్తూ కేరింతలు కొడుతూ కూర్చున్న పిల్లల్ని చూస్తూ కూర్చున్నాడు. ఎంత వద్దను కున్నా, ఆలోచనలు వదలడంలేదు. కొంతకాలం ఈ పరిసరాలకు దూరంగా ఉంటే బావుంటుందేమో ! అన్న ఆలో చన వచ్చింది. మళ్ళీ కొన్నాళ్ళు కలకత్తా వెళ్ళి ఉంటే ... కానీ యిప్పుడు పొలం పనులు ఎవరి కప్పజెప్పి వెళ్ళాలి ? పాపం ! గోపాలం గారున్నంతకాలం తాము పొలాలవైపు కన్నెత్తి చూడక పోయినా, బంగారంలాంటి పంటలు గాదెల నిండుగా కన్పించేవి ఇప్పుడా అవకాశం లేదు. అన్నీ ఎవరో దగ్గరుండి

చూసుకుంటే తప్ప అయ్యేపనులు కావు నాన్నగారికీ వార్ధక్యం పైన బడుతోంది ఆయన యీ బాధ్యతలన్నీ తనమీదా గోపాలంగారిమీద వేసి నిశ్చింతగా ఉన్న సమయంలో హఠాత్తుగా గోపాలం గారు పోవడం, గోపాలంగారి కుటుంబాన్నే కాక తమ కుటుం బాన్ని కూడా చాలా చిక్కులపాలు చేసింది ఆలోచనల్లో మునిగి ఉన్న శేఖర్ ప్రొద్దుపోవడం గమనించలేదు టార్చి తీసుకొని రామయ్య వచ్చి పిలిచే వరకూ శేఖర్ ఏవేవో అంతూ దరీ లేని ఆలోచనలతో సతమతమౌతూనే ఉన్నాడు రామయ్య వెదుక్కుంటూ వచ్చి పిలవగానే మౌనంగా లేచి రామయ్య ననుసరించి యిల్లు చేరు కున్నాడు అయినా ఆలోచనలు వాటి దారిన అవి సాగుతూనే ఉన్నాయి

రోజులు నిర్లిప్తంగా గడిచిపోతు న్నాయి గోపాలంగా రుండగా రఘుపతి గారి పొలాలన్నీ ఆయనే చూసుకొనే వారు యిప్పుడు తమ పొలాలు చూసు కుంటూ రఘుపతిగారి పొలంలో కొంత భాగాన్ని కౌలుకు తీసుకున్నాడు చంద్రం అదీ కేవలం వీలైతే బాబాయి గారి కుటుంబానికి సాయపడాలనే ఉద్దేశ్యంతోనే అయితే సాధ్యమైనంత వరకూ పొలాలకు సంబంధించిన అన్ని పనులూ చంద్రం శేఖర్ యిద్దరూ కలిసే చేసేవారు అందులో యిచ్చి పుచ్చుకోడాల ప్రసక్తిలేదు శేఖర్ ముందే నిర్ణయించుకున్నాడు గోపాలం గారి కుటుంబానికి ఎప్పటిలా కొంత ధాన్యం యిచ్చేయాలని వాళ్ళకు ఆయన లేని లోటులేకుండా ఎప్పటిలా అన్నీ సమకూర్చాలని పంటలు యిల్లు చేరాయి కొన్ని బస్తాలు బండి కెక్కించి రామయ్యద్వారా గోపాలం గారింటికి పంపాడు శేఖర్

వాటిలో సగంమాత్రమే తీసుకొని మిగతావి తిప్పి పంపింది మధు శేఖర్‌కు మధు ఆంతర్య మేమిటో అర్థం కాలేదు సాయంత్రం కాఫీ తాగి గోపాలం గారిల్లు చేరిన శేఖర్ కళ్ళు మాధవికోసం నలుదిక్కులా వెదుకు తున్న సమయంలో ఎక్కడినుంచో పరుగున వచ్చిన శ్యాం శేఖర్‌ను ఢీ కొనడంతో ఉలిక్కిపడి వెనుదిరిగి చూసిన శేఖర్‌కు శ్యాం నవ్వుతూ కన్పించాడు "కూర్చోండి అక్కయ్య శాంత వదిన వాళ్ళింట్లో ఉంది పిల్చు కొస్తాను అంటూ వచ్చినంత వేగం గానూ పరుగెత్తాడు అప్పుడే లోపలి నుంచి తొంగిచూసిన సావిత్రమ్మ మీరా బాబూ ! కూర్చోండి మధు వస్తుం దిప్పుడే అంది

శేఖర్ కూర్చుంటూ అమ్మా ! నేను మీ తో మాట్లాడాలనే వచ్చాను ప్రొద్దున ధాన్యం పంపిస్తే సగమే తీసుకొని మిగతావి

పంపించివేశారేం ?" అని వినయంగా అడిగాడు.

అతను అడుగుతున్న తీరు చూసిన సావిత్రమ్మ మనసు ఆర్ద్రమైంది. "అవును బాబూ ! నేను మధుతో చెబుతూనే ఉన్నాను, బాబుగారు బాధ పడతారు అలా తిప్పి పంపకే అని. వింటేనా ? పనిచేయకుండా ఫలితం ఎందు కనుభవించాలి ? మావయ్య ఉన్నన్నిరోజులు చేసిన పనికి సగం తీసుకున్నాం కదా. మిగతాది వారు దయతలచి యిచ్చేదై ఉంటుంది. అది మనకు అవసరంలే దత్తయ్యా ! నేను ఉద్యోగం చేస్తాను. మనం బ్రతకలేమని భయపడకు. ఈ ఒక్క విషయంలో నా మాట వినత్తయ్యా !" అని కళ్ళ నీళ్ళు పెట్టుకుంది బాబూ ! నేనేం చేయను ? అది రాగానే దాన్నే అడగండి. ఏం ఉద్యోగం చేస్తుందో ఏమో, నాకేం అర్థంకావడంలేదు. అయినా అది చెప్పిన మాటలో కూడా నిజం లేకపోలేదు బాబూ ! ఇంక ఏదో ఓ ఆధారం వెదుక్కోవల్సిందేగా ? యిన్నాళ్ళూ ఆయన ఉంటే తెలిసి రాలేదు. అన్నీ ఆయనే సమర్థించుకు పోయేవారు. యిప్పుడు మధు ఆ బాధ్యత తను తీసుకుంటా నంటున్నది. దాన్ని కాదనే ధైర్యము నాకు లేదు. కాదని నేను చేయగలిగిందీ ఏమీలేదు" అంటూ కన్నీరు తుడుచుకుంటున్న సావిత్రమ్మను చూసిన శేఖర్ అయోమయంగా అయిపోయాడు. ఆమెను ఎలా ఓదార్చాలో ఏం చెప్పాలో కూడా అర్థం కాలేదు.

ఇంతలో మాధవి యింట్లో అడుగు పెట్టి శేఖర్‌ను చూసి పలకరింపుగా నవ్వి "అత్తయ్యా ? శేఖర్ బాబుకు కాఫీ అయినా యిచ్చావా లేదా ?" అంటూ హడావుడి పెట్టింది.

"లేదమ్మా ! యిప్పుడే పెడతాను" అంటూ లోపలి కెళ్ళింది సావిత్రమ్మ. శేఖర్ కెదురుగా ఉయ్యాల బల్లమీద కూర్చొని ఉన్న మధువైపే తదేకంగా చూస్తున్నాడు. ఇద్దరిలో ఎవ్వరూ పెదవి కదిపి మాట్లాడలేకపోతున్నారు ఎలా పలకరించుకోవాలో తెలీనట్లుగా మౌనంగా ఉండిపోయారు.

ఆ మౌనాన్ని భంగపరుస్తూ మాధవే మాట్లాడింది, "ఏవి టివాళ చాలా దీర్ఘంగా ఆలోచిస్తున్నారు ?" అంటూ. అప్పటికే చూపులు తిప్పుకున్న శేఖర్, "మధూ ! నన్నింకా పరాయివాడుగానే అనుకుంటున్నావా ?" అంటూ మధు కళ్ళలోకి చూశాడు. అంత సూటిగా ప్రశ్నిస్తాడని ఊహించని మాధవి ఆ ప్రశ్నకు కొంత తడబడినట్లైంది.

"నే నేమన్నాను ?" అంది.

"ఏమీ అనలేదు మధూ ! ధాన్యం తిప్పి పంపి నీ స్వాభిమానం ఎంతటిదో చూపుకున్నావు. అవతల వాళ్ళు ఎంత

బాధపడతారన్న విషయం ఏ మాత్రం ఆలోచించినా అలా ప్రవర్తించి ఉండవు. నువ్వు చేసిన పనికి నేనేకాదు, నాన్నగారూ, అమ్మా కూడా ఎంత బాధ పడ్డారో తెలుసా ? ఇన్ని సంవత్సరాల నుంచి తన సొంతపొలంలా సాగుచేసిన గోపాలంగారికి మేమెంత ఋణపడి ఉన్నామో నీకు తెలీదు. ఆయన కుటుంబానికి ఆమాత్రం సహాయంచేసే అర్హత మాకు లేదంటావా ? ఎందుకలా చేశావు మధూ ?" అంటూ ఆత్మీయతా, ఆవేశం సమపాళ్ళలో ప్రవహిస్తుంటే ఆపుకోలేని శేఖర్ లేచి మధు భుజాలు పట్టుకొని కుదుపుతూ నిలదీస్తున్నాడు. అప్పటికే మధు కళ్ళనిండుగా నీళ్ళు న్నాయి. నెమ్మదిగా శేఖర్ చేతులు తప్పించి లేచి నిలబడి,

"శేఖర్ బాబూ ! మిమ్మల్నందరినీ బాధపెడుతున్నందుకు క్షమించండి. మిమ్మల్ని బాధపెట్టాలని నా ఉద్దేశ్యం కాదు. మామయ్య ఎవరిదగ్గరా అయాచితంగా, అన్యాయంగా పైసా ఆశించే వాడుకాదు. మామయ్య కెంత స్వాభిమానమో నాకంటే మీకే ఎక్కువ తెలిసి ఉండాలి. లెక్కకు మించి ఏనాడూ ఓ పైసా ఆశించకూడదనీ, శ్రమకు తగ్గ ఫలితాన్నే ఆశించాలనీ, ఆయన నాతో చెబుతుండేవారు. స్వాభిమానాన్ని మించిన ధనం లేదని, దానివల్ల మనిషి కష్టాలకు గురికావచ్చునేమో కానీ గొప్ప ఆత్మసంతృప్తి లభిస్తుందనీ చెప్పే వారు. ఇన్నిరోజులూ మామయ్య చెప్పిన మాటలు నాలో నాకు ఎంతో విశ్వాసాన్నీ, స్వాభిమానాన్నీ పెంచాయి. అందుకే ఆయన అడుగుజాడల్లో నడవాలనుకుంటున్నాను. ఆయన నాకు నేర్పినవి, అనుభవం నేర్పిన పాఠాలు. వాటి ననుసరించి నాకు చేతనైన పనేదో చేసి మా కుటుంబాన్ని నా స్వయం కృషితో పోషించాలనే నిర్ణయానికి వచ్చాను. మామయ్య బ్రతికుండగా ఈ యిల్లు, ఆ ఎడ్లబండి తప్ప వేరే సంపాదించలేకపోయినా, తన మంచి తనంతో నలుగురిలో పలుకుబడి, నలుగురి అభిమానం కావల్సినంత సంపాదించాడు. ఆయన పోయినా యింకా ఆయన్ని పదే పదే తల్చుకుంటున్నారంటే అందుకు ఆయన మంచి తనం, చేసేపనిలో చిత్తశుద్ధి, నిజాయితీలే కారణం. ఆ విషయం నాకంటే ఎక్కువ మీ కుటుంబానికీ, యీ ఊరి వాళ్ళకీ తెలుసు. శేఖర్ బాబూ ! మీరు నాకు సహాయం చేయదల్చుకుంటే ఓ సాయం చేసిపెట్టండి. నేను మా యింట్లో ఓ చిన్న స్కూల్ ఓపెన్ చేయాలనుకుంటున్నాను. మీ రామయ్యను, రంగయ్యను పంపి, మా యింటి ముందో పాకలాంటిది వేసిపెట్టమనండి ఏదో ధరకట్టి ఆ ఎడ్లూ బండీ మీరే తీసుకొని

స్కూల్‌కు అవసరమైన సామానులు కొన్ని తెప్పించి పెట్టండి. చంద్రం బావ తాటాకులు పంపిస్తా నన్నాడు" అంది మధు. ఆమెను చూస్తుంటే యిదివరకు మధుపై పెంచుకున్న అభిమానం, ఆపేక్షగా మారి ఆపుకోలేని ప్రేమాదరణ కలిగింది శేఖర్‌కు. మధూ !" అన్నాడు శేఖర్. అంత కంటే మరో మాట పెగల్లేదు. ఇంతలో లో పలినుంచి "మధూ!" అన్న పిలుపు. ఆ అవకాశంకోసమే చూస్తున్నట్లున్న మాధవి "వస్తున్నా అత్తయ్యా !" అంటూ ఒక్క గంతులో యింట్లోకి పరుగెట్టింది.

కాఫీ గ్లాసు పట్టుకొని నెమ్మదిగా తిరిగివచ్చింది మాధవి. కాఫీ తీసుకొని తాగుతూ-

"మరి నీకు స్టూడెంట్స్ దొరికారా మధూ?" అన్నాడు శేఖర్. "ఓ అప్పుడే అరడజనుమంది దొరికారు. రమ వాళ్ళ తమ్ముడు, ఇందిరా వాళ్ళ చెల్లెలు, కుసుమ అక్కయ్య కొడుకు. రమణ మావయ్యగారబ్బాయి, యింకా..."అని చెప్పుకుపోతున్న మాధవి మాటలకు అడ్డం వస్తూ "అరడజనుమందికే అంత ఆనందపడిపోతున్నావే...చూడు రేపీపాటికి మరో అరడజనుమంది స్టూడెంట్స్‌ను పెంచే పూచీ నాది" అంటూ ఖాళీ గ్లాసు మాధవి చేతికిచ్చి లేచాడు చిన్నగా నవ్వుతూ. కృతజ్ఞత కళ్ళనిండుగా నింపుకొని అతి మెల్లగా నవ్వుతూ "థాంక్స్" అంది మాధవి.

## 5

మాధవి ఆరంభించిన చిన్నస్కూల్ లక్షణంగా సాగిపోతోంది. చిన్న చిన్న పిల్లలతో యింట్లో అవస్థపడలేని వాళ్ళంతా మూడు నాలుగేళ్ళ పిల్లల్ని కూడా తీసుకొచ్చి, మాధవి కప్పజెప్పు తున్నారు. చిన్నసైజ్ కిండర్‌గార్టెన్ స్కూల్‌లా తయారయింది మాధవి స్కూలు. ఎప్పుడూ పిల్లలమధ్య తిరుగుతూ, వాళ్ళ అభిరుచుల్ని అర్థం చేసుకొని, వాళ్ళ అభిప్రాయాల కనుగుణంగా నడుచుకుంటూ "మధు అక్కయ్య"గా వాళ్ళ మనసుల్లో స్థిరనివాసం ఏర్పరచుకుంది మాధవి.

ఇళ్ళకెళ్ళిన దగ్గర్నుంచీ, పిల్లలు ఎప్పుడు తెల్లవారుతుందా ? ఎప్పుడు స్కూల్ కెళదామా ? అన్నట్లు తయా రయ్యారు. పెద్దలు సరేసరి, వాళ్ళకు పగలంతా పిల్లల గోలలేకుండా సక్రమంగా పనులు చేసుకోడానికి కావల్సినంత తీరిక. తీరిక సమయాల్ని వాళ్ళు వృధాచేయకుండా మాధవి తనకు తెలిసిన బుట్టల అల్లిక, స్వెట్టర్స్ అల్లడం నేర్పింది. దానితో అందరికీ మాధవంటే మంచి గురి ఏర్పడింది. ఓ రకమైన సానుభూతినీ, అభిమానాన్నీ సంపాదించింది తన మంచితనంతో మాధవి.

"గోపాలంగారికి సంతానం లేని కారణంగా కుటుంబం నానా అవస్థలు పడుతోంది" అనే మాట రాకుండా మాధవి ఆ యింటికి పెద్దకొడుకులా మారి లక్షణంగా అన్ని బాధ్యతలూ నిర్వర్తించడమే కాకుండా ఆ మంచితనం, విధేయతలతో గంగాపూర్ గ్రామస్థుల మనసుల్లో ఓ ప్రముఖ స్థానాన్ని సంపాదించింది.

చంద్రం, శేఖర్ కల్సినప్పుడల్లా మాధవి గురించే మాట్లాడుకునేవారు. మాధవి ధైర్యానికీ, ఆత్మస్థైర్యానికీ ఎంతో ముచ్చటపడేవాడు శేఖర్. చంద్రం కూడా ఏదోవిధంగా వాళ్ళ బాబాయి కుటుంబానికి సాయపడాలని ప్రయత్నించడం చూసి, శేఖర్ మనస్సులోనే మెచ్చుకునేవాడు. అయితే తనుమాత్రం వాళ్ళకు ఏమాత్రం సాయం చేయలేకపోతున్నానే, అనే బాధ అప్పుడప్పుడూ కలుగుతుండేది. అంత చిలిపిగా, అల్లరిగా గంతులు వేసిన మాధవి, ఒక్కసారే అంత బాధ్యతను అవలీలగా భుజాలమీద వేసుకోడం, శేఖర్‌కు మాధవిపై ఉన్న అనురాగాన్ని ఓ పాలు పెంచి మధు ఆత్మాభిమానాన్ని తలుచుకొని, ఆరాధించేలా చేసింది. కల్సినప్పుడల్లా కల్మషం లేకుండా నవ్వుతూ మాట్లాడేది. ధాన్యాన్ని తిరస్కరించినందుకు రఘుపతిరావుగారి దగ్గర. శ్యామలాదేవి దగ్గర క్షమాపణ కోరుకుని తన అభిప్రాయాన్ని వాళ్ళకు విశదీకరించింది.

గోపాలంగారు చనిపోయి అప్పుడే రెండు సంవత్సరాలు గడిచిపోయాయి. అయినా శేఖర్‌కు మధు దగ్గర తమ పెళ్ళి ప్రసక్తి తెచ్చే ధైర్యం లేక పోయింది. ఏం జవాబు చెబుతుందోనని భయం. మాధవి దగ్గరకు వెళ్ళినప్పుడల్లా ఏదో తెలీని బలహీనతతో మనసు విప్పి మాట్లాడలేక పోయేవాడు. ఒక్కోసారి మలయమారుతంలా గల గలా పారే సెలయేరులా నవ్వుతూ, మరో మారు పవిత్ర గంగానదిలా, నిర్మలంగా ప్రవహించే ఆ మూర్తిని తను ఎంత కాలమైనా అర్థంచేసుకోలేనేమో అన్పించేది శేఖర్‌కు. అంతరంగంలో తరంగాలు సృష్టించే మధు రూపం, ఆ పేరు అలా మనసున ముద్రించినట్లు నిలిచి పోయింది, శేఖర్ హృదయాన.

ఈ రెండు సంవత్సరాలకాలంలో మధు శేఖ రింటికి చాలాసార్లు వచ్చింది. కొన్నిసార్లు శ్యామలాదేవి కబురు పెడితే, మరికొన్నిసార్లు శాంతతో కలిసి ఊరికే మాట్లాడాలని. శ్యామలాదేవి మాధవిపట్ల అభిమానంతో మాధవి వచ్చి వెళ్ళినప్పుడల్లా రఘుపతిరావుగారి ముందు జాలిగా మాట్లాడేది.

"పాపం యీపాటికి ఏ కాలేజీలోనో చదవాల్సిన పిల్ల సుషమలా, దాని దురదృష్టం ఈ గంగాపూర్ పిల్లలకు

వెట్టిచాకిరీ చేయాల్సి ఉంది కాబోలు" అంటూ నిట్టూర్చేవారు. శేఖర్ దగ్గరలో ఉంటే తల్లి మాటలు విని మనస్సు బాధతో మూలిగేది. కానీ చేసేదేముంది? మధును ఆ చరనుండి తప్పించగల వాళ్ళెవరు? తనకు తాను తల్చుకుంటే తప్ప మధుని మరొక రెవ్వరూ ఆ మార్గంనుంచి తప్పించలేరు.

ఈ మధ్యకాలంలో శేఖర్‌కు చాలా సంబంధాలు వచ్చాయి. అన్నింటికీ ఏదో వంకపెట్టి తప్పించేస్తున్నాడు. రఘుపతిగారు విసిగిపోయారు. శ్యామలాదేవిని పిలిచి "వాడి మనసులో ఎవరైనా ఉన్నారేమో కనుక్కో. లేకపోతే వచ్చిన ప్రతి సంబంధం తిప్పి కొడుతుంటే వాళ్లేమనుకుంటారు? వంకలుంటే అవేమిటో చెప్పమను. ఈ సంబంధం ఎందుకు కాదంటున్నాడో నాకు తెలియాలి. యిప్పుడు చూసిన సంబంధానికి ఏమైంది? అమ్మాయి బంగారు బొమ్మలా ఉంది. బియ్యే వరకూ చదువుకుంది. ఆస్తిపాస్తులు మనకంటే ఓ పాలు ఎక్కువే ఉన్నాయి. ఒక్కగానొక్క కూతురు. ఈ ఫొటో చూపించి, వివరాలు చెప్పి, వాడి అభిప్రాయం అడుగు. ఎల్లుండి పెళ్ళిచూపులకు వెళ్ళాలి. సిద్ధంగా ఉండమను" అంటూ ఓ ఫొటో శ్యామలాదేవి ముందు పడేసి, ఎసురుగా కండువా భుజాన వేసుకొని తోటవైపు సాగిపోయారు రఘుపతిరావుగారు ఓ నిట్టూర్పు విడిచి, ఫొటో తీసుకొని శేఖర్ గదివైపు అడుగులు వేశారు శ్యామలాదేవి.

గదిలో పడుకొని 'లోన్లీ లేడీ' చదువుతున్న శేఖర్ గుమ్మంలో మెట్టెల చప్పుడు విని తల తిప్పి చూశాడు. తల్లి లోపలికి రావడం చూసి చిన్నగా నవ్వుతూ లేచి కూర్చున్నాడు. మౌనంగా శేఖర్ ప్రక్కన కూర్చుంటూ చేతిలో ఉన్న ఫొటో శేఖర్ ముందుంచారు శ్యామలాదేవి. ఫొటో చూడగానే విషయం గ్రహించి మళ్ళీ పుస్తకం చేతుల్లోకి తీసుకున్నాడు శేఖర్. కొంతసేపు అలాగే కొడుకువైపు చూసిన శ్యామలాదేవి-

"బాబూ! ఈ ఫొటో ఒక్కసారి చూడు. వీళ్లు మనకు కొద్దిగా దూరపు బంధువులు కూడా. అమ్మాయి పేరు మంజుల. బియ్యే పరీక్షలు వ్రాసిందట. నీకు నచ్చితే వాళ్ళు వెంటనే ముహూర్తాలు పెట్టుకోవాలని తొందర పడుతున్నారు మీ నాన్నగారు ఎల్లుండి పెళ్ళిచూపుల కొస్తామని కబురుచేశారు. మాట్లాడవేం బాబూ? నేను చెప్పే మాటలు వింటున్నావా లేదా?" అంటున్న తల్లి మాటలకు యిబ్బందిగా కదిలి పుస్తకం ప్రక్కన పడేసి "అమ్మా! నా కిప్పుడే పెళ్ళిచేసుకోవాలని లేదమ్మా' అనవసరంగా ఈ పెళ్ళిచూపుల తతంగాలు నేను

నచ్చలేదనడం వాళ్లు బాధపడటం, మీరు బాధపడటం నా కష్టంలేదు. ఇంకొన్నాళ్ళపాటు నన్నిలాగే ఉండనివ్వండి స్వేచ్ఛగా. ఆ తర్వాత ఆలోచిద్దాం. నాన్నగారితో నువ్వు చెప్పమ్మా, యింక సంబంధాలు చూడొద్దని. ప్రతిసారీ నాన్నగారికి నామీద కోపం వస్తోంది, వంకలు పెడుతున్నానని" అన్నాడు శేఖర్.

"చూడు బాబూ ! నీ కిష్టంలేకుండా ఏ పనీ చేయం. కానీ సంబంధాలు వస్తుంటే అన్నీ ఎలా తిప్పి పంపడం ? అయినా పెళ్ళైతే నీకు స్వేచ్ఛ ఉండదని ఎవరన్నారు ? లేకపోతే ... కలకత్తా అమ్మా యెవరైనా నీ మనసులో ఉందా ? చెప్పు బాబూ ! తల్లిదగ్గర సిగ్గుపడతా వెందుకు ? నీ యిష్టాన్ని కాదని, మీ నాన్నగారు మట్టుకు ఎలా అంటారు ? చెప్పు శేఖర్ ?" అంత ఆప్యాయంగా తన మనసులో ఎవరైనా ఉన్నారేమో చెప్పమని అడుగుతున్న తల్లి దగ్గర ఒక్కసారి తన మనసులో వ్యథంతా చెప్పాలనే తీవ్రమైన కోరిక కలిగింది. అది సమయం కాదని అతి ప్రయత్నంమీద ఆ కోరిక నణచుకొన్నాడు శేఖర్.

"అదేం లేదమ్మా ! నాకు కలకత్తాలో బాగా పరిచయమైన అమ్మాయిలంటూ ఎవరైనా ఉన్నారంటే అది సుషమ ఒక్కతే. అది నా ముందు చాలా చిన్నపిల్లగా అన్పించేది సుషమమీద నాకెప్పుడూ అలాంటి అభిప్రాయం కలగలేదు. పరిచయమైన రెండో వారానికే "అన్నయ్యా" అని పిలవడం మొదలెట్టింది. నువ్వో చూశావుగా దాని అల్లరి. "దానికో మంచి సంబంధముంటే చూడండి శేఖర్" అని మొన్న కలకత్తా వెళ్ళినప్పుడు శ్రీధర్ బాబాయి మరీ మరీ చెప్పారు. మన ప్రాంతంవాళ్లు కావాలని ఆయన కోరిక." అంటూ మాట మార్చి సుషమ సంబంధాల గురించి మాట్లాడుతున్న శేఖర్‌ను మధ్యలోనే ఆపి, "సుషమకు సంబంధాలు మేం చూస్తాం గానీ, ముందు నీ విషయం చెప్పు" అన్నారు శ్యామలాదేవి చిరుకోపంగా.

"అమ్మా! చెల్లెలి పెళ్ళి కాకుండా ఏ అన్నయ్యైనా పెళ్ళి చేసుకుంటాడా ? నువ్వో సుషమను ముద్దుల కూతురిగా ఒప్పుకున్నావు. మరి దాని పెళ్ళి కానివ్వు. ఈలోపు నా ఆలోచనలన్నీ అమలుపరచి, మన పొలాల్లో బంగారం పండించి అందరికంటే గొప్పగా సేద్యం చేసిన ఘనతను తీసుకొస్తాను నాకు మరో రెండు సంవత్సరాలు టైమివ్వమని నాన్నగారితో చెప్పమ్మా ! పోనీ ఒక్క సంవత్సరం, సరేనా ?" అంటూ బుజ్జగింపుగా మాట్లాడి ఎలాగో తల్లిని ఒప్పించి, "మా అమ్మ మంచిది" అంటూ దిగ్గున మంచంమీదనుంచి క్రిందకు దూకి పొలం వైపు సాగిపోయాడు శేఖర్.

అలా వెళుతున్న కొడుకును చూస్తుంటే వాడెందుకలా వాయిదాలు వేస్తున్నాడో శ్యామలాదేవి కేమీ అర్థం కాలేదు. "ఏది ఏమైనా మరో సంవత్సరం వరకు వాడిని ఒత్తిడి పెట్టినందువల్ల ప్రయోజనంలేదు" అలా తనలో తాను అనుకుంటూ వంటగదివైపు వెళ్ళిపోయారు.

ఆ సాయంత్రం రఘుపతిగారి దగ్గర శేఖర్ చెప్పిన మాటలే సున్నితంగా ఆయనకు కోపం రాకుండా చెప్పడానికి ప్రయత్నించిన శ్యామలాదేవికి ఆయనతో రెండు మూడు మాటలు పడక తప్ప లేదు. "నీ గారాబం వాణ్ణి మరీ పనికి రాని వాణ్ణిగా చేసింది. లక్షణంగా పెళ్ళి చేసుకోరా అంటే వాయిదాలు, వంకలు. ఛీ ! ఛీ ! మా కాలంలో మేం యిలా ఉన్నామా ?" అంటూ కొంతసేపు కస్సు బుస్సులాడి, ఆ తర్వాత సుషమ విషయం కూడా విని "అలాగే చూద్దాంలే మన ప్రక్క దొరికే సంబంధాలు సుషమకు సరిపడవేమో ! చదువుకున్న పిల్ల. ఈ ప్రాంతాల్లో యిమడగలదా ?" అంటూ సందేహం వెలిబుచ్చారు.

రోజులు ప్రశాంతంగా గడిచి పోతున్నాయి. శేఖర్ పూర్తిగా పొలానికే అంకితమైపోయినట్లుగా నవీన పద్ధతుల్లో సేద్యంచేస్తూ, చంద్రానికీ, మిగతా రైతులకూ ఆ పద్ధతులు చెబుతూ, గంగాపూర్ గ్రామం సేద్యంలో ఆ సంవత్సరం రాష్ట్రస్థాయిలో ఫస్ట్‌గా రావాలనే ప్రయత్నంలో రాత్రింబవళ్ళూ కృషిచేస్తున్నాడు. ఆ రోజు పొలం నుంచి యింటికి వస్తుంటే దారిలో చంద్రం కలిసి సాయంత్రం గంగా తీరానికి రమ్మనీ, ఓ ముఖ్యవిషయం మాట్లాడాలనీ చెప్పాడు శేఖర్‌కు.

ఇంటి కెళ్ళగానే స్నానంచేసి, కాఫీ తాగి గంగానదివైపు బయలుదేరిన శేఖర్‌ను, మధ్యలోనే చంద్రం వచ్చి కలిశాడు యిద్దరూ మాట్లాడుకుంటూ బయలుదేరారు ... శాంతకు ఓ మంచి సంబంధం వచ్చిందిరా ! నాన్నగా రుండగా వాళ్ళొకసారి మాట్లాడుకున్నా రట కూడా. అప్పటికి శాంత చాలా చిన్నపిల్ల కావడంవల్ల నాన్నగారు అప్పుడే పెళ్ళిచేయడానికి ఒప్పుకోలేదట. మన ప్రక్క ఊరు రాంపూర్ కృష్ణయ్య చౌదరి గారబ్బాయి. వాళ్ళ పెద్దబ్బాయి మన క్లాస్‌మేట్ నీకు జ్ఞాపకం ఉందా ? రామేశ్వర్రావు అని ఉండేవాడు. మనం ఎప్పుడూ ఏడిపిస్తుండేవాళ్ళం. "రామేశ్వర్, సోమేశ్వర్, బసవేశ్వర్, ఒరే, నీ కీ పేరే బావుందిరా" అని ఏడిపించేవాళ్ళం. బాగా లావుగా ఉంటా డని, ఆడపిల్లలు కూడా వాడిని బసవేశ్వర్, దున్నేశ్వర్ అంటూ ఏడిపించేవాళ్ళు పాపం వాడి చదువు ఈ స్కూల్‌తోనే ఆగిపోయింది.

ఇప్పుడే ఓ సంవత్సరం క్రితమే వాడికి పెళ్లైంది. వాళ్ళ తమ్ముడు పెళ్ళికి ఉన్నాడు." మధ్యలోనే చంద్రాన్ని ఆపి ఆ చిన్నప్పటి జ్ఞాపకాలను ఫ్రెష్‌గా నెమరువేసుకుంటూ, "పిడూ! బసవేశ్వరే నేమిటి కొంపదీసి ? అసలే పాపం శాంత బలహీనం" అంటూ ఫక్కున నవ్వేశాడు. నవ్వుతూ శేఖర్ వీపు చరిచి భుజాన చేయివేసి నొక్కుతూ-

"ఛ, లేదురా! అబ్బాయి చాలా బావున్నాడు. వాడికీ,వాళ్ళ అన్నయ్యకూ పోలికే లేదు. చిన్నప్పటినుంచీ వాడు కలకత్తాలోనే పెరిగాడట వాళ్ళ మావయ్య గారింట్లో. పెద్దైన తర్వాత రాంపూర్ వచ్చేశాడు. ఇంటర్‌వరకూ చదువుకున్నాడట. యిక ఆ తర్వాత చదవను వ్యాపారం చేస్తానన్నాడట. ఏదో ఒకటి చేద్దువుగాని యింటి కొచ్చేయమని వ్రాస్తే వచ్చేశాడట. పెద్దగా కట్న కానుకలు కోరడంలేదు. మీ అమ్మాయికి మీరు పెట్టుకోదల్చు కుంది పెట్టుకోండి, మాకు మీరేమీ యివ్వక్కర్లేదు అన్నారు. అసలు ఆ అబ్బాయి కట్నం తీసుకునేట్లుగా ఉంటే నాకు పెళ్ళే వద్దన్నాడట. దాన్నిబట్టి ఏదో కొద్దిగా ఆదర్శభావాలు ఉన్నట్లే అన్పించింది. అబ్బాయి బావున్నాడు. పేరు 'రాజేశ్వర్' అని చిన్నగా నవ్వుతూ మెత్తగా ఉన్న యిసుకలో చతికిలబడుతూ, శేఖర్ని చేత్తో లాగి కూర్చోబెట్టి-

"ఏంరా నీ అభిప్రాయ మేమిటి ? శాంతను రాజేశ్వర్ కిచ్చి పెళ్ళిచేస్తే ఎలా ఉంటుందంటావు ? ఇంటికి పెద్ద కొడుకునని అంతా నా మీదే వదిలేశారు. శాంత నడిగితే సిగ్గుపడుతూ 'నీ యిష్టమన్నయ్యా' అంది. అమ్మ కూడా 'నీ కిష్టమైతే నాకూ యిష్ట మేరా !' అంది. మరి యింక నాకు కావల్సింది నీ అభిప్రాయం." శేఖర్ మౌనంగా కొంతసేపు చంద్రంవైపు చూస్తూండిపోయాడు. తండ్రి చనిపోగానే యింటి బాధ్యతను తనమీద వేసుకొని, పెద్ద చదువులు చదవాలని కన్న కలలకు మంగళగీతం పాడి చెల్లెలి మంచిచెడ్డల్ని గురించి ఆరాటపడే అన్నయ్య చంద్రంలో కన్పించాడు. ఆప్యాయంగా చంద్రం చేయి చేతిలోకి తీసుకొని నొక్కుతూ-

"చందూ ! యిందులో నేను ఔననడానికీ, కాదనడానికీ ఏముందిరా. నీకు నచ్చితే త్వరగా మా కందరికీ పప్పన్నాలు పెట్టించు. అయితే అంతకు ముందుగా ఆ రాజేశ్వర్ చేత ఆ వ్యాపార మేదో ప్రారంభించే, ఏర్పాటు చేయించమని వాళ్ళ నాన్నగారికి కబురు చేయి. మిగతా అభ్యంతరా లేముం టాయి ? కట్నం వద్దన్నాడంటే మంచి వాడే అన్పిస్తోంది ఎప్పుడు చూడా

లనిపిస్తే అప్పుడు చెల్లెల్ని సైకిల్‌మీద వెళ్ళి చూసి రావచ్చని ప్లాన్ వేశావులే ! అందుకే రాంపూర్‌లో గాలమేసి బావను చిక్కించుకున్నావు. వెరీగుడ్ ! యింక త్వరగా అన్నిపనులూ కానివ్వు" అన్నాడు ఉత్సాహంగా.

"అయితే యింక నీకు పనేం లేదను కుంటున్నావురా శేఖర్? వచ్చి హాయిగా పెళ్ళిభోజనంచేసి వెళదామనుకుంటున్నా వేమిటి ? నా ప్రాణమిత్రుడి వైనందుకు, నాలో సగమైనందుకు, చెల్లెలి పెళ్ళిలో నీకు పనిలేకుండా ఎలారా ?...నువ్వు ముందుగా కలకత్తా వెళ్ళి శుభలేఖలు అచ్చువేయించుకు రావాలి. అలాగే సుషమను, శిరీష్‌ను, వాళ్ళ నాన్నగార్ని పిలిచి, వీలైతే నీ వెంటనే తీసుకురావాలి. యింకా... కావల్సిన సామాన్ల లిస్టు యిస్తాను. అవన్నీ తీసుకురావాలి" అంటూ జేబులో నుంచి పెన్నూ, పేపరూ తీస్తున్న చంద్రాన్ని చెయ్యిపట్టుకొని ఆపి-

"ఒరేయ్ చందూ ! యివన్నీ నాకు సాధ్యమయ్యే పనులేనా ? నే నొక్కడినీ వెళితే అందులో సగం పనులే అవుతాయి. మిగతా సగానికి నువ్వు వెళ్ళాలి మళ్ళీ. అందుకని, యిద్దరం కల్సి వెళదాం. అక్కడి పనులు చూసుకొని వెంటనే బయలుదేరి వద్దాం. మిగతా యిక్కడి పనులు వచ్చాక చూసుకుందాం ముహూర్తం ఎన్ని రోజుల్లో ఉందన్నావు ?

"వా రం రో జు లు మా త్ర మే" అన్నాడు చంద్రం నవ్వుతూ.

"మరి వారంరోజుల్లో పనులన్నీ అవుతాయా ?" అన్నాడు శేఖర్ ఆశ్చర్యంగా

"ఓ యస్ ! యింటిదగ్గర పనులన్నీ మా అమ్మ, సావిత్రి పిన్ని, మధు కలిసి చేసేస్తారు. ఇక మిగతా పనులు మన పాలు. ఇంక మీ చెల్లాయి సుషమ కాస్త ముందుగా వస్తే మధూ వాళ్ళకు కాస్త సాయంగా ఉంటుంది. యింకో తోడు దొరుకుతుంది వాళ్ళకు" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"సు ష మ వా ళ్ళ కు సాయం చేయడమా ? వాళ్ళ పనులు చెడగొట్ట కుండా ఉంటే చాలు" అన్నాడు శేఖర్ నవ్వుతూ.

" ఏంకాదులేరా ! నీతోపాటు సుషమను, శిరిష్‌నూ తీసుకొచ్చేసెయ్. పను లెలా ఉన్నా సందడిగా, సరదాగా ఉంటుంది. వాళ్ళ నాన్నగారు కూడా వాళ్ళతో వస్తే బాధేలేదు. లేకపోతే ముహూర్తం నాటికైనా తప్పకుండా వచ్చేయమని చెప్పేసిరా" అంటున్న చంద్రాన్ని ఆపుతూ "రేయ్ చందూ ఆపక్కడ, నాతో తీసుకురావడంకాదు. మనతో, మనతో అను. ఎందుకంటే కలకత్తా మనిద్దరం వెళుతున్నాం కనుక" అన్నాడు

సరేలేరా బాబూ ! ఇద్దరం

వెళదాం! రేపు వచ్చి నేను నాన్న గారితోనూ, అమ్మతోనూ చెబుతాను. ఇంక లే వెళదాం! రాంపూర్ వాళ్ళకు ఆ వారంరోజుల తర్వాత ముహూర్తమే ఖాయం చేయమని కబురుచేయాలి. నిన్నడిగి చెబుదామని వాళ్ళకు నే నేమాటా చెప్పలేదు. వాళ్ళు ఏకంగా ముహూర్తం పెట్టుకొనే వచ్చారు. నేను రెండురోజులు టైమివ్వండని చెప్పి పంపించాను. వాళ్ళు ఎప్పుడో శాంతను చూశారట. చూసే అవసరం లేదన్నారు. నేను నిన్న వెళ్ళి రాజేశ్వర్‌ని చూసి వచ్చాను. నమ్రతగా మాట్లాడాడు. నాకు నచ్చాడు. నేను యింటికి వెళ్ళి కబురు చేస్తానని చెప్పి వచ్చాను" అంటూ ముందుకు అడుగు లేస్తున్న చంద్రాన్ని అనుసరించాడు శేఖర్, మార్గమధ్యంలో.

"మరి నీ పెళ్లెప్పుడురా?" అన్నాడు శేఖర్. "నీ పెళ్ళైన తర్వాత." వెంటనే సమాధానం వచ్చింది. ''అయితే యిక నీ పెళ్ళి అయినట్లే నాతో పెట్టు కుంటే...'' అంటూ ముందుకు సాగిన శేఖర్ భుజం పట్టుకొని ఆపుతూ, "ఏంరా? నువ్వు పెళ్ళే చేసుకోవా ఏం? సంబంధాలు వస్తున్నాయని విన్నానే? నీ కెవ్వరూ నచ్చడంలేదా? లేకపోతే కలకత్తాలో ఏమైనా ప్రేమాయణం నడిపావా? ఏవిటి కథ?'' అంటూ నిలవేశాడు చంద్రం.

"అదేం లేదురా! ఎందుకో యిప్పట్లో పెళ్ళిచేసుకోవాలనిలేదు చందూ కొంతకాలం యిలాగే ఉండాలని" అంటూ మౌనంగా ముందుకు అడుగులు వేస్తున్న శేఖర్ వైపు విచిత్రంగా చూస్తూ తనూ ముందుకు సాగాడు చంద్రం. శేఖర్‌ను అంత ఉదాసీనంగా, నిరుత్సాహంగా ఉండగా ఎప్పుడూ చూళ్ళేదు. వాడి మనసులో ఏదో బాధ ఉన్నట్లుంది. ఏమై ఉంటుంది. పెళ్ళిమాట వాడిలో అంత అలజడి రేపడానికి కారణ మేమై ఉంటుంది?" ఆలోచిస్తూ శేఖర్ భుజాన చేయి వేశాడు చంద్రం. మౌనంగా సాగిపోయా రిద్దరూ గ్రామంవైపు.

ఆ రోజు పదకొండు గంటల బస్సుకే వెళ్ళాలని చంద్రం చెప్పడంవల్ల హడావుడిగా తయారవుతున్నాడు శేఖర్. పొలం పనులు రామయ్యకూ, రంగడికీ వప్పజెప్పి ఒకటికి పదిసార్లు అన్నీ వివరించి తన గదిలో కెళ్ళి బాగ్ సర్దుకుంటున్నాడు. వెనగ్గా ఏదో చప్పుడైతే వెనుదిరిగిన, శేఖర్ భుజం, అడుగు దూరంలో ఉన్న మాధవికి తగిలింది. ఆ సమయంలో అలా తనకు అంత దగ్గరగా, ఒంటరిగా కన్పించిన మధుని చూడగానే శేఖర్‌కు మొదట ఆశ్చర్యంగా, అనందంగా అదేదో తెలిని అనుభూతితో మనసంతా నిండిపోయింది. అలా మధునే చూస్తుండిపోయాడు. పావడా వోణీకి బదులు ప్రింటెడ్

వాయిల్, తెల్లగా, మల్లెపువ్వులా ఉన్న చీర ముచ్చటగా కట్టింది. విశాలంగా మెరిసే కళ్ళకు తీరుగా కాటుక దిద్దింది. ముఖాన ఎర్రటి తిలకం మెరుస్తుండగా, పలువరుస తళుకు కనిపించేలా చిన్నగా నవ్వుతూ నిల్చున్న ఆ సౌందర్య మూర్తిని చూస్తుంటే రెప్ప వాల్చాలన్పించడంలేదు శేఖర్‌కు. జడకుచ్చులు తీసివేసి వదులుగా, అందంగా వేసుకున్న జడ పొడవుగా జీరాడుతోంది. ముగ్ధత్వాన్ని ముమ్మూర్తులా నింపుకున్న ముద్దబంతిపూలు ఆ జడకు, మధుకు మరింత అందాన్ని ప్రసాదించాయి.

అదోరకమైన క్రొత్త ఆకర్షణ, క్రొత్త పరిమళం. ఆ రోజు మాధవి అలంకరణ పాత క్రొత్తల కలయికలా, పల్లెపట్టణాల ఐక్యతలా ... అందంగా అపురూపంగా కన్పించింది. శేఖర్ చూపుల తాకిడికి తట్టుకోలేకపోతోంది మాధవి. ఇంక లాభంలేదని ధైర్యం చేసి తనే మాట్లాడింది. "అమ్మ నడిగితే మీ రిక్కడ ఉన్నారని చెప్పారు. చంద్రం బావ, తను ముందుగా వెళ్ళి, టికెట్స్ తీసుకొని ఉంచుతానని... మిమ్మల్ని తొందరగా బస్‌స్టాండుకు రమ్మని చెప్పాడు. నేను సుషమను అడిగానని చెప్పండి. బావకు చెప్పాను కానీ, యిన్ని పనుల్లో మరిచిపోతాడని నా భయం. ఈ హాండ్‌బాగ్ సుషమ కివ్వండి. నేను స్వయంగా తనకోసమే అల్లానని చెప్పండి. ఇంకో విషయం శాంత చెప్పింది సుషమను మీ వెంటే తీసుకొచ్చేయండి నాలుగు రోజులు ముందుగా వస్తే మాకూ సరదాగా ఉంటుంది. శిరీష్‌గారికి కూడా చెప్పండి" అంటూ గడగడా పాఠంలా వప్పజెప్పి "ఇక నేను వస్తాను" అంటూ గిర్రున వెనక్కు తిరిగిన మధు అప్రయత్నంగా ఆగిపోయింది భుజంమీదపడిన బలమైన చేయి మధుని తన కభిముఖంగా తిప్పుకోడంవరకే తెలుసు ఆ తర్వాత ఏం జరిగిందీ తెల్సుకొనే లోపల శేఖర్ మధుని ఒక్కసారిగా బలంగా దగ్గిరకు లాక్కొని మెరుస్తున్న పెదాలపై ముద్దుగా ఓ ముద్రవేయడం తెలుసు అక్కడినుంచి తప్పించుకొని ఎటు పరుగెడుతుందో కూడా తెలీనంత అయోమయంగా పరుగెట్టి పారిపోయింది మాధవి.

తన తొందరపాటుకు బాధపడ్డా, ఆ ఆత్మీయమైన స్పర్శానందం తలుచుకున్నప్పుడల్లా శేఖర్ శరీరంలో విద్యుత్తరంగా లేవో ప్రవహిస్తున్న అనుభూతి కలుగుతోంది. తను దగ్గరకు లాక్కోగానే భయంగా, బిడియంగా క్షణంలో సగం మూసుకుపోయిన ఆ కనురెప్పల అందం, మరేదో తన్మయావస్థలో ఉక్కిరిబిక్కిరైన మధు మోహన రూపం పదే పదే కళ్ళముందు కదలాడుతుంటే...బాగ్ తీసుకొని ఉత్సాహంగా

ఏదో తనలో శక్తి పెరిగినట్లు, తృప్తిగా బస్‌స్టాండువైపు బయలుదేరాడు.

## 6

అనుకున్న టైముకు అన్ని పనులూ పూర్తిచేసుకొని శిరీష్, సుషమలను వెంటబెట్టుకొని గంగాపూర్ చేరుకున్నారు శేఖర్, చంద్రం. ఈసారి సుషమ చీరకట్టుకొని వచ్చింది. చీరలో కొంత హుందాతనం చేకూరినా చిలిపితనం, అల్లరీ ఆవగింజంత కూడా తగ్గలేదు. ఓ పాలు ఎక్కువయ్యాయేమో కూడా. శ్రీధర్‌గారు పెళ్ళినాటికి వస్తానని మాట యిస్తేగానీ వదల్లేదు చంద్రం.

"అబ్బ, ఏవిటి శేఖర్! మీ ఫ్రెండ్ శతమొండిలా ఉన్నాడేమోయ్ అనుకున్నది సాధించి కానీ వదలడులా ఉంది. మొత్తానికి అసాధ్యుడు. ఐ లైక్ హిమ్ వెరీ మచ్" అన్నారు. అందరూ ఆశ్చర్యపోయేలా "ఐ టూ డాడీ" అంది సుషమ. సుషమ మాటతో అదిరిపోయిన చంద్రం, తల ఎక్కడ దాచుకోనా అని టేబుల్ క్రింద ఏదో వెదికే ప్రయత్నంలో ఉండటం చూసి, బిగ్గరగా నవ్వేశారు శ్రీధర్. "నాటీ గర్ల్ !" అంటూ సుషమ వీపున చిన్నగా తట్టుతూ, మళ్ళీ అంతా నవ్వుతూ కబుర్లలో పడ్డారు.

చంద్రం యింట్లో పెళ్ళిసందడంతా సుషమ, మధులదే. "పెళ్ళి కొచ్చారు కనుక మా యింట్లోనే దిగాలంటూ సరాసరి సుషమను, శిరీష్‌ను తమ యింటికే తీసుకెళ్ళాడు చంద్రం. శేఖర్‌ను "నువ్వు కూడా యిక్కడికే వచ్చేయరా" అంటున్న చంద్రంతో-

"బాగ్ యింట్లో పడేసి స్నానంచేసి వస్తాలేరా" అంటూ తమ యింటివైపు దారితీశాడు శేఖర్. సుషమను. శిరీష్‌నూ తమ యింటికే తీసుకెళ్ళాలని ఉన్నా చంద్రం బాధపడతాడని బలవంతం చేయలేదు.

ఆ రోజు మధ్యాహ్నం భోజనానికి పిలవడానికి వచ్చిన చంద్రంతో కలిసి వాళ్ళింటికి వెళ్ళిన శేఖర్‌ను చూసి, హాల్లో కూర్చున్న అరడజనుమంది అమ్మాయిలూ తలో ప్రక్కా పారిపోయారు. అవి చూసి చంద్రం... "ఒరే నిన్ను చూస్తే వీళ్ళందరికీ అంత భయమేంరా శేఖర్ ? మళ్ళీ శిరీష్‌ను చూసినా భయం లేకుండా చక్కగా కబుర్లు చెబుతారు శాంత ఫ్రెండ్సంతా. మరి నువ్వేలా కన్పిస్తావో ఏమో వాళ్ళకు." అంటుండగానే నవ్వుతూ ఎదురుగా వచ్చిన్న శాంతను చూసి శేఖర్ ఆశ్చర్యపోయాడు.

సిగ్గుతో కొద్దిగా వంచిన తల పెళ్ళికూతుర్ని చేశారు కాబోలు. ఆ రోజు కొత్తచీర. బుగ్గను కాటుక చుక్క. బారుగా వేసుకున్న జడ నిండుగా కనకాంబరాలు. వెనకే వచ్చిన సుషమ,

మాధవి కూడా దాదాపు పెళ్ళి కూతు ళ్ళనిపించేట్లే ఉన్నారు. బుగ్గన చుక్క ఒక్కటి లోపించింది. మిగతా అలంకరణ ముగ్గురిదీ ఒకే రకంగా ఉంది. చామన ఛాయ రూపమైనా, లక్షణమైన కనుముక్కు తీరుతో, సన్నగా పీలగా కన్పించే శాంతలో ఏదో హుందాతనం, నిండుదనం కన్పిస్తున్నాయి. పెళ్ళి పేరు చెబితేనే ఆడపిల్లలకు ఓ రకమైన అణకువతో కూడిన అందం ముఖాల్లో ప్రతిఫలిస్తుందేమో ! కన్నార్పకుండా చూస్తూండిపోయారు చంద్రం, శేఖర్‌లు. ముందుకు వచ్చిన మాధవి, చంద్రం కళ్ళదగ్గర చెయ్యిపెట్టి అటూ యిటూ కదిపింది.

"బావా ! ఏవిటా చూపు ? దిష్టి తగులుతుంది" అంటూ. "ఎవరికే, నీకా ?" అంటూ జడ పట్టుకోబోయిన చంద్రాన్ని తప్పించుకొని ముందుకు పరుగెట్టి, "ఎవరికి తగలాలో వాళ్ళకే తగులుతుంది. మధ్య నా కెందుకు తగులుతుందీ ?" అంది మెల్లగా నవ్వుతూ క్రీగంట సుషమను చూస్తూ.

గోపాలంగారు పోయాక అన్ని రోజులకు మళ్ళీ చంద్రం, మాధవీ అలా సరదాగా మాట్లాడుకో గలిగారు. కబుర్లతో, జోక్స్‌తో ఆ రోజంతా సరదాగా గడిచిపోయింది. భోజనాలైన తర్వాత శిరీష్ తా నా మధ్య వ్రాసిన భావగీతాలు కొన్ని పాడి వినిపించాడు. మాధవి అవి తనకు రాసివ్వమని కోరింది. మరో శుభవార్త కూడా చెప్పాడు. తనకు రిసర్చి యిన్‌స్టిట్యూట్‌లో జాబ్ దొరికిందని, కలకత్తాలోనే పోస్టింగ్ వచ్చిందని.

శాంత పెళ్ళి ఉన్నంతలో వైభవంగానే చేశాడు చంద్రం ... సుషమ, మాధవీ వడ్డనల దగ్గరనుంచీ పూనుకొని పెళ్ళికి కావల్సినవి అందించడం, పై వారికి మర్యాదలు చేయడంవరకూ అన్ని పనులూ ఆ యింటి ఆడబడుచుల్లానో, కోడళ్ళలానో చేశారు. పెళ్ళి కొచ్చినవాళ్ళంతా వాళ్ళిద్దరి గురించీ అడిగేవాళ్ళే. మాధవి, చంద్రం మరదలని తెలిసి మామూలు ఆనవాయితీ ప్రకారం చంద్రం పెళ్ళిచేసుకుంటాడని ఊహాగానాలు చెయ్యడమే కాకుండా కొందరు, "ఏం చంద్రం ! చెల్లెలి పెళ్ళితో పాటు నీదీ కానిచ్చేయలేకపోయావా ? ఖర్చులోఖర్చు కలిసొచ్చేదిగా అందమైన మరదలు రెడీగానే ఉందె," అంటూ వేళాకోళా లాడటం మొదలెట్టారు.

ఆ మాటలు విన్న నలుగురూ నాలుగు రకాలుగా బాధపడ్డారు. సుషమ ఓ రకంగా, మాధవి మరోరకంగా, శేఖర్ ఒక రకంగా, చంద్రం మరో రకంగా. ఎవళ్ళ మనోభావాలు వాళ్ళు మనసుల్లోనే దాచుకొని మథనపడ్డారు. ఆ ప్రసంగం వాళ్ళముందు వచ్చినప్పుడల్లా పెద్దల్ని ఏవీ అనలేక నవ్వుతూ

అక్కడినుంచి తప్పుకునేవాడు చంద్రం. మాధవి కూడా ఆ పరిసరాలకు దూరంగా పారిపోయేది. తప్పనిసరైన శేఖర్, సుషమ ఆ మాటల్ని వినవలసి వచ్చేది.

పెళ్ళినాటికి అన్నమాట ప్రకారం శ్రీధర్‌గారు వచ్చారు. బస్‌స్టాండ్‌కు స్వయంగా వెళ్ళి తీసుకొచ్చాడు చంద్రం, అన్నిపనుల్లో సతమత మౌతున్నాసరే. తీసుకొచ్చి మొదట తల్లినీ, శాంతనూ పరిచయం చేశాడు. "మావయ్యగారికి నమస్కరించమ్మా" అని చెల్లెలిచేత పాదాభివందనం చేయించాడు. శ్రీధర్‌గారు, ఆ కుటుంబ మర్యాద, ముఖ్యంగా చంద్రం అణకువ, నేర్పుగా పనులు చేసుకొనే పద్ధతులూ చూసి ముచ్చటపడ్డారు. సాయంత్రం పెళ్ళిముహూర్తం రాగానే భోజనాలు కానిచ్చి శేఖర్‌ను తీసుకొని వాళ్ళింటికి బయలుదేరి వెళ్ళారు. తండ్రి ననుసరించబోయిన సుషమను జడపట్టి లాగి కూర్చోబెట్టింది మధు. "నువ్వేం చేస్తావు వెళ్ళి ? పెద్దవాళ్ళంతా ఏవో కబుర్లు చెప్పుకుంటారు, నువ్వెందు కక్కడికి?" అంటూ.

సుషమ, మాధవిల మధ్య ఈసారి మరీ చనువేర్పడింది. సుషమ తన మనసు మాధవిదగ్గర దాచుకోలేదు. మాధవి మనసేవిటో తెల్సుకోకుండా వదల్లేదు. వచ్చిన రెండోరోజే మాధవి సుషమ కలిసి అలా వెళ్ళొస్తామని చెప్పి గంగాతీరానికి చేరుకున్నారు. చల్లగా వీచే గాలికి తలలూపుతూ స్వాగతం పలుకుతున్న గడ్డిపూల సోయగాలికి పరవశిస్తూ మెల్లగా తీరం చేరిన సుషమ, మధులు వాళ్ళ వాళ్ళ ఊహా లోకాల్లో మునిగిపోయారు కొంతసేపు.

నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ సుషమే అడిగింది మాధవిని. "మధూ ! నా మనసులో ఒక డౌట్ ఉండిపోయింది. డొంకతిరుగుడుగా మాట్లాడటం నాకు చాతకాదు. సూటిగా యిలా అడుగుతున్నందుకు ఏమీ అనుకోకు. చంద్రంగారు నిన్ను చేసుకుంటారని అత్తయ్యవాళ్ళంతా అనుకునేమాటనిజమేనా ?" సుషమ అంత నిష్కల్మషంగా, నిర్మలంగా నిలదీసి అడుగుతుంటే మాధవికి ముచ్చటేసింది. అదీకాక ముందుగానే సుషమ మనసు ఎరిగి ఉన్నదవడంవల్ల వంకర సమాధానాలు చెప్పి సుషమ మనసును బాధపెట్టదల్చుకోలేదు.

"లేదు సుషమా ! బావ నన్ను చేసుకోడు. నేను బావని చేసుకోను. అంతవరకూ అక్షరాల నిజం. 'ఎందుకని ?' అని తర్వాత ప్రశ్న వేస్తావు నాకు తెలుసు. మావయ్య బ్రతికుంటే ఎలా జరిగేదో చెప్పలేను కానీ ఇప్పట్లో బహుశా నేను ఎవ్వరినీ పెళ్ళి చేసుకొనే ప్రసక్తిలేదు. శ్యాం చదువు,

అత్తయ్య ఆశలు నామీదే వున్నాయి నేను స్కూలు నడుపుతున్న కారణం కూడా అదే. నా స్వార్థం నేను చూసుకుంటే యింకా ప్రపంచం సరిగ్గా తెలియనితమ్ముడిజీవితం, చరమాంకంలో ఒంటరిగా మిగిలిన అత్తయ్య, వాళ్ళనెవరు చూస్తారు? అందుకే యిప్పట్లో... బహుశా ఎప్పటికీ నా పెళ్ళి ప్రశ్నే రాదు," అంటూ కళ్ళు నిండుగా నిండిన కన్నీటిని కొనగోట చిమ్మి బయటకు రానీకుండాచేసి, "నా విషయం వదిలేయ్ సుషమా! నువ్వు చంద్రం బావని పెళ్ళి చేసుకుంటానంటే నాన్నగారు వొప్పుకుంటారా! ఆయన్ని ఒప్పించగల నమ్మకముంటే, నువ్వు నిజంగా అదృష్టవంతురాలివి. బావ నిన్ను పువ్వుల్లో పెట్టి చూసుకుంటాడు. ఆతవరకూ నమ్మకంగా చెప్పగలను" అంది మాధవి. సుషమ కళ్ళు కూడా నీటితో నిండిపోయాయి.

"మధూ! నన్ను గురించి యింత ధైర్యంగా నమ్మకంగా చెబుతున్నావు. మరి నీ భవిష్యత్ ఏవిటని ఎప్పుడైనా ఆలోచించావా! ఎంతకాలం అలా వొంటరిగా వుంటావు? దీని కేదో పరిష్కార మాలోచించాలి మధూ!" అంది సుషమ. "పరిష్కారం తీరిగ్గా ఆలోచిద్దువుగాని పద, చాలా సేపైంది. పాపం! శాంత ఒక్కతే మనకోసం ఎదురుచూస్తూ కూర్చొని ఉంటుంది. వెళ్దాం." అంటూ లేచింది మాధవి, చిరునవ్వు నవ్వుతూ.

"వదినా! మధూ! అన్నయ్యా పిలుస్తున్నాడు" అంటూ నవ్వుతూ వచ్చింది శాంత.

బయటకు వెళ్ళిన మాధవికి చంద్రం ఎక్కడా కన్పించలేదు. పందిట్లో అంతటా వెతుకుతున్న మాధవికి ఎదురుగా శేఖర్ కన్పించాడు. "బావెక్కడికి వెళ్ళాడు?" అని శేఖర్నే అడిగింది.

"ఏం? యింత శాల్తీని నేను నీకు యిక్కడ కన్పించడం లేదా? పిలిచిందీ యీ బావే... శాంత చెప్పలా?" అంటూ చిలిపిగా నవ్వుతున్న శేఖర్ని చూసి తనూ చిన్నగా నవ్వుతూ "ఏం కావాలి?" అంది. "ఏదడిగితే అది యిస్తావేమిటి?" అనగానే వెనుదిరిగిన మధుని ఆపుతూ "ప్రస్తుతానికి ఓ కప్పు కాఫీ కావాలి మేడమ్, తల బద్దలు కొట్టుకుపోతోంది. కేకలు వేసి యీ పని వాళ్ళతో చేయించేసరికి. స్పెషల్ కాఫీ కావాలి. అందుకే నిన్ను పిలవమని శాంతకు చెప్పాను," అన్నాడు. పెళ్ళి పనులతో అలిసినట్లు బరువుగా వున్న ఆ కనురెప్పల సోయగాన్ని తనవితీరా చూస్తూ, రెప్పలు క్రిందకు వాల్చినా శేఖర్ కళ్ళు తన కళ్ళవైపు చూడటం తెలిసిపోతూనే వుంది మధుకు నెమ్మదిగా అక్కడినుంచి కదులుతూ "యిప్పుడే తెస్తాను." అంటూ వెనుదిరిగిన మధుకు ఎదురుగా శిరీష్ కనిపించాడు.

"దేవీ! ఆమాకోఫీదేబేన్" స్టైల్గా

బెంగాలీలో వంగి సలామ్ చేస్తున్న శిరీష్‌ను చూసి చిన్నగా నవ్వుతూ "హాం" అంటూ లోపలి కెళ్ళిపోయింది మాధవి. పది నిముషాల్లో చిక్కని కాఫీ తీసుకొచ్చి శేఖర్‌కూ, శిరీష్‌కూ యిచ్చింది.

ఇంతలో ఎక్కడినుంచో వచ్చిన చంద్రం, "మధూ! నాకూ ఓ కప్పు కాఫీ యివ్వమ్మా! చాలా తల నొప్పిగా వుంది." అన్నాడు కణతలు నొక్కుకుంటూ. ఎందుకో చంద్రం చాలా ఉదాసీనంగా ఉన్నట్లనిపించింది మాధవికి. వెంటనే లోపలి కెళ్ళి మరో కప్పు కాఫీ తీసుకొచ్చి చంద్రాని కిచ్చింది. కప్పు చేతపట్టుకొని ఆలోచనలో మునిగిపోయాడు చంద్రం. చంద్రం అంత స్తబ్దుగా అయిపోవడానికి కారణ మేవిటో తెలీక మధువైపు చూశాడు ప్రశ్నార్థకంగా. మధుకూడా అయోమయంగా చూస్తోంది. అంతలో సుషమ వచ్చి "అన్నయ్యా! నాన్నగారు పిలుస్తున్నారు" అంటూ శిరీష్‌ను పిలుచుకువెళ్ళింది. శేఖర్‌కూ మధూకు విషయ మేవిటో తెలుసుకోవాలని ఆతృతగా వుంది. చివరికి ధైర్యంచేసి మధూయే అడిగింది.

"ఏవిటి బావా అదోలా వున్నావు?" అంతకంటే యింకేమీ అనలేక పోయింది. కప్పు ప్రక్కన పెట్టి ఓసారి శేఖర్‌వైపు, మధువైపు చూసి, "మీ రిద్దరూ నాతో వోసారి రండి," అంటూ ముందుకు నడిచాడు. తన లైబ్రరీ గది లోకి తీసుకెళ్ళి లోపల గడియవేశాడు. శేఖర్‌కు ఆరాటం అధికమైంది. "చందూ! ఏవిటిరా తొందరగా చెప్పరాదూ?" అన్నాడు. వాళ్ళను కూర్చోమని సైగ చేస్తూ, తనూ కూర్చొని "ఏమీ లేదురా! ఇంవాక ఎవరో వచ్చి రాజేశ్వర్ ఫ్రండ్ నని చెప్పాడు. లోపలికి పిలిచి మర్యాద చేశాము. ఉండండి ఎవరినైనా మీతో పంపుతాను విడిదిల్లు చూపిస్తారు" అని అతనితో మాట్లాడుతుండగానే ఎవరో వచ్చి పిలిస్తే "యిప్పుడే వస్తాను మీరు కూర్చోండి ఎవరినైనా మీతో పంపుతాను" అని చెప్పి వెనక పందిళ్లువేసే దగ్గరకు వెళ్ళాను. పనివాళ్ళ కవన్నీ ఎలా పెంచివేయాలో చెప్పి పది నిముషాల్లో బయటకు వచ్చాను. నే వచ్చేసరికి అతను లేడు. తను కూర్చున్న దగ్గర ఓ లెటర్ వ్రాసిపెట్టి వుంది. చూడండి అది ఎలా వుందో!" అంటూ ఓ లెటర్ శేఖర్ చేతికిచ్చాడు. శేఖర్ చదివి మధు కిచ్చాడు. వణుకుతున్న చేతుల్తో లెటర్ అందుకొని నెమ్మదిగా చదువుకుంది మధు. వెంటనే భయంగా చంద్రంవైపు చూస్తూ "యిప్పుడేం చేద్దాం బావా?" అంది.


"ఏవిటి మధూ! నీకూ వాడిలా పిచ్చెక్కిందా? ఎవరో వోర్వలేనివాళ్లు

ఏదో చేస్తుంటాయి అంతమాత్రాన మనం అవన్నీ నమ్మితే ఎలా? అంటున్న శేఖర్‌ను మధ్యలోనే ఆపుతూ "లేదు శేఖర్ నేను కూడా యివన్ని నమ్మటం లేదు. అయితే దీనివల్ల రాజేశ్వర్ శత్రవు లెవరో యీ పెళ్ళి ఆపాలని గట్టిప్రయత్నంలో వున్నట్లు తెలుస్తోంది. నేను అంతటా వాకబు చేసే ఈ సంబంధాన్ని కుదిర్చాను. రాజేశ్వర్ తాగుతాడనీ జూదరనీ యింకా ఏవిటేమిటో వ్రాశాడు వాడు. అవన్ని నేను నమ్మ లేదు. కానీ ఆ శత్రువులెవరో తెలియాలి. వాడికోసం మళ్ళీ మన బజారంతా వెతికాను. ఎక్కడా కన్పించలేదు. అంతలోనే ఎటు మాయ మయ్యాడో అర్థంకావడంలేదు. వాడి పేరేవిటో చెప్పాడురా! అయినా వాడు అసలు పేరు చెప్పాడని నమ్మక మేవిటిలే! లక్షణంగా వున్నంతలో ఘనంగా శాంత పెళ్ళి చేయాలనుకుంటుంటే మధ్యలో ఈ అవాంతర మేమిటాని? మనస్సు కొంత అదుపు తప్పిన మాట నిజమే. అయినా మనకు రాజేశేఖర్ తెలుసు. వాడొట్టి అమాయకుడు, విన్నంతలో రాజేశ్వర్ కూడా చాలా నెమ్మదైన కుర్రాడనీ తెలివికలవాడనీ విన్నాను నువే మంటావురా?

"అనడాని కేముందిరా చందూ పీటలమీద పెళ్ళి ఆపు చేయాల దురుకిద్ది పుట్టిన వాళ్ళెవరో సామాన్యులై వుండరు. ఈ విషయం రాజేశ్వర్ వాళ్ళను హెచ్చరించడం ఎందుకైన మంచిది. ఈ లెటర్ తీసుకెళ్ళి రామేశ్వర్ వాళ్ళ కివ్వు. ఏమంటారో చూద్దాం నువ్వు అనవసరమైన అనుమానాలు పెట్టుకొని, ఆలోచించి, బుర్ర పాడు చేసుకోకు. అంతా సక్రమంగా జరుగ తుంది. పద అంతా మనకోసం చూస్తుం టారు." అంటూ తలుపు గడియ తీసి ముందుకు నడిచాడు శేఖర్. మౌనంగా చంద్రం అనుసరించాడు. వెనక్కు తిరిగి "మధూ! అనవసరంగా యీ మాటలు మనసులో పెట్టుకోకు, ఎవరి తోనూ అనకు." అంటూ వెళ్ళిపోయాడు శేఖర్. శిలాప్రతిమలా నిలబడి వాళ్ళ మాటలు విని అర్థంచేసుకోడానికి ప్రయత్నిస్తున్న మధు, సుషమపిలుపుతో యీ లోకంలోకి వచ్చి సుషమ ననుస రించి లోపలి కెళ్ళింది. విడిదింటికి ఫల హారాలు పంపే ప్రయత్నంలో మునిగి పోయారు సుషమా, మాధవీ.

(సశేషం)

Printed and Published by A. Chandra Sekar Rao at 5-9-88, Public Garden Road Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor : A. SUDHAKARA RAO



పొట్టబండ్ల విజయలక్ష్మి

# ప్రేమవాహిని

చంద్రం రామేశ్వర్‌ను కలిసి విషయం వివరించి, లెటర్ చూపించాడు. ఆ లెటర్ చూడగానే వుగ్రనరసింహావతార మెత్తారు కృష్ణయ్యచౌదరిగారు. ఆ లెటర్ వాళ్ళ బంధువుల్లో ఎవరూ వ్రాసి వుండ రనే విషయం స్పష్టమైంది. లోంపూర్ మున్సబుకూ, కృష్ణయ్యగార్కి మొదటి నుంచీ స్పర్థలున్నాయి. మామూలు గ్రామ రాజకీయాల్లో ఒక భాగంగా పెద్ద వాళ్ళ శతృత్వాలు పిల్లలకూ వార సత్వంగా అబ్బాయి. మున్సబుగారి అబ్బాయి కుమార్‌కూ, రాజేశ్వర్‌కూ ప్రతి విషయంలోనూ పందాలూ, పట్టు దలలూ వున్నాయి. ఇద్దరూ ఒకేసారి కాలేజీలో చేరారు. అక్కడా తమ ఆధి కృతను నిలుపుకోడానికి ఆ రెండు సంవ త్సరాల్లోనే కావల్సినంత హంగామా చేశారు. ఆఖరికి చదువుకు స్వస్తివాచకం పలకడంకూడా ఒకేసారి జరిగింది. ఇంటి పూళ్లో చేరిన దగ్గరనుంచీ వ్యాపారం మొదలెట్టాలని రాజేశ్వర్ ప్రయత్నిస్తుంటే తనూ వ్యాపారమే చేయాలని పట్టుదలగా వున్నాడు కుమార్. లెటర్ చూడగానే అది కుమార్ పనే అయ్యుంటుందని తేల్చేశాడు రాజేశ్వర్. సందేహాలు తీరి పోయాయి. గ్రామాల్లో వుండే మామూలు రాజకీయాల్లో ఒక భాగంగా రాజేశ్వర్ పెళ్ళి ప్రయత్నం జరిగింది. విషయం విశదంకాపడంతో అంతా కుదుటపడ్డ హృదయాలతో ఆనందంగా పెళ్ళి

సందర్భో పాల్గొన్నారు. రాంపూర్ గ్రామస్థులు కొందరు పెళ్ళికి వచ్చినవారు మున్సబ్ మీద ప్రచారానికి మరోఆయుధం దొరికిందని తలచి సంతోషపడ్డారు.

కాంత పెళ్లిలో వుత్సాహంగా పరుగులు తీస్తూ అన్ని పనులూ అవలీలగా సమర్ధించుకుపోతున్న మధు చాలామందిని ఆకర్షించింది. అలాగే శ్రీధర్‌గారిని కూడా పరిచయమైన క్షణంనుంచీ ఆత్మీయంగా పలకరిస్తూ ఆయనకు కావలసినవన్నీ టైమ్‌కు అందజేస్తూ ఆయన అభిమానానికి పాత్రురాలైంది.

"బాబుగారూ! మీకు కాఫీ తెమ్మంటారా? టీ తెమ్మంటారా?" అని అడుగుతున్న మధును చూసి ముచ్చటపడి "చూడమ్మా! నన్ను బాబుగారూ అని పిలవకు. నీ యిష్టమొచ్చిన వరసతో పిలువు, పలుకుతాను" అంటూ చిన్నగా నవ్వుతున్న శ్రీధర్‌గారి మాటల్లోని ఆప్యాయతకు మధు మనసు కరిగిపోయింది. అలాగే చూస్తున్న మధుని చూసి, "బాబుగారూ! అని పిలిస్తే నేను మీకు చాలా పరాయివాడిననే ఫీలింగ్ వస్తోందమ్మా! అందుకని" అంటున్న ఆయన మాటలను మధ్యలోనే ఆపుతూ, "అలాగే మావయ్యగారూ!" అంటూ ముందుకు కదిలిన మధుని పిలిచి "మళ్ళీ మావయ్యగారు! ఎందుకమ్మా? మావయ్య అను చాలు" అంటున్న శ్రీధర్ మాటలకు ఒక్కసారి చనిపోయిన గోపాలం మావయ్య గుర్తొచ్చి కళ్ళు నీటితో నిండిపోయాయి మధుకి...

...మొట్టమొదటిసారిగా గోపాలంగారు కలకత్తా వెళ్ళినప్పుడు కొత్తగా చూసిన ఆయన్ని చనువుగా పిలవడానికి భయపడి "మావయ్యగారూ" అంటూ ఏదో చెప్పబోయిన మాధవిని దగ్గరకు తీసుకొని "మధూ! మావయ్య అని పిలువమ్మా చాలు" అంటూ తల నిమిరిన గోపాలం మావయ్య ఆత్మీయతలోని మాధుర్యం గుర్తొచ్చింది. మళ్ళీ ...అలా పిలిపించుకుంటున్న శ్రీధర్‌గారికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకుంటూ కళ్ళలో నిండిన నీరు క్రిందికి జారకుండా అతి ప్రయత్నం మీద నవ్వడానికి ప్రయత్నిస్తూ "కాఫీ తెస్తాను మావయ్యా!" అంటూ లోపలికి పరుగెత్తింది మాధవి.

అలా పరుగెత్తుతున్న మాధవిని చూస్తుంటే ఎవరో స్మృతిపథంలో మెదిలారు శ్రీధర్‌గారికి. మాధవిని చూస్తుంటే ఏదో తెలీని ఆత్మీయత కలుగుతోంది. ఆ చిన్న ముఖంలో తొంగిచూసే అమాయకత్వం, దానితో పోటీపడే గంభీరత, కార్యదీక్ష, అంతలో చిలిపితనం చిందులువేసే ఆ ముఖం, ఎప్పుడో ఎక్కడో తనకు బాగా పరిచయమైంది

శ్రీధర్‌గారి ఆలోచనలు ఇరవై అయిదు సంవత్సరాలు వెనక్కు పరుగులు

వచ్చిన రాంతో సరిగ్గా మాట్లాడను తీశాయి. అప్పుడు తాను ఎమ్.ఎ. చదువుతుండగా తనకు జూనియర్‌గా పరిచయమయ్యాడు శ్రీరాం. అతనూ హాస్టల్‌లో తనతోపాటు వుండటమేకాక తన రూమ్‌మేట్ కూడా కావడంవల్ల, చాలా కొద్దిరోజుల్లోనే తమ యిద్దరి మధ్యా పరిచయం స్నేహంగా మారింది. ప్రాణ స్నేహితులంటే వాళ్ళే అని నిర్వచనం చెప్పగలంత గొప్పగాసాగింది తమ స్నేహం. వాళ్ళిద్దరూ జంటగా వెళుతుంటే చూసిన మిగతా ఫ్రెండ్స్ "కృష్ణార్జునులు వెళుతున్నార్రోయ్" అని కేకలు వేసేవారు. తాము వాళ్ళమాటలు వింటూ సరదాగా నవ్వుకునేవాళ్ళు. శ్రీధర్ "ఒరేయ్ రాం! నేను నీకంటే సీనియర్‌ను, పెద్దవాడిని కనుక నేను కృష్ణుణ్ణి, నువ్వు అర్జునుడివి సమ్మత మేనా ?" అంటే "అరేయ్ శ్రీ. అనవస రంగా చిక్కులో పడిపోతున్నావు. సుభద్రను వెదికే పూచీ నీదే అవుతుంది జాగ్రత్త !" అని బెదిరించేవాడు శ్రీరాం. "నాకు చెల్లెళ్ళుంటే సంతో షంగా యిచ్చేవాడినిరా ! కానీ నా దురదృష్టం. నాకు చెల్లెలు లేదు నీకా అదృష్టంలేదు" అని నవ్వేసేవాడు శ్రీధర్. ఎటు వెళ్ళినా సరదాగా యిద్దరూ కలిసి వెళుతుండేవారు. వాళ్ళ స్నేహాన్ని గురించి కాలేజిలో కథలుగా చెప్పుకునేవారు. ఒకళ్ళకోసం మరొకరు ప్రాణమివ్వడానికైనా సిద్ధమే అని. అను కోకుండా జరిగిన ఓ సంఘటన వాళ్ళి ద్దరినీ ఒకళ్ళ విషయాలు ఒకళ్ళు తెలుసుకోలేనంత దూరంగా విసిరేసింది.

కాలేజి బ్యూటీగా పేరుతెచ్చుకున్న బిందు వాళ్ళిద్దరి మధ్యా అడ్డుగోడగా నిలిచింది. శ్రీధర్‌తో కావాలని పరిచయం పెంచుకొని ఏ కొంచెం టైమ్ దొరికినా అతన్ని తమ యింటికి ఆహ్వా నించడం, అతనితో కబుర్లు, సినిమాలు, షికార్లు వీటితో శ్రీధర్‌ని పూర్తిగా పిచ్చి వాడిని చేసింది. అతనికి బిందు తప్ప మరోలోకం తెలీనంతగా మారిపోయాడు. ఆ విషయంలో హెచ్చరించబోయిన రాంను కసురుకున్నాడు. బిందు సలహా మీద హాస్టల్ వదిలి వేరే రూమ్ తీసు కున్నాడు. విచ్చలవిడిగా తిరిగేవారు. కాలేజి ఎగ్గొట్టి సినిమాలూ, షికార్లు చేసిన రోజులెన్నో. అన్నదమ్ముల్లా మెలిగిన శ్రీరాం, శ్రీధర్‌లు ఒకరిని చూసి ఒకళ్ళు తప్పుకు తిరగటం మొద లెట్టారు. ఏదో తప్పుచేస్తున్నట్లు మన సులో బాధగా వున్నా ఏనాడూ మనసు విప్పి మాట్లాడుకోడానికి ప్రయత్నించ లేదు శ్రీధర్. ఆ రోజుల్లోనే బి యే. పూర్తి కాకుండానే కాలేజి వదిలేశాడు శ్రీరాం. ఎందుకు వెళ్ళిందీ ఎక్కడికి వెళ్ళిందీ శ్రీధర్ కిప్పటివరకూ తెలీదు.

చివరిసారిగా తనను చూడటానికి

కూడా మాట్లాడకుండా బిందు రాగానే "సారీ ! బ్రదర్, మళ్ళీ కలుద్దాం !" అంటూ బిందు ప్రక్కనే కార్లో కూర్చుని వెళ్ళిపోయాడు తాను. కానీ యింతవరకు మళ్ళీ రాంను చూడలేకపోయాడు. అదే ఆఖరి కలయిక అవుతుందని తను అనుకోలేదు. ఆ రోజు కళ్ళ నిండుగా మెరుస్తుంటే సరిగ్గా యిలాగే...... మధులాగే నవ్వడానికి ప్రయత్నిస్తూ "ఫర్వాలేదు శ్రీ-గుడ్ బై అండ్ గుడ్ లక్ టు యు" అంటూ వెళ్ళిపోయాడు తడబడే అడుగులతో. అలా వెళ్ళిపో తున్న రాంను చూసి వెంటనే కారు దిగి వాడితోపాటు నడిచివెళ్ళాలనే బలమైన కోరిక బిందు చల్లటి చేయి చేతికి తగల గానే మంచులా కరిగిపోయింది. దుమ్ము రేపుకుంటూ పరుగెడుతున్న కారు తన దృష్టినుంచి దూరంచేసింది రాంను. ఆ తర్వాత మళ్ళీ యింతవరకూ రాంను కలవలేదు. ఏమయ్యాడో? ఎలావున్నాడో కూడా తెలీదు.

కానీ యీ రోజు మళ్ళీ యిన్ని సంవత్సరాలకు మధు ముఖంలో తన ప్రాణమిత్రుడు రాం కనిపిస్తుంటే మనస్సు వశం తప్పింది. ఆలోచనల్లో వెనకటి స్మృతుల్లో మునిగి జ్ఞాపకాల పుటలు తిరగేస్తూ కళ్ళు మూసుకున్న శ్రీధర్ కళ్ళనుంచి అప్రయత్నంగా అప్పటి తమ స్నేహ మాధుర్యాన్ని తలుచుకొని, తమ స్నేహ మెంతటిదో తాను విడదీసి చూపిస్తానని కంకణం కట్టుకొని, తనతో ప్రేమ నాటకమాడిన బిందు తనను రాంను విడదీసి, తనూ దూరమైపోవడం జ్ఞాపకంవచ్చి, రాం మాటలు పెడచెవిని పెట్టి స్నేహమాధు ర్యాన్ని కాదని ప్రేమతరంగాల్లో తేలి పోవాలని కలలు కని, రెంటికీ చెడ్డ తన అవివేకం తలచుకొని రెండు కన్నీటి బిందువులు చెంపల మీదగా జారాయి.

* * *

అంతలో హడావుడిగా లోపలినుంచీ కాఫీ పట్టుకొచ్చిన మధు, "మావయ్యా ! కాఫీ రెడీ !" అంటూ స్టూల్ ముందుకు జరిపి గ్లాస్ స్టూల్‌మీద వుంచి శ్రీధర్ వైపు నవ్వుతూ చూడబోయి హడావిడిగా కర్చీఫ్‌తో కళ్ళద్దుకుంటున్న శ్రీధర్‌ను విచిత్రంగా చూసింది. కారణం అడిగే చనువూ ధైర్యం లేకపోవడంవల్ల నెమ్మ దిగా మౌనంగా లోపలికి దారితీసింది

"మధూ !" పిలుపు...ఆ పిలుపు లోని ఆప్యాయత మాధవి అంతరం గాన్ని సృజించి మరుగున పడిన జ్ఞాపకాల్ని వెలికితీసినట్లయింది. తండ్రి బ్రతికుండగా తనని అలాగే పిలిచే వాడు. వెనుదిరిగి శ్రీధర్ వైపుచూసిన మధు కళ్ళ నిండుగా నీళ్ళున్నాయి. ఖంగారుపడిన శ్రీధర్ "ఏమిటమ్మా ? ఎందు కలావున్నావు. నేనేమైనా అన్నానా పొరబాటుగా ?" అన్నాడు. తొందరగా

శ్రీధర్ కుర్చీదగ్గరకు వచ్చి మోకాళ్ళ మీద కూర్చొని కుర్చీకి తలానించి "మావయ్యా! మరోసారి పిలవండలాగ! మరోసారి పిలవండి" అంటున్న మధు గొంతు వొణుకుతుండగా వెక్కి వెక్కి ఏడుస్తూ శ్రీధర్‌వైపు చూసింది. ఆర్ద్రమౌతున్న హృదయాన్ని చిక్కబట్టుకుంటూ "ఏవిటి మధూ! ఎందుకలా ఐపోతున్నావు? చెప్పమ్మా?" అంటూ బుజ్జగింపుగా అడుగుతున్న శ్రీధర్ చేతుల్లో వొరిగి పోయింది.

"మావయ్యా! మా నాన్నగారు నన్నలా పిల్చేవారు. మళ్ళీ మీరలా పిలుస్తుంటే మా నాన్నే తిరిగివచ్చి పిలిచినట్లయింది" అంది మాధవి ఏడుస్తూ. ఆమెను ప్రక్కన కుర్చీలో కూర్చోబెట్టుకుంటూ "మీ నాన్నగారి పేరేమిటమ్మా! చంద్రం ఏదో మాటల సందర్భంలో ట్రాం యాక్సిడెంట్‌లో పోయారనీ కలకత్తాలోనే వుండేవారనీ చెప్పాడు. నేను కలకత్తా వచ్చిపదేళ్ళపైనే అయింది. మీరు ఎక్కడ వుండేవాళ్ళు?" అన్నాడు శ్రీధర్.

"మేము బాలీగంజ్‌లో వుండే వాళ్ళం. మా నాన్నగారి పేరు శ్రీరాం. ఇన్‌కమ్‌టాక్స్ ఆఫీసులో పనిచేసేవారు" అంది మాధవి.

శ్రీరాం...శ్రీరాం...ఆ పేరు పదే పదే చెవుల్లో మారుమ్రోగుతున్నట్లైంది. శ్రీధర్ మనసులోవున్న సందేహం తీరి పోయింది. మాధవి అచ్చు రాం పోలికలతో వుండటంవల్ల ఆ ముఖం తనకు ఎంతో కాలంగా పరిచయమైనదిగానూ, ఆత్మీయంగానూ అన్పించడం చూసి శ్రీధర్‌కు ఆశ్చర్యమేసింది. తన ప్రియ మిత్రుడు చనిపోయాడా? పిల్లలను దిక్కులేని వాళ్ళను చేసి, ఆ వూహే భరించరానిదిగా వుంది శ్రీధర్‌కు. కానీ అక్షరాల నిజమై మాధవి రూపంలో ఎదురుగా కన్పిస్తుంటే ఎలా కాదనడం? అలాగని మాధవి ముందు బయటపడటానికి తన మన స్సంగీకరించడంలేదు.

"నేనలా రఘుపతిగారింటి కెళ్ళొస్తానమ్మా! జరిగిపోయిన విషయాలు పదే పదే జ్ఞాపకంచేసుకొంటూ బాధపడకు. మీ నాన్నగార్ని నీకు తిరిగి యివ్వలేక పోయినా యీ మావయ్య ఒకడున్నాడని గుర్తుచేసుకోమ్మా!" అంటూ ఆర్ద్రమౌతున్న గొంతుతో మాధవి తల నిమిరి, నెమ్మదిగా లేచి బయటకు అడుగులు వేశారు శ్రీధర్. భారంగా అడుగులు వేస్తూ వెళ్ళిపోతున్న శ్రీధర్‌లో తన జీవితంనుంచీ తప్పుకున్న యిద్దరు అతి ముఖ్యులైన ఆత్మీయుల్ని చూసి కన్నీళ్ళు తుడుచుకుంటూ లోపలికెళ్ళింది మాధవి.

* * *

శాంత పెళ్ళి వైభవంగా జరిగి పోయింది. వచ్చిన బంధువులందరూ

ఒక్కొక్కరే సామాన్లు సర్దుకొని ప్రయాణమౌతున్నారు. ఆ రాత్రిబండికి వెళ్ళిపోవాలని శ్రీధర్‌గారు, సుషమ, శిరీష్ ప్రయాణమౌతున్నారు. చంద్రం మరో రెండురోజు లాగమని బలవంతం చేస్తున్నాడు.

"మళ్ళీ నీ పెళ్ళికి వస్తాంలేవోయ్ ! శలవుల్లేవు నాకు" అంటున్న శ్రీధర్ వైపుచూసిన మాధవి యిదే సమయ మనుకొని "సుషమ పెళ్ళెప్పుడు మావయ్యా ?" అంది. "నీ పెళ్ళైన తర్వాతమ్మా !" అన్నాడు శ్రీధర్ చిన్నగా నవ్వుతూ. "పోండి మావయ్యా! నాతో పెట్టుకుంటే యిక సుషమ పెళ్ళి అయినట్లే... నేనొక సంబంధం చూశా సుషమకు, చెప్పనా ?" అంటుంటే చంద్రం సుషమ, శిరీష్ ఆశ్చర్యంగా చూశారు మాధవి వైపు. విచిత్రంగా కళ్ళుతిప్పుతూ, "ఆహా ! యిప్పుడుకాదు. వివరంగా మీకు వుత్తరం వ్రాస్తాను. ప్రస్తుతానికి సస్పెన్స్" అంది మళ్ళీ.

"సరే అలాగే తప్పకుండా లెటర్ వ్రాయి. అందులోనే నీ సంబంధం విషయంకూడా వ్రాస్తే రెండూ ఒక్కసారే చేసేయొచ్చు. ఏవోయ్ చంద్రం ?" అన్నాడు నవ్వుతూ శ్రీధర్. ఏం సమాధానం చెప్పాలో తెలీక అయోమ యంగా నవ్వాడు చంద్రం. ఆ నవ్వు ఆ తత్తరపాటు చూసి శిరీష్‌కూ, సుషమకు, మాధవికీ, శ్రీధర్‌గారికీ నవ్వాగలేదు. అంతా పెద్దగా నవ్వేశారు.

అప్పుడే లోపలికొస్తున్న శేఖర్ "ఏవిటి అంకుల్ ! నవ్వుల పువ్వులు కురుస్తున్నా యేవిటి కథ?" అని అడుగు తుంటే యింకా బెదురు బెదురుగా చూస్తూ తనూ నవ్వడానికి ప్రయత్నిస్తున్న ట్లున్న చంద్రాన్ని చూపించింది సుషమ. శేఖర్‌కూడా నవ్వి, "ఒరేయ్ చందూ, ఏవిటిరా అలా తెల్లముఖం వేశావ్ ?" అంకుల్ చేతిలో చిక్కావంటే చిత్తయి పోయావన్నమాటే..." అంటుండగానే "అన్నట్లు నీ పెళ్ళెప్పుడోయ్ ?" అని అడిగారు శ్రీధర్‌గారు శేఖర్ వైపు తిరిగి. బాంబు తన మీద పేలేసరికి ఏం చెప్పాలో తెలీక తికమకపడుతున్న శేఖర్‌ను చూసి యీసారి నవ్వడం చంద్రం వంతైంది. అందరూ సరదాగా నవ్వుతూ ఏవో కబుర్లు చెప్పుకుంటుండ గానే రావయ్య "బాబుగారూ ! టైమైనా దండీ," అంటూ లోపలికొచ్చాడు, అందరి దగ్గరా శలవు తీసుకొని శ్రీధర్, శిరీష్, సుషమా కలకత్తా వెళ్ళిపోయారు. సుషమ మనసు గంగాపూర్‌లో వదిలేసి తనువు మట్టుకు తప్పనిసరిగా కలకత్తా కదిలించింది.

మళ్ళీ మాధవి స్కూల్ కార్య క్రమాలు మామూలుగా నిరాటంకంగా సాగిపోతున్నాయి. శ్యాంకూడా శ్రద్ధగా చదువుతున్నాడు. శాంత అత్తవారింటికి

వెళ్ళిపోయింది. శిరీష్ ఉద్యోగంలో చేరినట్లు, శేఖర్‌కు చంద్రానికి లెటర్ వ్రాశాడు. సుషమ బి. యస్. సి. ఫైన లియర్‌కు వచ్చింది. చంద్రం, శేఖర్ లు మళ్ళీ పొలం పనుల్లో పడ్డారు. తాత్కాలి కంగా శేఖర్‌కు పెళ్ళి సంబంధాలు చూడటం ఆపేశారు రఘుపతిరావుగారు శ్యామలాదేవి మాటలవల్ల. అప్పుడప్పుడు మనస్సును మథిస్తున్న మాధవిని గురించిన మధురాలోచనలను ఆపలేక మధనపడుతున్నాడు శేఖర్.

ఆ రోజు పొలంనుంచి యింటికివచ్చి స్నానంచేసి, కాఫీ త్రాగి అలవాటు ప్రకారం గంగా తీరానికి బయలుదేరాడు శేఖర్. ఈ మూడు సంవత్సరాల్లో ఎంతో అభివృద్ధిని సాధించి చూపించాడు వ్యవసాయంలో. ఆ విషయంలో గంగాపూర్ ప్రజలందరూ శేఖర్‌ను దేవుడిలా తలుచుకుంటున్నారు. అత నొచ్చిన తర్వాతే ఏ గుర్తింపూలేకుండా వున్న తమ ఊరు, రాష్ట్రస్థాయిలో ఒక ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించ గలిగింది. అందుకు అహర్నిశలూ శ్రమ అనుకోకుండా జమిందారు బిడ్డైనా అందరితో కలసి పనిచేసిన శేఖర్ శ్రద్ధాశక్తులే కారణం. రఘుపతిరావు గారంటే భయంతోకూడి భక్తి గౌరవా లుంటే... శేఖరంటే చనువుతో కూడిన ప్రేమాభిమానాలు పెంచుకున్నారు గంగాపూర్ ప్రజలు.

అందరి అభిమానానికి పాత్రుడైనా శేఖర్‌కు బ్రతుకులో ఏదో వెలితి, లోపం అనిపిస్తోంది. ఇంట్లో అమ్మ సాధింపూ అలాగే వుంది. పాపం వాళ్ళ కోరికలు అసహజమైనవి కావు అందరిలాగే వాళ్లూ యింటికో లక్ష్మి కోడలుగా రావాలనీ, మనవడినీ, మనవరాల్ని ఎత్తు కోవాలనీ, వంశంపేరు నిలబెట్టే సంతానం కావాలనీ వుబలాటపడుతున్నారు. వాళ్ళ కోరికలు తీర్చడానికి వున్న ఒకే ఒక సాధనం శేఖర్. అందుకే అతని పెళ్ళి గురించి అంతగా ఆరాటపడుతున్నారు.

తనకూ పెళ్ళి చేసుకోవాలనే వుంది. కానీ తను మనసారా కోరుకునే మధు, బాధ్యతల బరువు లెత్తుకొని బాంధవ్యపు బంధాలకు బందీ అయింది. మనసు మహారణ్యంలా వుంది. ఆ అరణ్యరోదన ఎవరికీ వినిపించలేదు. తన బాధని అర్థంచేసుకొని ఓదార్చే ఆత్మీయుల్లేరు. ఆ ఊళ్ళో తను మనసు విప్పి ఏ విషయ మైనా చెప్పకోగల ఆత్మీయుడు, అప్తుడు చంద్రం. అయితే చంద్రంతో మధు విషయం ఎలా మాట్లాడగలడు? ఒకవేళ చందూ మధుని పెళ్ళి చేసుకోవాలనే అభిప్రాయంలో వుంటే... స్నేహితు డయ్యుండి తను అడ్డుపడ్డట్లవుతుందేమో.

చల్లటి సాయంత్రం. ప్రశాంతంగా పారే పవిత్ర గంగానదీ తరంగాలపై నుంచి వీచే చల్లటిగాలి ప్రశాంతంగా ప్రకృతి అందాల్ని ఆస్వాదించే ప్రశాం

తత మనసున లేనపుడు ఎంతటి ఏకాంత మైనా ఎంత సుందర, సుమధుర పరిసరాలైనా మనసును ఆకర్షించలేవు. శేఖర్‌కు అత్యంత ప్రియమైన ఆ గంగా నదీ, ఆ చల్లని పిల్లవాయువులు, పొలాల లోని పూలనుంచీ వచ్చే సుమధుర పరిమళాలు, ఎటు చూచినా పచ్చగా కనుల కింపుగా పెరిగిన తోటలు, పొలాలు, ఏవీ శేఖర్ మనసుకు శాంతి నివ్వలేకపోయాయి. శేఖర్ అలా ఆలోచనల్లో వుండగానే తెల్లటి బట్టల్లో పూలరంగడిలా మెరిసిపోతూ, చెరగని చిరునవ్వుతో హాయిగా నవ్వుతూ చంద్రం వచ్చాడు

"ఏరా శేఖర్ ? ఏవి టివాళ నన్ను పిలవకుండానే వచ్చేశావ్ ? ఏకాంతమూ సాయంత్రమూ అని పాడుకోవాలన్పిం చిందా ?" అంటూ శేఖర్ వీపున ఓ దెబ్బవేసి ప్రక్కనే యిసుకలో కూర్చున్నాడు.

"ఏం లేదురా ! నిన్ను పిలుద్దామనే అనుకున్నాను. ప్రొద్దున రాంపూర్ వెళతానన్నావుగా, వెళ్ళివుంటావనుకొని, ఏదో పరధ్యానంగా ఆలోచిస్తూ వచ్చేశాను. రాంపూర్ వెళ్ళలేదా నువ్వు ?" అన్నాడు శేఖర్

శేఖర్ ముఖంలో అంతులేని అలసట కన్పిస్తోంది. చంద్రం ఆప్యాయంగా శేఖర్ చెయ్యందుకొని "అప్పుడే అంత పరధ్యాన మేవిటిరా ? రాంపూర్ ఎంత సేపు వెళ్ళిరావాలి ? ప్రొద్దున వెళ్ళి మధ్యాహ్నానికి తిరిగి వచ్చేశాను. శాంత వుండమని బలవంతం చేసింది. "మళ్ళీ వస్తాను, యింటిదగ్గర చాలా పనులున్నా యమ్మా !" అని బయటపడ్డాను. ఆ రాంపూర్‌లో ప్రొద్దుపోవడం మహా కష్టంరా. అన్నట్టు నిన్నడిగానని చెప్ప మంది శాంత. ఇంకో విశేషం చెప్పనా? శ్రీధర్‌గారు లెటర్ వ్రాశారు." అంటూ పరీక్షగా శేఖర్ వైపు చూశాడు. ఏదో దీర్ఘాలోచనలో మునిగి వున్నట్లున్న శేఖర్ చంద్రంవైపు తిరిగి "ఏం వ్రాశారు ?" అన్నాడు.

"నువ్వే చూడు" అంటూ జేబులో నుంచి కవర్ తీసి శేఖర్ కందించాడు చంద్రం. ఆ లెటర్ అందిస్తున్నప్పుడు చంద్రం అంతులేని ఆనందంతో వుక్కిరి బిక్కిరవుతున్నట్లు, అందమైన ఆ ముఖంలో ఏదో చెప్పలేని తృప్తి, ఓ రకమైన బిడియంతో రక్తమంతా ముఖంలోకి పాకినట్లు, వింత కాంతితో మెరిసిపోతున్న చంద్రంవైపు ఆశ్చర్యంగా చూసి లెటర్ విప్పాడు శేఖర్.

డియర్ చంద్రం !

ఆశీస్సులు !

నిన్ననే చి॥ మాధవి వ్రాసిన లెటర్ అందింది. అందులోని విషయాలు చదివి ఆశ్చర్యపోయాను. ఇన్నాళ్ళూ నువ్వు మాధవిని పెళ్ళిచేసుకుంటావనే అభిప్రా యంలో వున్నాను. కానీ మాధవి

తనంతట తానే 'సుషమను చంద్రం బావకిచ్చి వివాహం చేయాలని నా కోరిక. సాహసంతో నేను వ్రాస్తున్న ఈ విషయాన్ని అపార్థంచేసుకోక నన్ను మన్నించి యీ పెళ్ళి అయ్యేలా చూస్తారని ఆశిస్తున్నాను.' అంటూ వ్రాసింది. పిచ్చిపిల్ల దానికి సుషమమీద నీ మీద వున్న అభిమానమంతా తన వుత్తరంలో పొందుపరచింది. నువ్వూ సుషమా యీ పెళ్ళికి సుముఖంగా వున్నారని మాధవి లెటర్ ద్వారా తెలుసుకొని నాకు చాలా ఆనందంగా వుంది. ఇన్నాళ్లూ తెలుగు మాట్లాడటానికే ముఖం వాచినట్లున్న మాకు మళ్ళీ గంగాపూర్ వచ్చినపుడు పునర్జన్మ ఎత్తినట్లైంది. ఆంధ్రదేశంలో అడుగుపెట్టిన అనుభూతి కలిగింది. ఆ వూరే అత్తవారిల్లు కావాలని సుషమ కోరుకుంటే అంతకంటే నాకు కావలసిన దేముంది ? పదిరోజుల్లో నేనే స్వయంగా వచ్చి మీ అమ్మగారితో మాట్లాడుతాను. మన ఆనవాయితీ ప్రకారం ఆడపిల్ల తండ్రిని కదా !

చంద్రం ! మరో "ముఖ్య విషయం. నాకు మాధవిని చూసినప్పటినుంచీ నా ప్రాణంతో ప్రాణమైన శ్రీరాం గుర్తొచ్చి ఎంతో బాధపడ్డాను. మధు నాకత్యంత ప్రియతమ మిత్రుడైన శ్రీరాం కూతురే అని తెలిసాక ఆ అమ్మాయిమీద వున్న అభిమానం ఆపేక్షగా మారింది. నాదో చిన్న కోరిక. మాధవి అంగీకరించే పక్షంలో మాధవిని నా కోడలిగా చేసుకుందా మనుకుంటున్నాను. ఈ రకంగానైన చనిపోయిన నా మిత్రుడికి ఆత్మకు శాంతి కల్గించిన వాడినౌతాను. ఈ విషయంలో నీ అభిప్రాయం వ్రాయగలవు. శిరీష్‌కూడా అడ్డు చెప్పడనే నా అభిప్రాయం. మాధవికి, సావిత్రి పిన్నిగారికి నా మాటగా చెప్పగలవు. నేను వచ్చిన తర్వాత వివరంగా మాట్లాడుకుందాము.

నీ శ్రేయాభిలాషి

శ్రీధర్

ప్రేమాశీస్సులతో.

ఉత్తరం చదివిన శేఖర్ చంద్రం వైపు వెర్రిగా చూశాడు. తరువాత తనని తాను స్వాధీనంలోకి తెచ్చుకుంటూ "కంగ్రాచ్యులేషన్స్‌రా చందూ ! నాకు చాలా సంతోషంగా వుంది. నువ్వదృష్టవంతుడివి. అయితే మధుచేత నువ్వే లెటర్ వ్రాయించావా ?" అన్నాడు సందేహం తీరక.

"లేదురా ! మధు యిలా వ్రాసినట్లు కూడా నాకు తెలీదు. కనీసం శ్రీధర్ గారికి లెటర్ వ్రాసినట్లే నాతో చెప్పలేదు. కొంటె పిల్ల మొత్తానికి తననుకున్నది సాధించి కానీ వదలేదు." అన్నాడు ఆప్యాయంగా మధును తలుచుకుంటూ. చంద్రానికి శేఖర్ ప్రవర్తన విచిత్రంగా వుంది. ఉత్సాహంతో వురకలు వేసే శేఖర్ ఆ శుభవార్త విని కూడా ఎందు

కుదాసీనంగా వున్నాడో, ఆ వార్త అతనిలో ఏ మాత్రం మార్పు ఎందుకు కలిగించలేకపోయిందో అర్థంకాక చంద్రం మనసు చిన్నబోయింది. తన వివాహ ప్రసక్తి ప్రాణమిత్రుడికి సంతోషకరమైనదిగా అన్పించకపోవ డానికి కారణం కనిపించలేదు చంద్రానికి.

ఇంతలో శేఖర్ లేచి బట్టలు దులుపుకుంటూ, "అయితే చందూ! మరి మధుకు శిరీష్‌ను చేసుకోడం యిష్టమేనా ?" ఆ మాట అడుగుతున్నప్పుడు ఎంత ఆపుకున్నా శేఖర్‌కంఠం కొద్దిగా చలించింది. తనూ లేచి నుంచొని శేఖర్ భుజంపై చేయివేస్తూ "లేదురా! మధూ అసలు పెళ్ళే చేసుకోనని మొండికేస్తోంది. పిన్నికూడా ఎంతగానో నచ్చచెప్పింది. నేనూ చెప్పి చూశాను, కానీ మధును వొప్పించలేకపోయాం. 'ఈ విషయంలో నన్నెవరూ బలవంతం చేయకండత్తయ్యా!' అని అక్కడినుంచి లేచిపోయింది. దాని విషయం తల్చుకుంటే బాధగా వుంది. ఇంత చిన్న వయసులో ఎన్ని అనుభవాలు? కష్టాలు, కన్నీళ్లు తప్ప మధు జీవితంలో ఏం అనుభవించింది? పిచ్చిది కాకపోతే యింత చక్కటి అవకాశాన్ని ఎవరైనా కాదంటారా? శిరీష్‌కు ఏం తక్కువ?



చదువూ, సంస్కారం, వుద్యోగం అన్నీ వున్నాయి. మన అంతస్థుకు అంత మంచి సంబంధం రావడం మన అదృష్టం మధూ! నా మాట కాదనకు." అని ఎన్నో విధాల నచ్చజెప్పాను

'అత్తయ్యనీ శ్యాంనీ అనాధల్లా వదిలి నా దారి నేను చూసుకోలేను బావా! నన్ను క్షమించు. నా కిప్పట్లో పెళ్ళి ఆలోచన లేదు,' అని ఖచ్చితంగా చెప్పేసింది. చిలిపిగా మాట్లాడే మధుతో ఎంత సైపైనా మాట్లాడగలను గానీ... అలా గంభీరంగా మారిపోయి అన్ని అనుభవాలూ గడించినట్లున్న ఆ మధు ముందు నిలబడి తర్కించడానికి నాకు ధైర్యం చాల్లేదు శేఖర్," అంటున్న చంద్రం, బాధను అణచుకునే ప్రయత్నంలో క్రింది పెదవిని పై పంటితో గట్టిగా నొక్కిపట్టి చెమ్మగిల్లిన కళ్ళను తుడుచుకున్నాడు, పై పంచతో.

ఇద్దరూ అలా మౌనంగా నడుచుకుంటూ చాలాదూరం వెళ్ళారు. మరోప్పుడైతే ఎన్ని కబుర్లు చెప్పుకునేవారో! ఆ రోజులు క్షణాలుగా గడిచిపోయాయి ఈ రోజు క్షణ మొక యుగంగా గడుస్తోంది. చాలాదూరం అలా ఎవరి ఆలోచనల్లో వాళ్ళు నడచి, సూర్యాస్తమయాన్ని చూసి, నెమ్మదిగా గ్రామంవైపు నడక సాగించారు.

ఇల్లు చేరిన శేఖర్‌కు ఆ రాత్రంతా నిద్ర లేదు. ఒక ప్రక్క చంద్రం సుషమల పెళ్ళవుతోందని తెలిసి సంతోషంగా వున్నా, శ్రీధర్‌గారు మాధవిని కోడలుగా చేసుకునే అభిప్రాయాన్ని వెలిబుచ్చారని తెలియగానే ఓ క్షణం మాధవి అంగీకరిస్తుందేమో అన్న ఆలోచనతో హృదయస్పందన ఆగిపోయినట్లైంది. అదీ తేలిపోయింది చంద్రం మాటలతో. అయినా అసంతృప్తి, అసహనం మాధవి నిర్ణయం ఓ రకంగా బావున్నా, అసలు పెళ్ళే చేసుకోనని చెప్పడం శేఖర్ హృదయాన్ని గాయపరిచింది. అంటే మధూ యింక జీవితమంతా అలా పిల్లలకు పాఠాలు చెబుతూ శ్యాంనీ, సావిత్రమ్మగారినీ చూసుకుంటూ గడిపేస్తుందా ? మాధవిని గురించి తను అల్లుకున్న ఆశల పందిరి ఏం కావాలి ? మనసు తెలిసిన మాధవి మమతలో మునిగి, మనుగడ మధురతరం చేసుకోవాలనుకున్న తన కోరికలు ఏంకావాలి ? మధుకు తప్ప తన మనసులో మరో మగువకు స్థానం లేదు. అది తనకు బాగా అర్థమైపోయిన నిజం. తన మాటల్లో, కలల్లో, సుప్రసన్నంగా, సుమధురమైన చిరునవ్వుతో, సువిశాలమైన నయనాల్లో ఆత్మీయతా, అనురాగం నింపుకొని, కన్పించే మధు ముగ్ధమోహన రూపం హృదయాన్ని కదలించి, మొదటి చూపులోనే తన్నాకర్షించి మధుర మంజుల గాన మాధుర్యంతో అనురాగపు వారధి

కట్టిన ఆ అమాయకపు చూపులను మరవడం ఎలా సాధ్యం? ఎవరికి సాధ్యం?

ఆ రోజు అప్రయత్నంగా దగ్గరకు తీసుకొన్నప్పుడు బెదురుగా, బిడియంగా కదలాడిన ఆ కళ్ళలోని తళుకు అనుక్షణం జ్ఞప్తికొస్తోందే... నిన్ను ఎలా మరువను మధూ? నువ్వు లేకుండా ఎలా బ్రతుకను? నే నెన్నివిధాల అభివృద్ధిని సాధించినా, ఎంత పేరు గడించినా, నిన్ను పొందలేని నా జీవితానికి అర్థమే లేదనిపిస్తోంది. పరుల తృప్తికోసం మరొకరిని పెళ్లాడి మనసులేని మనువుతో జీవితాంతం భ్రమగ్గలేను. బాధ్యతల బరువుతో బ్రతుకంతా భారంగా గడిపేయడానికే నిర్ణయించుకున్నావా? నీతో బంధాన్ని కలుపుకోలేని నేనూ బ్రతుకు భారంగా యీడ్చవలసిందేనా? కన్నీళ్ళతో తలగడంతా తడిసిపోయింది. జీవితంలో మొట్టమొదటిసారిగా తను కోరుకున్నది పొందలేని నిస్సహాయతకు కన్నీళ్ళు కార్చాడు శేఖర్.

రోజులు యధాప్రకారం గడిచిపోతున్నాయి. శేఖర్‌కు మళ్ళీ సంబంధాలు చూసే హడావిడిలో పడ్డారు రఘువతిరావుగారు. శేఖర్ తోటివాడు చంద్రానికి కూడా పెళ్ళి నిశ్చయమైందని తెల్సిన తర్వాత వారికి మరీ ఆరాటంగా వుంది. అన్నీ వుండి తామింకా ఒక్కగానొక్క కొడుకు వివాహం చేయలేకపోయామే అని బాధగా వుంది రఘుపతిరావుగారికి. మునపటిలా ఏదడిగినా మృధువుగా సమాధానం చెప్పడంలేదు శేఖర్. తల్లి ఏ ద డి గి నా చిరాగ్గా, విసుగ్గా సమాధానం చెప్పేసి వెళ్లిపోతున్నాడు. సంబంధాలు వస్తున్నాయి, పోతున్నాయి. శేఖర్ ఒక్కటీ ఒప్పుకోడం లేదు.

ఆ రోజు మళ్ళీ ఏదో సంబంధం గురించి మాట్లాడుతున్న తల్లితో "అమ్మా! నేనిక్కడ వుండాలంటే నాకు సంబంధాలు వెదకడం మానెయ్యాలి. లేదంటే నే నీరోజే కలకత్తా వెళ్ళిపోతాను. ఏదో వుద్యోగం చేసుకొని బ్రతుకుతాను" అంటూ విసురుగా చెప్పులు వేసుకొని పొలాలవైపు సాగిపోయాడు. ఆ పిల్లాడి మనస్తత్వమేమిటో తెలియని తల్లి హృదయం తల్లడిల్లిపోయింది. తనతో శేఖర్ అన్న మాటలే భర్తకు చెప్పారు శ్యామలాదేవి. మొదట కేకలువేసినా నిజంగానే కొడుకు అంత పని చేస్తే ఎలాగా? అన్న భయం ఆయన్నీ బాధ పెట్టింది. వున్న ఒక్కడూ కళ్ళెదురుగుండా లేకుండా పోతే తాము భరించగలరా? అందుకే కొన్నాళ్ళపాటు వాడి మనసేవిటో తెలిసే వరకూ ఆ పెళ్ళిగొడవలు ఎత్తకూడదనుకున్నారు. రోజురోజుకూ క్షీణిస్తున్న తన ఆరోగ్యం, కొడుకు పెళ్ళైనా కళ్ళారా చూడగలనో లేదో

అన్న బాధ హృదయాన సుళ్ళు తిరుగుతున్నా, శేఖర్‌కు ఇష్టంలేకుండా ఏ పనైనా చేయడం తనకు నచ్చదు కసుకనే ఆఖరికి చదువు విషయంలో కూడా శేఖర్ యిష్టానికే వదలేసారు. ఇంక ఇప్పుడూ శేఖర్ యిష్టానికే వదిలేయక తప్పదనుకున్నారు. ఆ తర్వాత శేఖర్‌ని పెళ్లివిషయమై ఎవరూ బాధించలేదు.

పొలంనుంచి అలసటగా తిరిగివస్తున్న శేఖర్ కాళ్ళు అప్రయత్నంగా గోపాలంగారి ఇంటి ముందుకు రాగానే ఆగిపోయాయి. లోపలినుంచి శ్రావ్యమైన గొంతుతో మాధవి పాడుతున్న పాట మనసుకు హాయికలిగిస్తుంటే, సన్నటి గొంతుల్తో వాళ్ళిష్టమొచ్చిన రాగంతో మిశ్రమ రాగా న్నాలపిస్తూ మాధవి పాడిన చరణాన్ని అష్టవంకరలు తిప్పి పాడుతున్నారు పిల్లలు. వాళ్ళను ఆపి తను మళ్ళీ పాడుతోంది మాధవి. అలాగే కొంచంసేపు నిలబడి ఆ గొంతులోని మాధుర్యాన్ని మనసున నింపుకొని వెళ్ళిపోవాలని కలలు కంటున్న శేఖర్ "అత్తయ్యా !" అనే ఆర్తనాదంలాంటి కేకతో ఈ లోకంలోకివచ్చి గబగబా లోపలికి పరుగెత్తాడు. అప్పటికే క్రింద పడికదల్లేకుండాపడివున్న సావిత్రమ్మను రెండు చేతుల్తో పైకి లేపడానికి ప్రయత్నిస్తోంది మధు. సావిత్రమ్మ చాలా నీరసంగా వుంది. భర్త చనిపోయిన తర్వాత జీవితాశ పూర్తిగా నశించిపోయింది. మాధవి భవిష్యత్‌కు తనుబంధమౌతున్నానన్న బాధ మరీ వేధిస్తోందామెను. చంద్రం వచ్చినప్పుడు మధు చెప్పిన సమాధానం సావిత్రమ్మ మనసును మరీ చిత్రవధ చేసింది. తనే చేసుకుంటాడనుకున్న చంద్రం వేరే సంబంధం గురించి చెప్పడం "నేనసలు పెళ్ళే చేసుకోనని మాధవి తెగేసి చెప్పడం. ... సావిత్రమ్మ ఆరోగ్యం మీద పెద్ద దెబ్బతీశాయి. ఆనాటినుంచే ఆరోగ్యం అసలు బావుండటంలేదు. లోపల పడుకొని ఉన్నది, మాధవి పాట విని నెమ్మదిగా లేచివచ్చి అరుగు మీదకు చేరుకుంది. అంతే...కళ్ళు తిరిగి అరుగు మీదనుంచి క్రింద పడిపోయింది. పిల్లలందరూ చుట్టూ చేరారు భయం భయంగా చూస్తూ, కొందరు ఏడుస్తూ.

మధుకు సావిత్రమ్మను లేపడం సాధ్యంకావడం లేదు. తొందరగా లోపలికెళ్ళిన శేఖర్ పిల్లలందరినీ తప్పుకోమని చెప్పి, ఓసారి మధువైపు చూసి "పక్క సరిచేయి మధూ లోపలికెళ్ళి. నేను తీసుకొస్తాను" అంటుంటే మరో మాట మాట్లాడే ధైర్యంలేక లోపలికెళ్ళి పక్క సరిచేసింది. ఈలోపల శేఖర్ రెండుచేతులతోనూ సావిత్రమ్మను ఎత్తుకొచ్చి మంచంమీద పడుకోబెట్టాడు. సావిత్రమ్మకు స్పృహలేదు. సావిత్రమ్మ దగ్గరగా కూర్చొని "అత్తయ్యా! అత్తయ్యా !" అంటూ నీళ్ళు నిండిన

కళ్ళతో చూస్తున్న మధును చూడగానే అంతులేని ఆవేశం కలిగింది. ఆదరంగా అక్కున చేర్చుకొని ఓదార్చాలనీ ధైర్యం చెప్పాలనీ. అవేమీ చేయలేక నిగ్రహించుకుంటూ అన్నాడు.

"మధూ ! భయపడకు యిప్పుడే వస్తాను," అంటూ బయటకు పరుగెత్తాడు శేఖర్. సరాసరి ఆ వూళ్ళోవున్న ఒకే ఒక ప్రైవేట్ డాక్టర్ దగ్గరకు పరుగునవెళ్ళాడు. డాక్టర్ అప్పుడే క్లినిక్ నుంచి వెళ్ళి రెస్ట్‌తీసుకుంటున్నాడు. శేఖర్ వచ్చాడని చెప్పగానే, బయటకు వచ్చి "రండి లోపలికి" అంటూ ఆహ్వానించాడు. క్లుప్తంగా విషయం వివరించి డాక్టర్‌ను వెంటబెట్టుకొని గోపాలం గారిల్లు చేరాడు శేఖర్. డాక్టర్‌ను, శేఖర్‌నూ చూడగానే ఏడుస్తూకూర్చున్న శ్యాంను ప్రక్కకుతీసి మంచం దగ్గరగా కుర్చీవేసి అత్తయ్య వైపే చూస్తూ నిలబడింది మధు. కూర్చున్న నిముషానికే పరీక్షచేసి లేచి మెడికల్ కిట్ తీసుకొని బయలుదేరిన డాక్టర్ వైపు ప్రశ్నార్థకంగా చూశాడు శేఖర్.

"అయామ్‌సారీశేఖర్! షియాజ్ డెడ్, హార్ట్ ఫెయిలైంది. క్షమించండమ్మా !" అంటూ ముందుకు అడుగులు వేశాడు డాక్టర్. ఆత్రంగా మధువైపు చూసిన శేఖర్‌కు భయమేసింది. నెమ్మదిగా మంచం ప్రక్కకు జారి అత్తయ్యచెయ్యి చేతుల్లోకి తీసుకొని నిమురుతోంది. మధు కళ్ళలో నీళ్ళు లేవు. నిర్వికారంగా వుంది. తనకున్న ఆ ఒక్క పెద్దదిక్కూ పోయిందని తెలిసినా మధు ఏడవడం లేదు. కాదు మధు షాక్ తిన్నట్లుంది. ఎలా ? ఏం చేయాలి ? మధు భుజాలు పట్టుకొని కుదిపాడు "మధూ ! మీ అత్తయ్య చనిపోయారు మధూ!" అంటున్నాడు ఆవేదనగా. మరో ధ్యాసలేకుండా అత్తయ్యనే చూస్తూ కూర్చుంది మధు. శేఖర్ పిలుపు వినిపించినట్లే లేదు

ఇంతలో చుట్టూ మూగిన జనంలో ఎవరో వెళ్ళి చంద్రాన్ని పిల్చుకొచ్చారు. పిన్ని మృతదేహాన్ని చూసి గుండెలవిసేలా ఏడుస్తున్నాడు చంద్రం.ఆ గుండెల మీద పెరిగిన రోజుల్ని గుర్తుచేసుకొని కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు. అంతా ఏడవడం చూసి శ్యాంకూడా అర్థమైపోయింది. వాడు అత్తయ్యా ! అత్తయ్యా ! అంటూ పలకని అత్తయ్యని పిలుస్తూ ఏడుస్తున్నాడు. వాడిని ఎవరో ప్రక్కకు తీసుకెళ్ళారు. కానీ మధు కంటి వెంట వోచుక్క నీరుకూడా కారడం లేదు. అంతా ఆశ్చర్యంగా మధునే చూస్తున్నారు. యిరుగుపొరుగులు కూడా సావిత్రమ్మ మంచితనాన్ని తలుచుకొని కళ్ళు తుడుచుకుంటున్నారు. కొందరు మధుని చూసి, "ఆ పిల్ల గుండె రాయమ్మా ! మరొకళ్ళైతే అంత నిబ్బరంగా వుండగలరా ? ఎంత ధైర్యంగా కూర్చుందో చూడండి అయినా యీ

రోజుల్లో కడుపున పుట్టినవాళ్ళకే ప్రేమ ఉండటం లేదు. అయిదేళ్ళుగా కడుపులో పెట్టుకొన్నంత మాత్రాన దానికి ప్రేమ ఎక్కడినుంచి వస్తుందిలే!"

"పాపం చిన్నప్పుడు ఎత్తుకొని గోరు ముద్దలు తినిపించిన ఆ పిన్ని మీద ఎంత అపేక్షో చూడండి చంద్రానికి అని ఒకరంటే—

"మధూ ! మధూ ! అంటూ ఎంత ఆప్యాయంగా చూశారు. ఆ పిల్లకు విశ్వాసముంది, కనుకే కుటుంబభారాన్ని ఏదో రకంగా మోస్తోంది. సావిత్రమ్మగారు పోవడం పాపం మాధవికి పెద్ద దెబ్బ" అంటూ తలా ఒక రకంగా వ్యాఖ్యానిస్తున్నారు.

ఎందరో ఎన్నో రకాలుగా సావిత్రమ్మ మంచితనం గురించి, గోపాలంగారి వ్యక్తిత్వం గురించి, గొప్పతనం గురించి పొగుడుతున్నారు. ఆవిడ అంతిమయాత్రకు సానుభూతి చూపుతున్నారు. కొందరు చంద్రాన్ని ఓదారుస్తున్నారు. చంద్రం లేచి మధువైపు చూశాడు. ఏకదీక్షగా సావిత్రమ్మ ముఖంలోకే చూస్తోంది మధు. మధు ముఖంలో ఏ భావమూ వ్యక్తంకావడం లేదు. ఆ నిశ్శబ్దమూర్తిని చూసి ఆగలేక పోయిన శేఖర్ ధైర్యంచేసి చంద్రం భుజంమీద చెయి వేసి "చందూ ! మధును తీసుకెళ్ళమని చెప్పరా అమ్మతో" అన్నాడు బాధగా. అలా చూడలేను అన్న భావం ధ్వనించింది శేఖర్ గొంతులో. చంద్రం తల్లి నెమ్మదిగా లేచి కళ్ళు తుడుచుకుంటూ, మధుని లేపి లోపలికి తీసుకెళ్ళింది. యాంత్రికంగా మర మనిషిలా నడుస్తున్న మధును చూస్తే శేఖర్ హృదయం ద్రవీభూతమైంది. కానీ తను అశక్తుడు. మధు తనకు అర్హత,అధికారం యిచ్చి వుంటే ఎందరున్నా లెఖ్ఖచేయక ఎదపై చేర్చుకొని, మధు తనివితీరా ఏడ్చి హృదయాన్ని తేలికపరచుకొనే వరకూ అలాగే ఆమె తలనిమురుతూ, తన విశాలమైన బాహువుల్లో బంధించి ధైర్యం కల్గించేవాడేమో ! తనకా అదృష్టం ఏదీ ? ఈ నాలుగేళ్ళూ మధు ఎదురుపడ్డప్పుడల్లా మనస్సును నిగ్రహించుకొనడానికి చేసిన ప్రయత్నం ఓ తపస్సులా నిర్వహించాడు.

మనసు అదుపు తప్పుతున్నదనుకున్నపుడల్లా పొలంవైపు పరుగెత్తి అక్కడినుంచీ గంగాతీరం వైపు మళ్ళి ఏకాంతంగా గంటలు గంటలు గడిపేసేవాడు. ఒక్కోసారి తన కత్యంత ప్రియమైన గంగాపూర్‌నూ, పసిడి పంటల పొలాల్ని ఇంతడివాడైనా అప్పుడప్పుడూ అమ్మచేత ముద్దలు తినే ఆనందాన్ని, ప్రాణప్రదమైన చందూ స్నేహాన్నీ, కోడలిని తెచ్చుకోవాలనీ మనవడి నెత్తుకోవాలనీ ఆత్రపడే పితృ హృదయాన్నీ, అన్నింటినీ, అందర్నీ

వదిలేసి, ఎక్కడికో తెలీని దూరదేశా లకు పారిపోవా లనిపిస్తుండేది. మళ్ళీ అంతలోనే ఆ యింటికి వారసుడుగా తన కర్తవ్యం గుర్తొచ్చి, తన పిచ్చి ఆలోచనలకు స్వస్తిచెప్పి పవిత్ర గంగా నదిలో కొంతసేపు స్నానంచేసి ఆ చల్ల దనాన్ని మనసున నింపుకునే ప్రయత్నం చేస్తూ, చాలా సేపు అలాగే వుండి పోయి గంగానదిలోకి వొరిగిపోతున్న సూర్యుణ్ణి చూస్తూ కాలాన్నిగడిపేవాడు. మరీ పిచ్చెత్తిన ట్లనిపించినప్పుడల్లా కలకత్తా వెళ్ళాలనిపించేది. శిరీష్, సుషమల స్నేహంలో కొంత మనశ్శాంతి దొరుకుతుందని. ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తుండే శిరీష్ తన ప్రక్కన వున్న వాళ్ళందరిని మంచి మూడ్స్‌లో పెట్టగల నేర్పరి. గోపాలంగారు పోయిన తర్వాత అనుకున్నప్పుడల్లా కలకత్తా వెళ్ళే స్వేచ్ఛ కూడా కరువైంది. యింటి మనిషి లేకుండా పొలం పనులు అయ్యేవి కావు. ఎంతమంది పనివాళ్ళున్నా, దగ్గరుండి చూసుకోకపోతే పనులు సక్రమంగా అయ్యేవికావు. కానీ......యీ రోజు మధును చూస్తుంటే ఎవర్నీ లెఖ్ఖచేయా లనిపించడంలేదు. లోపలికెళ్ళైనా సరే మధుని మామూలు మనిషిగా మార్చాలని పిస్తోంది. మనసు వశం తప్పుతోందని గ్రహించిన శేఖర్, చంద్రం భుజం మీద మెల్లగా తట్టి, "యిప్పుడే వస్తాను చందూ !" అతి ప్రయత్నంమీద ఆ మాట చెప్పి అరచేత గుండెల్ని రాసు కుంటూ, వీధిలోకొచ్చిన శేఖర్ కళ్ళు

## సవరణ

అక్టోబరు 'క్విజ్' సమాధానాలలో అచ్చు పొరబాట్లు దొర్లి నందునకు విచారిస్తున్నాం. 7 వ ప్రశ్నకు సమాధానంగా 1927 కు బదులు 1972 అని పడింది. ఆ ప్రశ్నకు సమాధానం 1972 గా చదువుకో ప్రార్థన.

సంపాదకుడు
యువ

నీటితో నిండిపోయాయి. తెలీని బాధ. గుండెలో సన్నగా నొప్పి ప్రారంభ మైంది. ఈ మధ్య తరచు వస్తోం దీ నొప్పి, ఎక్కువగా ఆలోచించి నప్పుడల్లా నొప్పి ఎక్కువౌతోంది. ఆక్రదించవలసిన సమయంలో, అయో మయంగా చూస్తూ, నిశ్చలంగా వున్న మధు రూపం కళ్ళముందు కనిపించి కలవర పెడుతోంది. అంతరంగాన వువ్వెత్తునలేచే అనురాగపు తరంగాలను అతిప్రయత్నం మీద అణచుకోడానికి ప్రయత్నిస్తూ నెమ్మదిగా యిల్లు చేరుకున్నాడు శేఖర్.

అప్పటికే వార్త తెలిసిన శ్యామలా దేవి శేఖర్‌ని చూడగానే, "బాబూ! మధుని పలకరించి వచ్చావురా! పాపం ఆ పిల్ల ఎంత దురదృష్టవంతురాలు. ఉన్న ఆ ఒక్క పెద్దదిక్కూ పోయింది. నేనోసారి వాళ్ళింటికి వెళ్ళి వస్తానండీ!" అని తండ్రి నడుగు తున్న తల్లివైపు ఆశ్చర్యంగా చూశాడు శేఖర్. అంతలోనే తృప్తిగా మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకొన్నాడు తల్లికి.

జమిందారీ వంశం వారిది. జమీలు పోయినా వారిని జమిందారులుగానే ఎంచేవాళ్ళు. శ్యామలాదేవి ఎన్నడూ ఎవరిళ్ళకు వెళ్ళేదికాదు. శుభకార్యాల ప్పుడు వాళ్ళెవరైనా వచ్చి బలవంతం చేస్తే, తప్పనిసరైన వాళ్ళనుకుందే వెళ్ళేవారు. అంతకు తప్పించి తల్లి బయట అడుగుపెట్టడం చూడలేదు. అందులోనూ తనంతట తానే తండ్రి నడగటం యిదే మొట్టమొదటిసారి శేఖర్ అనుభవంలో. శాంత పెళ్ళికి చంద్రం వచ్చి తీసుకెళ్ళితే వెళ్ళింది, తప్పనిసరై. "మీరు లేకుండా శాంత పెళ్ళెలాగౌతుందమ్మా!" అని చంద్రం అంటుంటే "మీ నాన్నగారు, శేఖర్ వస్తున్నారుగా చందూ!" అని తప్పించుకోజూసిన శ్యామలాదేవిని బ్రతిమిలాడి ప్రక్క బజారున వున్న యింటికి, బండికట్టి తీసుకొచ్చి, తీసు కెళ్ళాడు చంద్రం. అలాగే గోపాలంగారు పోయినప్పుడు రఘుపతిరావుగారు వెళ్ళ మని చెబితే వెళ్ళింది. అలాంటి అమ్మ యీ రోజు తనంతట తాను మధుని పలకరించి రావడానికి వెళతా నంటున్నదంటే......అది మధు మంచి తనంలోని మహిమ అనుకోవాలో... అవధులు దాటిన తల్లి అభిమానమను కోవాలో అర్థంకాలేదు శేఖర్‌కు. "పద నేనూ వస్తాను" అంటూ పైపంచవేసుకొని బయలుదేరుతున్న రఘుపతిరావుగారిని మరింత విస్మయంగా చూశాడు శేఖర్. తనవైపు చూసిన తల్లితో, "నేను వెళ్ళే వస్తున్నానమ్మా" అని చెప్పి పైకి వెళ్ళి పోయాడు నెమ్మదిగా శేఖర్.

గోపాలంగారు చనిపోయిన తర్వాత మధు ఎన్నోసార్లు తమ యింటికిరావడం

జ్ఞాపకం వచ్చింది. తల్లితో చనువుగా మాట్లాడటం, ఆవిడకు స్వెట్టర్ అల్లడం నేర్వాలని ప్రయత్నించి సాధ్యంకాక తనే ఓ స్వెట్టర్ అల్లి యివ్వడం, అది చూసి మధు పనితనాన్ని తల్లి మెచ్చు కోడం అన్నీ వరసనే జ్ఞాపకం వస్తు న్నాయి. నిలబడలేక అలాగే కుర్చీలో జారగిలబడ్డాడు శేఖర్. గుండెనొప్పి ఆ రోజు తీవ్రంగా వుంది. అంతవరకూ ఎవరికీ చెప్పలేదు. చెప్పాలని కూడా అన్పించడం లేదు.

*　　*　　*

శ్యామలాదేవి, వెనకే వెండిపొన్ను కర్ర చేతబట్టుకొని రఘుపతిగారు రావడం చూసి, అంతా పక్కకు తప్పు కొని దారిచ్చారు. చంద్రం వాళ్ళిద్దరినీ చూసి లేచి రెండు కుర్చీలు ముందుకు జరిపాడు. కళ్ళవెంట జలజలా కన్నీరు రాలిపోతోంది చంద్రానికి. ఓ క్షణం నిర్జీవంగా పడివున్న శుష్కించిన సావిత్రమ్మ మృతదేహాన్నిచూసి, దీర్ఘంగా నిట్టూర్చి, "చందూ ! బంధువులందరికీ కబురు చేశావా ?" అన్నారు రఘుపతి గారు. కళ్ళు తుడుచుకుంటూ "ఎవరు

# నవంబరు నెల క్విజ్

## సమాధానాలు

1 — ఎ　　2 — సి　　3 — డి

4 — బి　　5 — బి

6. మొహంజొదారో
7. చక్రపాణి
8. చైనీస్
9. 1-30 P. M.
10. నౌరు

నవంబరు నెల క్విజ్ కు ఆల్ కరెక్టుగా సమాధానాలు పంపినవారు ఎవ్వరూ లేరు. అందువల్ల రూ. 116 బహుమతి సొమ్మును జనవరి నెల 'క్విజ్ కు' చేర్చడమైంది.

న్నారు నాన్నగారూ ! శాంతకు కబురు చేశాము ఓ గంటలో అది వస్తుంది. ఇంక శ్రీధర్ గారికి ఓ టెలిగ్రాం యిమ్మని మనిషిని పంపాను. అయినా వారొచ్చేంతవరకూ ఎలాగూ వుంచ లేము. పూరికే తెలియచేయాలని " అన్నాడు చంద్రం. "ఎలా పోయారు?" అంటూ వివరాలుఅడిగిండి శ్యామలాదేవి.

"నాకేం తెలీదమ్మా ! నే వచ్చేసరికే అంతా అయిపోయింది. మధుకు తెల్సి వుంటుంది. కానీ మధు ఎవరేమడిగినా సమాధానం చెప్పడంలేదమ్మా" అన్నాడు చంద్రం. మధు దగ్గరికెళ్ళింది శ్యామలాదేవి.

కిటికీలోనుంచి ఆకాశంవైపు చూస్తూ ఏదో దీర్ఘాలోచనలో మునిగివున్నట్లుంది మధు. శ్యామలాదేవి వెళ్ళి భుజంమీద చెయివేసినా చలనంలేదు. గడ్డం పట్టు కొని మధుముఖం తనవైపు తిప్పు కున్న శ్యామలాదేవి ఆశ్చర్యపోయింది. మధు ముఖం మామూలుగా వుంది. ఆమె ఏడవడంలేదు. ఆ చూపుల్లో జీవం లేదు. అలావున్న మనిషిని ఎలా వోదార్చాలి. ! గుండెలవిసేలా ఏడు స్తుందేమో గుండెల్లో దాచుకొని వోదా ర్చాలని వచ్చిన శ్యామలాదేవికి నిరాశే ఎదురైంది. ఎంతో అభిమా నంగా, ఆత్మీయంగా మాట్లాడే మధు మాట్లాడదేం ?అలా చూస్తుండిపోయిందేం? అయస్కాంతంలా ఆకర్షించే ఆ కళ్ళ లోని కాంతి ఎటు పోయింది ? పది నిముషాలు అలాగే నుల్చున్నా శ్యామలా దేవి మనసులోని ప్రశ్నలకు సమాధానం దొరకలేదు.

అప్పుడే లోపలి కొచ్చిన చంద్రం తల్లి కుర్చీ తీసుకొచ్చి మంచంపక్కనే వేస్తూ "కూర్చోండి !" అంటూ శ్యామలా దేవి వైపు చూసింది. అప్పటికీ మధు నోరు విప్పి మాట్లాడలేదు. మరోసారి జాలిగా మధువైపు చూసి, చంద్రం తల్లితో "వస్తాను" అని మాత్రం చెప్పి, బయటకు వచ్చిన శ్యామలాదేవి అప్పటికే కండువా సర్దుకుంటూ, వెళ్ళడానికి సిద్ధంగా వున్న రఘుపతిరావుగారితో కలిసి యిల్లు చేరారు.

యథావిధిగా దహనసంస్కారాలన్నీ తన చేతులమీదుగానే పూర్తిచేసిన చంద్రం స్నానంచేసి లోపలికి రాగానే శాంత వచ్చి, "అన్నయ్యా ! మధు వదినేమిటన్నయ్యా అలా వుంది ? పిలిస్తే పలకడంలేదు. వెర్రిగా చూస్తోంది. నాకు భయమేస్తోందన్నయ్యా ! మధుని మాట్లాడమను" అంటూ చంద్రాన్ని చుట్టేసి బావురుమంది.

(సశేషం)

Printed and Published by A. Chandra Sekar Rao at 5-8-88, Public Garden Road Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor : A. SUDHAKARA RAO



# ప్రేమవాహిని

ఆప్యాయంగా శాంత వీపు తట్టుతూ "వూరుకో శాంతా ! ఏదీ మధును చూద్దాం పద" అంటూ మధు వున్న గదిలోకి వెళ్ళిన చంద్రం యింకా అలాగే ఆకాశంవైపు చూస్తూ కూర్చున్న మధుని చూస్తే బాధతో మనసు మెలికలు తిరిగింది. మధు జీవితంలో తిన్నదెబ్బలు సామాన్యమైనవి కావు. అంత చిన్న వయసులోనే ఒక జీవితకాలానికి సరిపడ్డ కష్టాల్ని కళ్ళజూసింది. ఆమెకు అత్యంత ఆత్మీయులైన వ్యక్తులు ఒక్కొక్కరే మధు జీవితంనుంచి నిష్క్రమించారు. ఆ షాకును తట్టుకోడం సామాన్యులకు సాధ్యంకాదు. ఆ అమాయకురాలి మనసున రగిలిన బాధాగ్నిని అర్థంచేసుకోలేని ప్రజావాహిని వాళ్ళ కిష్టమొచ్చినట్లు వూహించుకొని ఏవేవో మాట లంటున్నారు.

దగ్గరగా వెళ్ళి "మధూ !" అని పిలిచాడు చంద్రం. మనసులోని ఆప్యాయతంతా ధ్వనించిందా కంఠంలో. ఓసారి చంద్రంవైపు వెర్రిగా చూసి, మళ్ళీ నిశబ్ద నిశీధిలోకి దృష్టి సారించింది. తలమీద చెయివేసి "మధూ ! కొంచెంసేపు పడుకోమ్మా !" అన్నాడు చంద్రం ఆర్ద్రంగా.

మధులో మార్పేమీ లేదు. ఆ మౌన మూర్తిని ఎక్కువసేపు చూడలేకపోతున్నాడు చంద్రం. ప్రక్కనే నిలబడ్డ శాంతను "ఓ గ్లాసు పాలు తీసుకు రామ్మా !" అని పంపించాడు. అయిదు నిముషాలు మౌనంగా గడిచిపోయాయి.

శాంత పాలు తీసుకొచ్చింది. గ్లాసందు కొని మంచంమీద మధు ప్రక్కనే కూర్చొని "మధూ ! కొంచెం పాలు త్రాగి నిద్రపోమ్మా. రేపటికి హాయిగా వుంటుంది." అంటూ బుజ్జగింపుగా మధు చేయి చేతుల్లోకి తీసుకొని గ్లాసం దించబోయాడు. అప్పటికీ ఆ వెర్రి చూపులో మార్పులేదు చంద్రానికి ప్రతిమలా కూర్చున్న మధుచేత ఆ పాలు త్రాగించడం దుస్సాధ్య మనిపిం చింది. గ్లాసు తిరిగి శాంత చేతికిచ్చి, మధును నెమ్మదిగా రెండు భుజాలు పట్టుకొని మంచంమీద పడుకోబెట్టాడు. ప్రతిఘటించలేదు. కిటికిలో నుంచీ అలాగే శూన్యంలోకి చూస్తూ పడుకుంది.

ఇంతలో శ్యాం వచ్చాడు అక్క దగ్గరకు. వాడిని చూసి మధులో చలనం లేదు. అక్క మౌనంచూసి వాడికి భయంగా వుంది. "బావా ! అక్కయ్య మాట్లాడదేంటి ?" అంటూ చంద్రంవైపు చూశాడు ఏడుపుముఖంతో. అంత వరకూ అణగద్రొక్కుకున్న బాధంతా ఒక్కసారి పెల్లుబికింది చంద్రంలో. వాడిని దగ్గరకు లాక్కుని వాడిని వోదార్చే ప్రయత్నంలో, తనూ కన్నీరు కారుస్తూ వాడి ద్వారా కొంత సాంత్వన పొందాడు! దుప్పటి తీసి మధు మెడ వరకు కప్పి తలుపులు దగ్గరగావేసి శ్యాంని తీసుకొని హాల్లోకి నడిచాడు. పిన్నిపోయిన బాధకంటే మధు ప్రవర్తన మధు మౌనంగా చూసే ఆ మూగ చూపులు మరీ బాధపెడుతున్నాయి చంద్రాన్ని.

రెండోరోజు సాయంత్రానికి శ్రీధర్ గారు వచ్చారు కలకత్తా నుంచి. రావడం రావడం సరాసరి గోపాలంగారింటికే వచ్చారు."మధు ఎంత బాధపడుతుందో? ఈ విశాల ప్రపంచంలో తనకు తమ్ముడు తమ్ముడికి తను తప్ప మరెవ్వరూ లేరని బాధపడుతుండవచ్చు పిచ్చిపిల్ల." అని మాధవిని గురించిన ఆలోచనలతోనే బాధపడుతూ వచ్చారు శ్రీధర్‌గారు.

చావిట్లో దిగులుగా కూర్చున్న చంద్రాన్నిచూసి ఎలాజరిగింది చంద్రం? యింత హఠాత్తుగా మీ పిన్నిగారు..." అంటుండగానే ప్రక్కనే వున్న శేఖర్ జరిగింది వివరించాడు.

"జరిగినదానికంటే ఎక్కువ మధు పరిస్థితి చూస్తే మరీ భయంగా బాధగా వుంది అంకుల్ ! వాళ్ళ అత్తయ్య పోయారని విన్నాక మధు ఒక్క కన్నీటి బొట్టుకూడా కార్చలేదు. ఇంతవరకు పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టుకోలేదు. డాక్టర్ నడిగితే షాక్ తిని వుంటుంది. క్రమంగా, తనే కోలుకుంటుంది లెమ్మం టున్నారు. ఆ గదిలో పడుకొని అలా శూన్యంలోకి చూస్తోంది. మాకందరికీ బాధగా వుంది. అంకుల్ మీరైనా మాట్లాడించండి మధుచేత. మేమెవ్వరం వెళ్ళి పలకరించినా ప్రయోజనం కన్పిం

చడంలేదు. ఏదో పిచ్చిగా చూస్తోంది. ప్లీజ్ అంకుల్ మధుని మాట్లాడించండి. మేమెవ్వరం వెళ్ళినా ప్రయోజనంలేదు." అంటూ ఆవేశంగా, ఆత్రంగా శ్రీధర్ గార్ని లోపలికి తీసుకెళుతున్న శేఖర్‌ను విచిత్రంగా చూశారు శ్రీధర్.

మాధవి పట్లగల అభిమానాన్నీ ఆపేక్షనూ యిన్నాళ్ళూ ఆనకట్టలువేసి ఆపి వుంచాడు శేఖర్. ఈ రెండు రోజుల్లో మూర్తీభవించిన మౌనంలా జీవంలేని చూపులతోవున్న మధును చూస్తూ తట్టుకోలేకపోతున్నాడు. ఈ క్షణంలో ఆత్మీయుడైన మరోవ్యక్తి కనిపించేసరికి అతనివల్లనైనా మధు మామూలు మనిషవుతుందేమోననే ఆశతో కట్టలు తెంచుకొని ప్రవహించే నదీ ప్రవాహంలా యిన్నాళ్ళూ అంతర్గతంగా దాచుకున్న ఆవేదన కన్నీళ్ళ రూపంలో బయటపడింది. మధు అంటే అందరికీ అభిమానముంది. శేఖర్‌ను అంతగా కదిలించడం చూసే, చంద్రం కూడా ఆశ్చర్యపడుతూ, వాళ్ళ ననుసరించి మధు వున్న గదిలో కెళ్ళాడు.

అంతమంది లోపలికెళ్ళిన అలికిడికి కూడా తిరిగి చూడలేదు మధు. పందిరి మంచంమీద పట్టెనానుకొని కూర్చొని అలా దూరంగా అక్కడ ఏంచూస్తుందో ఎవరికీ అర్థంకాలేదు. చంద్రం పిల్చాడు "మధూ! ఎవరొచ్చారో చూడు," అంటూ. శ్రీధర్‌గారు మధు ముందుకు వెళ్ళి నిలబడ్డారు. ఓసారి గాజు కళ్ళలావున్న కళ్ళను కదిల్చి చూసింది. మళ్ళీ మామూలుగా దృష్టి బయటకు సారించింది. శేఖర్‌కు మధునలా చూడటం దుస్సాధ్యంగా వుంది. మరో రెండురోజులు మధు అలాగేవుంటే మధుకంటే ముందు తనకు మతిభ్రమిస్తుందేమోననే భయంవేసింది. సంకోచాల్నీ, సందేహాల్నీ ప్రక్కకుతోసి ముందుకొచ్చి మధు రెండు భుజాలపై చేతులువేసి–

"మధూ! మాట్లాడు మధూ! మీ మావయ్య వచ్చారు చూడు. నువ్వు మాట్లాడకపోతే ఏమనుకుంటారు?" అంటూ భుజాలు కుదుపుతూ అడిగాడు. ఓ క్షణం ఆ కళ్ళలోకి తళుకులాంటి కాంతి వచ్చి ది. అంతమాత్రానికే పరమానంద భరితుడయ్యాడు శేఖర్. చేతులు తీసేసి, "చూడు మధూ! పలకరించు. ఆయన నిలబడే ఉన్నారు. కూర్చోమని చెప్పు" అన్నాడు మళ్ళీ ఓసారి అందరివైపు దృష్టి సారించి కిటికీవైపు చూపులు త్రిప్పుకుంటున్న మధును చూసి శ్రీధర్‌గారి హృదయం బాధతో విలవిల్లాడింది.

మంచంమీద కూర్చొని రెండు చేతుల్లోకి మధు ముఖాన్ని తీసుకొని తడబడుతున్న గొంతుతో "ఏవిటమ్మా ఆ చూపు? మాట్లాడమ్మా. రేపు శిరీష్, సుషమ వస్తామన్నారు. నువ్వూ, శ్యాం

మాతో వచ్చేద్దురుగాని" మధు ముఖ భావాల్లో ఏ మార్పూలేదు.

"మాధూ! మాట్లాడమ్మా! మధూ!" శ్రీధర్‌గారి గొంతు పూడుకుపోయింది. "నాన్నా" శ్రీధర్ చేతుల్లోకి ఒరిగిపోయి వెక్కి వెక్కి ఏడ్చింది మధు. గుండె లవిసేలా ఏడుస్తోంది మధు. చూసే వాళ్ళ హృదయాలు ద్రవించిపోయేలా ఏడుస్తోంది. రెండు రోజుల్నుంచీ కన్నీటిచుక్క రాని ఆ కళ్ళనుంచి ముత్యాల సరాలుగా తెగిపడుతున్న కన్నీటిని చూసి అందరికీ ఓ రకమైన సంతోషం కలిగింది. "మధు మళ్ళీ మనుషుల్లో పడింది ఆ తృప్తి చాలు" అనుకుంటూ ఆనందంగా కళ్ళు తుడుచుకుంటున్న శేఖర్‌వైపు చూసిన చంద్రానికి ఏదో అర్థమైపోయినట్లైంది.

అక్క ఏడుపు వినిపించి శ్యాం పరుగెత్తుకుంటూ వచ్చాడు. వాడిని గుండెల కదుముకున్నాడు శ్రీధర్. నెమ్మదిగా మధుని లేపి ముఖం కడిగించి శాంత తెచ్చిన వేడిపాలు స్వయంగా తనే త్రాగించారు శ్రీధర్. శ్రీరాం కూతుర్ని అలా లాలిస్తుంటే మనసు అదో రకమైన తృప్తితో నిండిపోయింది. యిన్నాళ్ళకి రాం రుణం యిలానైనా తీర్చుకోగలుగుతున్నాననే ఆనందం కలిగింది. ఆయన పాలు చేతబట్టుకొని త్రాగిస్తుంటే కళ్ళనిండుగా నీళ్ళు నింపుకొనే గుటకలు వేసింది. "రాం ! నిన్ను దూరం చేసుకున్నా నీ బిడ్డల్ని చేరువ చేసుకునే అదృష్టాన్ని కలిగించావు" అనుకుంటూ కనిపించని స్నేహితుడిని తలుచుకొని కన్నీరు కార్చారు శ్రీధర్.

ప్రేక్షకుల్లా నిలబడి చూస్తున్న చంద్రానికీ, శేఖర్‌కూ ఆశ్చర్యంగా వుంది యీ అద్భుతమేమిటా అని మధు ఆయన్ని 'నాన్నా' అని ఎందుకు పిలిచిందో అంతకంటే అర్థంకాలేదు.

శ్రీధర్‌గారు ఆ తర్వాత విషయం వివరించేవరకూ ఎవరికీ ఆయన పిలిస్తే పలకడంలోగల అసలు రహస్యం బోధపడలేదు. తన తండ్రిలా 'మాధూ' అని పిలిచేసరికి మరుగునపడుతున్న స్మృతులు ఒక్కసారిగా జ్ఞాపకంవచ్చి, శ్రీధర్‌గారిని చుట్టేసి హృదయ విదారకంగా ఏడ్చింది మధు. దానితోనే బాహ్య స్మృతి వచ్చింది. జరిగినవన్నీ జ్ఞాపకం వచ్చాయి. నిలబడి తనవైపు ఆప్యాయంగా చూస్తున్న చంద్రాన్ని, అనురాగాన్నంతా కళ్ళలో నింపుకొని ఆరాధనగా చూస్తున్న శేఖర్‌నూ చూసి నెమ్మదిగా "నిలబడే వున్నారేం, కూర్చోండి బావా ?" అంది మధు యిద్దరినీ వుద్దేశించి. ఇద్దరూ ఒకళ్ళు మోడా, మరొకరు కుర్చీ లాక్కొని మంచం దగ్గరగా కూర్చున్నారు. శ్రీధర్‌గారి ప్రక్కనే నుంచుని బిక్కు బిక్కు మంటున్నట్లు కొత్తగా చూస్తున్న

శ్యాంని దగ్గరకు తీసుకుంది మధు. వెక్కి వెక్కి ఏడుస్తున్న వాడి తల మీద కన్నీళ్ళతో అభిషేకం చేస్తూ, వాడిని మరింత దగ్గరకు తీసుకొని కుమిలిపోతున్న మధుని చూసి అందరి కళ్ళు చమర్చాయి.

రెండు రోజులుండి, శలవులేదనీ మళ్ళీ పదిరోజుల తర్వాత వస్తానని చెప్పి బయలుదేరారు శ్రీధర్‌గారు. ఈ రెండురోజుల్లో పూర్తిగా కోలుకోపోయినా శ్రీధర్‌గారి ఆత్మీయతతో, చంద్రం శాంతల ఆప్యాయతలతో. భాషకందని భావాలతో నిశ్శబ్దంగా శేఖరందించే అనురాగపు చూపులతో, చాలావరకూ మామూలుగా తయారయినా, నీరసంమీద విపరీతంగా ఏడుస్తుండటంవల్ల, తిండి సరిగ్గా తినకపోవడంవల్ల మధులో చాలా మార్పు వచ్చింది. అప్పుడప్పుడు జ్వరం తగులుతోంది. రోజులో కొంతసేపు జ్వరం వుంటుంది, మరికొంతసేపటికి నార్మల్‌గా వుంటోంది. పీటితో నీరసంగా వుంటోంది.

భవిష్యత్ ఏమిటనే విషయం ఎవరూ ప్రస్తావించలేదు మధు దగ్గర. వెళ్ళేముందు చంద్రంతో చెప్పారు శ్రీధర్. "చంద్రం! ఇప్పట్లో మధు యీ పరిసరాలకు ఎంత దూరంగా వుంటే అంత మంచిది. పదిహేను రోజులు కాగానే నేను వచ్చి మధును, శ్యాంనూ, కలకత్తా తీసుకెళతాను. శ్యాంని స్కూల్లో చేర్పిస్తాను అక్కడే. మధు కిష్టమైతే తనూ కొంతకాలం చదువుకుంటుంది. సుషమతోపాటే పెళ్ళి చేసుకొని నాకోడలి అధికారంతో అక్కడే వుంటుంది. ఏమంటావు? రాం స్నేహితుగా యిది నా కర్తవ్యంగా, నా బాధ్యతగా భావిస్తున్నాను. సుషమ గంగాపూర్ వస్తుంది. మధు కలకత్తా వస్తుంది. ది స్టైట్ ఛేంజ్. ఓ కూతురి స్థానాన్ని మరో కూతురు వస్తుంది. ఏమంటావ్ చంద్రం? ఏవోయ్ శేఖర్ ఎలా వుందంటావ్ నా ఆలోచన?" అంటున్న శ్రీధర్‌గారికి శేఖర్ ఏం సమాధానం చెప్పాలో నిర్ణయించుకునే లోపలే, చంద్రం అందుకున్నాడు. "మావయ్యగారూ! నేను మీకు వ్యతిరేకంగా ఆలోచిస్తున్నా ననుకోకపోతే ఒక్క మాట. మధును, శిరీష్‌ను పెళ్ళి చేసుకొనే విషయమై అడిగి చూశాను. అసలు తను పెళ్ళికి సుముఖంగా లేదు. అప్పట్లో పిన్ని బాధ్యత శ్యాం బాధ్యత, దృష్టిలో వుంచుకొని కూడా అలా అని వుండవచ్చు. ఏమైనా మళ్ళీ యీ విషయాలు మాట్లాడాలంటే కొంత టైమ్ కావాలి. పిన్ని పోయిన షాకు నుంచి యింకా పూర్తిగా తేరుకోలేదు మధు. ఇంకో రెండు మూడు నెలల వరకు మధుకు భవిష్యత్‌ను గురించిన ఆలోచనలు కలగకుండా చేయడం మన

విధి. మళ్ళీ కలకత్తా వెళ్ళినా అక్కడి విషాద స్మృతులు మధును బాధించ వచ్చు. తన ఆరోగ్యంమీద మరీ దెబ్బ తీయవచ్చు. అందువల్ల యిప్పట్లో మధుకు ఆ ఆలోచన కలగకుండా యిక్కడే వుంచేస్తే కొన్నాళ్ళకు అన్నీ మర్చిపోయే అవకాశముంది. అప్పుడు మధు యిష్టప్రకారం చెయ్యవచ్చు.

మీరు మరోలా అనుకోనంటే... కొన్నాళ్ళపాటు మా పెళ్ళి కూడా వాయిదా వేయాలని నా కోరిక. మధు యిలా ఉండగా నాకు పెళ్ళి చేసుకోవా లనిపించడంలేదు. అంతక్రితం ఎవరి కెవరమో తెలీకపోయినా ఈ అయి దేళ్ళలో మధు మా కందరికి ఎంతో సన్నిహితురాలైంది. బాంధవ్యం బావని చేసినా నేను మధునెప్పుడూ మా శాంత లాగే అభిమానించాను. ఒక చెల్లెలి పెళ్ళి చేసి, మరో చెల్లెలికి పెళ్ళి కాకుం డానే గృహస్థునయ్యేంత స్వార్థపరుణ్ణి కాలేను. మావయ్యగారూ ! పిన్నీ బాబాయి ఎవరున్నా నాకింత బాధ్యత తీసుకోవలసిన అవసరంలేదు. కానీ యిప్పుడు తప్పదు......నన్ను క్షమిం చండి. సుషమతో కూడా చెప్పండి నన్ను క్షమించమన్నా నని. ఎన్నాళ్ళైనా, ఎన్నేళ్ళైనా మధు పెళ్ళి తర్వాతే నా పెళ్ళి. నా కోసం సుషమని ఆగమని చెప్పటం నా స్వార్థమే అవుతుంది. ఆమె అలా ఆగగల్గితే అది నా అదృష్టంగా భావిస్తాను" అంటున్న చంద్రం గొంతు అణచిపెట్టుకుంటున్న బాధతో విచిత్రంగా ధ్వనించింది.

శేఖర్ తృప్తిగా ఆనందంగా చూసాడు చంద్రంవైపు. శ్రీధర్‌గారు ప్రశంసాపూర్వకంగా చంద్రం వీపు తడుతూ "అలాగే చంద్రం ! నీ యిష్ట ప్రకారమే కానివ్వు. యిప్పట్లో మధుతో ఆ విషయా లేమీ చెప్పను. పదిరోజు లకు నేను రావడానికి వీలుకాకపోతే శిరీష్‌నూ, సుషమనూ పంపిస్తాను. వస్తే ముగ్గురం వస్తాం మరి వెళ్ళొస్తాను శేఖర్" అంటూ ముందుకు నడచిన శ్రీధర్ గారిని అనుసరించి చంద్రం శేఖర్‌లు ఆయన్ని బస్సెక్కించి వచ్చేశారు.

* * *

"మనసులోని ద్వేషాన్ని మరుగు పర్చడం ఎలా కష్టమో మనస్సులోని మమతల్ని మరల్చడం కూడా అంతే కష్టం." మధు ఆలోచనల నుంచి మనసును మరల్చుకోవాలనుకునే శేఖర్ ప్రయత్నం, ప్రయత్నంగానే వుండి పోయింది. రోజు కొక్కసారైనా వెళ్ళి మధును చూసి పలకరించిరాందే మనసుకు శాంతి కలగటంలేదు.

ఈ వారం రోజుల్లో శేఖర్ మనసే మిటో పూర్తిగా అర్థమైంది చంద్రానికి. ముఖ్యంగా శ్రీధర్‌గారు వచ్చిన రోజు జరిగిన సంఘటనతో కొంత అర్థమైనా,

మధుమీద యింతటి ఆరాధన, ప్రేమ పెంచుకున్నా డనుకోలేదు. అయినా శేఖరెక్కడ ? మధు ఎక్కడ ? తను ఎలా వూహించగలుగుతున్నాడు ? ఈ బంధం శాశ్వత మయ్యేదేనా ? రావు బహద్దూర్ రఘుపతిరావుగారి ఏకైక పుత్రుడు శేఖర్. అంతటి ఆస్తికి ఏకైక వారసుడు. మధు...తల్లీ దండ్రీ ఆఖరికి ఆదరించిన ఆత్మీయుల్ని కూడా పోగొట్టుకున్న దురదృష్టవంతురాలు, అనాధ. ఈ పెళ్ళికి రఘుపతిరావు గారి నొప్పించడం ఎవరికీ సాధ్యం కాదు. ఆ విషయం శేఖర్‌కు తెలీదా ? తెలిసీ యింతగా అభిమానాన్ని పెంచు కుంటున్నాడెందుకు మధు మీద ? మధు కూడా శేఖర్ మీద అదే అనురాగం వుందా ? ఏమో ?? అది చంద్రం వూహ కందటంలేదు. ఒకవేళ మధూ, శేఖర్ ల మధ్య అనురాగం వాళ్ళు పరిచయమైన తొలి క్షణం నుంచీ వుందేమో ! తనే గ్రహించలేదేమో ! ! ఆలోచనలతో చంద్రం బుర్ర వేడెక్కి పోతుండగానే శేఖర్ వచ్చాడు.

నెమ్మదిగా లేచి శేఖర్‌ను అనుసరించాడు చంద్రం. యిద్దరి మధ్యా మౌనం రాజ్యం చేస్తోంది. ఆఖరికి మౌనాన్ని ఛేదిస్తూ శేఖర్ మాట్లాడాడు.

"చందూ ! రేపే కదూ పెద్ద కర్మ ? శ్రీధర్ అంకుల్ ఏమైనా లెటర్ వ్రాశారా ? వస్తున్నారా ?" తలెత్తి శేఖర్ వైపు చూసిన చంద్రానికి శేఖర్‌లో చాలా మార్పు కనిపించింది. మొట్ట మొదటిసారిగా డిగ్రీ పూర్తిచేసుకొని పురకలువేసే వుత్సాహంతో జలపాతంలా గంగాపూర్‌లో దూకిన శేఖర్‌కూ... నిరాశా, నిస్పృహలతో ఏదో పోగొట్టు కున్నట్లు దీనంగా వున్న ముఖం పొలాల వెంట అతిగా తిరగడంతో తెల్లటి శరీరం, రంగు మారి, గోధుమ వర్ణానికి తిరిగింది. అలసట అణువణువునా జీర్ణించుకున్నట్లున్న శేఖర్‌ను చూస్తుంటే చంద్రం మనస్సు జాలితో నిండిపోయింది.

నెమ్మదిగా శేఖర్ చుట్టూ చేయివేసి, "అవును శేఖర్ రేపే పెద్ద కర్మ. శ్రీధర్‌గారు రావడం లేదుట. ఆఫీసులో ఏదో యిన్స్పెక్షను వుందట శిరీష్, సుషమ వస్తున్నారని వ్రాశారు బహుశా రేపు తెల్లవా రీపాటికి వస్తారేమో !" అని ఓ క్షణం ఆగి, "శేఖర్ ఒక టడుగుతాను నిజం చెప్పు. ఇన్నాళ్ళ స్నేహంలో నువ్వు నా దగ్గర దాచిం దేదీ లేదు. నీ మనసులోని బాధేవిటిరా?" అంటూ శేఖర్‌ను తనవైపు తిప్పుకొని నిలదీస్తున్న ట్లడుగుతున్న చంద్రం కళ్లలో ప్రతిఫలించిన ఆపేక్షకు శేఖర్ మనస్సు చలించింది.

"చెబుతానురా చందూ ! నీకు గాక నా బాధ మరెవరికి చెప్పుకోను ?" అంటూ అంత కాలంగా తన మనస్సును

మధస్తున్న విషయం, తన అంతరంగాన ప్రేమతరంగాలు సృష్టించి, తన హృదయ స్పందనగా మారిన మధును తను మర్చిపోలేక పడుతున్న బాధ, అన్నీ వివరంగా చంద్రంతో చెప్పేసి బరువు దించుకున్నట్లు ఫీలయ్యాడు శేఖర్. ఎన్నాళ్ళని బాధను మనసున దాచి భరించగలడు ? ఆత్మీయుడైన చంద్రం ముందు తన హృదయఘోష విన్పించిన తర్వాత కొంత మనశ్శాంతి కలిగినట్లైంది. మౌనంగా శేఖర్ చెప్తున్న మాట లింటూ అతని మథనను అర్థంచేసుకోడానికి ప్రయత్నిస్తూ గంగానదీ తరంగాల్లోకి దృష్టి సారించి ఆలోచిస్తున్న చంద్రం తొడపై తల పెట్టుకొని యిసుకలో వెల్లకిలా పడుకుని నీలిమాకాశంవైపు చూస్తూ రిలీఫ్‌గా ఫీలవుతున్నాడు శేఖర్. చాలా రోజుల తర్వాత మనసుకు, శరీరానికి కొంత విశ్రాంతి లభించి నట్లైంది.

"శేఖర్ ! నువ్వు మధును పెళ్ళి చేసుకుంటే ... హృదయపూర్వకంగా ఆశీర్వదించి, ఆనందించే మొట్టమొదటి వ్యక్తిని నేనే. మొన్న శ్రీధర్‌గారితో నేను చెప్పిన మాటకూడా విన్నావు. అయితే నాన్నగారిని యీ పెళ్ళికి ఒప్పించడం మన మనుకున్నంత తేలిక కాదు. రఘుపతి నాన్నగారి పంతాలు పట్టుదలలు నాకు తెలియనివి కావు ఆయన తన పంతాన్ని ఎలా నెగ్గించు కోగలరో నాకు వూహ తెల్సినప్పటి నుంచీ చూస్తున్నాను. నీ ఆశ నెరవేరాలని నా కోరిక. అయితే అది మన మను కున్నంత తేలికగా నెరవేరేది కాదని నా అభిప్రాయం," అంటున్న చంద్రం మాటలను మధ్యలోనే తుంచేస్తూ లేచి కూర్చున్నాడు శేఖర్.

"చందూ ! నాకు నాన్నగారిమీద నమ్మక ముంది. ఆయన యింతవరకూ నా యిష్టానికి వ్యతిరేకంగా ఏదీ చేయలేదు. చదువు విషయంలో కూడా ఆయన నా యిష్టప్రకారమే చదివించారు. ఆయనకు నన్ను యింజనీర్ని చేయాలనే కోరిక మొదటినుంచీ వుండేది. కానీ నేను చిన్నప్పటినుంచీ పొలం పనులమీద యింట్రెస్ట్ చూపేవాడిని. గోపాలం గారిని నాకు తోచిన ప్రశ్న లన్నీ వేసే వాడిని. నా అర్థంలేని ప్రశ్నలకు చిరు నవ్వుతో ఆయన వోపిగ్గా సమాధానాలు చెబుతుండేవారు. నాన్నగారు నన్నక్కడి నుంచి లేపి, వెళ్ళి చదువుకొమ్మని విసుక్కునేవారు. నాకు వూహ తెల్సిన తర్వాత ఆయన ఏనాడూ నా ఇష్టానికి వ్యతిరేకంగా ఏ పనులూ చేయలేదు. యీ విషయంలో కూడా నాన్నగారు నా యిష్టానికి వ్యతిరేకంగా చెయ్యరనే నా విశ్వాసం."అని నిశ్చయంగా చెబుతున్న శేఖర్‌లోని ఆత్మవిశ్వాసం, తండ్రిపై నున్న అపార నమ్మకం హర్షించ

దగినవే. కానీ ఒక్కసారి పరిస్థితులు మనిషి విశ్వాసంపై దెబ్బతీసి తను వేసే అంచనాలను తలక్రిందులు చేస్తాయి. ఆ దెబ్బకు కొందరు తట్టుకోగలుగుతారు. మరి కొందరు తట్టుకోలేరు. అయినా విధి విచిత్ర విలాసానికి పావులు కాకుండా తప్పుకోడం ఎవరికీ సాధ్యం కాదు అనుకుంటూ,

"మరి... మరి మధు విషయం ! తనసలు వివాహానికే సుముఖంగా లేదుగా శేఖర్ ?" అంటున్న చంద్రం మాటలు అప్పటివరకూ ఎంతో వుత్సాహంగా, విశ్వాసంగా చెబుతున్న తన మాటలన్నీ వృధా అన్పించేలా చేశాయి శేఖర్‌కు. అయినా మాటలు కూడదీసుకుంటూ నెమ్మదిగా చెప్పాడు.

"చందూ ! ప్రస్తుత పరిస్థితుల్లో మధును ఆ విషయమై ప్రస్తావించి, చికాకు పర్చడం నాకూ యిష్టంలేదు. కొన్నాళ్ళు పోయిన తర్వాత ఈ దుఃఖాన్ని మరపించి నేను మధును నా దాన్నిగా చేసుకోగలనన్న గట్టినమ్మకముంది. అందుకు స్నేహితుడిగా, మధుకూ, నాకూ, హితుడిగా, నీ సహకారం కావాలిరా" అంటూ అర్థింపుగా చూస్తున్న శేఖర్ చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని ఆప్యాయంగా నొక్కుతూ-

"తప్పకుండా వుంటుంది శేఖర్ ! నేను శ్రీధర్‌గారికి యిచ్చిన నా మాట ప్రకారం మధుకూ నీకూ వివాహమైన తర్వాతే నా వివాహం. సరేనా?" అంటున్న చందూని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు శేఖర్. ఇద్దరూ లేచి ఓరకమైన తృప్తితో యిళ్ళకు బయలుదేరారు.

సావిత్రమ్మ కర్మకాండలన్నీ పూర్తయ్యాయి. ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు. శాంతను మరో రెండురోజులుండమని ఆపేశాడు చంద్రం. రాజేశ్వర్ వ్యాపారం గొడవలేవో వున్నాయని వెళ్ళిపోయాడు. తనకు చాతనైనంతలో కర్మకాండ గొప్పగానే ముగించాడు చంద్రం. తల్లి తర్వాత తల్లి సావిత్రమ్మ మరణం చంద్రాన్ని చాలావరకూ కృంగదీసింది. అయినా ధైర్యంగా తిరుగుతూ నేర్పుగా పనులన్నీ చేయిస్తున్నాడు. తండ్రిద్వారా విషయాలన్నీ వినివున్న సుషమకు చంద్రంవైపు చూస్తుంటే అతను తనకంటే ఎంతో వున్నతుడుగా తను అందుకోలేని ఆదర్శశిఖరాల నధిరోహించిన ఆదర్శపురుషుడిగా కన్పిస్తున్నాడు. ఏకాంతంగా కల్సుకొని మాట్లాడాలంటే ఆ హడావుడిలో అందరిమధ్యా అవకాశం కలగటంలేదు.

రాగానే మామూలు పలకరింపులయ్యాయి. తనకు ఏడ్చేవాళ్ళను ఎలా వోదార్చాలో తెలీదు. గంభీరంగానో, శోకదేవతలాగో కూర్చుని వుండే మధు దగ్గర కూర్చోవాలంటే మరీ భయంగా వుంది. కాలం స్తంభించినట్లుంది. ఇంత క్రితం రెండుసార్లు గంగాపూర్ వచ్చినా,

ఆ అనుభవంలోని అనుభూతులు అనుక్షణం ఆనందం కల్గించేవిగా వుండేవి. ఏటి వొడ్డున షికార్లు, మామిడి తోటల్లో చిన్నపిల్లల్లా వేసిన గంతులు, శాంత పెళ్ళిలో చేసిన అల్లరీ, అప్పుడప్పుడు కావాలని చంద్రం బెదిరిపోతున్నా అల్లరిగా అతన్ని ఏడిపించాలని తను దగ్గర కెళ్ళి కూర్చోవడం అతను భయంగా ఎవరైనా చూస్తున్నారేమోనని చుట్టూ చూడటం, అంతలోనే ఆపుకోలేని ఆవేశంతో ఆ విశాలమైన బాహువుల్లో యిముడ్చుకొని వుక్కిరిబిక్కిరి చేయడం, తను తప్పించుకొని పారిపోవడం చూసి చంద్రం అల్లరిగా నవ్వడం...తను వెక్కిరిస్తూ ముందుకు పరుగెట్టడం, అది మధూ కనిపెట్టి ఏడ్పించడం లాంటి మరపురాని మధురాతి మధుర స్మృతులే మిగిల్చింది గంగాపూర్.

కానీ యిప్పటి పరిస్థితి సుషమ వూహకందనిది. ఆ యింటినీ ఆ వూరినీ, ఏదో నిశ్శబ్దత లాంటిది ఆవరించినట్లుంది ఆ వాతావరణంలో వూపిరాడనట్లుగా వుంది సుషమకు. శిరీష్‌కు రోజంతా శేఖర్ వాళ్ళింటికి వెళ్ళి, బజార్ల వెంట తిరిగి ఎలాగో ప్రొద్దుపోయేది. తండ్రి తను వచ్చేటప్పుడు మధును కనిపెట్టుకొని వుండమని, మధుకు సంతోషం కలిగించేట్లుగా వుండమని మరీ మరీ చెప్పడంవల్ల ఎటూ వెళ్ళలేకపోతోంది సుషమ. ఒకసారి మాత్రం శేఖర్‌తో వాళ్ళింటికి వెళ్ళి వచ్చింది. శ్యామలాదేవి కూడా ఓ సారి వచ్చి మధును పలకరించి వెళ్ళారు. శాంత కూడా సంతోషంగా తిరగటంలేదు. శాంత పెళ్ళిలో సావిత్రమ్మగార్ని తనూ చూసింది. సుషమ. అప్పటికే ఆవిడ చాలా నీరసంగా కన్పించారు.పదిరోజులైనా ఆ యింట్లో అందరూ అంతగా మర్చిపోలేకుండా వున్నారంటే ఆవిడ ప్రభావం వాళ్ళమీద ఎంత వుందో అర్థంచేసుకోగలదు మధు మామూలుగా మాట్లాడుతున్నా, మునుపటి కళాకాంతులు ముఖంలో కన్పించడంలేదు. వుత్సాహం వురకలువేసే మధులో ఏదో పెద్ద మార్పు వచ్చినట్లుగా అన్పించింది.

సుషమ, శిరీష్ వచ్చి మూడురోజులైంది. కానీ సుషమకు మూడు యుగాలైనట్లుగా వుంది. శేఖరన్నయ్యలో కూడా ఏదో మార్పు కన్పిస్తోంది. ఆలోచిస్తూ ఒంటరిగా దక్షిణపు గదిలో పడుకున్న సుషమ ముఖంమీద చిరుజల్లులా నీళ్ళు పడటంతో కళ్ళు విప్పి చూసింది. ఎదురుగా చంద్రం నిలబడి వున్నాడు. చేతిలో గ్లాసు. చిన్నగా నవ్వుతూ "ఏం సుషమా ! నీ సుందర స్వప్నాన్ని చెదరగొట్టలేదు కదా ?" అంటూ నీళ్ళగ్లాసు చేతి కిచ్చాడు.

"ఏమిటిది ?" అంటూ గ్లాసందుకున్న సుషమ నిమ్మకాయరసం చూసి "మీరు

తెచ్చారెందుకూ? నేను తెచ్చుకునే దాన్నిగా" అంది.

"ఆహా! ఫర్వాలేదే బస్తీ అమ్మాయికి పనలొచ్చన్నమాట" అంటూ చిలిపిగా నవ్వుతున్న చంద్రాన్ని చూసి, వచ్చాక మూడు రోజులకు మనస్ఫూర్తిగా నవ్వింది సుషమ. "కూర్చోండి" అంటూ మంచం వైపు చూపించింది.

"అహా! అమ్మో! అప్పుడే!... నాకంత ధైర్యంలేదు. నిజం చెప్పాలంటే నా పైద నాకు నమ్మకంలేదు. వూరికే నీకు దగ్గరగా చూస్తూ కూర్చోవాలంటే...నీ సమక్షంలో అది నాకు సాధ్యమయ్యే పనికాదు దేవీ!" అంటూ నెమ్మదిగా బుగ్గన ఓ చిటిక వేసి, యింతలో శాంత పిలవడంతో త్వరగా బయటకు వెళ్ళిపోయాడు. సుషమకు మళ్ళీ శరీరంలోకి ప్రాణ మొచ్చినట్లుగా అన్పించింది. మనసు ఆనందంతో తేలిపోతుంటే లేచి చావిట్లోకి వెళ్ళింది. ఎదురుగా శాంత వస్తూ..."ఎక్కడికి వదినా?" అని అడిగింది.

"అబ్బ! వదినా, గిదినా అనకపోతే సుషమా అనలేవూ?" అంటూ విసురుగా వెళ్ళిపోయింది.

ఆశ్చర్యంగా సుషమ వెళ్ళినవైపే చూస్తుండిపోయింది శాంత.

తన సంతోషానికి అంతరాయాన్ని కల్గించిన శాంతమీద కోప మొచ్చి విసుక్కుందే కాని తర్వాత తను తప్పుగా అన్నానని బాధపడింది సుషమ. మధ్యాహ్నానికి శేఖరింటినుంచి యిల్లు చేరిన సుషమకు మనసులో ఏదో సంకోచంగా వుంది. శాంత ముఖం చూడాలంటే. తనలా విసుక్కోని వుండవల్సింది కాదు. వాళ్ళన్నయ్యను పెళ్ళి చేసుకోబోయే తను వదిన కాక మరేమౌతుంది శాంతకు. పాపం! తనలా అన్నందుకు శాంత ఎంత బాధపడిందో? ఆలోచిస్తూ మధు గదివైపు అడుగులు వేసిన సుషమ వాకిట్లోనే ఆగిపోయింది.

లోపల్నించి చంద్రం బుజ్జగింపుగా మాట్లాడుతున్న మాటలు విన్పిస్తున్నాయి.

"తిను మధూ! ఎన్నాళ్ళిలా వుంటావు? నువ్వు సరిగ్గా భోంచేసి ఎన్ని రోజులైందో తెల్సా? పిన్నీ, బాబాయి పోతే నీకింక ఎవ్వరూ లేరని నువ్వెందుకనుకోవాలి? నీకు నేను లేనా మధూ! నీకెప్పటికీ తోడు నీడగా నేనుంటాను మధూ! ధైర్యంగా వుండాలి. నువ్వు దిగులుగా వుంటే శ్యాం కూడా ముఖం విప్పి తిరగటంలేదు. నా మాట విను మధూ, కొంచమైనా తిను." అంటూ పళ్ళెంలోంచి ఓ ముద్ద చేతిలోకి తీసుకొని మరో చేత్తో మధు గడ్డం పట్టుకొని బ్రతిమిలాడుతున్నాడు.

మధు అవిరామంగా కురుస్తున్న

కన్నీళ్ళను తుడుచుకొనే ప్రయత్నం కూడా చేయకుండా చేతుల్లో తల దాచుకొని ఏడుస్తోంది. శోకమూర్తిలావున్న మధు తలపై చేయివేసి నిమురుతూ "మధూ ! నా మాట వింటావా లేదా ? సరే నేను కూడా లేననుకుంటే, నీ యిష్టమొచ్చినట్లు నువ్వుండు" అంటున్న చంద్రం నోటికి చెయ్యడ్డంపెట్టి-

"ఒద్దు బావా ! అంత మాటనకు. తింటాను" అంటూ పళ్ళెం చేతుల్లోకి తీసుకుంది.

చెమ్మగిల్లిన కళ్ళను వొత్తుకుంటూ పై పంచతో ముఖం తుడుచుకుంటూ బయటకు అడుగువేయబోయిన చంద్రం వాకిట్లో శిలాప్రతిమలా నిలబడిపోయిన సుషమను చూసి నవ్వడానికి ప్రయత్నిస్తూ "అరే ! సుషమా ! ఎంతసేపైంది నువ్వొచ్చి ? యింకా భోజనం చేయలేదు కదూ ! పద పద భోంచేద్దాం. శిరీష్ ఎక్కడ ?" అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తూ వంటింటివైపు వెళ్ళిపోయాడు. ఒక్కసారి వెనక్కు తిరిగి సుషమ వైపు చూసి వుంటే...అంత మామూలుగా వెళ్ళిపోయుండేవాడు కాదు చంద్రం.

భోజనానికి కూర్చున్నారంతా. శాంత వచ్చింది సుషమను పిలవడానికి. ఓ క్షణం తటపటాయించి "సుషమా ! భోజనం చేద్దురుగాని రండి. అన్నయ్యవాళ్ళు



కూర్చున్నారు.మిమ్మల్ని పిలుస్తున్నారు" అంది తల వంచుకొని శాంత.

తనంతక్రితం అన్న మాట వల్లే శాంత అలా పిల్చినా ఒక్కసారిగా తను పరాయిదాన్ననే భావం కలిగింది. తనను వాళ్ళంతా చాలా దూరం చేస్తున్నట్లుగా అన్పించింది. ఇంతలో మధు వున్న గదిలో కెళ్ళిన శాంత "వదినా పెరుగు తీసుకు రానా ? నేనంతసేపు బ్రతిమిలాడినా భోంచేయలేదు. అన్నయ్య చెబితే తింటు న్నావు కదూ !" అంటోంది. అప్పటికే అసూయా జ్వాలల్లో దహించుకుపోతున్న సుషమను ఈ మాటలు మరింత దహించి వేస్తాయని తెలిస్తే శాంత అలా అని వుండదు. గిర్రున అక్కడినుంచి తమ కోసం ఏర్పాటు చేసిన దక్షిణపు గదిలోకి వెళ్ళిన సుషమ బాగ్ సర్దటం మొద లెట్టింది. లోపల్నుంచి చంద్రం పిలుస్తు న్నాడు "శాంతా ! శాంతా !" లోపలి కెళ్ళిన శాంతతో "సుషమ ఏదమ్మా ! భోజనానికి రాలేదేం ?" అన్నాడు. తల వంచుకొని భోంచేస్తున్నాడు శిరీష్. 'సుషమను నేను పిలవను. నువ్వే పిలు వన్నయ్యా' అనాలన్పించినా శిరీష్ ముఖం చూసి ఆపుకొని "పిలిచా నన్నయ్యా ! తనెందుకో దక్షిణపు గది లోకి వెళ్ళింది."

మాటలన్నీ వినిపిస్తూనే వున్నాయి సుషమకు. బాగ్ అక్కడ పడేసి మంచ మెక్కి పడుకుంది. కన్నీళ్ళు ఆపుకుందా మన్నా ఆగటంలేదు.

"నీకు ఎవ్వరూ లేరని నువ్వెందుకు బాధపడాలి ? నీకు నేను లేనా మధూ !" ప్రపంచంలో వున్న ప్రేమంతా ఆ రెండు మాటల్లో నింపుతూ చంద్రం అన్న ఆ మాటలే పదే పదే చెవుల్లో మారుమోగుతున్నట్టై తలగడలో తల దూర్చి వెక్కి వెక్కి ఏడుస్తోంది సుషమ. తను మనసిచ్చిన వాడిమీద తనెరిగిన మధుమీద నమ్మకం లేకుండా అతి సాధారణమైన ఆడపిల్లలా అతి వలందరికీ వుండే మామూలు అసూయా ద్వేషాలతో మనసు నింపుకొని ఆక్రో శిస్తోంది, ది సోకాల్డ్ సివిలైజ్డ్ జంటిల్ మాన్ శ్రీధర్స్ డాటర్. కాలేజీ చదువులు చదువుకున్నా....సంస్కారహీనురాలిలా విలపిస్తోంది.

చంద్రం అన్నంచేత్తో అలాగే లేచి వెళుతుంటే శిరీష్‌కు కోపం వచ్చింది, ఎంతకూ రాని చెల్లెలిమీద. సుషమ వున్న గదిలో అడుగుపెట్టిన చంద్రానికి ఆశ్చర్యంతో నోటమాట రా లే దు. 'సుషమ ఏడుస్తోందెందుకు ? ఎవరే మన్నారు ?' దగ్గరగా వెళ్ళి "సుషమా" అని పిలిచాడు. తలెత్తి కూడా చూడ లేదు. చంద్రానికి ఖంగారుగా వుంది విషయమేమిటో అర్థంకాక. సుషమ భుజం పట్టుకొని తనవైపు తిప్పుకుంటూ "సుషమా ! ఏం జరిగింది ? ఎందు కేడుస్తున్నావు ? ఎవరేమన్నారు ? నే నేమైనా పొరపాటుగా మాట్లాడానా ?

శాంతేమైనా నొప్పించిందా? మధు ఏమైనా అందా?" అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడు. ఆదుర్దాగా, అమాయకంగా, ఆప్యాయంగా, అలా అడుగుతున్న ఆ కంఠం వింటుంటే తన అనుమానాలన్నీ ఆధారం లేనివేమో అన్పించిందో క్షణం కళ్ళు తుడుచుకుంటూ లేచి కూర్చుంది సుషమ. "తర్వాత మాట్లాడుకుందాం, భోంచేద్దాం రా సుషమా! శిరీష్ ఎదురుచూస్తున్నాడు" అంటున్న చంద్రం వైపు చూడకుండా బయటకు చూస్తూ సమాధానం చెప్పింది.

"నాకాకలిగా లేదు. మీ రెళ్ళి భోంచేయండి." అలిగిన చిన్నపిల్లలా మూతి ముడుచుకుని మాట్లాడుతున్న ఆ ముచ్చటైన ముఖం చూసి, చంద్రానికి ఓసారి దగ్గరకు లాక్కొని ముద్దుగా ముడిచిన ఆ ముచ్చటైన పెదాలమీద ముద్ర వేయాలనిపించింది. అది సమయం కాదని హాస్యంగా" పోనీ, నేను కలిపి తీసుకొచ్చి గోరుముద్దలు తినిపించనా ఎంచక్కా?" అంటున్న చంద్రం వైపు కోపంగా చూస్తూ "తినిపించేవాళ్ళకు తినిపించండి ఎంచక్కా నాకెందుకూ!" అంటూ విసురుగా లేచి వాకిట్లో కెళ్ళిపోయింది.

సుషమ మాటల కర్థమేవిటో? ఎందుకలా అంది? ఆలోచనలతో, అయోమయంగా, అక్కడే ఎండిపోతున్న చేత్తో నిలబడ్డ చంద్రంతో, భోంచేసి చేయి తుడుచుకుంటూ వచ్చిన శిరీష్ "అదేవిటి? అలా నుంచుండిపోయారేమిటి? సుషమేదీ? దానికి ఆకలేస్తే అదే తింటుందిగానీ మీ భోజనం కానీండి, చంద్రం. నేను ఆకలికాగలేను. ఎంత సేపటికీ మీరు వచ్చే సూచనలు కన్పించకపోతే, నా భోజనం కానిచ్చేశాను" అన్నాడు.

"ఫర్వాలేదు శిరీష్!..." అంటూ లోపలి కెళ్ళిన చంద్రం చెయ్యి కడుక్కోడం చూసి, "అదేంటన్నయ్యా! భోంచేయవేం?" అంది శాంత ఆదుర్దాగా. "ఈ పూట ఎందుకో నాకు ఆకలిగా లేదమ్మా!" అంటూ బయటకు వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రమే బయలుదేరుదామంటున్న సుషమ వైపు విచిత్రంగా చూశాడు శిరీష్. అదేవిటి? నాన్నగారు నాల్గురోజుల్లో వచ్చేయమంటే కనీసం పదిరోజులైనా పడుతుంది డాడీ! అని చెప్పొచ్చి అంతలోనే కలకత్తా మీదకు గాలి మళ్ళిందా?" అన్నాడు నవ్వుతూ. ఆ సాయంత్రం వరకూ ఎవరితోనూ మాట్లాడలేదు సుషమ. అందర్నీ తప్పుకొని తిరిగింది. తన మనసేవిటో తనకే అర్థం కావడంలేదు. తండ్రి, "చంద్రం మధు పెళ్ళయ్యేంతవరకూ తనూ పెళ్ళి చేసుకోనన్నాడు" అని చెప్పినప్పుడు చంద్రం ఔన్నత్యాన్ని తలుచుకొని

మురిసిపోయింది. ఎవరో బాబాయి మేనగోడలి మీద అంతటి అభిమానంతో బాధ్యత స్వీకరించి అలా చెప్పాడన్న ప్పుడు అంతటి విశాలహృదయుడు తన వాడవబోతున్న అదృష్టానికి పరవశిం చింది. అతనికోసం జీవితాంతం ఆగ వలసి వచ్చినా తన కభ్యంతరం లేదని తండ్రిముందు నిర్భయంగా చెప్పింది. అదే వ్యక్తి మధుమీద చూపుతున్న ఆదరణ, ఆప్యాయతల్ని సహృదయంతో అర్థంచేసుకోలేకపోతోంది." మనస్సు కోతిలాంటి దంటారు. ఒక్కోసారి మంచిగా, మరోసారి చెడ్డగా, ఒకే విషయాన్ని వివిధ కోణాల్లో చూసి విమర్శించడం బహూశా ఆ మనసుకే చెల్లుతుందేమో ! !

అన్నయ్య అడిగిన ప్రశ్నకు సమా ధానం చెప్పలేదు సుషమ. "ఓ. కే. యాజ్‌యు" లైక్, అంటూ తన బాగ్ తీసుకొని సర్దుతున్న శిరీష్, శేఖర్ పిలుపుతో పని ఆపుజేసి వెనక్కు తిరి గాడు. "శిరీష్! త్వరగా కానివ్వరా వెళ్ళి పోదాం" అంటున్న శేఖర్ వైపు చూసి నవ్వుతూ" ఓహో నువ్వూ వస్తున్నా వన్నమాట ? అదీ కథ ! ఇంత హఠాత్తుగా చెల్లెమ్మగారికి చదువుమీద యింత యింటరెస్ట్ ఎలా పుట్టిందా అని నే నాలోచిస్తున్నాను." అంటూ సుషమ వైపు చూశాడు నవ్వుతూ. దగ్గరగా వచ్చి వీపున ఒక్కటి చరిచి "ఒరేయ్ ! నే నెక్కడికీ రావడంలేదురా. మీరు మా యింటి కొస్తున్నారు. ఇంక సుషమ చదువువిషయ మంటావా ? మనకంటె వెయ్యిరెట్లు'నయం. ఏం సుషమా ?" అంటూ నిర్మలంగా నవ్వుతున్న శేఖర్ వైపు చూస్తూ "మళ్ళీ మీ యింటి కెందుకన్నయ్యా ! రోజూ వస్తూనే వున్నాము కదా ! ఇవ్వాళ వెళ్ళిపోదా మనుకుంటున్నాం కలకత్తా" అంటున్న సుషమ ఎదురుగా గుమ్మంలో కన్పించిన చంద్రాన్ని చూసి మాట మధ్యలోనే ఆపేసింది.

మధ్యాహ్నం అతను తన మూలంగా భోజనం చేయకుండా వెళ్ళాడని తెలిసి, మనసు పశ్చాత్తాపంతో నిండిపోయింది. తను చేసిన తెలివితక్కువతనానికి తనలో తానే సిగ్గుపడుతోంది సుషమ. శేఖర్ చంద్రంవైపు తిరిగి "ఒరేయ్ చందూ ! ప్పీళ నేమిటిరా అప్పుదే బిఛాణా కట్టించేస్తున్నావు. మళ్ళీ యిప్పు డొదిలావంటే యింకో ఆరునెల్లవరకూ కన్పించరు. అంతవరకూ గ్యారంటీగా చెప్పగలను చందూ ! నీకు మరో విశేషం తెల్సా ? త్వరలో మన శిరీష్ అమెరికా అమ్మాయిని పెళ్ళిచేసుకో బోతున్నాడట. అమెరికా వెళ్ళి సెటిల్ అవ్వాలని వాడి ప్లాను. శేఖర్ చెబుతున్న మాటలేవీ విన్పించుకోకుండా వాడిన ముఖంతో సుషమ వైపే తదేకంగా చూస్తున్న చంద్రం-

"ఒరేయ్ దిష్టి తగులుతుంది ఏవిటా చూపు" అంటూ శేఖర్ ఒక్కటి వేశాక గానీ బాహ్య స్మృతి కలగలేదు. మళ్ళీ చెబుతున్న శేఖర్ మాటలు విని "చాలా సంతోషం శిరీష్. నాకు చెప్పలేదేం ?" అంటూ సంతోషంగా శిరీష్ నభినంది స్తుంటే ఆడపిల్లలా సిగ్గుపడిపోయాడు శిరీష్. మబ్బులు విడిపోయినట్లు దానం తటదే ఓ పెద్ద చిక్కు విడిపోయేసరికి చంద్రానికి హాయిగా అనిపించింది శ్రీధర్ గారు మధును కోడలిగా చేసుకునే అభిప్రాయం వ్యక్తపరిచారు. శేఖర్ మధు లేకపోతే మరణమే శరణ్యమనేంత పిచ్చిగా మధును ఆరాధిస్తున్నాడు. వీటన్నింటి మధ్యా శిరీష్ మనసేమిటో, శ్రీధర్ గారికి ఏమి బదులు చెప్పాలో తెలీక నిరంతరం ఆలోచనలతో సతమత మౌతున్న చంద్రానికి శేఖర్ శిరీష్‌ను గురించి చెప్పిన శుభవార్త అత్యంత ఆనందాన్ని కలిగించింది. ఓ క్షణం మధ్యాహ్నం సుషమ అన్న మాటలన్నీ మర్చిపోయాడు.

"శాంతా ! మధూ" అంటూ కేకలు పెట్టాడు. హడావిడిగా లోపలికొచ్చిన శాంత "ఏవిటన్నయ్యా ? మధు వదిన పడుకునుంది" అంటుంటే బదులేం చెప్పాలో అర్థంకాక అయోమయంగా అయిపోయి "ఏం లేదమ్మా. కాఫీ కలిపి పట్రా" అన్నాడు. మౌనంగా లోపలి కెళుతున్న శాంతను చూసి తనూ బయటకు వెళ్ళబోయింది సుషమ.

"తమ రెక్కడికి ? తమరిలా కూర్చోండి" అంటూ చెయ్యిపట్టుకులాగి మంచంలో కూలేశాడు చంద్రం. వెనక్కు తిరిగిచూసిన శాంత, నవ్వుతూ వెళ్ళి పోయింది. శేఖర్, శిరీష్ కూడా నవ్వడం చూసి వుక్రోషంగా చూసింది చంద్రంవైపు.

చిన్నగా నవ్వుతూ "సారీ సుషమా ! అలా చూడకు. భస్మమయి పోతానని భయంగా వుంది" అన్నాడు అర్థింపుగా. 'ఆ చూపుల్లోని కొంటెతనా నికి నవ్వకుండా వుండటం సాధ్యం కాలేదు, సుషమకు.

మళ్ళీ ఆ రాత్రి చాలా ప్రొద్దు పోయేంతవరకూ మాట్లాడుతూ కూర్చు న్నారు. సుషమా వాళ్ళు కలకత్తా వెళ్ళడం మరో రెండురోజులు వాయిదా పడింది. శేఖర్ వాళ్ళింటికి తీసుకెళతా నంటే చంద్రం వొప్పుకోలేదు. "రోజూ వస్తున్నారు గదా ! ఎక్కడుంటే నేంరా !" అన్నాడు. శేఖర్‌కు సుషమ, శిరీష్ వచ్చిన తర్వాత ప్రత్యేకంగా మధుని పలకరించడానికి సంకోచంగా వుంది. ఈ రోజు శిరీష్ తను ఓ అమెరికా అమ్మాయిని ప్రేమిస్తున్నట్లు, పెళ్ళిచేసుకోబోతున్నట్లు చెప్పి, ఆ విషయం శ్రీధర్ అంకుల్‌కి చెప్పే బాధ్యత తనమీద వేసినప్పుడు మనసు ఆనందంతో గంతులువేసింది

శ్రీధర్ గారి దగ్గర సుషమకున్న చనువు శేఖర్‌కు లేదు. ధైర్యంగా

తనకు కావలసింది అడిగి పొందగలదు సుషమ. శిరీష్ అలా కాదు. తండ్రంటే కొంచం భయం. అందులోనూ యీ ప్రేమ వ్యవహారం కులాంతరమో మతాంతరమో కాక దేశాంతర వ్యవహార మయ్యేటప్పటికి మరింత భయంగా వుంది. తండ్రి ఎదురుపడితే గుండె లబ్ డబ్ లబ్‌డబ్ మని కొట్టుకోడం స్పష్టంగా తనకే విన్పిస్తున్నట్లై తప్పు కొని లోపలికెళ్ళిపోయేవాడు. అందుకే తనవల్ల సాధ్యంకాని పని అని తెలుసు కొనే, సుషమ తర్వాత అంత చనువు గానూ మాట్లాడే శేఖర్‌కు ఆ పని ఒప్ప జెప్పాడు శిరీష్. సుషమతో చెప్పా లంటే తనకంటే చిన్నదానిముందు తన ప్రేమ వ్యవహారం చెప్పాలంటే సిగ్గుగా అన్పించింది. దాని రికమండే షన్ అడిగితే చెట్టెక్కి కూర్చుంటుందని భయం. అందుకే వుపాయం ఆలోచించి అపాయం నుంచి కాపాడమని శేఖర్‌ని అర్థించాడు. ఆ అర్థింపే శేఖర్ పాలిట వరంగా మారింది.

అందరూ కూర్చొని చావిట్లో కబుర్లు చెప్పుకుంటున్నారు. శాంత కూడా వచ్చింది. ప్రొద్దుటి తన ప్రవర్తనకు సిగ్గుపడుతున్న సుషమ శాంత రాగానే వుయ్యాలబల్లమీద ప్రక్కకు జరిగి, తన ప్రక్కన కూర్చోబెట్టుకుంది చిన్నగా నవ్వుతూ. శేఖర్ అడిగాడు, "మధు ఏంచేస్తోంది ఒక్కతే లోపల ?" "ఇందాక పడుకునుంది. నిద్రపోతుందో లేదో చూసొస్తాను" అని లోపలి కెళ్ళింది శాంత

కొంచంసేపటికి బలవంతంగా మధుని తీసుకొని వచ్చింది శాంత. అంతా సరదాగా మాట్లాడుతూ కూర్చొని వుండటంచూసి తనూ చిన్నగా నవ్వ డానికి ప్రయత్నిస్తూ, సుషమ ప్రక్కన వచ్చి కూర్చుంది మధు. మధు చేయి చేతుల్లోకి తీసుకొని చూస్తోంది సుషమ. పాలిపోయినట్లు తెల్లగావున్న ఆ చేతు ల్లోకి చూస్తూ ఏదో ఆలోచిస్తోంది. శాంత పెళ్ళప్పటికీ యిప్పటికీ మధులో చాలా మార్పు వచ్చింది. మొదట చూసి నపుడు చెంగుచెంగున గంతులు వేస్తూ తిరిగిన మధు, శాంత పెళ్ళిలో పంది రంతా తనే అయి తిరిగి, అందరి అవస రాలూ కనుక్కుంటూ, అందరి అభిమా నానికీ పాత్రురాలై తనకు మరింత సన్నిహితురాలైంది. ఇప్పుడు మధును చూస్తోంటే యింత త్వరగా మనిషిలో యింత మార్పు ఎలా సాధ్యమా ? అని ఆలోచిస్తోంది సుషమ మనసు.

ఇంతలో దూరంగా కూర్చున్న శేఖర్ లేచి వుయ్యాలబల్ల దగ్గరగా కుర్చీ వేసుకొని కూర్చుంటూ, "మధూ ! యీ రోజు కులాసాగా వుందా ! జ్వరమేం లేదుకదూ !" అని చిన్నగా అడిగాడు. మాటల్లో మునిగిన శిరీష్ గమనించక పోయినా, చంద్రం క్రీగంట శేఖర్‌ను

గమనిస్తున్నాడు. మధు ప్రక్కనే కూర్చున్న శాంత, సుషమలు కూడా చూస్తున్నారు. శిరీష్ మాటల్లో పడితే అవతలివాళ్ళు వింటున్నారా లేదా అనేది కూడా గమనించడు. ఎక్స్‌ప్రెస్‌లా చెప్పుకుపోతూనే వుంటాడు. కొన్ని మాటలు విన్నా అర్థం కావు. అంత స్పీడ్‌గా మాట్లాడుతాడు. వయసుతో పాటు మనసు పెరగలేదు. కుర్రతనం ఎక్కువ. చిన్నపిల్లాడిలా మాట్లాడు తుంటాడు.

ఓసారి తలెత్తి శేఖర్‌వైపు చూసి వెంటనే తలవంచుకుని, "ఈ రోజు జ్వరంలేదు. మీ నాన్నగారెలా వున్నారు? వారికి మధ్య వంట్లో బావుండటంలే దన్నారు" అంది మధు అతి మెల్లగా. "నాన్నగారు బానేవున్నారు ప్రస్తుతం. నీ ఆరోగ్యం జాగ్రతగా చూసుకో మధూ !" యిలా మెల్లగా సాగిపోతున్న సంభాషణ శాంతకూ, సుషమకూ ఆశ్చర్యాన్ని కలిగించింది. అసలు శేఖర్‌కు ఎదురుగా ఒక్క మధు తప్ప వేరెవ్వరూ లేనట్టు మిగతావాళ్లంతా ఏ బల్లల్లాగో, కుర్చీల్లాగో కనిపిసున్నా రేమో! అనే అనుమానం వచ్చింది చంద్రానికి. శేఖర్ కళ్లలో మెదిలే ఆరాధనాభావానికి కళ్లెత్తి చూస్తే మధుకు పిచ్చెత్తిపోయే దేమో ! అన్పించేంత ఆర్తిగా ఆపేక్షగా చూస్తున్నాడు శేఖర్. ఇన్నాళ్లూ ఇంతటి ఆరాధనను, ఆరాటాన్నీ ఎలా అణచు కున్నాడా ! అని ఆశ్చర్యమేసింది చంద్రానికి.

"ఓ రోజేమైందంటే, మా ఫ్రండ్సుతో కలసి పిక్నిక్‌కు వెళ్ళాలని బయలు దేరాను. ఒకళ్ళు రామకృష్ణ మఠమంటే మరొకరు దక్షిణేశ్వర్ కెళదామని వాద నలు మొదలెట్టారు సరే ఎలాగూ చేతిలో కారుంది కనుక అక్కడికీ యిక్కడికీ కూడా వెళ్దామని బయలుదేరాం. మేం ఆరుగురమే వున్నాం. మొదట రామ కృష్ణా మఠ్‌కు వెళ్ళి, అక్కడికి వచ్చిన టూరిష్ట్ బాచ్‌లను చూసి, స్కూలు పిల్లల్ని చూసి దడుచుకొని దక్షిణేశ్వర్ బయలుదేరాం. అక్కడయినా రద్దీ తక్కువ వుండాలని విశ్వేశ్వరుడిని వేడు కుంటూ ఎలాగో చేరాం. జనం కొంత తక్కువగానే కనిపించారు. అక్కడికి చేరగానే మాతో కొందరికి గంగానది స్నానం చేయాలనిపించింది. 'పాపాత్ము ల్లారా మీరు మునగండిరా గంగలోనే, నేను రాను.' అని నేను తమాషాగా చూస్తూ, కాళ్ళు మట్టుకు నీళ్ళలో వుంచి మెట్టుమీద కూర్చున్నాను యింతలో ఓ ఆడపిల్లల గుంపొచ్చింది. నేను పల్లీలు, చనా తింటూ దర్జాగా కూర్చుని హాయిగా జలకాలాడుతున్న మిగతా ఫ్రండ్సందరినీ చూస్తున్నాను. వచ్చిన అమ్మాయిల్లో యిద్దరు యిండియన్స్ కాదు. మరో అమ్మాయి యిండియన్, బహుశా ఆ అమ్మాయితో వాళ్ళిద్దరూ వచ్చివుంటారు.

వాళ్ళేదో మెట్టుమీద నుంచొని కాళ్ళు కడుక్కుంటూ మాట్లాడుకుంటున్నారు. నన్ను చూసి నవ్వుతున్నారు. నేను భయపడి నీళ్లలోకి దిగలేదని వీళ్లకు ఎగతాళిగా వుంది కాబోలనుకొని కోపంగా వాళ్లవైపు చూసి చేసేదేంలేక నోట్లో పెట్టుకున్న గింజల్ని 'థు' అని వూసేశాను. అంతే ఓ అమ్మాయి చేత్తో సైగచేయడం, మరో అమ్మాయి నన్ను ముందుకు తోసేయడం, నేను నీళ్లలో పడటం, వాళ్ళు కిలకిలా నవ్వుతూ పరుగెట్టడం ఒకేసారి జరిగాయి. నేను నీళ్లలో పడగానే దూరంగా ఈత కొడుతున్న గ్రూపంతా 'పాపాత్ముడు పడ్డాడోయ్' అంటూ నవ్వుతూ వచ్చి నన్ను చుట్టేశారు. వాళ్లకు నిజం చెప్పలేక, పారిపోతున్న అమ్మాయిల్ని పట్టుకోలేక నిస్సహాయంగా వాళ్ల చేతులు విడిపించుకొని "వూరికే మిమ్మల్ని హడలగొట్టాలని దూకానురా !" అన్నాను ఏడవలేక నవ్వుతూ. శిరీష్ వాక్ప్రవాహం ఆగింది. తను చెప్పింది ఎవ్వరూ వినడంలేదని తెలిసేసరికి తనే పగలబడి నవ్వాడు. ఎందుకు నవ్వుతున్నాడో తెలీని చంద్రం శాంతలు అప్రయత్నంగా నవ్వేశారు ఒకళ్ళ ముఖాలు ఒకళ్లు చూసుకొని. "నవ్వు అనేది ఓ అంటువ్యాధి లాంటిది. ఒకళ్ళు నవ్వితే ఇంకొకరు నవ్వకుండా వుండలేరు. ఎదుటి మనిషి నవ్విస్తే కారణం లేకుండానే, మనకు తెలీకుండానే నవ్వొస్తుంది. కానీ ఏడుపలా కాదు. ఏడుస్తున్నవాళ్ళను చూసి అందరూ ఏడవలేరు మరీ సున్నితమైనవాళ్ళు ఒకళ్ళు ఏడిస్తే చూడలేరు. వాళ్ళకూ ఏడుపొస్తుంది. కొందరు సినిమా చూస్తూ, పుస్తకం చదువుతూ, సన్నివేశాన్నిబట్టి నవ్వడం ఏడవడం చేస్తుంటారు. కొందరు ఏ భావమూ వ్యక్తం చేయకుండా చదువుకుపోతుంటారు. అది వాళ్ళ మనసుకున్న అతిసున్నితమైన రియాక్షన్స్ మీద ఆధారపడి వుంటుంది.

శాంతా, చంద్రం, శిరీష్ ల నవ్వులు విన్న సుషమ, శేఖర్, మధు కూడా నవ్వేశారు.

అంతా పూర్తిగా వినండి. మళ్ళీ ఎవరికి వాళ్ళు గుసగుసలు చెప్పుకుందే కాదు. అని మరోసారి వోపిగ్గా, మధ్య మధ్య కొన్ని జోక్స్ చెబుతూ తన దక్షిణేశ్వర్ గంగానది స్నాన, సాహస గాథను వివరించాడు శిరీష్. మళ్ళీ ఓసారి అంతా మనస్పూర్తిగా నవ్వారు.

(సశేషం)

---

Printed and Published by A. Chandra Sekar Rao at 5-9-88, Public Garden Road Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor : A. SUDHAKARA RAO



# ప్రేమవాహిని

హాయిగా నవ్వుతున్న మధుని చూసి తృప్తిపడ్డ శేఖర్ "ఒరేయ్ శిరీష్ ! నువ్వు చెప్పే ఆ అమెరికా అమ్మాయి నిన్ను నీళ్ళలోకి తోసిన అందాల బొమ్మా - అల్లరి లేమ ఒక్కతే కాదు గదా !'' అన్నాడు నవ్వుతూ.

"ఎగ్జాక్ట్లీ! నీ బుర్ర వుందే! అమోఘంరా శేఖర్. అక్కడ మొదలైంది మా ప్రణయం. లక్కీగా మరో ఫ్రెండ్ యింట్లో పరిచయమై అలా అలా పాకి అంతంతై పెరిగింది.'' అన్నాడు శిరీష్ చిన్నగా నవ్వుతూ.

మళ్ళీ ఓసారి శిరీష్ ప్రేమగాథ శాంతకూ మధుకూ చెప్పి "యింక నే వెళ్లొస్తానురా చందూ !" అంటూ అయిష్టంగానే లేచాడు శేఖర్. "భోంచేసి వెళ్ళండి" అంది మెల్లగా మధు.

"అవునురా యివ్వాళ అందరం కలిసి భోంచేద్దాం !" అంటూ మధును బలపరిచాడు చంద్రం. తప్పనిసరై అందరితో కలిసి భోంచేసి వెళ్ళిపోయాడు శేఖర్ మనసునిండా తృప్తి నింపుకొని.

అల్ప సంతోషి శేఖర్. ఓ నాలుగు మాటలు మధుతో మాట్లాడగలిగిన తృప్తి, శేఖర్‌లో ఎన్నో ఆశల్ని, కోరికల్ని రేకెత్తించి భవిష్యత్‌ను గురించి బంగారు కలలు కనడానికి ఓ సాధనంగా వుపయోగపడేది.

సుషమ ఎంత ప్రయత్నించినా చంద్రం మధుతో అంత క్లోజ్‌గా వుండటాన్ని ఆమె ఆడమనసు అంగీకరించడం లేదు. ఏదో తెలీని బాధ.

చంద్రం తనకు మాత్రమ సొంతమని, అతని ప్రేమలో ఆదరణలో కరిగి పోగల అర్హత, అధికారం తనవేననీ కలలుగంటున్న సుషమ అందులో మరొకరికి భాగం పంచివ్వడం సహించ లేకపోతోంది. చంద్రం మధుల స్నేహం, ఆత్మీయత అయిష్టంగా అన్పిస్తోంది. వెళ్ళడానికి ముందురోజు చంద్రం కోరికపై వొంటరిగా మామిడితోటకు చేరుకున్న సుషమకు చంద్రం - శేఖర్ మనస్సేంవిటో వివరించాడు. "భగవంతు దనుకూలిస్తే అతి త్వరలో మధును శేఖర్‌కిచ్చి వివాహం చేస్తాను. అ తర్వాత ఆలస్యంచేయకుండా నిన్ను నా దాన్నిగా పొందే అధికారాన్ని సంపాదిస్తాను. అంతవరకూ మన కీ ఎడబాటు తప్పదు సుషమా !" అంటున్న చంద్రం మాటలు వింటుంటే అతనిమీద ఉన్న అన్ని అనుమానాలూ, అసూయలూ పటాపంచలైనా, మరుక్షణం మధుతో చంద్రం అన్న మాటలు గుర్తొచ్చి, చంద్రం అన్నం తినిపించబోవడం గుర్తొచ్చి ఏదో చెప్పరాని జుగుప్సతో మనసు నిండి పోయింది. వాళ్ళిద్దరు కలసి తన్నూ, శేఖర్ అన్నయ్యనూ మోసంచేస్తున్నా రేమో!" అలా మనస్ఫూర్తిగా అనుకోలేక పోయినా చంద్రం మాటలకు బదులు చెప్పలేదు. ఏకాంతంగా కలుసుకున్న ఆనందం మిగల్లేదు. అక్కడా మధు గురించి...మధు వ్యక్తిత్వం గురించి మాట్లాడుతున్న చంద్రంలోని మంచి తనాన్నీ, మానవత్వాన్నీ అర్థంచేసు కునేంతగా ఎదగలేదు సుషమ మనసు "ఇంక వెళదాం" అంటూ లేచిన సుషమను విచిత్రంగా చూశాడు చంద్రం. "శేఖరన్నయ్యయింటికి వెళ్ళి వస్తానని చెప్పివచ్చాను. ఈలోగా శేఖరనయ్య మనింటికి వస్తే..." అంది చిన్నగా నవ్వుతూ.

తను చిన్నగా నవ్వి సుషమ చేయి పట్టుకొని పైకిలేస్తూ, "సుషమా! ఈసారి నీలో చాలా మార్పు కన్పిస్తోంది. ఎందు కలాఉన్నావు ? నిన్ను చూడాలని ఎంతగా తపించానో తెలుసా ? ముఖ్యంగా పిన్నిపోయినరోజు మధు మాట్లాడకుండా పిచ్చిచూపులు చూసి నప్పుడు నువ్వొస్తే నీ సాన్నిధ్యంలో ఈ బాధలు బాధ్యతలన్నీ మరిచి సాంత్వన పొందాలనీ, నీ వోదార్పు కోసం, ఆత్మీయమైన నీ స్పర్శకోసం ఎంతగా తపించానో తెలుసా ?"

సుషమకు ఏది వినడం బాధగా వుందో అదే మళ్ళీ మళ్ళీ విన్పిస్తోంది. "మధు మాట్లాడకుండా పిచ్చిచూపులు చూసినప్పుడు నువ్వొస్తే నీ సాన్నిధ్యంలో సాంత్వన పొందాలని" మధు మాట్లాడి వుంటే తన అవసరం ఉండేది కాదేమో! ఆవిడే వోదార్చివుండేదేమో!"

ఏ కమార్గాన పయనిస్తున్న మనస్సును తిట్టుకుంటూ చంద్రంవైపు చూసింది.

ఆ చూపుల్లో ఆరాధనను. అయస్కాంతశక్తినీ కాదనగల శక్తి సుషమకు లేదు. అలా చూస్తుండిపోయిన సుషమ చుట్టూ చేతులువేసి దగ్గరకు తీసుకున్న చంద్రం కళ్ళు ఆనందమో, ఆవేదనో తెలిని అనుభూతితో చమర్చాయి. అప్పటి వరకూ ఏవేవో ఆలోచనలతో సతమత మౌతున్న సుషమ మనసుకు, ప్రశాంతంగా మరో ఆలోచనకు తావులేకుండా జగమంతా ప్రేమమయంగా కనిపించింది. చంద్రం స్పర్శలో పొందుతున్న అలౌకికానందంలో ఎవరో గట్టిగా చెప్పినట్లైంది. "సుషమా ! నువ్వు చంద్రంకోసమే పుట్టావు. అతను లేందే నువ్వు లేవు. నువ్వులేందే అతను లేడు మీ బంధం యీనాటిది కాదు. జన్మజన్మల దీ అనుబంధం" సుషమ కన్నీటితో చంద్రంషర్ట్ తడిసిపోయింది సుషమ ముఖం రెండు చేతుల్తో పైకెత్తి కన్నీరు కారుస్తున్న ఆ కళ్ళపై సున్నితంగా ముద్దుపెట్టుకొని కన్నీరు తుడిచి -

"ఎందుకు సుషమా కన్నీరు ? మనల్ని వేరుచేయగల శక్తి ఎవ్వరికీ లేదు. ఎప్పటికైనా నువ్వు నా దానివే నన్న గట్టినమ్మకంతో వున్నాను నేను. నా నమ్మికంలో స్వార్థముందంటావా ? మన వివాహానికి వాయిదాలువేస్తున్నానని నా మీద కోపంగా వుందా ?" అడిగాడు చంద్రం

"లేదు మీ మీద నాకేం కోపంలేదు. మీకోసం నేనెంతకాలమైనా ఆగుతాను. నా ఆఖరిక్షణం వరకూ మీకోసం ఎదురుచూస్తానుచందూ " అని ఆవేశనగా చంద్రంగుండెల్లో తలదాచుకుంటున్న సుషమ తలనిమురుతూఅన్నాడు.

"నాకు తెలుసు సుషమా ! నా నమ్మకం ఎప్పుడూ వమ్ముకాదు పద వెళదాం. ప్రొద్దుపోతోంది " అన్నాడు చంద్రం. అతన్ని ఆనుకొని ఆ తోటల మధ్యనుంచి నడిచి వెళుతుంటే ఆ దూరమెప్పటికీ తరగకూడదనీ తను అలాగే చంద్రం చేయిపట్టుకొని భుజాన్ని ఆసరాచేసుకొని, జీవితకాలమంతా అలా నడుస్తూ వెళ్ళాలనే పిచ్చి కోరిక కలిగింది సుషమకు కొంచం దూరం వెళ్ళేసరికి పొలాల్నుంచి యిళ్ళకు తిరిగి వెళుతున్న మనుషలు కన్పించడంతో చంద్రం నెమ్మదిగా సుషమచేయి తన భుజంమీదనుంచి తొలగించి, ముందుకు నడిచాడు. తనూ చంద్రాన్ని అనుసరించి, దూరంగా నడుస్తూ ముందుకు వెళ్ళి, చంద్రం కంటే ముందుగా యిల్లు చేరింది.

సుషమ భయపడ్డంతా అయ్యింది. అప్పటికే శేఖర్ వచ్చి కూర్చొని ఉన్నాడు. సుషమను చూడగానే "వాడెక్కడ? నువ్వు వొంటరిగా వచ్చా

వం ? వ నువ్వు యింటదగ్గర్నుంచి వస్తున్నావు కదూ ?" అంటూ చిన్నగా నవ్వాడు. శేఖర్ మాటలతో సిగ్గుపడిన సుషమ లోపలికి పరుగెత్తింది. మరో రెండు నిముషాల్లో లోపలి కొచ్చాడు చంద్రం.

"ఏం రా ? యీ వేళ పొలంనుంచీ పెందలాడే వచ్చేశావేంటి ?" అంటూ ప్రక్కన కూర్చొని, "శాంతా మంచి నీళ్లు తెచ్చిపెట్టమ్మా !" అన్నాడు.

"మామిడితోట వరకూ వెళ్ళి దాహం తీర్చుకోకుండానే వచ్చావా ?" అన్నాడు శేఖర్ చంద్రంచెవి దగ్గర వంగి, శేఖర్ వీపున ఒక్కటి చరిచి

"నీ కెవరు చెప్పార్రా ?" అన్నాడు.

"ఎవరో చెప్పాలేమిటి? చింతాకులా వున్న ముఖం తామరాకంత అయింది. ముఖంలో ఎక్కడలేని తేజస్సు. కళ్ళలో కదలాడుతున్న కాంతి. అవన్నీ చెప్పకనే చెబుతాయిరా ఫూల్ ! మీ రహస్య సమావేశాన్ని..." అన్నాడు శేఖర్. నోటికి చెయ్యడ్డంవుంచి "ష్ ! అట్టే వాగకు శాంత వస్తోంది" అన్నాడు చంద్రం ఖంగారుగా.

"ఫర్వాలేదు, వస్తే నాకేం భయం?" అన్నాడు శేఖర్.

"ఏమన్నయ్యా ! మామిడతోటకు వెళ్ళినవాడివి నాలుగుకాయలైనా కోసుకు రాక ఆకులు మోసుకొచ్చావేం !" అంది శాంత మంచినీళ్ళు అందిస్తూ.

వెళ్ళాను మామిడితోటకు ? అలా రచ్చబండ దగ్గరకు వెళ్ళి వస్తున్నాను. మునసబు తాత వాళ్ళంతా ఏవిటో మాట్లాడుతుంటే..." అంటున్న చంద్రాన్ని మధ్యలోనే ఆపుతూ "యింకా ఆపరా ! మామిడి ఆకులు చొక్కాలో దోపుకొని మరీ వచ్చి మోసుకురాలే దంటావేం ?" అంటూ తలమీద నుంచీ కాలర్ మీదకు జారి అక్కడే ఆగిపోయివున్న మామిడాకుతీసి చంద్రానికి చూపించాడు శేఖర్, పగలబడి నవ్వుతూ. శాంత కూడా శృతి కలిపింది. చంద్రం తన అబద్ధాలన్నీ పట్టుబడిపోయినందుకు సిగ్గుపడిపోయాడు. చంద్రం మాట మార్చటానికి.

"శేఖర్‌కు కాఫీ అయినా ఇచ్చావా శాంతా ? ఒట్టి కబుర్లేనా ?" అంటుండగానే లోపల్నుంచీ రెండు గ్లాసుల్తో కాఫీ తెస్తున్న మధు శేఖర్ దృష్టిలో పడింది.

"అరె ! నువ్వు...నువ్వు లేచావా మధూ ! కాఫీ పట్టుకొచ్చావా ? ఈ టైమ్‌లో కాఫీ ఎందుకు చెప్పు ? ఎలాగూ ఇంటికెళ్ళి భోంచెయ్యాలిగా ? నువ్వనవసరంగా శ్రమపడ్డావు" అని నొచ్చుకుంటూ గ్లాసందుకుంటున్న శేఖర్‌ను చూసి యిప్పుడు నవ్వడం చంద్రం-శాంతల వంతైంది. "ఎందుకు నవ్వుతున్నారు ?" అని ప్రశ్నార్థకంగా చూసిన శేఖర్‌కు నవ్వే సమాధానమైంది.

ఒంటు నవ్వాపుకుంటూ ఎద్దనుకుం టూనే చెయ్యిదాపుతుంటే నవ్వొచ్చిం దన్నయ్యా ! అందులోనూ మీకూ కాఫీ కొక బ్రెముందాసి" అంటూ మళ్ళీ నవ్వుతున్న శాంతను చూసి తనూ నవ్వుతూ

"నిజమే శాంతా ! యింతక్రితం మీ యింటికి వచ్చినప్పుడు చెప్పాను కదూ ! కాఫీనట్టుకు ఎన్నిసార్లిచ్చినా తాగుతానని. ఆ విషయం నేను మర్చి పోయాను. అయినా మధుతో చెప్ప లేదుగా. తన కింకా నీరసంగా వుంది కదా కాఫీ పెట్టుకొచ్చిందే అని బాధ పడ్డాను" అంటున్న శేఖర్‌తో.

"బాబోయ్ ! కాఫీ మధు పెట్టకే దన్నయ్యా ! నేనే పెట్టాను తను గ్లాసులు పట్టుకొచ్చింది. నువ్వు మరింక బాధపడకు పాపం నీరసంగా రెండు గంగాళాలు మోసుకొచ్చిందే అని" అంటూ చిలిపిగా నవ్వుతున్న శాంత మాటలకు అంతా నవ్వేశారు.

"ఫర్వాలేదు. రాంపూర్ నీళ్ళు బాగానే వంటబట్టినట్టున్నాయే. మాటలు మాత్రం మన సొంతంకాదని నాకు తెల్సులే ! రాజన్నయ్య ట్రైనింగ్ అయ్యుంటుంది , అవునా ?" అంటూ నవ్వుతున్న మధును చూసి "పో వదినా !" అంటూ తనే లోపలికి పారి పోయింది శాంత.

అప్పటికి బయటపడింది సుషమ. శేఖరన్నయ్యకు తెలిసిపోయిందని తెల్సాక ఎదురుగా రావాలంటే సిగ్గుగా వుంది. రాకపోతే మరీ ఆటపట్టిస్తా రేమోనని భయంగానూ ఉంది. నెమ్మదిగా వచ్చి మధు ప్రక్కనే నుంచుంది. "కూర్చో సుషమా !" అంటూ మంచం వాల్చి తనూ కూర్చుంది మధు.

హడావుడిగా బయటనుంచి వచ్చిన శిరీష్ "సుషమా ! సామాను సర్దేశావా? తెల్లవారుఝామునే వెళ్ళాలి ఫస్ట్ బస్ కాచ్ చేస్తేగానీ ఆ ట్రైన్ అందదు." అంటూ వచ్చి శేఖర్ ప్రక్కనే కూర్చున్నాడు.

"ఎక్కడికెళ్ళావురా ?" అని అడుగుతున్న "శేఖర్‌తో, కొంచంసేపు అలా తోటలవైపు వెళ్ళి, నాన్నగారితో కొంచంసేపు మాట్లాడివస్తున్నాను" అన్నాడు.

"ఏ తోటలవైపురా ?" అంటూ నవ్వుతూ అడుగుతున్న శేఖర్ వైపు బిక్కుబిక్కుమంటూ చూస్తోంది సుషమ. చంద్రం తలవంచుకున్నాడు. శాంత ముసిముసి నవ్వులు నవ్వుతూ మధు చెవిలో ఏదో వూదటానికి ప్రయత్ని స్తుంటే సుషమ శాంతను అవతలకు నెట్టేస్తోంది. "ఏ తోటలేవిటిరా ? మన పొలం పక్కన వున్న నిమ్మతోటలవైపు నువ్వుంటావనే వెళ్ళాను. అప్పటికే వెళ్ళిపోయావని చెప్పాడు రామయ్య,

అంటూ తలెత్తిచూసిన శిరిష్కు, సుషమ శాంతను నెట్టేయడం కనిపించింది.

"సుషమా ! ఏవిటది ?" అంటూ నవ్వుతూ అడుగుతున్న శిరీష్ వైపు చూస్తూ చిన్నగా "ఏం లేదు" అని సర్దుకొని కూర్చుంటుండగానే అసలు రహస్యం మధుచెవిలో చెప్పేసింది శాంత. మధూ, శాంత ఒక్కసారే నవ్వారు వాళ్ళను చూసి నవ్వుకున్న శేఖర్ వైపు చంద్రంవైపూ చూస్తూ -

"ఆ జోక్ ఏమిటో నాకూ చెప్పండి నేనూ విని తరిస్తాను" అంటూ నవ్వు తున్న శిరీష్ను చూసి "ఏవీ లేదురా ! అమెరికా అమ్మాయి జోక్ జ్ఞాపకం వచ్చిందిలే" అంటూ సర్దేసిన శేఖర్ సమయస్ఫూర్తికి కృతజ్ఞతగా నవ్వాడు చంద్రం.

"ఓ అదా ?" అంటూ నవ్వుతున్న శిరీష్ అమాయాకత్వానికి మళ్ళీ అంతా నవ్వుకున్నారు.

చాలారోజుల తర్వాత అలా కళ కళలాడుతూ నవ్వుతున్న మధు ముఖం చూసి శేఖర్ కళ్ళు తృప్తిగా మెరిశాయి. కబుర్లతో ఆరోజు చాలా ప్రొద్దుపోయేంతవరకూ సరదాగా గడిచింది శిరీష్కు ఏడ్చేవాళ్ళను నవ్వించగల నేర్పుంది. అతని మాటలకు నవ్వకుండా ఉండటం ఎవరికీ సాధ్యం కాదు.

* * *

శిరిష్, సుషమా వెళ్ళిపోయి పదిహేనురోజులయింది. ఈ పదిహేను రోజుల్లోనూ దాదాపు, రోజు విడిచి రోజైనా మధును పలకరించడానికి వెళ్ళేవాడు శేఖర్...సుషమవాళ్ళు వెళ్ళిన నాలుగురోజులకు రాజేశ్వర్ వచ్చి శాంతను తీసుకువెళ్ళాడు రాంపూర్. మధును తమతోపాటు తమ యింట్లోనే వచ్చి వుండమని చంద్రం ఎంతో బ్రతిమి లాడాడు. ససేమిరా ఒప్పుకోలేదు మధు.

"యిప్పటికే నీకు చాలా ఋణపడి ఉన్నాను బావా ! నన్నింకా ఋణ గ్రస్తను చేయకు. ఊళ్ళోనే ఉన్నాం గదా ! ఎప్పుడు రావాలనిపిస్తే అప్పుడు మీ యింటికొస్తాం. తోడుగా రామి పడుకుంటోంది. శ్యాం, నేను. యింకా భయమేవిటి ? అయినా గంగాపూర్లో నాకు భయమేవిటి బావా ? నేను పుట్టి పెరగకపోయినా యిది నాకు పుణ్య భూమిగా దొరికింది. రామి లేకపోయినా మేం వుండగలం. మరో వారంరోజులు పోయాక మళ్ళీ స్కూల్ ప్రారంభి స్తాను. లేకపోతే నాకు కాలక్షేపం కావడం కష్టం. ఊరికే కూర్చొని నువ్వు వండించి పెడుతుంటే ఎంతకాల మిలా కూర్చొని తినేది ?" అంది మధు.

"మధూ ! నన్నూ పరాయివాడు గానే అనుకుంటున్నావు కదూ ! నా సహాయం తీసుకోడానికి కూడా అనుమా

నిస్తున్నావా ?" అని బాధపడుతున్న చంద్రాన్ని చూసి దగ్గరగా వచ్చి చంద్రం చేతులు పట్టుకుంటూ అంది -

"కాదు బావా ! ని న్నెప్పుడూ పరాయివాడుగా అనుకోలేదు. అలా అనుకుంటే యిన్నాళ్ళూ నువ్వు చేసిం దంతా ఎలా స్వీకరించాను? నాకు తెలుసు బావా ! యీ ఖర్చులకోసమని నువ్వు పొలం తాకట్టుపెట్టి డబ్బుతెచ్చిన సంగతి కూడా నాకు తెలుసు. ఏమిచ్చి నీ ఋణం తీర్చుకోగలను బావా ! అందుకే అంటున్నాను నన్నింకా ఋణగ్రస్థురాలని చేయకు నా జీవితంలో ఎప్పుడైనా నాకే కష్టమొచ్చినా ముందుగా నేను చేతులు చాచి సహాయం అడగ్గల్గే నిన్నే బావా ! నిన్నే అడుగుతాను." అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది మధు.

తలమీద చెయివేసి, "సంతోషం మధూ ! ఆ మాత్రం నామీద నమ్మక ముంచుకున్నందుకు నీ యిష్ట ప్రకారమే కానీయమ్మా !" అంటూ అక్కడ మరో నిముషం నిలవకుండా వాళ్ళ యింటివైపు వెళ్ళి పోయాడు, కళ్ళల్లో దాగిన కన్నీరు దాచుకునే ప్రయత్నంలో.

దూరమౌతున్న ఆ నిస్వార్థ, నిష్కల్మష హృదయుడిని చూసి మనసులోనే కృతజ్ఞతాంజలులు చెప్పు కొని కన్నీళ్ళు తుడుచుకుంటూ లోపలి కెళ్ళిపోయింది మధు. చంద్రంబావ మంచితనాన్ని, మమకారాన్ని ఆరగించు కోడం కష్టమేమో అన్పిస్తోంది. అభి మానంతో ఎవరిదగ్గరా తలవంచకూడ దనుకొని శేఖర్ పంపిన సహాయాన్ని రెండుసార్లు తిరస్కరించింది. మమత నిండిన మనసును బాధపెడుతున్నా ననిపించినా, ఆత్మాభిమానంకోసం ఆ సహాయాన్ని అందుకోలేదు మధు. తర్వాత రఘుపతిరావుగారు పిలిపించి నచ్చచెప్పాలని ప్రయత్నించినా "మావయ్య పనిచేయనప్పుడు ఆ పసిడి పంటల్ని తినే అధికారం మాకు లేదు బాబుగారూ !" అంటూ స్వాభిమానంతో చెప్పిన మధునుచూసి మొదట గర్వ మనుకున్నా, ఎవరికీ చెయ్యిచాపకుండా తను నేర్చిన విద్యతో నలుగురికీ విద్యా దానం చేస్తూ, అత్తయ్యకూ తమ్ముడికీ ఆధారంగా నిలవాలనుకున్న ఆ పిల్ల ఆదర్శాన్ని అభినందించకుండా వుండ లేకపోయారు. సహాయన్ని తిరస్కరించి నందుకు మొదట శేఖర్ ఎంతగానో బాధపడ్డా, మధు మనసు తెలుసుకున్న తర్వాత మనసులోనే ఆ ఆత్మాభిమానా నికి జోహార్లర్పించాడు అప్పుడే ఆసరాగా నిలబడాలనుకున్న చంద్రాన్ని కూడా దూరంగా వుంచి, వాళ్ళ మనసులు నొప్పించకుండా, వాళ్ళకు నష్టంలేని తనకు కష్టంకల్గించని చిన్న సహాయాలు వాళ్ళద్వారా పొంది, వాళ్ళకు ఓ రకమైన తృప్తిని కలిగిం

చింది మధు. ఎవ్వరినీ బాధపెట్టా లనుకోదు. అందుకే మళ్ళీ స్కూల్ ప్రారంభించాలనే నిర్ణయం తీసుకొని నిశ్చింతగా నిద్రపోయింది మధు.

మాధవి మళ్ళీ మామూలుగా చిన్న పిల్లలతో ఆడుతూపాడుతూ వాళ్ళతోడిదే జీవితమన్నట్లు తయారయింది. అది పిల్లలకు స్కూల్‌కాదు ఓ ఆనంద నిలయం. ఆశ్రమం. వాళ్ళిష్టమున్నప్పుడు చదువుకోవచ్చు. లేనప్పుడు మధు అక్కయ్యనడిగి ఆడుకోవచ్చు. అదీ ఇదీ కాదంటే అక్కయ్యను బ్రతిమిలాడి పాటలు వినవచ్చు. వాళ్ళకు మధు అక్కయ్య వుంటే చాలు. అమ్మ కూడా గుర్తురాదు రాము, వసూ స్కూల్ వదిలిపెట్టినా మేము అక్కయ్య దగ్గరే ఉంటామని మారాంచేసేవాళ్ళు. అలాంటప్పుడు 'పోనీ పడుకోనివ్వండని' వాళ్ళని తమదగ్గరే వుంచుకొని శ్యాంతో పాటు అన్నంపెట్టి, కొంచంసేపు కథలు చెప్పి నిద్రపుచ్చేది.

అసలే ఆడపిల్ల ఒంటరిగా అవస్థలు పడుతుంటే రోజూ పిల్లలు అక్కడే వుంటామని చేసే మారాంచూసి ఒక్కోరోజు బలవంతంగా లాక్కెళ్లేది కుసుమ. అలాంటప్పుడు ఆ పూట మధుకు అన్నం తినాలనిపించేదికాదు. పిల్లలందరిలో వాళ్ళిద్దరిమీద వో ప్రత్యేకమైన అభిమానం మధుకు పిల్లలు అక్కడే వుండిపోయిన రోజున కుసుమ, పెరుగో, పాలో పంపిస్తుండేది, అవి తీసుకోకపోతే కుసుమక్క బాధపడుతుందని తీసుకునేది మధు.

శ్యాం తొమ్మిదవ తరగతికి వచ్చాడు. వాడి కప్పుడే పధ్నాలుగేళ్ళు. మంచీ చెడ్డా అప్పుడప్పుడే కొద్దిగా అర్థమౌతున్నాయి. తనకు అక్కయ్య తప్ప ప్రపంచంలో మరెవ్వరూ లేరనే విషయం పూర్తిగా అర్థమైంది. శ్రద్ధగా చదువుతున్నాడు. క్లాసులో ఫస్ట్ మార్కులన్నీ వాడివే. ఆ విషయంలో మధుకు చాలా తృప్తిగా వుంది తన శ్రమ వృధాపోవడంలేదు. శ్రద్ధగా చదివి తమ్ముడు ఓ పెద్ద ఆఫీసరౌతాడు. వాడి భవిష్యత్‌ను గురించి కలలు గనటంతోనే గడిచిపోతుండేది ఒక్కో రాత్రి.

అప్పుడప్పుడు వచ్చి తన యోగక్షేమాలు కనుక్కునే శేఖర్‌ను చూస్తే అంతులేని అభిమానం. ఆతని సమక్షం అనంతమైన తృప్తిని శాంతిని ప్రసాదిస్తోంది. అయినా తమీద లేనిపోని ఆశలు పెంచుకొని ఆనందకరమైన భవిష్యత్‌ను తన ఆలోచనలతో పాడుచేసుకుంటాడేమోనని భయం. ఊళ్ళోవాళ్ళు ఏమైనా అనుకుంటారేమోనని, అతనిరాకకు అపార్థాలు కలిగించుకుంటారేమోననీ అనుమానం మనసును బాధ పెడుతుండేవి. అతన్ని తమ యింటికి రావద్దని చెప్పగల ధైర్యం, మనోనిబ్బరం తనకు లేవు. అతను

వచ్చిన సంబంధాలన్నీ తిరస్కరిస్తున్నాడని విని బాధ పడింది. తన మీద ఆశ వదులుకోమని తనింక తమ్ముడు శ్యాం భవిష్యత్ కోసమే బ్రతుకుతున్నానని శేఖర్‌తో ఎలా చెప్పడం?

సంధ్యాదేవి చల్లగా వేంచేసింది. ఆకాశం చీర మార్చి నల్లచీర కట్టుకున్నట్లు. నీలిమాకాశాన్ని నల్లబరచింది వాతావరణం. సూర్యుని సున్నిత కిరణాలతో పాటు సాయంత్రపు పలచని వెలుతురులో అక్కడక్కడా నక్షత్రాలు మిణుకుమంటున్నాయి. సాయంత్రపు చల్లగాలిలో ఒంటరిగా కూర్చుని చంద్రం దగ్గరనుంచీ తెచ్చుకున్న శరత్‌బాబు శేషప్రశ్న చదువుతోంది మధు. కానీ మనస్సు పుస్తకంమీద లగ్నంకావడం లేదు. శ్యాం ఆడుకో డానికి వెళ్ళాడు. మావయ్య తమకోసం మిగిల్చిపోయిన ఆ పాతకాలపు పెంకుటింటి వసారాలో అరుగుమీద కూర్చొని పుస్తకం చదవడానికి ప్రయత్నిస్తున్న మధుకు తన ఒంటరి జీవితం తల్చుకొని మనసంతా వికలమైంది. శ్యాం తప్ప తనకెవ్వరున్నారు? అనుకోగానే గంగాతీరాన శేఖరన్న మాటలు అస్పష్టంగా విన్పించాయి

ఒంటరిగా కూర్చుంటే శేఖర్ గుర్తొచ్చినప్పుడు తన ఏకాంతం, బాధలూ అన్నీ మరచిపోయి కొంతసేపు ఏవో సుందర స్వప్నాల్లో తేలిపోవడం ఈమధ్య మధుకు బాగా అలవాటైంది. శేఖర్ సమక్షంలో తన మనస్సు విప్పి చెప్పలేదు. మావయ్య బ్రతికున్నా శేఖర్‌తో తన వివాహం జరగటమనేది తామిద్దరూ అనుకున్నంత తేలికైన పని కాదని ఎప్పుడో అర్ధమైంది. కానీ శేఖర్ మీద అంతులేని విశ్వాసం. అతని ప్రేమపూరిత హృదయంలో హెచ్చు తగ్గుల తారతమ్యాలు లేవు. తను అంగీకరిస్తే యీ క్షణంలో అంతస్థుల తేడాలాలోచించకుండా తన మెళ్ళో తాళికట్టగలడని మనస్ఫూర్తిగా తెలుసు. అతని ప్రేమ తనకు దక్కిననాడు ఓహ్!

కానీ తనకా అదృష్టం, అదృష్టం లేవు. అందుకే అందగా నిలిచిన మావయ్యను, ఆప్యాయంగా చూసే అత్తయ్యనూ పోగొట్టుకుంది. ఆలోచనల్లో మునిగివున్న మధుకు అడుగుల చప్పుడు విన్పించలేదు. శేఖర్ వచ్చి చిన్నగా "మధూ!" అని పిలిచేసరికి ఒక్కసారి కలేమో అన్పించింది. అంతలో ఎదురుగా శేఖర్‌ను చూసి వులిక్కిపడి లేచిన మధు "రండి" అంటూ త్వరగా లోపలికెళ్ళి కుర్చీ తెచ్చి అరుగు ప్రక్కన వేసింది. కుర్చీలో కూర్చుంటూ "ఏమిటి మధూ! యీవాళేదో దీర్ఘాలోచనలో మునిగి వున్నట్లున్నావు? నేను లోపలికొచ్చింది కూడా గమనించలేదు. అతిగా ఆలో

చించడం ఆరోగ్యానికి మంచిదికాదని ఎన్నిసార్లు చెప్పాను ?" అ టూ చనువుగా మందలిస్తున్న శేఖర్‌ను చూసి, మళ్ళీ ఆ కళ్ళలోకి చూసే ధైర్యం లేక తలవంచుకొని అరుగమీద కూర్చుంది మాధవి.

"ఏమిటి మధూ యివాళ దోలా వున్నావు ?" అంటూ ఖంగారుగా ప్రశ్నించాడు.

"ఊ !" అంటూ పరధ్యానంగా తలెత్తింది

"మధూ ! నువ్వు దేన్నిగురించో విపరీతంగా ఆలోచిస్తున్నావు. నాతో చెప్పడానికూడా నీకు అభిమానం అడ్డొస్తోంది. నువ్వు నన్నింకా పూర్తిగా అర్థంచేసుకోలేదు. పరాయివాడుగా నే చూస్తున్నావు. నీ మనసు విప్పి ఏదీ చెప్పవు నేనేం చెప్పినా నువ్వు విన్పించు కోవు. కనీసం నీ మంచి చెడ్డలు చెప్పడం కూడా నీకిష్టముండదు. మీ అత్తయ్య పోయి మూణ్ణెల్లైంది. యింకా ఆ దిగులేనా ? నువ్విలా గంభీరంగా వుంటూ నన్నెందుకు భయపెడతావు ? వెనకటిలా స్వచ్ఛంగా, స్వేచ్ఛగా, గలగలా నువ్వు నవ్వుతుంటే చూడాలని తపించి పోతున్నాను. మధూ !" అంటున్న శేఖర్ స్వరం గద్గదమైంది.

బాధగా చూసిన మధు కళ్ళనిండుగా నీళ్ళున్నాయి. తనకోసం అంతగా పరితపిస్తున్న ఆత్మీయుడికి సంతోషం కలిగించె రెండు మాటలు చెప్పలేక పోతోంది. తన జీవితం ఎదురుదెబ్బ లకు మనస్సు గట్టిపడి పాషాణంలా తయారయినా యీ బాధలేకపోను. యిరవై రెండేళ్ళకే ఎన్నో అనుభవాలు ! శేఖర్ కేం తక్కువ ? ఆ జమీకి ఏకైక వారసుడు. చీకూచింతాలేని జీవితం కోరుకున్నవన్నీ నిముషాలమీద పొంద గల అదృష్టవంతుడు. లక్ష్మీపుత్రుడు. అలాంటివాడు కేవలం తన ప్రవర్తన మూలంగా బాధపడుతున్నాడు. అతడిని అంతగా బాధపెట్టడం భావ్యంకాదు. లేని నవ్వును ముఖంమీద పులుము కుంటూ "శేఖర్ బాబూ ! యివ్వాళ్ళ శ్రీధరం మావయ్య లెటర్ వ్రాశారు. వుండండి చూపిస్తాను." అంటూ లోపలి కెళ్ళి కవరు తీసుకొచ్చి శేఖర్ కిచ్చింది. "నే నడిగినదాని కిది సమా ధానమా మధూ !" అంటున్న శేఖర్‌తో "కాదు, మావయ్య శ్యాంని తీసుకొని కలకత్తా వచ్చేయమని వ్రాశారు. చంద్రం బావకూడా లెటర్ వ్రాశారట మమ్మల్నిద్దరినీ తీసుకురమ్మని" అని మధు చెబుతుండగానే లెటర్ పూర్తిగా చదివాడు శేఖర్.

"మాధూ! నీకు యిప్పట్లో వివాహం చేసుకోవాలని లేకపోతే నిన్ను బాధ పెట్టను కొంతకాలం కాలేజీలో చదువు కుందువుగాని, శ్యాంని కూడా యిక్కడ స్కూల్లో చేర్పించవచ్చు. నీకు చదువు

ఉన్నంతకాలం అంత కాలం ఏదో ఉద్యోగం చేద్దువుగాని. నేనుండగా మీ రిద్దరూ దిక్కులేనివాళ్ళలా గంగా పూర్‌లో బాధపడటం నాకిష్టంలేదమ్మా!

"మీ నాన్న నేనూ దేహాలు వేరైనా ప్రాణమొక్కటిగా తిరిగాం విధి వక్రించి "బిందు" రూపంలో మమ్మల్ని విడదీసినా నేను రాంను వాడి స్నేహాన్ని తలుచుకొని బాధపడని క్షణంలేదు. హాస్టల్‌లో వుండగా నాకు తలనొప్పంటే విలవిల్లాడిపోయేవాడు. జ్వరమొస్తే వారంరోజులు నా ప్రక్కనే కాలేజీకూడా ఎగ్గొట్టి కూర్చుని నా అవసరాలు చూసేవాడు. వాడి ఋణం నేనెలా తీర్చుకోగలను? అవన్నీ మరచిపోదామన్నా మరచిపోలేని మధురస్మృతులు. వాడు దూరమైనా మిమ్మల్ని నా కన్నబిడ్డలుగా చూసుకొనే అవకాశం భగవంతుడు కలిగించాడు. నామాట కాదనవని నా విశ్వాసం. వెంటనే చంద్రంవెంట నువ్వూ శ్యాం బయలుదేరుతారని నమ్ముతాను," అంటూ ఇంకా అలాగే రమ్మని బతిమాలుతూ వ్రాశారు.

కవర్ మధుచేతికిస్తూ "ఏం నిర్ణయించుకున్నావ్ మధూ,' అన్నాడు శేఖర్. మనసులోని కలవరం మాటల్లో ధ్వనించింది.

"కొంచంసేపలా గంగాతీరాన షికారెళ్ళవద్దామని నిర్ణయించుకున్నాను, ప్రస్తుతానికి" అంటూ చిన్నగా నవ్వి, "ముందు మీరు వెళ్ళండి. నేను తర్వాత ఇంటికి తాళమేసి వస్తాను రేవువైపు", అని చెప్పి లోపలికెళ్ళిపోతున్న మధును చూసి, ఆమె మనసేవిటో అర్థంకాక పోయినా, ఎన్నిరోజులకు మళ్ళీ ఆ సుందర ప్రకృతిలో ప్రశాంత గంగా తీరంలో ఏకాంతంగా మధును కలువబో తున్న, అనుకోని అదృష్టాన్ని తలచుకొని, ఆ అనుభూతి నిజమో కలో నిశ్చయించుకోలేక ఓ క్షణం తటపటాయించినా, ఆలశ్యం చేస్తే మధు మళ్ళీ మనసు మార్చుకుంటుందేమోనని భయంతో లేచి వీధిలోకెళ్ళి గంగాతీరం వైపు నడకసాగించాడు. వేగంగా వుత్సాహంతో ఎగిరిపడుతున్న మనస్సుకు కళ్ళాలువేసే ప్రయత్నం చేయలేదు.

రేవు చేరిన శేఖర్ ఓసారి తృప్తిగా గాలి పీల్చుకున్నాడు. రేవులో ఎవ్వరూ లేరు. సామాన్యంగా ఆ పక్క చాకలివాళ్ళుంటారు. చీకటిపడటంవల్ల వాళ్ళు మూటలెత్తుకొని యిళ్ళకెళ్ళారు. నర సంచారం లేదు చుట్టుప్రక్కల ఎక్కడా. శేఖర్ కళ్ళు ఆత్రుతగా, ఆరాటంగా ఎదురుచూస్తున్నాయి, మధుకోసం. మరో పదినిముషాలకు మెల్లగా నడుస్తూ దూరంగా తనవైపే వస్తున్న మధు కనిపించింది.

'అబ్బ! అంత మెల్లగా నడుస్తుందేం!' క్షణాలు యుగాలుగా అనిపిస్తున్నాయి శేఖర్‌కు. ఎదురెళ్ళి ఎత్తు

కొచ్చేద్దామన్నంత ఆవేశంగా వుంది. అయినా ఏదో సంస్కారం అడ్డురాగా నిగ్రహించుకున్నాడు.

మధు వచ్చి నవ్వుతూ ఇసుకలో కూర్చుంది శేఖర్‌కు ఎదురుగా. వేలితో ఏవో గీతలు గీస్తూ కూర్చుంది. గీతలు కావవి శేఖర్ పేరు వ్రాసి మళ్ళీ వెంటనే చెరిపేస్తోంది. కొంత సేపు శేఖర్ పేరు వ్రాస్తూ మౌనంగా కాలక్షేపం చేసిన మధు, తలెత్తి నవ్వుతూ శేఖర్‌వైపు చూసింది. అప్పటికే అతని కళ్ళు ఆమె మనోభావాల్ని కనుక్కోవాలని ఆత్యాశగా ఎదురుచూస్తున్నాయి. మాటల్లో వ్యక్తం చేయలేని వింత అనుభూతితో మెరుస్తూ, చలిస్తున్న ఆ నయనాలు చూస్తుంటే అప్రయత్నంగా కళ్ళు క్రిందకు వాలిపోయాయి మధుకు. అతను ఆప్యాయంగా ఆమె చేయి తన చేతుల్లోకి తీసుకొని

"మధూ! మమ్మల్నందరినీ, యింతటి ప్రశాంతమైన గంగానదినీ, గంగాపూర్‌ను వదిలేసి కలకత్తా వెళ్ళిపోతావా?" అన్నాడు యింకేవో మాటల కోసం వెదుక్కుంటూ.

"గంగానది కలకత్తాలో కూడా వుందిగా" అంది అల్లరిగా నవ్వుతూ.

"అయితే వెళ్ళిపోతావన్నమాట. అది చెప్పటానికి యింతదూరం రావడమెందుకు?" అన్నాడు చిరుకోపం ప్రదర్శిస్తూ.

"ఏది చెప్పడానికైతే యింతదూరం రావాలో చెబుతారా సార్!" అని యింకా కొంటెగా అడుగుతున్న మధును చూసి శేఖర్‌కు నిజంగానే కోపం వచ్చింది. తనంత సీరియస్‌గా అడుగుతుంటే మధుకు పరిహాసంగా వుందని.

"మధూ! ఏవిటా సమాధానం? నాకు సీరియస్‌గా మాట్లాడేటప్పుడు జోక్ చేస్తే వళ్ళు మండిపోతుంది. ఎవరైనా ఎదురుగా కన్పిస్తే చంపలు పగలగొట్టాలనిపిస్తోంది" అన్నాడు విసుగ్గా కోపంగా చూస్తూ.

ఓసారి చుట్టూ చూసి, "మరి ఈ చుట్టుప్రక్కల అవి అందుకోగల అదృష్టవంతులెవరూ కనిపించడంలేదు నేనూ, ఆ గంగమ్మతల్లీ తప్ప చంపలు పగలగొట్టాలంటే... నేను, ఒళ్ళుమంట తగ్గాలంటే గంగానదిలో ఓ మునక" అంటున్న మధు మాటలకు నవ్వొచ్చినా బిగపట్టి అలాగే కూర్చున్నాడు శేఖర్. కొంత సేపు నిశ్శబ్దం ఆవరించిందా ప్రదేశాన్ని. ఎవరి ఆలోచనల్లో వాళ్ళు మునిగిపోయారు. గాలి చేసే స్వరాల శబ్దం, చుట్టుప్రక్కల నివాసాలకు చేరుకుంటున్న పక్షుల కిలకిలారావం తప్ప మరో చప్పుడు వినిపించడంలేదు. నెమ్మదిగా నిశ్శబ్దాన్ని భగంచేస్తూ "శేఖర్ బాబూ! యివాళ నా మనసులో అంతులేని సంచలనంగా వుంది. నేనేం మాట్లాడుతున్నానో నా కర్థంకాకుండా

వుంది. నాకేంకావాలో ఏమఖ్ఖర్లేదో తెలీకుండా వుంది. నేనేంచేయాలో ఏం చేయకూడదో బోధపడటంలేదు." అంటున్న మధువైపు విచిత్రంగా చూశాడు శేఖర్. అంతలో అంత గంభీరంగా మారిపోయిందేవిటి? ఇప్పటివరకూ చిలిపిగా, చిరునవ్వుతో మాట్లాడిన మధూ, యిప్పుడు నిరాశా నిస్పృహ మేళవించిన గొంతుతో అసహాయంగా అయోమయంగా మాట్లాడుతున్న ఈ మధూ. ఒక్కరేనా ? అనే అనుమానంతో చూశాడు. శేఖర్ చూపులు అర్థమైనట్లే జవాబు చెప్పింది మధు.

"శేఖర్ బాబూ! మిమ్మల్ని అనవసరంగా బాధపెడుతున్నాను. నా పిచ్చి మాటలతో శ్రీధర్ మావయ్యకు లెటర్ వ్రాశాను యిందాకే." ఓ క్షణం ఆగి ది

"ఏమని?" శేఖర్ కళ్ళు ప్రశ్నిస్తున్నాయి

"శ్యాం తొమ్మిదవ తరగతికి వచ్చేశాడు. మరో రెండు సంవత్సరాలైతే వాడిస్కూల్ చదువు పూర్తవుతుంది. అప్పుడు కాలేజీలో ఎలాగూ చేర్పించాలి అప్పుడే వస్తాను ప్రస్తుతం యీ రెండేళ్ళు గంగాపూర్‌లోనే వుంటాను. నేనిలా వ్రాశానని అన్యథా భావించవద్దు. సాధ్యమైనంత త్వరలో సుషను పెళ్ళి చేస్తే, తను నాకు తోడుగా గంగాపూర్ వచ్చేస్తుంద అని వ్రాశాను! నే తీసుకున్న నిర్ణయం సరైనదేనంటారా ?" శేఖర్ వైపు చూసిన మధుకు శేఖర్ కళ్ళలో ప్రతిఫలిస్తున్న భావకందని భావంచూసి అతన్నుంచి దూరంకావడం తననుకున్నంత. తెలివైన పనికాదని అన్పించింది

"మధూ! మరి చంద్రం తీసుకున్న నిర్ణయమేమిటో తెలుసా? నీ వివాహమయ్యేంతవరకూ తనూ వివాహం చేసుకోడట. సుషమ యిక్కడికి రావాలంటే ముందు నీ వివాహం కావాలి. యింక నీ నిర్ణయం విషయానికి వస్తే నీకు భవిష్యత్‌ను గురించిన మరే ఆలోచనలూ లేవా మధూ! శ్యాం కాలేజీలో చేరితే నువ్వు కలకత్తా వెళ్ళి ఏం చేస్తావు?

"ఆ రోజు నీ కళ్ళలో కన్పించిన కాంతితో నా జీవితమంతా వెలుగు నింపుతావనుకున్న నాకు, నీ సమాధానమేమిటి మధూ?

ఈ రోజు సమయం సందర్భం కలిసి వచ్చాయి కనుక అడుగుతున్నాను మధూ! మనం మొదట అనుకున్నట్టే పెళ్ళి చేసుకుందాం మధూ! అందువల్ల శ్యాం భవిష్యత్‌కు వచ్చిన నష్టమేమీ వుండదు. అతని భవిష్యత్‌కు ఆటంక ముండదు. నేను చదివిస్తాను. శ్యాం ఎంతవరకు చదవాలనుకుంటే అంతవరకూ. నువ్వంగీకరిస్తే మన వివాహం, సుషమ చందూల వివాహం ఒకేసారి జరుగుతాయి" అన్నాడు శేఖర్ ఆవేశంగా.

వెల్లువలా పెల్లుబుకుతున్న దుఃఖాన్ని ఆపుకోడానికి ప్రయత్నిస్తూ..."నన్ను

క్షమించండి. శ్యాం భవిష్యత్‌కు ఒక బాట నేర్పరచే వరకూ నా జీవితంలో వివాహప్రసక్తి లేదు. అందుకని మిమ్మల్ని అంతవరకూ నా కోసం ఆగమనీ చెప్పను. మీ నాన్నగారు ఎలాగూ మన వివాహానికి సమ్మతించారు. వారి నెపెరించినా మీరు నన్ను పెళ్ళిచేసుకో డానికి సిద్ధమని నాకు తెలుసు. కానీ నేను ఎప్పటికైనా వివాహంచేసుకుంటే అది వారి ఆశీర్వాదంతో. వారి కిష్టం లేకుండా మిమ్మల్ని నా సొంతం చేసుకోడం అమానుషం. తలి దండ్రులు పిల్లల మీద ఎన్నో ఆశలు పెంచుకుంటారు. వారి ఆశలకు విరుద్ధంగా పోయి మనం సాధించేదేమీ లేదు.

"మా నాన్నగారు ఎలాగైనానన్ను ఓ డాక్టర్‌ను చేయాలనీ గొప్ప కుటుంబంలో యిచ్చి,ఎంతో ఘనంగా పెళ్ళి చేయాలనీ శ్యాంని ఓ పెద్ద పైలెట్ ఆఫీసర్‌ను చేయాలనీ కలలు కనేవారు. ఆయన ఏ కలలూ తీర్చుకోకుండానే అకాలమృత్యువు వాతబడి మమ్మల్ని అనాధల్ని చేశారు. ఆయన పోయినా నేనింకా బ్రతికే వున్నాను. నాన్నగారి ఆశయాల్లో ఒక్కటైనా నెరవేర్చాననే తృప్తి నాకు మిగుల నివ్వండి శేఖర్" అంది ఆవేదన అపుకోలేక మోకాళ్ళమీద తలపెట్టుకొని ఏడుస్తున్న మధు. ఆమె కన్నీటిని తుడుస్తూ–

"ఛ ! యిప్పుడేమైంది ? మీ నాన్నగారి రెండు కోరికలూ తర్చే బాధ్యత నాది నాకా అవకాశ మివ్వు మధూ ! నా మాటవిను నేను నాన్నగారిని వొప్పించ గలనన్న ధైర్యముంది. వారు నా మాట కాదనరు నువ్వు ధైర్యంగా వుండు మన జీవితాలతో చంద్రం జీవితం ముడి పెట్టుకున్నాడు. నువ్వు పెళ్ళి చేసుకోక పోతే వాడూ చేసుకోడట అది నీకు న్యాయమేనా ? చందూ మన కోసం అలాగే వుండిపోవాలంటూవా?" అన్నాడు శేఖర్.

"లేదు,చంద్రం బావని నేనొప్పిస్తాను నా కోసం బావెందుకాగాలి ? సుషమను కూడా బాధపెట్టడం ఎందుకు ? మీరూ నా కోసం ఆగవద్దు మీ నాన్నగారు చూసిన మంచి అమ్మాయిని పెళ్ళి చేసుకోండి యింక నా మీద ఆశ వదులుకోండి." లేచి శేఖర్ పిలుస్తున్నా వినిపించుకోకుండా వెళ్ళిపోయింది. ఆ ఆమెను కనుమరుగయ్యేంత వరకూ చూస్తూండి పోయి, నెమ్మదిగా తనూ లేచి చంద్రంయింటి వైపు అడుగులు వేశాడు

ఇల్లు చేరిన మాధవికి ఆ రాత్రంతా నిద్రలేదు శేఖర్ మాటలు నమ్మి తను ఆతన్ని పెళ్ళిచేసుకుంటే శ్యాంభవిష్యత్ ఏమౌతుందో అనే భయం ఆమెచేత అలా అంత నిక్కచ్చిగా, శేఖర్ అభ్యర్థనను త్రోసిపుచ్చేలా చేసింది. యిప్పుడున్న ఆవేశంలో తొలివలపులోని ఆవేశంలో

క్యాంని చదివిస్తానని, పెద్ద ఆఫీసర్‌ను చేస్తానని వాగ్దానాలు చేసినా అవి నిలబెట్టుకుంటారని నమ్మకమేమిటి? ఒకవేళ అలా జరగకపోతే తను శేఖర్‌ను క్షమించగలదా? తనను తాను క్షమించుకోగలదా? అందుకే అంత్యనిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేలని ముందే శేఖర్ మాటల్ని త్రోసిపుచ్చింది. మరో రెండు నిముషాలక్కడే వుంటే...అండగా నిలుస్తానంటున్న ఆ గుండెలపై వాలిపోయి తన్ను తాను మర్చిపోతానేమోనమోననే భయంతోనే శేఖర్ పిలుస్తున్నా వినిపించుకోకుండా, తిరిగి చూడకుండా వచ్చేసింది. తన తిరస్కారానికి ఎంత బాధపడుతున్నాడో శేఖర్ సమక్షంలో మనస్సు వశం తప్పుతుంది. అతని అనంతమైన ఆరాధనలో కరిగి అతనిలో కలిసిపోవాలనే వెర్రికోరిక కలుగుతుంది. కానీ తను అన్ని విధాలా దురదృష్టవంతురాలు. తను అమితంగా ప్రేమించే వాళ్ళెవరూ తనకు అందుబాటులో లేకుండా పోతున్నారు. అది తను చేసుకున్న పాపమో, విధి శాపమో తెలియడం లేదు.

పాపం! చంద్రం బావ! నేనంటే ఎంత అభిమానం...పిచ్చి బావ! తన వివాహం నా వివాహంతో ఎందుకు ముడిపెట్టుకోవాలి? రేపే మళ్ళీ శ్రీధర్ మావయ్యకు ఉత్తరం వ్రాయాలి, వెంటనే ముహూర్తాలు పెట్టుకోడానికి రమ్మని. ఈ విషయం ముందుగా బావకు చెబితే మళ్ళీ అడ్డుపుల్లలువేసి నా పెళ్ళితో ముడిపెడతాడు. నాకా అదృష్టం ఎలాగూ యీ జన్మకు లేదు. పాపం, మనస్ఫూర్తిగా ప్రేమించుకున్న సుషమ-బావ ఎందుకు బాధపడాలి? ముందుగా ఏ విషయం బావకు చెప్పకుండా రహస్యంగా ముహూర్తాలు అక్కడే పెట్టుకొని రమ్మని మావయ్యకు వ్రాస్తే మావయ్య ముహూర్తాలు పెట్టుకుని దిగితే అప్పుడు ఆపగల ధైర్యం వుండదు కనుక తప్పనిసరిగా వొప్పుకుంటాడు బావ! ఈ ఆలోచన బావుంది! అలాగే శేఖర్‌ను మరో అమ్మాయిని. ఆ మధ్య వచ్చిన సంబంధానికి వొప్పిస్తే...అది తనకు సాధ్యమయ్యేపనేనా? అతన్ని పెళ్ళి చేసుకోకుండా వుండగలదేమో కానీ... అతన్ని వేరే మరో అమ్మాయితో పెళ్ళికి వొప్పించగల ఆత్మస్థైర్యం తనకెక్కడిది? తను చాలా స్వార్థంగా ఆలోచిస్తోందేమో! అతన్ని వదులుకోనూ లేదు. అలాగని అతన్ని పెళ్ళి చేసుకోనూ లేదు. మరొకరికి తనంతట తాను వొప్పజెప్పనూలేదు. దూరంగా వున్నా తను తనవాడనే భావన కొండంత ధైర్యాన్నిస్తోంది. ఎంత ఆనందం కలిగిస్తోంది ఆ భావన.

నిష్కల్మషమైన ప్రేమ స్వార్థరహిత మంటారు. కానీ తనలో యింత స్వార్థమేమిటి? స్వార్థం లేకుండా అసలు

ప్రేమే లేదేమో!" ఆ నిర్వచనంలో దోషముందో తన మనసులో దోష ముందో అర్థం కావడంలేదు.

ఇలా రాత్రంతా ఏవేవో ఆలోచనలతో నిద్రపట్టక బాధపడుతున్న మధు, తెల్ల వారుఝామునే లేచి కూర్చొని చదువు కుంటున్న శ్యాంని చూసి తనూ లేచి పాచివాకిలి వూడవడానికి వెళ్ళింది. అన్య మనస్కంగానే వాకిలి వూడ్చి కళ్ళాపి జల్లి, ఏదో ముగ్గుపెట్టి యింట్లోకి వచ్చింది. పక్క దులిపి పరుపు చుట్టేసి, మంచం ఎత్తిపెడుతున్న అక్కవైపు వింతగా చూశాడు శ్యాం. ఈవాళ అక్క ప్రవర్తన వింతగా వుంది. లేచాక తన్న సలు పలకరించనే లేదు. చేసే పని మీద కూడా మనసున్నట్లు లేదు. ఏదో ఆలోచిస్తూ నిలబడిపోతోంది కొంచం సేపు, మళ్ళీ పనిచేసుకుపోతోంది.

అలాంటప్పుడు అక్కని మాట్లాడించా లంటే వాడికి భయం. అప్పుడు అత్తయ్య చనిపోయినప్పుడు అక్క మాట్లాడ కుండా వెర్రిచూపులు చూసిన ఆ రెండు రోజులూ వాడికి నరకం కనిపించింది. అక్కయ్యంటే అందంగా నవ్వుతూ, ఆనందంగా పాడుతూ, కథలు చెబుతూ తనతో ఆడుకునే ఓ అమృతమూర్తి. ఆప్యాయంగా అన్నం కలిపి పెట్టే అక్కయ్య వాడికి అమ్మలేని లోటెప్పుడూ కనిపించనీయలేదు...చాలా కాలం తర్వాత తనకో ఆటబొమ్మలా దొరికిన




ఆ తమ్ముడంటే అపురూపం ఆ అక్కకు. అందుకే వాళ్ళిద్దరి మధ్యా విడదీయరాని రక్త సంబంధమే కాకుండా, ఆత్మీయతా బంధం కూడా అల్లుకొని, ఒకళ్ళంటే మరొకరికి ఆపేక్షను పెంచింది.

ఆ రోజు తన హోంవర్కంతా త్వరగా ముగించుకొని స్నానం కానిచ్చి మాట్లాడకుండా అక్క పెట్టిన అన్నం తినేసి స్కూల్‌కు వెళ్ళిపోయాడు శ్యాం.

బిలబిల్లాడుతూ వచ్చిన పిల్లలతో మళ్ళీ ఆ చిన్నారిలోకంలో పడి కొంత సేపు తన బరువు బాధ్యతలు, కలతలు, కన్నీళ్ళు మర్చిపోయింది మధు.

మధు లెటర్ అందుకున్న శ్రీధర్ గారు మధు వూహించినట్లు వెంటనే ముహూర్తాలు పెట్టుకోకుండా చంద్రానికి వుత్తరం వ్రాశారు. అప్పటికి మధు శ్రీధర్ గారికి లెటర్ వ్రాసి పదిరోజులైంది. ఆ రోజే మధుకు జవాబొచ్చింది "నువ్వు వ్రాసిన లెటర్ అందింది, మధూ! మరో రెండు సంవత్సరాలు నువ్వు గంగాపూర్ లోనే వుండాలనుకుంటే నేను నిన్ను బలవంతపెట్టను. నీ యిష్ట ప్రకారమే కానివ్వు. శ్యాం స్కూల్ ఫైనల్ ఎగ్జామ్స్ కాగానే చంద్రాన్ని తీసుకొని వచ్చేయండి. సుషమ, శిరీష్ మిమ్మల్ని అడిగినట్లు చెప్పమంటున్నారు.

శ్రేయోభివృద్ధిని కోరే మామయ్య శ్రీధర్ ఆశీస్సులతో."

తేలిగ్గా నిట్టూర్చింది మధు. ఎందుకో చంద్రం, సుషమల వివాహం విషయం వ్రాయలేదని అసంపూర్తిగా అనిపించింది. ఆలోచిస్తూ వాకిట్లో నుంచున్న మధుకు వీధిలో తలవంచుకొని నెమ్మదిగా నడిచిపోతున్న శేఖర్ కనిపించాడు తమ యింటిముందునుంచే వెళుతూ కనీసం లోపలికి రాకుండా, తమ యింటి వైపైనా చూడకుండా వెళ్ళిపోతున్నాడని వో క్షణం మనస్సు బాధపడింది అంతలో కొంచం వెనగ్గా వస్తున్న చంద్రం కనిపించాడు. యింక ఆగలేక వీధిలో కెళ్ళి, "బావా!" అని కేకేసింది. ఇద్దరూ వెనుదిరిగి చూశారు. మళ్ళీ శేఖర్ తలవంచుకుని ముందుకో అడుగు వేశాడు. చంద్రం వస్తుండటం చూసి, "శేఖర్ బాబూ మీరు కూడా రండి," అని కేకేసింది. ఇంక తప్పుకోలేక చంద్రాన్ననుసరించి లోపలి కొచ్చాడు శేఖర్.

ఎర్ర బడ్డ కళ్ళతో, అలసిన ముఖంతో చిక్కినట్లు కనిపిస్తున్న శేఖర్ ని చూస్తుంటే ఎంతో క్షోభకు గురయ్యాడని తెలుస్తోంది. ఇందుకు అన్ని విధాలా కారకురాలినైన నన్ను ఏంచేస్తే ఆ పాపానికి నిష్కృతి కలుగుతుంది? అన్పించింది మధుకు.

చంద్రం కూడా వుత్సాహంగా లేడు. 'బహుశా శేఖర్ తన విషయాలన్నీ చెప్పాడేమో! తన నిర్ణయాలు విని బాధ పడుతున్నాడేమో!' అనుకుంటున్న

మధు, చంద్రం మాటలతో యీలోకం లోకి వచ్చింది.

"శ్రీధర్‌గారు లెటర్ వ్రాశారు మధూ! సుషమ శిరీష్‌తో కలిసి అమెరికా వెళతానంటున్నదట. శిరీష్ అమెరికా వెళ్ళి సెటలై పోవాలనుకుంటున్నాడట. ఆయన చాలా బాధపడుతూ వ్రాశారు మధూ!" చెబుతున్న చంద్రంగొంతులో కూడా అణచిపెట్టుకున్న బాధ ధ్వనిస్తోంది.

ఈ వయసులో వున్న యిద్దరుపిల్లలూ శ్రీధర్ మావయ్యను వదిలిపోతే ఆయన వొంటరిగా ఎంత బాధపడాలి? ఆ మాత్రం జ్ఞానం లేదూ శిరీష్‌కూ సుషమకు! అంత బాధలోనూ వాళ్ళ అమాయకత్వాన్ని, అవివేకాన్ని తలచుకొని నవ్వొచ్చింది మధుకు. తను లేని ఆత్మీయులకోసం బాధపడుతుంటే... ఉన్న ఒక్క ఆత్మీయున్ని వదలి ఆనందాన్ని వెదుక్కుంటూ వెళ్ళబోతున్న వాళ్ళ అంతరంగమేవిటో అర్థంకాలేదు.

మళ్ళీ చంద్రమే మాట్లాడాడు. "నన్నూ శేఖర్‌నూ వెంటనే బయలుదేరి రమ్మని వ్రాశారు. కనీసం సుషమ నన్నా ఆపుతామని."

జుట్టులోకి వేళ్ళుపోనిచ్చి పిచ్చిగా వెనక్కు నెట్టుకుంటూ నేలచూపులు చూస్తున్న శేఖర్‌ను అంత మౌనంగా వుండగా చూడటం అదే మొదటిసారి. మధుకు పిచ్చెత్తిపోయేలా వుంది ఆ పరిస్థితి. "ఏవిటిది? చివరికి తన మూలంగా ఎవ్వరికీ ఏ ఆనందమూ వుండదా? తన జాతకమే అలాంటిదా?" అన్న ఆలోచనలతో మౌనంగా వున్న మధును చూసి అన్నాడు చంద్రం.

"మధూ! నువ్వూ రాకూడదూ? నువ్వొస్తే తప్పక సుషమను ఆపగలవు" అంటున్న చంద్రం గొంతులో ఏదో ఆశ.

"బావా! సుషమను ఆపగలగటమంటూ జరిగితే అది నువ్వే చెయ్యగలగాలి. నేను వస్తే ఆగుతుందనే నమ్మకం నీకుంటే తప్పకుండా వస్తాను బావా!" అంటున్న మధువైపు కృతజ్ఞతతో చూశాడు చంద్రం.

"మీరు మాట్లాడుతూ వుండండి, యిప్పుడే వస్తాను" అని మధు లోపలికెళ్ళింది.మరో పదినిముషాల్లో కాఫీకలిపి తీసుకొచ్చింది.తలవంచుకొని కూర్చున్న శేఖర్ తలెత్తి ఓసారి మధు కళ్ళలోకి చూసి గ్లాసందుకున్నాడు. ఆ మౌనం భరించరానిదిగా వుంది. ఆ చూపుల్లోని శక్తిముందు మధు నిలబడలేకపోతోంది. అంతకంటే దైహికంగా తనని హింసించినా, తిట్టినా, అంత బాధ కలగపోయేది. 'శేఖర్ అలా కావడానికి... చంద్రం సుషమల పెళ్ళి ఆగిపోవడానికీ వాటన్నింటికీ నువ్వే కారణం. నువ్వే కారణం!' అని వేయిగొంతులు ఎలుగెత్తి చాటుతున్నట్లనిపించి వుయ్యాల బల్లను పట్టుకొని నుంచున్న మధు

శరీరం గాలిలో తేలిపోతున్నట్లు, తల గిర్రున తిరిగిపోతున్నట్లై, నిలదొక్కుకో లేక క్రిందకు తూలింది.

అంతవరకూ శిలావిగ్రహంలా కూర్చున్న శేఖర్, ఖంగారుగా లేచి తూలి క్రిందకు జారుతున్న మధును పొదివి పట్టుకున్నాడు. కళ్ళు తెరచి తనకు ఆసరాయిచ్చి పట్టుకున్న ఆ అమృతమూర్తిని చూడాలని మధు చేసిన ప్రయత్నం విఫలమై అతని చేతుల్లో అచేతనంగా వాలిపోయింది. రెండు చేతుల్తో జాగ్రతగా ఎత్తి మంచం మీద పడుకోబెట్టిన శేఖర్ ఆతృతగా, భయంగా చంద్రంవైపు చూశాడు. చంద్రం త్వరగా లోపలికెళ్ళి గ్లాసుతో చల్లటి నీళ్ళు తీసుకొచ్చాడు శేఖర్ వెంటనే గ్లాసందుకొని మధు ముఖాన నీళ్ళు చల్లాడు. జేబులో నుంచీ కర్చీఫ్ తీసి, తడిపి మెత్తగా ముఖాన అద్దుతూ–

"చందూ! మధు ఎందుకిలా పడి పోయింది?" అనురాగంతో మధు నుదుటిపై పడిన ముంగురులు సవరించసాగాడు. శేఖర్ మనసుతెలిసిన చంద్రానికి మధు మూర్ఖంగా అంతటి అనురాగమూర్తిని కాదంటున్నందుకు ఓ క్షణం మధు మీద కోపమొచ్చింది. నెమ్మదిగా శేఖర్ వెన్ను రాస్తూ.

"మరి కొంచం సేపటిలో తేరు కుంటుందిలే వీక్‌నెస్, మరేంలేదు భయ పడకు" అంటూ, మసక బారుతున్న కళ్ళను తుడుచుకొనే ప్రయత్నంలో చావిట్లోకి వెళ్ళిపోయాడు చంద్రం. ఈ రోజు చంద్రం మనసు కూడా బాగా వికలమై వుంది. సుషమ అమెరికా వెళ్ళాలనే నిర్ణయం ఎందుకు తీసుకుందో అర్థంకాకుండా వుంది. ఇటు మధు చెప్పిన మాటవినడం లేదు. శేఖర్ అంతకంటే పిచ్చిగా "మధు లేకపోతే మరి నాకీ బ్రతుకెందుకురా! చల్లని చేతుల్తో ఎప్పుడూ ఆహ్వానిస్తుందే ఆ గంగమ్మతల్లి వొళ్ళో హాయిగా శాశ్వ తంగా నిద్రపోతాను అంటూ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు. అందరికీ అన్నివిధాలా సర్దిచెప్పలేక, సమర్థించ లేక, వోదార్చలేక చంద్రం సతమత మౌతున్నాడు. తలపట్టుకొని వుయ్యాల బల్లమీద కూర్చున్న చంద్రం ఆలో చనలు మళ్ళీ సుషమ వైపు మళ్ళాయి.

దక్షిణపు గదిలో గాలి బాగా వస్తుంది మంచంమీద పడుకొనివున్న మధు ముంగురులు సవరిస్తూ రెప్ప వాల్చకుండా తదేకంగా ఆ ముఖంలోకి చూస్తున్న శేఖర్, నెమ్మదిగా కళ్ళు తెరచిన మధు వైపు ఆనందంగా చూశాడు మనసున దాగిన మమతానురాగాల్ని త్రెంచుకొని "మధూ" అన్న మధురమైన పిలుపు అతనికి తెలీకుండానే పెదవులు దాటింది. కళ్ళెత్తి శేఖర్‌వైపు చూసిన మధు కళ్ళనిండుగా కన్నీళ్ళు...ఆ ప్రేమ ప్రవాహాన్ని ఆపడం ఎవరికి సాధ్యం?

"మధూ" అని మరోసారి అనునయింపుగా చేతులు పట్టుకున్నాడు శేఖర్.

ఒక్కసారిగా లేచి అతని చేతుల్లో వాలిపోయింది. ఆ కౌగిలికి ఆ స్పర్శకు తపించిపోయిన రెండు హృదయాల మీద ఆ సమాగమం పన్నీటిజల్లు కురిసింది. మధు కళ్ళనుంచీ జారుతున్న వెచ్చటి కన్నీళ్ళు ఆవేదనతో బీటలు వారిన హృదయాన్ని తడిపింది.

"ఎంత బాధ పెట్టాను మధూ! నా అంత మూర్ఖంగా ఎవరైనా వుంటారా? పదిరోజుల్నించీ నీ ముఖమైనా చూడకుండా వుండటానికి నేనెంత బాధపడ్డానో తెల్సా?" మూగ బాధ, మరోరకమైన ఆనందంతో మాట్లాడ లేకపోతున్న మధు మౌనమే సమాధానమైంది. చిన్నప్పటి నుంచీ ఆవేదన ఎలా వుంటుందో తెలీకుండా అపురూపంగా పెరిగిన శేఖర్ కళ్ళ వెంట కన్నీళ్ళు టపటపా రాలి మధు తలను తడిపేశాయి.

అతనిలో పూర్తిగా ఐక్యమైపోతూ గుండెలమీద తలవాల్చిన మధు నుదిటిపై పడ్డ వెచ్చటి కన్నీళ్ళు వాస్తవంలోకి తెచ్చాయి. ఖంగారుగా దూరంగా జరిగి శేఖర్ వైపు చూసింది. చమర్చిన కళ్ళను క్రిందకు దించుకున్నాడు. "క్షమించు మధూ!" అంటూ మంచం మీదనుంచీ లేచి ముందుకు పోబోయిన శేఖర్‌ను చెయ్యిపట్టుకుని ఆపింది మధు.

మధుకు ఆ క్షణంలో మాట్లాడాలనిపించడం లేదు. మౌనంగా, అణువణువునా ఆత్మీయత నిండిన ఆ అనురాగమూర్తిని చూడాలనీ, ఆ మమత నిండిన మాటలు వినాలనీ తప్ప ప్రపంచంలో వేరే ఏవీ గుర్తు లేవు. ఓరకమైన ప్రేమోన్మాదంఆవరించింది మధు మనస్సును, శరీరాన్ని. చంద్రం ఏమయ్యాడనికూడా ఆలోచించలేదు.

"మధూ! నీకు ఎంత దూరంగా వుండాలనుకున్నానో, నీ ఆలోచనలు అంత దగ్గరకు లాగుతున్నాయి. నీ మీద కోపంతో మొండిగా నిన్ను చూడకుండా వుండటానికి నేనెంత బాధ పడ్డానో తెలుసా? అయినా మళ్ళీ ఎదుట పడితే నిన్ను చూడకుండా, నీతో మాట్లాడకుండా వుండటం నాకు అసాధ్యం మధూ! నాకెందుకింతటి శిక్ష వేశావు మధూ? ఈ బాధకు తట్టుకొని నిలబడటం నాకు సాధ్యం కావడం లేదు. ఏన్నేం చేయమంటావు మధూ? ఏం చేయమంటావు?" అని బాధగా కణతలు రుద్దుకుంటున్న శేఖర్ తలను గుండెల కదుముకొని ఓదార్చాలనిపించింది. ఆ పని చేయకుండా వుండటానికి తనలోని సర్వశక్తులూ వుపయోగించి ఓడిపోయింది మధు.

(సశేషం)

Printed and Published by A. Chandra Sekar Rao at 5-9-88, Public Garden Road Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor: A. SUDHAKARA RAO




# ప్రేమవాహిని

శేఖర్ తల మృదువైన మధు గుండెల మీద...నెమ్మదిగా శేఖర్ తల్లో వేళ్ళుదూర్చుతూఎంతోహాయిననుభవిస్తూ "మీకోసం...మీ పిలుపుకోసం... ఈ పదిరోజులుగా ఎంతగా తపించి పోయానో!... ఆరోజు మీరు పిలుస్తుంటే ఆగకుండా రావడానికి ఎంత అవస్థపడ్డానో తెలిస్తే...... మీరు నన్ను అర్థంచేసుకొని వుండేవారు. నన్ను దూరం చేసినదానికంటే,... నా ముఖంకూడా చూడకుండా పోతున్న మీరు నన్నెంత తప్పుగా అర్థం చేసుకున్నారో అనుకుని బాధపడ్డాను. మీ సంతోషంకోసం, శ్యాం భవిష్యత్ కోసం...నేను మీకు దైహికంగా దూరం కాగలనేమోకానీ అంత ప్రాణాధికంగా ప్రేమించే మీరు నన్ను అసహ్యించుకుంటే నేను భరించలేను. మీకు దూరమై బ్రతకటం నాకు సాధ్యం కాదేమో నన్పిస్తోంది. మీరు నాకింత అవసరమని నాకీ క్షణంవరకూ తెలీలేదు. మానసికంగా మీ సహకారం లేకపోతే మీ మధు ఏదీ సాధించలేదు. నాకా సహాయాన్నందిస్తానని, నాకా బలాన్ని చేకూరుస్తానని చెప్పండి శేఖర్!" అంటూ తనలో యిమిడిపోతున్న మధును నెమ్మదిగా తననుంచి విడిదీస్తూ.

"తప్పకుండా మధూ! నా సహాయం, సహకారం ఎప్పుడు కావలసి వచ్చినా నిరభ్యంతరంగా నాకు తెలియజేయి.

ముఖం తుడుచుకో" అంటూ లేచి సున్నితంగా మధు ముంగురులు సవరించి బయటకు వెళ్ళాడు.

కానీ చంద్రం హాల్లో లేడు. వాకిట్లో అరుగుమీద కూర్చొని శ్యాంతో మాట్లాడు తున్నాడు అయితే మధు లేచిందని తెలిగానే శ్యాంను బయటే కూర్చోబెట్టి కబుర్లలో పెట్టాడన్నమాట అనుకొని చిన్నగా నవ్వుకుంటూ వెళ్ళి చంద్రం ప్రక్కన కూర్చున్నాడు శేఖర్. చంద్రం ఏమీ అడగలేదు. శేఖరేమీ చెప్పలేదు శ్యాం ముందడిగితే ప్రశ్నల వర్షం కురిపిస్తాడని చంద్రం లేచి లోపలికెళ్ళాడు.

అప్పుడే ముఖం కడుక్కొని లోపలి గదిలోకి వెళ్ళబోతున్న మధు, చంద్రం పిలుపుతో గుమ్మందగ్గరే ఆగిపోయింది గానీ వెనక్కి తిరిగి చూడలేదు. సిగ్గుగా, ఏదో తెలీని భయంగా అన్పించింది చంద్రం ముఖం చూడా లంటే... చంద్రానిక్కూడా ఏదో తెలీని బిడియంగా అన్పించి "రేపు కన్పిస్తాను మధూ! కలకత్తా వెళ్ళే విషయం మాట్లాడదాం. ఆరోగ్యం జాగ్రత్త! చాలాబలహీనంగా వున్నావు. వస్తాను" అంటూ వెనక్కి తిరిగాడు. మౌనంగా వెళ్ళిపోతున్న చంద్రాన్నీ, శేఖర్‌నూ చూస్తూ ముఖం తుడుచుకోడం కూడా మర్చిపోయిన మధు లోపలికెళ్ళింది.

ఆ రోజు మామూలుగా శ్యాంని స్కూలుకు పంపించి, ఇంటి అవరణలోవున్న పాకలో కూర్చొని ఒక్కరొక్కరుగా వస్తున్న పిల్లల్ని నవ్వుతూ పలకరిస్తూ కూర్చుంది మాధవి ఇంతలో రాము పరుగెత్తు కుంటూ వచ్చాడు. "గాలిమోటర్... గాలిమోటర్ పోతోంది...గాలిమోటర్ పోతోంది" అని కేకలువేస్తూ. బిలబిల్లా డుతూ, పెద్దకేకలు వేస్తూ పిల్లలందరూ లేచి వాకిట్లోకి పరుగెత్తారు. నవ్వుతూ తనూ వీధిలో కెళ్ళిన మధుకు చాలా క్రిందుగా పోతున్న విమానం కన్పిం చింది. వెంటనే శిరీష్, సుషమలు అమెరికా వెళ్ళే విషయం జ్ఞాపకమొచ్చి మనస్సు వికలమైంది. విమానం వెళ్ళి పోయింది. అంతా మళ్ళీ లోపలికి చేరు కుంటున్నారు పిల్లలు. వెనక్కి తిరిగి లోపలికెళుతున్న మధు పోస్ట్‌మాన్ పిలుపుతో వెనుదిరిగింది. నవ్వుతూ! "మాధవమ్మా! మీకు కవరొచ్చింది" అంటూ ఓ కవరు మాధవి కందించి, సైకిలెక్కి వెళ్ళిపోయాడు. కవరు విప్పి చూసిన మధు ఆశ్చర్యంగా చదవడం మొదలెట్టింది.

"మధూ!

నీకు ఉత్తరం వ్రాయాలనుకోలేదు. కానీ వ్రాయకుండా వుండలేకపోతు

న్నాను. నిన్నే మీ అనకూడదనుకున్నాను. వ్రాయకపోతే నాకు మనశ్శాంతి వుండదు. ఈ దావాగ్నిని నే నొక్క దాన్నే భరించలేను బహుశా నేను అన్నయ్యతోపాటు అమెరికా వెళ్ళిపోతున్నట్టు మీ చంద్రం బావ నీకు చెప్పే వుంటాడు. నాన్నగారు చంద్రం గారికి లెటర్ వ్రాయడం చూశాను. ఆయన తప్పకుండా నా విషయం వ్రాసి వుంటారు. అది మీ బావ నీకు తప్పకుండా చూపించివుంటారు.

మధూ ! నాకు భవిష్యత్‌ను గురించి ఎన్నో ఆశలూ, కోరికలూ వుండేవి. గంగాపూర్ వచ్చిన మొదట్లో నా కలలకు రూపకల్పనగా నిలిచిన ఆ పచ్చటి తోటలు, పసిడిపంట పొలాలు, ఎప్పుడూ నిర్మలంగా పారే ఆ గంగానదీ తీరాన సంధ్యా సమయాల్లో మీతో గడిపిన ఆ మధుర క్షణాలు శాశ్వతం కావాలని, మనస్సు పరవళ్ళు తొక్కింది. నీ స్నేహమాధుర్యంలో, చందూ ప్రేమాను రాగాల జలధిలో కలిసి కరిగిపోవాలనుకున్నాను. నా మాట కెప్పుడూ ఎదురుచెప్పని నాన్నగారిని తలుచుకొని నిర్భయంగా నా ఆశాలతకు నీళ్ళుపోసి పెంచాను. నే ననుకున్నట్లే నాన్నగారి అంగీకారం అతి సులువుగా సంపాదించగల్గాననే ఆనందంతో జగమంతా ప్రేమమయంగా, నందనవనంలా కన్పించింది. నా జీవితంలో విధికి తలవంచవలసిన రోజు వస్తుందని కలలోకూడా వూహించలేను. నేను కన్న కలలన్నీ అలాగే ఫలించి నాలో నాకంత నమ్మకాన్ని కలిగించాయి.

అనుకోకుండా మీ అత్తయ్య పోవడం అప్పట్లో నీ ఆరోగ్యం దెబ్బతినడం నన్నూ బాధపెట్టింది. ఆ క్షణంలో చందూ తీసుకున్న నిర్ణయం నన్నింతగా బాధ పెడుతుందని తెలిసి వుంటే, నాన్నగారి ముందతని వున్నత భావాలను, అతని ఆదర్శాన్ని, అతని ఔన్నత్యాన్ని అంతగా కీర్తించివుండేదాన్నికాదు. నీ వివాహం కాకుండా తను వివాహం చేసుకోనంటే నీ పెళ్ళి బాధ్యత తను వహించాడని సంతోషపడ్డాను. ఒక అనాథకు ఆశ్రయం చూపి చాలనే అతని అభిలాషను, ఆదర్శాన్ని అభినందించాను.

కానీ మధూ ! నీతో అతని అతి చనువును నేను సమర్ధించుకోలేకపోతున్నాను. నీ పెళ్ళయ్యేంతవరకూ తనూ పెళ్ళిచేసుకోనని అతను కూర్చుంటే... శ్యాం ఆఫీసరయ్యేంతవరకూ నీ జీవితంలో పెళ్ళి ప్రసక్తే లేదని నువ్వు కూర్చుంటే... మధ్య నలిగిపోతున్నది ఎవరు ?? నేను ... నా మనసులో చందూకు తప్ప మరొకరికి స్థానంలేదు. అతన్ని కాదని నేను బతకలేను. ఆ సంగతి నాకు పూర్తిగా అర్థమైపోయింది. నీ వల్ల, కేవలం నీ వల్ల నీ మీద

అభిమానంతో చందూ అలా వుండిపోతే నాకు బాధ కాదూ ! అంటే...అంటే నా ప్రేమను నీ మీద అభిమానం జయించిందనేగా దానర్థం. చందూ ప్రేమలో మరొకరికి భాగం పంచడం నేను సహించలేను. ఆయనకు నామీదకంటే మరొకరిమీద ప్రేమాభిమానా లెక్కువనే భావాన్నే నేను భరించలేను. అది నా స్వార్థమే కావచ్చు. అవును నేను స్వార్థపరురాలినే కానీ నా స్వార్థంకోసం మరొకరి ప్రేమను బలిపెట్టడంలేదు నీలాగ.

క్షమించు మధూ ! ఆవేశాన్ని అపుకోలేక ఏమేమో వ్రాశాను. ఏది ఏమైనా నువ్వు గతంలో నా కందించిన స్నేహ మాధుర్యాన్ని మర్చిపోలేను. అలాగే నీ మూలంగా నా జీవితంలో రాబోతున్న పెద్ద మార్పునూ మర్చిపోలేను డాడీ ఆరోగ్యం అంత బావుండటంలేదు. ఆయన బహుశా నిన్నిక్కడకు పిలిపిస్తారేమో ! నేనుండగా మాత్రం నన్నాపే ప్రయత్నాన్ని చేయడానికి చందూతో నువ్వు రావద్దు. అది నేను సహించలేను. చందూ మీద, అతని ప్రేమ మీద నమ్మకం పోలేదు. అయినా యిక్కడే వుంటూ, యిలా దూరంగా వుండటం నాకు సాధ్యంకాదు. అందుకే అమెరికా వెళ్ళిపోవాలనే నిశ్చయానికి వచ్చాను. వీలైతే అక్కడే ఏదైనా వుద్యోగం చూసుకుంటాను. మధూ ! నువ్వొక విచిత్రమైన మనిషివి. నీ స్నేహంలోని మంచితనం అమృతాన్ని కురిపిస్తే, నీ స్వార్థంలోని కరకుదనం విషాన్ని కురిపించింది నా మీద.

ఇక వుంటాను.

ఎవరికీ ఏమీ కాలేకపోతున్న

సుషమ"

లెటర్ చదవడం పూర్తిచేసిన మధు చెంపల మీదుగా కన్నీరు జల జలా రాలిపోతోంది. అక్కని ఆనందంగా తప్ప, అలా చూడని పిల్లలందరూ బిక్కముఖాలు వేశారు. రామూ, వసూ పెద్దగా ఏడుపు లంకించుకున్నారు. వాళ్ళఏడుపుతో వాస్తవంలోకి వచ్చిన మధు వెంటనే లేచి వాళ్ళను దగ్గరకు తీసుకొని కళ్ళు తుడుచుకుంటూ—

"ఇవ్వాల్టికి మీరంతా యిళ్ళకు వెళ్ళండమ్మా ! రేపు మంచి మంచి కథలు చెప్పుకుందాం. నాకొంచం పనుంది" అని బుజ్జగించి అందర్నీ యిళ్ళకు పంపేసి, వెళ్ళి మంచంమీద పడి భోరుమని ఏడ్చింది. "భగవాన్ ఏవిటిది ? నే నెందర్ని బాధపెడు తున్నాను. నా మూలంగా ఎవరికీ ఏ సుఖమూ లేకపోగా అందరికీ అనవసరమైన చికాకులు కలిగిస్తున్నాను. నా కర్తవ్యమేవిటి ? నేనేం చేస్తే అందరికీ సంతోషం కలుగుతుంది ?" అని పరి పరి విధాల ఆలోచిస్తూ ఓ గంట తల గడిపేస్తూ కన్నీరు కార్చిన మధూ లేచి

ముఖం కడుక్కొని, చెప్పులేసుకొని చంద్రం యింటివైపు వెళ్ళింది. చంద్రం ఆ సమయంలో యింట్లో వుండడని జ్ఞాపకం వచ్చి, అటునుంచటే పొలాల వైపు సాగిపోయింది.

అలవాటుకు విరుద్ధంగా మావిడిచెట్టు క్రింద కూర్చొని ఎటో దిగంతాలలోకి చూస్తూ ఆలోచిస్తున్న చంద్రం మార్గ మధ్యంలోనే కన్పించాడు. ఎప్పుడూ, హుషారుగా, ఉత్సాహానికి ప్రతీకలా తిరిగే చంద్రం బావలో కలిగిన మార్పు, మధుకు చెప్పకుండానే అతని మానసిక పరిస్థితిని తెలియజేసింది.

దగ్గరగా వెళ్ళి "బావా!" అని పిలిచిన మధు కంఠం తెలీకుండానే వణికింది.

వులిక్కిపడి తలెత్తిన చంద్రం మధును చూసి పెదాలమీద నవ్వు తెచ్చుకుంటూ "అరే మధూ! ఈ వేళప్పుడు...నువ్వు యిక్కడ? ఈవాళ సూర్యుడు పశ్చిమాన వుదయించ లేదు కదా? మీ వానర సైన్యాన్ని ఏంచేశావ్" అన్నాడు మధును పరిశీలనగా చూస్తూ.

నెమ్మదిగా చంద్రానికి కాస్త దూరంలో కూర్చుంది. "వాళ్ళందరికీ యివ్వాళ శలవిచ్చేశాను బావా! నువ్వూ, శేఖర్ బాబూ కలకత్తా ఎప్పుడు వెళు తున్నారు?" అంది తలవంచుకొని అరచేతులు రాసుకుంటూ.

"అదేవిటి? నువ్వు రావడంలేదా?" అన్నాడు అనుమానంగా.

"ఉహూ! లేదు బావా! నా ఆరోగ్యం అంత బావుండలేదు. నీకో మాట చెప్పా లని వచ్చాను సుషమ యిపుడు అమెరికా వెళ్ళిపోతానంటున్నదంటే... దానికి కారణం నువ్వు. నువ్వు పెళ్ళికి వాయిదాలమీద వాయిదాలు వేస్తుంటే తనుమట్టు కేంచేస్తుంది? ఈ సంవత్స రంతో చదువైపోయింది. నువ్వేమో నాతో వంతు పెట్టుకొని కూర్చున్నావు. పాపం! సుషమ ఇంట్లో కూర్చొని ఒక్కతీ ఏంచేస్తుంది? శిరీష్‌గారు కూడా అమెరికా వెళ్ళిపోతే! తనకు వొంటరిగా ఏం తోస్తుంది?" ఓ క్షణం సమాధానంకోసం ఆగింది.

చిన్నగా నవ్వుతూ "మరి సుషమమీద అంత పాపమన్పిస్తే, నువ్వు త్వరగా పెళ్ళికి ఒప్పుకోకూడదూ?" అంటున్న చంద్రం వైపు తలెత్తి చూసి, మళ్ళీ చూపులు భూమిలోకిగుచ్చుతూ చెప్పింది.

"పరిహాసం కాదు బావా! నేనెంతో ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాను. నువ్వు కలకత్తా వెళ్ళి మీ పెళ్ళికి ముహూ ర్తాలు పెట్టుకొని తిరిగిరావాలి. నువ్విలాగే నాతో వంతు పెట్టుకు కూర్చుంటే సుషమ అమెరికా వెళ్ళిపోతుంది. మీ యిద్దరినీ దూరంచేసిన పాపం... వృద్ధాప్యంలో శ్రీధర్ మావయ్యను బాధ పెట్టిన పాపం నాకు తగులుతుంది.

యిప్పుడు నువ్వు నా మాట వినకపోతే మళ్ళీ నన్ను వూళ్ళో చూడలేవు. శ్యాంని తీసుకొని ఎక్కడికో మీకందరికీ దూరంగా వెళ్ళిపోతాను. నువ్వు కలకత్తా వెళ్ళి మీ పెళ్ళి లగ్నం నిశ్చయించుకురా బావా! సుషమ ఇండియా వదిలి ఎలా పోతుందో నేను చూస్తాను. ఈ ఒక్కసారి నా మాట విను బావా! నన్ను గురించి బాధపడకు. యిప్పటివరకూ నేను కోరుకున్నవేవీ నాకు దక్కలేదు. అమ్మ, నాన్న, మావయ్య, అత్తయ్య ఒక్కరొక్కరే నా జీవితంనుంచి తప్పుకున్నారు. అందుకే నా మనసు నా చేతుల్లో లేకపోయినా, కనీసం భౌతికంగా అందరికీ దూరంగా వుండాలని నా ప్రయత్నం. నామీద నీకేమాత్రం ప్రేమాభిమానాలున్నా నేను చెప్పినట్లు చెయ్యి బావా! లేకపోతే నువ్వు మళ్ళీ నన్ను చూడలేవు." అని కన్నీళ్ళతో అర్థిస్తూ, చటుక్కున చంద్రం పాదాలకు నమస్కరించి, లేచి ముందుకు వెళ్ళిపోతున్న మధువైపు, ఆశ్చర్యంగా, అభిమానంగా చూస్తుండిపోయిన చంద్రం కళ్ళు నీటితో నిండిపోయాయి.

ఆ సాయంత్రమే కలకత్తా బయలుదేరిన చంద్రం, శేఖర్‌లు మధు యింటికొచ్చారు. యిద్దరికీ కాఫీ యిచ్చి, "దగ్గరలో ముహూర్తం పెట్టుకోండి బావా!" అని తృప్తిగా నవ్వుతున్న మధువైపు జాలిగా చూసి తలవూపి వెళ్ళిపోయాడు చంద్రం. శేఖర్ కూడా శలవు తీసుకున్నాడు.

* * *

శేఖర్‌ను, చంద్రాన్ని చూడగానే ప్రాణం లేచివచ్చినట్లైంది శ్రీధర్‌గారికి. ఆప్యాయంగా ఆహ్వానించాడు సుషమకు చంద్రాన్ని చూడగానే మనసు స్వాధీనం తప్పింది. అయినా నిగ్రహించుకొని మామూలుగా మాట్లాడటానికి ప్రయత్నించింది.

"లాస్ట్ టైమ్ వచ్చినప్పుడు శాంత పెళ్ళి హడావిడిలో ఏమీ చూపించలేదు శిరీష్. చంద్రాన్ని తీసుకెళ్ళి సిటీ అంతా చూపించండిరా!" అన్నాడు శ్రీధర్. తెల్లవారి లేవగానే తప్పనిసరిగా కారుతీసుకొని బయలుదేరిన శిరీష్‌తో పాటు,చంద్రం శేఖర్‌ల కోరికపై తనూ వెళ్ళక తప్పలేదు సుషమకు.

అసలు చంద్రంతో ఎక్కువగా మాట్లాడితే అతని సాన్నిధ్యంలో ఎక్కువగా మాట్లాడితే తన్నుతాను మర్చిపోయి, అతని మాటల మాయలో పడిపోతానేమోనని భయం సుషమకు. తప్పించుకోవాలని ప్రయత్నించినా ముగ్గురూ బలవంతంచేయడంతో వాళ్ళ ననుసరించక తప్పలేదు.

శిరీష్ డ్రైవ్ చేస్తున్నాడు ప్రక్కన శేఖర్ కూర్చున్నాడు. వెనకసీట్‌లో చంద్రం, సుషమ కూర్చున్నారు. చంద్రం తదేకంగా సుషమను చూస్తుంటే

ఆ చూపుల్ని తప్పించుకునే ప్రయత్నంలో సుషమ విండోలోనుంచి బయటకు చూస్తోంది. ముందుగా ప్లానిటోరియమ్‌కు వెళ్ళారు. లోపలకూడా చంద్రం, సుషమ ప్రక్క-ప్రక్కన కూర్చోక తప్పలేదు

ఆ చిరుచీకట్లో ఒక్కసారిగా పైన ఓ నీలిమాకాశం, నక్షత్రాలు, చంద్రుడూ ఒక్కొక్కటే ప్రత్యక్షమయ్యాయి. ఒక్కో గ్రహం పేర్లు వివరిస్తూ వాటి చరిత్ర గురించి విశేషాలతో వివరించి చెబుతున్నారు ప్రొఫెసర్ మైకులో. వర్తులాకారంగావున్న ఆ ప్లానిటోరియంలో ప్రక్కన సుషమ వుండగా మెరుస్తున్న నక్షత్రాలవైపు వెన్నెల కురిపించే పూర్ణచంద్రుడివైపు మైమరచి చూస్తున్న చంద్రం, నెమ్మదిగా సుషమచేతిమీద చేయివేసి మృదువుగా నొక్కుతూ చిన్నగా నవ్వుతూ ఏమీ ఎరగనట్లు పైకి చూస్తున్నాడు. చెయ్యి తప్పించుకోవాలని సుషమ ప్రయత్నించింది. వుక్కులాంటి ఆ చేతినుంచి తప్పించుకోవడం సాధ్యమయ్యే పనిగా కనిపించలేదు. తల తిప్పి చంద్రం ముఖంలోకి చూసిన సుషమ తెల్లగా మెరుస్తున్న పలువరుస కన్పించేట్లు కొంటెగా నవ్వుతున్న చంద్రంవైపు చూస్తుండిపోయింది. "సూర్యోదయమెలా అవుతుంది ? తిరిగి అస్తమయమెలా అవుతుంది?" వివరంగా ప్రొఫెసర్ చెబుతుంటే వింటూ ఎదురుగా ఆ వింత చూస్తుంటే నిజంగా అది మరో ప్రపంచంలా కన్పిస్తోంది చంద్రానికి రెండుసార్లు అంతక్రితం వచ్చినా కలకత్తాలోని ఏ విశేషాలూ చూడటం పడలేదు చంద్రానికి. బయట ఒక ఆకాశం ! తాము కూర్చున్నచోట మరో నీలిమాకాశం ! మానవుడి విజ్ఞానం సృష్టికి ప్రతిసృష్టి చేయగల కాలం మరెంతో దూరం లేదనిపించింది చంద్రానికి ఇంతలో లైట్లు వెలిగాయి. అప్పటివరకూ పైకి చూస్తూ కూర్చున్న చంద్రం సుషమవైపు నవ్వుతూ చూశాడు. అంతక్రితం ఎన్నోసార్లు చూసిన ప్లానిటోరియమ్ మరికొంచెం సేపు అలా చూస్తూవుండిపోతే బావుండుననిపించింది సుషమకు ఆ రోజు.

తప్పనిసరిగా, బయటకు వెళుతున్న శేఖర్, శిరీష్‌ల ననుసరించారు యిద్దరూ అయిష్టంగానే.

అక్కడి నుంచివిక్టోరియా టెర్మినస్. అదొక చరిత్రాత్మక ప్రదేశంగా అన్పించింది చంద్రానికి. అందులోని అణువణువూ అమితంగా ఆకర్షించింది చంద్రాన్ని ఆ తర్వాత ప్రశాంతతకు నిలయమైన పవిత్ర దేవాలయం రామాకృష్ణామఠ్ చూసుకొని అక్కడి నుంచి దక్షిణేశ్వర్ వెళ్ళారు.

దక్షిణేశ్వర్‌లోని కాళికాలయం, శివాలయాలు భయభక్తులను కలిగిం

చాయి. నాలుక బయటకు చాపి, భీక రంగా కన్పిస్తున్న కాళీమాత మరో చేత అభయహస్తం చూపిస్తూ, దుష్ట శిక్షణా శిష్ట రక్షణా తన ధ్యేయమన్నట్లు కన్పిస్తోంది దేవి. దక్షిణేశ్వర్‌లోని పన్నెండు శివలింగాలూ గంగానది ఒడ్డునే వుండి, చంద్రాన్ని అమితంగా ఆకర్షించాయి. పన్నెండు శివనామాలతో ఒక్కో లింగానికి ఒకో మందిరంగా నిర్మించారు. చిన్నగా, అందంగా అలంకరించిన పూలతోవున్న ఆ శివాల యాల్లోని మరో విశేషం చంద్రాన్ని అమితంగా ఆకట్టుకుంది. సామాన్యంగా ఏ దేవాలయాల్లోనూ మూల విగ్రహాన్ని ముట్టుకోనివ్వరు. కానీ అక్కడ ఆ శివాలయాల్లోపలి కెళ్ళి, ఆ పవిత్ర శివలింగాలకు తల ఆనించి, భక్తితో కళ్ళుమూసుకొని వరాలు కోరు కొనే, మనశ్శాంతిని కోరుకునే భక్తుల నెవ్వరూ ఆటంకపరచరు. నిరాడంబ రంగా వున్న ఆ మందిరాల్లోని శివలింగాల్ని చూస్తే...శివుడుబీదవాడనీ, బిచ్చమెత్తుకొని తిరిగేవాడనీ ... బోళా శంకరుడనీ పురాణాలు చెప్పే మాటల్లో అతిశయోక్తి లేదనిపిస్తుంది. ఆభరణాలు అలంకరించలేదు. ఆకులు పూలతో అలంకరించారా లింగాల్ని. ఆ దేవుడికి ఏ పూజారులూ కాపలాలేరు. ఒకటి రెండు మందిరాల్లో వున్నా తీర్థం యిచ్చి పైసలు వేయించుకోడం కోసం నిల్చున్న అర్చకులు అర్చకుల్లా వున్నారు తప్ప భక్తులను భయపెట్టే బకాసురుల్లా లేరు. వాళ్ళు నిల్చున్నచోట కూడా భక్తులు మూల విగ్రహానికి(శివలింగానికి) మొక్కడానికి ఆటంకం కనబరచలేరు.

కన్నుల పండువగా ఆ దేవాలయాన్ని సుషమతో పాటు దర్శించగలిగిన ఆ దృష్టానికి ఆనందపడుతున్నాడు చంద్రం. అన్నీ చూసుకొని గంగానది వొడ్డుకు చేరుకున్నారు నల్గురూ. కొందరు భక్తులు స్నానం చేస్తున్నారు, కొందరు రెండుచేతులతో నీళ్ళు దోసిట పట్టుకొని ఏవో మంత్రాలు చదువుతూ మళ్ళీ గంగలో నీళ్ళు వదిలేస్తున్నారు. అక్క డంతా కోలాహలంగా వుంది. మాటలు మాని అలా నీళ్ళలోకి చూస్తూ చిన్నగా నవ్వుతున్న శిరీష్‌ను చూడగానే చంద్రానికి అతని సాహసగాథ గుర్తొచ్చి నవ్వొచ్చింది. మళ్ళీ మరోసారి శిరీష్‌ను వుడికిస్తూ నవ్వుకున్నారు చంద్రం, శేఖర్‌లు.

"అరే పొరపాటు చేశాంరా శిరీష్, నాకు అయిడియా రాలేదు. ఆ అమెరికా అమ్మాయిని పిలిచి వుండాల్సింది ఈ రోజు మనతో" అన్నాడు. "ఆమె ప్రస్తుతం యిక్కడ లేదని మర్చి పోయావా ?" అన్నాడు శిరీష్. "ఓ అయామ్ సారీ! నిజంగానే మర్చి పోయానురా! సరేగానీ నాకు మళ్ళీ ఓసారి ఆ కాళికాదేవినీ...ఆ భక్తవశంకరు

లనూ చూడాలని వుందిరా, పద వెళ్దాం" అని శిరీష్ భుజంమీద చేయివేసి ముందుకు నడుస్తూ "మీరు కొంచెం సేపలా మెట్లమీద కూర్చోండి చందూ!" అని సుషమ చూడకుండా కన్ను గీటి చిన్నగా నవ్వుతూ శిరీష్‌తోపాటు వెళ్ళిపోయాడు శేఖర్.

కోరుకున్న ఏకాంతం సుషమతో లభ్యమైనా అంతమంది ఎదురుగా వుండే ఆ మెట్లమీద కూర్చొని ఏం మాట్లాడగలడు? అందుకే నెమ్మదిగా సుషమ చేయి చేతుల్లోకి తీసుకొని, దూరంగా తమ కారు పార్క్ చేసిన చెట్టు క్రిందకు చేరుకున్నాడు చంద్రం.

ఇద్దరూ చెట్టు మొదట ఆనుకొని కూర్చున్నారు. జనానికీ వాళ్ళకూ మధ్య కారడ్డం. దూరంగా జనం చేసే కోలాహలం విన్పిస్తున్నా...అక్కడ, ఆ ప్రశాంతతే ఎంతో గొప్పనిపించింది. అనుక్షణం విసుగు లేకుండా తిరుగుతున్న కార్లతో, ట్రాంలతో, సిటీ బస్‌లతో విసుగూ విరామం లేకుండా బిజీగా వుండే కలకత్తా సిటీ నుంచి దూరంగా వచ్చిన వారికి అదే ఎంతో ప్రశాంతమైన ప్రదేశం. అక్కడా వాళ్ళ కోలాహలంతో ప్రశాంతతను భంగపరుస్తుంటారు కొందరు

నెమ్మదిగా సంభాషణ కుపక్రమించాడు చంద్రం సుషమ వైపే చూస్తూ. "సుషమా నిజంగా నువ్వు అమెరికా వెళ్ళిపోతావా మీ అన్నయ్యతో...నేనేం తప్పు చేశానని నాకింత పెద్ద శిక్ష వేస్తున్నావు? మధు పెళ్ళైన తర్వాతే మన పెళ్ళనుకున్నాను. అంతవరకూ నువ్వు తప్పకుండా నాకోసం ఆగుతావనుకున్నాను.కానీ నువ్వింత నిర్దయగా, నా కనుచూపు దూరానికి అందనంత దూరంగా వెళ్ళిపోతా ననగలవని నేను కలలో కూడా వూహించలేదు సుషమా!" చంద్రం మాటలకు సుషమ కరిగి పోదలుచుకోలేదు. అతని ముఖంలోకి చూస్తూ, అతని పెదవుల కదలిక వింటూ, తన్ను తాను మరచి, అతని యిష్టానికి తన బ్రతుకును వదిలేస్తాననే భయం, సుషమ కళ్ళెత్తి చంద్రం వైపు చూడకుండా చేసింది.

తల వంచుకొని మౌనంగా కూర్చున్న సుషమ గడ్డం పట్టుకొని తల పైకెత్తుతూ "సుషమా! నీ మనసేవిటో నాకు తెలియజేసి వుంటే...వెంటనే ముహూర్తం పెట్టించమని మావయ్యగారితో చెప్పి వుండేవాడినిగా. నాకు ఒక్క మాటైనా చెప్పకుండా అమెరికా వెళ్ళిపోవాలనే నిర్ణయం ఎందుకు తీసుకున్నావు? మావయ్యగారికి ఈ వయసులో ఆసరాగా వుండవలసిన శిరీష్ దూరమైపోతున్నాడన్న బాధకంటే...నువ్వు ఏ ముచ్చటా తీర్చకుండా దూర దేశానికి వెళ్ళిపోతావన్న బాధ ఆయన్ని పూర్తిగా కృంగదీసినట్లుంది. ఆయన్ని చూస్తే

ఎంతో బాధగా వుంది. ఆయన చాలా కృంగిపోయారు. ఈ వయసులో ఆయన్ని సంతోషంగా వుంచడం పిల్లలుగా మన బాధ్యత, మన కర్తవ్యం. తొందరగా ముహూర్తాలు పెట్టించమని మావయ్యగారితో చెబుతాను. నువ్వు అమెరికా ప్రయాణం మానుకో. కావాలంటే ఆ తర్వాత ఓ సారి వెళ్ళి చూసొద్దువుగాని." అంటున్న చంద్రం వైపు ఆశ్చర్యంగా, ఆనందంగా కళ్ళెత్తి చూసిన సుషమ కళ్ళలో అనుమానం.

"మరి...మరి మధు పెళ్ళిచేసుకోడానికి ఒప్పుకుందా ?" అంది మెల్లగా ఆత్రుత ధ్వనించింది స్వరంలో.

విసుగ్గా చూసిన చంద్రం... "లేదు ... అయినా ఎవరెలాపోతే మనకేం ? మనం సుఖంగా వుండొచ్చు కదా !" అని మళ్ళీ అంతలోనే రంగులు మారుతున్న సుషమ ముఖం చూసి—

"క్షమించు సుషమా! మధు విషయం యింక ఎత్తకు దానికా అదృష్ట ముంటే అవుతుంది, లేకపోతే అలాగే వుండిపోతుంది. దానికోసం నీ భవిష్యత్‌ను, నా భవిష్యత్‌ను పాడుచేసుకోడం అవివేకమే అవుతుంది" అంటూ లేచి నుంచొని శిరీష్, శేఖర్‌ల కోసం చూస్తున్న చంద్రం వైపు విచిత్రంగా,అనుమానంగా చూసింది సుషమ. ఇంత మార్పు ఎలా వచ్చింది ఈ మనిషిలో ? తను వెళ్ళిపోతానంటే యింక ప్రపంచంలో దేన్నీ లెఖ్ఖచేయాలనిపించలేదేమో !" ఆ వూహా సుషమ మనసున పన్నీటి జల్లులా తాకి హృదయాన్ని చల్లబరిచింది. హాయిగా తృప్తిగా, గాలి పీల్చుకుంది సుషమ.

కానీ మధు కోరికమీద యీ మార్పుకు వొప్పుకున్న చంద్రానికి తెలుసు, మధు తనను అన్నమాట నిలబెట్టుకోకుండా అశక్తుడిని చేసిందని. అందుకు కారణం అన్నివేళలా అందరి ఆనందాన్నికోరే ఆ అమృతమయ అంతరంగమేననీ... యిప్పుడు లగ్నాలు పెట్టుకోకుండా వెళితే మధు అన్నంతపనీ చేస్తుందనీ తెలుసు. కనీసం, అందర్నీ పోగొట్టుకున్న ఆ అభాగ్యురాలికి పరోక్షంగానైనా అండదండగా వుండాలంటే అందు కిదొక్కటే మార్గమనీ. అంతే కాకుండా తను చెప్పినట్లు సుషమకు చెప్పవద్దని కూడా మాటతీసుకొని అన్ని విధాలా తనను కట్టిపడవేసింది మధు" అనుకుంటూ ముందుకు చూస్తున్న చంద్రానికి దూరంగా నవ్వుతూ వస్తున్న శేఖర్, శిరీష్‌లు కనిపించారు. మెట్లవైపు వెళ్ళబోతున్న వాళ్ళను చంద్రం చప్పట్లు కొట్టి పిలవడంతో వెనుదిరిగి కారు దగ్గరకు చేరారు.

"ఇక వెళదామా ?" అంటూ కారు లాక్ తీసి డోర్స్ వోపెన్ చేశాడు శిరీష్. చంద్రం, సుషమ ఎక్కి కూర్చున్నారు. శేఖర్ ఓ నాలుగు ఐస్‌క్రీం కప్పులు తీసుకొచ్చి తలా ఒకటి అందించి తనూ

స్టార్ట్ చేశాడు శిరీష్. అంతా ఎక్కి కూర్చున్నారు. కారు ముందుకు కదిలింది. దారిలో హౌరాబ్రిడ్జ్ దగ్గర కారు ఆపి, చంద్రం యింక యింటి కెళ్ళా మనడంతో కారు యింటి వైపు పోనిచ్చాడు శిరీష్.

చంద్రం మధు కిచ్చిన మాట ప్రకారం, లగ్నాలు పెట్టుకొనే, గంగాపూర్ చేరాడు. వూరు చేరగానే ఆ శుభవార్త శేఖర్ ముందుగా మధుకు అందించాడు.

"ఇంకో శుభవార్త కూడా త్వరలో వినాలనుంది "అంటున్న మధు నెత్తిన ఓ మొట్టికాయ మొట్టి" మరో మూడు సంవత్సరాలాగు విందువుగాని"అన్నాడు శేఖర్.

శేఖర్‌కు ఓ రకమైన ధైర్యం వచ్చేసింది. ఏది ఏమైనా, ఎన్నాళ్ళకైనా మధు తన సొత్తు. అది ఆమె కూడా కాదనలేని నిజం. అంటే యిప్పుడైనా, మరో మూడేళ్ళకైనా సరే తను మధు కోసం ఆగటానికి సిద్ధం." అలా అనుకుంటే నిచ్చింతగా, అతని మనసుకు అంతులేని శాంతి దొరికినట్లైంది.

చంద్రం పెళ్ళి ముహూర్తం మరీ, అయిదురోజుల్లోనే అనేసరికి హడావిడిగా వుంది. అయితే పెళ్ళి కలకత్తాలోనే కావడంవల్ల గంగాపూర్‌లో అంత సందడిగా ఏం లేదు. శాంతా, రాజేశ్వర్ ముహూర్తానికి ముందుగానే బయలుదేరి కలకత్తా చేరుకున్నారు.

శ్రీధర్‌గారు చక్కటి సూట్ వేసుకొని, శిరీష్‌కు అన్నలా కనిపించారు చూసేవాళ్ళకు. మనసులో అంతులేని బాధ వున్నా, అంతకుమించి కూతురు పెళ్ళి అనుకున్న వరునితో అనుకున్న ముహూర్తానికి (సమయానికి)చేయగలుగుతున్నాననే తృప్తితో ఆయనలో ఎక్కడలేని చురుకుదనం వచ్చింది. చంద్రం వాళ్ళతో బయలుదేరి మధు, శ్యాం కూడా కలకత్తా చేరుకున్నారు. "ఈ విషయంలోమట్టుకు నేను నీ మాట వినను మధూ ? నువ్వు వచ్చి తీరాల్సిందే" అని పట్టు పట్టాడు చంద్రం.

ఎవరూ లేకుండా చూసి సుషమ దగ్గరకు చేరి నవ్వుతూ పలకరిస్తున్న మధుని ప్రక్కన కూర్చోబెట్టుకొని పశ్చాత్తాపం ధ్వనించే గొంతుతో, నెమ్మదిగా "నన్ను క్షమించు మధూ! ఆవేశంలో ఏవిటేవిటో పిచ్చిగా వ్రాశాను" అంటున్న సుషమ నోటికి చెయ్యడ్డం వుంచుతూ-

"ఛ ! మనలో మనకు క్షమాపణ లేవిటి సుషమా ! నువ్వలా అమెరికా వెళతానని బెదిరించకపోతే బావ ఓ పట్టాన లొంగేవాడేమిటి ? మొత్తానికి నీ పంతం నెగ్గించుకున్నావు" అంటుండే, అందంగా కాటుక దిద్దిన కనురెప్పలు

సిగ్గుగా క్రిందకు వాల్చి గర్వంగా నవ్వు కుంది సుషమ.

శ్రీధర్‌గారు ఓ కళ్యాణ మండపం అద్దెకు తీసుకున్నారు. విశాలంగా వున్న ఆవరణలో రంగు రంగుల దీపాల మధ్య వెన్నెల్లా వెలిగిపోతున్న ట్యూబ్‌లైట్ల కాంతిలో వరుసగా పేర్చిన కుర్చీలలో కూర్చొని, అందంగా అలంకరించిన మండపంలో జరుగుతున్న ఆ పెళ్ళి ముచ్చట చూస్తున్న గంగాపూర్ ప్రజలు "స్వర్గలోకమంటే యిలాగే వుంటుందేమో! దేవేంద్రుడి పెళ్ళి యిలాగే జరిగిందేమో!" అనుకుంటూ చంద్రం అదృష్టాన్ని వేనోళ్ళ పొగుడుతూ, శ్రీధర్ గారిపర్యవేక్షణలోసాగిన బ్రహ్మాండమైన విందును తలచుకుంటూ పెళ్ళి తంతు వుత్సాహంగా చూస్తున్నారు. అందులో కొందరు అదే మొట్టమొదటిసారి పట్నం రావడం. చంద్రం మీదున్న అభిమానంతో మొదటిసారి గంగాపూర్ వదలి కలకత్తా వచ్చిన వాళ్ళకు, అది రంగుల ప్రపంచంలా చైతన్యస్రవంతిలా కనిపించింది.

మండపానికి ఓ ప్రక్కన చేరిన శాంత, మధూ, తదేకంగా చంద్రం, సుషమలను చూస్తున్నారు. శాంత కళ్ళు ఆశ్చర్యంగా పెద్దవయ్యాయి.

సుషమ అంతమందిలో చంద్రం వైపు చూసి నవ్వుతోంది. అదీ ఆశ్చర్యానికి కారణం. మధు భుజం మీద ఒక్కపోటు పొడిచింది.

"అబ్బ! ఏవిటి శాంతా?" అంటున్న మధుతో-

"అటు చూడు వదినా! సుషమ వదిన ఎలా చూస్తోందో! అన్నయ్యను తినేసేలా" అంది నవ్వు బిగపట్టుకుంటూ మెల్లగా.

"ఊ! మీ అన్నయ్య మట్టుకేం తక్కువ తిన్నాడు? అటు చూడు, రెప్ప కొడితే తప్పిపోతుందేమోనని రెప్ప వాల్చకుండా అలాగే చూస్తున్నాడు" అంది గుసగుసగా మధు. శాంత కూడా చిన్నగా నవ్వి అటు చూసింది. "నిజమే! తన పెళ్ళిలో తనెలా తలవంచుకొని కూర్చుంది? ఆ తర్వాత రెండురోజుల వరకూ మెడ నెప్పితో తనెలా బాధ పడిందీ జ్ఞాపకం వచ్చి తల వంచుకొని తనలో తాను నవ్వుకుంటున్న శాంత గడ్డం పైకెత్తి ఏవిటి? సీలో నువ్వే నవ్వుకుంటున్నావ్? మీపెళ్ళినాటి ప్రమాణాలు జ్ఞాపకమొస్తున్నాయా, వాళ్ళను చూస్తుంటే?" అంది మధు నవ్వుతూ. శాంతను వుడికించి, అతిథులవైపు దృష్టి సారించిన మధుకు అందరి మధ్యా ప్రత్యేకంగా బ్లూ సూట్‌లో నిలబడి తదేకంగా తనవైపే చూస్తున్న శేఖర్ కనిపించాడు. గంగాపూర్ వచ్చిన దగ్గర నుంచీ పంచ, లాల్చీలు అలవాటైన శేఖర్‌ని ఆ రోజు మళ్ళీ నిండుగా

సూట్‌లో చూస్తుంటే ఎంతో అందంగా హుందాగా కనిపించి, ఓ క్షణం తనూ రెప్పవాల్చటం మరచి అటే చూసింది.

ఇంతలో శాంత మోచేత్తో పొడిచి "ఏయ్ వదినా! యిటు, యిటు, పెళ్ళి యిటు జరుగుతోంది. అటు కాదు" అంటూ హెచ్చరించడంతో చూపులు మరల్చుకొని మండపంవైపు దృష్టి సారించింది. కొబ్బరికాయ మీద మాంగల్యం పెట్టి దాన్ని పెద్దలందరికీ చూపిస్తూ ఏవో మంత్రాలు చదువు తున్నాడు పురోహితుడు. మరో పురో హితుడు కొబ్బరికాయ వుంచిన పళ్ళాన్ని అందుకొని ఒక్కొక్కరి ముందునుంచీ అక్షింతలు పంచుతూ వెళుతుంటే-అంతా చేతులు సూత్రాల (మంగళసూత్రాల)కు ఆన్చి కళ్ళ కద్దు కుంటున్నారు. అప్రయ త్నంగా మధు కూడా అలాగే చేసింది. అందరికీ చూపించడమైన తర్వాత తీసు కెళ్ళి మండపంలో కూర్చున్న పురోహితు నికి పళ్ళెం అందించాడు. అతను మాంగల్యం చంద్రం చేతి కిచ్చాడు. చిరునవ్వుతో లేచి సుషమ వైపు చూస్తూ చంద్రం ముందుకు అడుగు వేయగానే మధు ముందుకు జరిగి సుషమ జడ పైకెత్తి పట్టుకుంది. మధువైపు చూసిన చంద్రం కళ్ళు ఓ క్షణం బాధగా చూశాయి. యింతలో పురోహితుడు తొందరపెట్టడంతో సుషమ మెళ్ళో గట్టిగా మూడు ముళ్ళు వేసేశాడు చంద్రం. పువ్వులు అక్షంతలు కలసిన వర్షం కురిసింది వాళ్ళిద్దరిమీద.

రఘుపతిరావుగారు, శ్యామలాదేవి కూడా ఆ పెళ్ళికి రావడం గంగాపూర్ ప్రజలకు వింతల్లో వింతగా కనిపించింది. కూతురిలా అభిమానించే సుషమకు, తమ చంద్రానికి పెళ్ళంటే రాకుండా -ఎలా వుంటారు? అందులోనూ చంద్రం గట్టి పట్టుపట్టాడు.

శ్రీధర్ వెంటనే బయలుదేరి పెళ్ళికి రావలసిందని టెలిగ్రాం యిచ్చాడు. అంగీకరించక, రాక,తప్పలేదు. చంద్రం సుషమలను ఆశీర్వదించి యిద్దరికీ మంచి బట్టలుపెట్టి, పెళ్ళవగానే అందరితోపాటు బయలుదేరి గంగాపూర్ వెళ్ళిపోయారు, శేఖర్‌ను చంద్రం కోరికపై అక్కడే వదిలి.

ఇక మిగిలినవాళ్ళు, శేఖర్, మధు, శాంత, శ్యాం, సుషమ, చంద్రాలతో పాటు బయలుదేరిన మధును,శ్రీధర్‌గారు పిలిచి, "మధూ! నువ్వూ, శ్యాం మరో నాలుగు రోజులుండి వెళ్ళండమ్మా! సుషమ, శిరీష్ వెళ్ళిపోతే నాకు మరీ దిగులుగా వుంటుంది" అన్నారు, ఆప్యాయంగా మధు తల నిమురుతూ. తామంటే అంత ఆప్యాయంగా, ఆద రంగా మాట్లాడే శ్రీధర్‌గారంటే తెలి కుండానే మధు మనసులో ఓ ఆత్మీయు డనే భావం తమ శ్రేయోభిలాషి

అని అభిప్రాయిం స్థిరపడి పోయాయి.

సుషమ పెళ్ళి చూడ్డంకోసమే ఆగిన శిరీష్ వాళ్ళంతా గంగాపూర్ ప్రయాణమైనరోజే అమెరికా వెళ్ళే ప్రయత్నంలో వున్నాడు. అంతా కలిసి శిరీష్‌కు వీడ్కోలివ్వడానికి ఏరోడ్రోమ్‌కు వెళ్ళారు.

దం దం విమానాశ్రయం కోలాహలంగా వుంది, వచ్చేపోయే పాసెంజర్స్‌తో. ఆ జన సమూహాన్ని కుతూహలంగా చూస్తున్న శ్యాంని దగ్గరకు పిలిచి "నువ్వూ వెళతావురా! శిరీష్‌లాగ ఏరోప్లేనెక్కి అమెరికా!" అని అడిగారు శ్రీధర్. వుత్సాహంగా తల వూపుతూ-

"వో! మా గంగాపూర్ పిల్లలు దీన్ని గాలిమోటరంటారు. దీనిపేరు ఏరోప్లేన్ కదూ! వాళ్ళకేం తెలియదు. నా చిన్నప్పుడు యివి బోలెడు చూశాను" అన్నాడు, అప్పటికి వాడేదో చాలా పెద్ద వాడయిపోయినట్లు. అంతా నవ్వారు వాడి మాటలకు.

వాడితో నవ్వుతూ కబుర్లు చెబుతున్నా శిరీష్ వెళ్ళిపోతున్నాడంటే చెప్పలేనంత వ్యధగా వుంది శ్రీధర్‌గారికి. "శిరీష్‌ను చిన్నప్పటినుంచీ ఎప్పుడూ వదిలి వుండలేము. వాడు సరదాపడి హాస్టల్‌లో చేరినా రెండురోజుల కొకసారైనా వాడిని చూడకుండా వుండలేక పోయేవాడు. నాకింత బాధగా వుంటే వాడంత సంతోషంగా ఎలా వున్నాడు? వాడికి తన వాళ్ళను, తన దేశాన్ని వదల వెళుతున్నాననే బాధే లేదా? పెద్దైంతర్వాత పిల్లలింత స్వార్థపరులుగా ఎలా మారిపోతారు? చిన్నప్పటినుంచీ తమ అలనాపాలనా చూసి, కంటిపాపల్లా కాపాడిన తలిదండ్రుల్ని చిటికెలో మర్చిపోయి తెరుచుకున్న మరో ప్రపంచపు ద్వారాలలోకి వెళ్ళిపోతారు. అది వాళ్ళ తప్పు కాదు, సృష్టి రహస్యం. ఉడిగిపోతున్న బంధాల్ని దూరంచేసుకోకపోయినా మరో కొత్త బంధాన్ని ఏర్పరచుకోలేకపోతే భవిష్యత్ భయంకరంగా తయారవుతుంది. ఎప్పటి కప్పుడలా బంధాలకు బందీకాక తప్పదు సరికొత్త బంధాల్ని ఏర్పరచుకునే ఆవేశంలో (ఆవేగంలో) ఆత్మీయుల్ని కొందరిని బాధించకా తప్పదు.

శ్రీధర్‌గా రనుకున్నట్లు శిరీష్‌కు బాధ లేకుండా పోలేదు. తను ధైర్యపడితే బ్రతుకులో సాధించదలుచుకుంది సాధించలేననే భయంతో ధైర్యంగావుండటానికి ప్రయత్నిస్తున్నాడు. అప్పటికే వెంటనే బయలుదేరి రమ్మని నాలుగు కేబుల్స్, రెండు ట్రంకాల్స్ చేసింది ఫ్లారెన్స్. అది ఆమె కోరిక అక్కడ పెళ్ళిచేసుకుని హాయిగా కొంత కాలం స్వేచ్ఛగా వరల్డంతా తిరిగి అప్పటికీ శిరీష్‌కు యిండియా రావాలనిపిస్తే, తప్పకుండా యిండియా వచ్చేసి సెటిలౌదామని చెప్పింది.

ఫ్లారెన్స్ న్యూయార్క్‌లోని ఓ పెద్ద రాజకీయ నాయకుడి ఏకైక పుత్రిక. కొన్ని లక్షల డాలర్లకు అధికారిణి. ప్రస్తుతం తండ్రి లేదు. ఇక ముందు యింకో తండ్రి వస్తాడనే భయం లేదు. తల్లి కూడా బాగా వృద్ధురాలై పోయింది ఆవిడకు ఆ కూతురు తప్ప మరో ప్రపంచం అక్కర్లేదు. అయితే శిరీష్ ఫ్లారెన్స్ వెనక వున్న ఆ లక్షల డాలర్ల కోసం ఆశపడలేదు. అందానికి రూప కల్పనగావున్న ఆమె అందం చూసి భ్రమించలేదు. కొందరు స్టూడెంట్స్‌తో కలిసి ఇండియా టూర్ వచ్చింది.అదృష్ట వశాత్తు ఓ ఫ్రెండ్ యింట్లో పరిచయ మైంది. ఆమె స్నేహంలో గడిపిన పదిహేనురోజులూ శిరీష్ జీవితంలో మరచిపోలేని. వింతగా మెరిసే నీలి కళ్ళతో కనిపించిన ప్రతి వస్తువు పేర్ల డిగి, అది తిరిగి వుచ్ఛరించడానికి ప్రయత్నించి సాధ్యంకాక పగలబడి నవ్వుతున్నపుడు సున్నితంగా సొట్టలు పడే ఆ బుగ్గల ఎరుపు లేత గులాబి రంగులో మృదువుగా మెరిసే పెదాల మెరుపు, చూసి భ్రమించలేదు.

ఫ్లారెన్స్ సాన్నిధ్యంలో రోజులు క్షణాలుగా గడిచిపోయేవి. మిగతా ఫ్రెండ్సంతా వేరే ప్రదేశాలు చూడటం కోసం వెళ్ళిపోయినా తను కలకత్తాలోనే ఆగిపోయింది శిరీష్ కోసం. అతనిలోని ఏదో ఆకర్షణశక్తి ఫ్లారెన్స్‌ను ఆకట్టు కుంది. ధైర్యంగా తనే అడిగేసింది, తన తల్లి తన యిష్టానికి వ్యతిరేకంగా ఏమీ చెప్పదని మనమిద్దరం మారేజ్ చేసు కుందామని, అమాయకంగా అతి తక్కువ టైమ్‌లో తనమీద అంతటి ప్రేమను పెంచుకున్న ఫ్లారెన్స్‌ను నిరాశపరచ లేకపోయాడు. అంగీకరించక తప్పలేదు. ధైర్యంచేసి తను ముందుగా, చెప్పలేక పోయినా ఫ్లారెన్స్‌మీద తనూ . అంతే ఆశలు పెంచుకున్నాడు.

నీలికళ్ళలో మెరిసే నీటితో తప్పక రమ్మని వాగ్దానం చేయించుకుంటూ, శిరీష్ పెదాలమీద సున్నితంగా ముద్దు పెట్టుకొని కర్చీఫ్ వూపుతూ నెమ్మదిగా కస్టమ్స్ రూమ్‌లో కెళ్ళిపోతున్నప్పుడు కళ్ళలో నిలిచిన నీరు చంపల మీదుగా జారి గుండెలను తడిపేస్తుంటే తిరిగి తిరిగి చూస్తూ వెళుతున్న ఫ్లారెన్స్‌ను చూసి, నిగ్రహించుకొని నిలబడలేక ఫ్లైట్ వెళ్లేంతవరకూ కూడా వుండలేక వెనుదిరిగి యింటికి వచ్చిన శిరీష్‌కు, కళ్ళు మూసినా తెరిచినా, అల్లరిగా నవ్వుతూ... అందంగా తనను వుడికిస్తూ. తన ఇంగ్లీషు ప్రనన్సేషన్‌కూ, వాళ్ళ ప్రనన్సేషన్‌కూ వున్న తేడాను విప్పి చెబుతూ, తెలుగు మాటలు, బెంగాలీ మాటలు శిరీష్ నడిగి డైరీలో వ్రాసుకొని అవసరమొచ్చినప్పుడల్లా అవి శిరీష్ దగ్గర వుపయోగించి అతనికి అదేం భాషో తెలియక తికమక పడు

తుంటే నవ్వుతూ, తన చేతుల్లో చేతులు వేసి స్వేచ్ఛగా స్వచ్ఛంగా తిరిగి, తన వాడిని చేసుకున్న ఫ్లారెన్స్ రూపు కళ్ళ ముందు కనిపిస్తుండేది. ఆ క్షణంలోనే ఫ్లారెన్స్ చెప్పినట్లు సాధ్యమైనంత త్వరలో అమెరికా వెళ్ళాలని నిశ్చయించు కున్నాడు

అమెరికా చేరగానే ఫ్లారెన్స్ స్పాన్సర్ లెటర్ పంపించింది. వీసా దొరికింది శిరీష్‌కు. వెళ్ళాలని అన్ని ఏర్పాట్లూ చేసుకున్నాడు. కానీ తండ్రికి చెప్పా లంటే ఏదో భయంగా, బాధగా అనిపించి ఆ బాధ్యత శేఖర్‌కు వప్పజెప్పి ఎలాగో ఆయన్ని వప్పించాడు. ఆయన అంగీ కారం తీసుకుని వెళ్ళాలనే యన్నాళ్ళూ ఆగాడు.

* * *

అందరి దగ్గరా వీడ్కోలు తీసు కుంటూంటే శిరీష్ కళ్ళు నీటితో నిండి పోయాయి. అందరి కళ్ళలో నీళ్ళు న్నాయి. చిన్నప్పటినుంచీ అన్నయ్యతో చిలిపి కజ్జాలతో పోట్లాడి, మళ్ళీ అన్నయ్య దగ్గర గారాలుపోయి, అత నితో కలిసి మెలిసి పెరిగిన సుషమ అన్నయ్య దూరంగా వెళ్ళిపోతున్నాడనే భావన భరించలేక వెక్కి వెక్కి ఏడు స్తోంది శిరీష్ చెల్లెల్ని అలా ఏడుస్తుంటే చూడలేకపోయాడు చంద్రం నెమ్మదిగా "ఛ ! ఏవిటిది సుషమా! అన్నయ్య దూరదేశమెళుతుంటే ఏడుస్తూ పంపు తారా ! సంతోషంగా పంపించు. మీ వదిన్ని తీసుకొని తొందరగా వచ్చేయ మని చెప్పు" అంటూంటే... కళ్ళనిండా నీళ్ళతో శిరీష్‌వైపు చూస్తున్న శ్రీధర్ గారి దగ్గరకు వచ్చి, "క్షమించండి డాడీ ! మిమ్మల్ని చాలా బాధపెడు తున్నాను. త్వరలో మీ కోడల్ని తీసు కొని వచ్చేస్తాను" అంటూ తండ్రి కాళ్లకు నమస్కరించి చంద్రంతో చేయి కలిపి చెల్లెలి తలపై చెయ్యివుంచి ఏదో చెప్పబోయిన శిరీష్‌కు దుఃఖం ముంచు కొచ్చి మాట పెగల్లేదు. ప్రక్కనే నుంచున్న శేఖర్ శిరీష్‌ను దగ్గరకు తీసుకున్నాడు శేఖర్ షర్ట్‌మీద వెచ్చటి కన్నీటి చుక్కలు పడ్డాయి. శేఖర్ కళ్ళూ చమర్చాయి ఇదంతా చూస్తున్న మధు కళ్ళలో నీళ్ళు నిలిచాయి. అందరి వైపూ మార్చి మార్చి చూస్తున్న శ్యాం బిక్కముఖంవేసి అక్క దగ్గరగా నుంచు న్నాడు. అందర్నీ ఓసారి తృప్తిగా చూసి గొంతు పెగుల్చుకొని—

"సాధ్యమైనంత త్వరలో వస్తాను సుషమా ! మధూ వెళ్ళొస్తాను. డాడీ, శేఖర్, ఒరేయ్ శ్యాం వెళ్ళొస్తాను." అంటూ ఏరోడ్రోమ్‌కు వచ్చిన తమ ఫ్రెండ్సందరికీ, ఆత్మీయులకు, ఆప్తులకూ పేరు పేరునా చెప్పి కస్టమ్స్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు కళ్ళనిండుగా నీళ్ళతో, నాలుగు నెలల క్రితం సరిగ్గా ఫ్లారెన్స్ వెళ్ళిపోయినట్లే శిరీష్‌కూడా.

శిరీష్‌ను అమెరికా పంపించి, అంతా బయలుదేరి గంగాపూర్ చేరుకున్నారు. స్కూలు పిల్లలకు యిబ్బందవుతుందని మధు కలకత్తాలో వుండటానికి అంగీకరించలేదు. అదీకాక శ్యాంకు స్కూల్ పోతుందని, శ్రీధర్‌గారినే గంగాపూర్ రమ్మంది. ఒక్కరే వుంటే మరీ దిగులు పడిపోతారని, చంద్రం, శేఖర్‌లు బలవంతపెట్టి శ్రీధర్‌గారిని కూడా తమతో పాటు గంగాపూర్ తీసుకొచ్చారు. కొన్నాళ్ళు వుండి వెళ్ళిపోవచ్చని లీవ్ తీసుకొని శ్రీధర్‌గారు వాళ్లననుసరించి గంగాపూర్ చేరక తప్పలేదు.

* * *

చంద్రానికీ, సుషమకూ రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయి "ప్రేమించిన హృదయాలు రెండూ ఒక్కచోట చేరితే అవి అడివైనా ఆనందకరమే" అంటారు ! ఇంక ప్రకృతి సౌందర్యానికి మారుపేరైన గంగాపూర్‌లాంటి గ్రామం, ఆ ప్రేమ జంటకు నందనవనంలా, బృందావనంలా కనిపిస్తుండేది. వారం రోజులు కూతురి కాపురం చూసి తృప్తిపడ్డ హృదయంతో కలకత్తా వెళ్ళిపోయారు శ్రీధర్.

ఈ మధ్య చంద్రంతో అంత తరచుగా కలవడానికి వీలవడంలేదు శేఖర్‌కు. వాళ్ల మధ్యకు వెళ్లి వాళ్ల ఆనందానికి అంతరాయం కలిగించటం యిష్టంలేక సాధ్యమైనంతగా చంద్రాన్ని, సుషమను డిస్టర్బ్ చేయకూడదనుకున్నాడు వూళ్ళో మిగిలిన మరో స్నేహము బు మధు తప్ప ఎవరూ లేకపోవడం రోజూ సాయంత్రం కొంచెం సేపు మధు యింటికెళ్ళి కబుర్లు చెప్పుకుంటూ గడుపుతున్నాడు.

రోజూ మధు యింటికి వచ్చి వెళుతున్న శేఖర్‌ను చూసి గ్రామంలో గుసగుసలెక్కువయ్యాయి. చెప్పుకోవడమనేది ప్రారంభిస్తే ఏదైనా క్షణాలమీద పాకిపోతుంది గ్రామాల్లో. ఒంటరిగా వున్న పిల్ల యింటికి అస్తమానం రాకపోకలు సాగిస్తున్న శేఖర్‌కూ మధ్య అక్రమ సంబంధాలను అంటగట్టి ఆనందిస్తున్నారు. దానికి తగ్గట్టు శేఖర్ వచ్చిన ప్రతి సంబంధం తిప్పికొడుతుంటే ఆ నమ్మకం అందరిలోనూ ధృవపడిపోయింది చంద్రం మధుని పెళ్ళిచేసుకుంటాడని చంద్రంతో వున్న చనువు వల్ల శేఖర్ వస్తున్నాడని అన్నా ఇప్పు మధుమీద జాలితో, సానుభూతితో పలకరించిన అమ్మలక్కలందరికీ చంద్రం మరో బస్తీ పిల్లని పెళ్లిచేసుకోడం, చంద్రం రాకపోయినా రోజూ మధు మంచిచెడ్డలు కనుక్కోడానికి మధు యింటికి శేఖర్ రావడంతో, శేఖర్‌కూ మధుకూ ఏదో వుందనే విషయం నమ్మకంగా అర్థమయిపోయినట్లైంది.

ఆ రోజు కొంచెం ఆలస్యంగా నీళ్ల కోసం గంగానదికి వెళ్ళిన మధుకు సుమ

కనిపించింది. "ఏవిటక్కా యివాళ నీకూ ఆలస్యమయినట్లుందే" అంటూ నవ్వుతూ పలకరించిన మధుకు కుసుమ పుల్ల విరిచి నట్లు చెప్పిన జవాబుతో ముఖం తిరిగి పోయినట్లైంది. "నేనేమైనా జమిందారు బిడ్డనా ఏవిటి ? యింటో పనంతా ఒక్క తినే చేసుకొని రావాలి నాకు ఏ జమిం దారు కొడుకూ దోస్తు కాలేదు పని మనుషుల్ని పెట్టడానికి" అంది కుసుమ.

అది తననుద్దేశించే అన్నదని స్పష్టంగా తెలుస్తోంది మధుకు. రేపటి నుంచి రామిని రావద్దని చెప్పాలి. వద్దన్నా వినకుండా తనకు సాయంగా ఉంటుందని రామిని పంపుతున్నారు శ్యామలాదేవి. అక్కి చెప్పినా వినకుండా తనకు పనిలో సాయంచేస్తుంది పిల్లై నప్పుడల్లా దానికి వీళ్ళు యిన్ని అర్థాలు తీసుకుంటున్నారా అని ఆశ్చర్యపోయి, బాధను దిగమ్రింగి మళ్ళీ మామూలుగా నవ్వడానికి ప్రయత్నిస్తూ, "కుసుమక్కా, రామూ, వసు, నిన్నా యివ్వాళ బడికి రాలేదేం?" అంది. "వాళ్ళనాన్న వద్దన్నారు" అంటూ వడివడిగా బిందె చంకన పెట్టుకొని నడిచిపోతున్న కుసుమవైపు చూసిన మధు కళ్లనిండుగా నీళ్ళునిండి మసక మసకగా కనిపించింది కుసుమ రూపం. తను కనిపించగానే ఎంతో ఆప్యాయంగా పలకరించే కుసుమక్క అలా ఎందుకు మారిపోయింది ? అంత నిర్దయగా, అంత వ్యంగ్యంగా, అంత లెఖ్ఖలేనితనంగా ఎలా మాట్లాడ గలిగింది ? పరిపరివిధాల ఆలోచనలతో బరువౌతున్న హృదయాన్ని చిక్కబట్టు కుంటూ బిందెతో నీళ్ళు తీసుకొని నెమ్మ దిగా తను యింటివైపు అడుగులు వేసింది మధు.

మరునాడు రాము, వసులే కాక మరో యిద్దరు పిల్లలు తగ్గారు. ఆ మరునాడు మరో ముగ్గురు. ఇలా రోజు రోజుకూ తగ్గిపోతున్న పిల్లల సంఖ్య మధు హృద యాన మాయని గాయాల్ని చేస్తోంది. వాళ్ళు రాకపోవడంవల్ల తన రాబడి తగ్గి బ్రతుకు భారమౌతుందన్న బాధకంటే.. వాళ్ళతో పెనవేసుకున్న బాంధవ్యం, వాళ్లు దూరమైపోతున్నారన్న నిజం, మధును మరీ బాధపెట్టింది. రోజు రోజుకూ శుక్లపక్ష చంద్రునిలా క్షీణి స్తున్న స్కూల్‌తోపాటు మధు ముఖాన కళాకాంతులు తరిగిపోతున్నాయి శేఖర్ వచ్చినప్పుడు కూడా మాట్లాడలేక పోతోంది. ఒక్కసారిగా ఆ గ్రామ ప్రజలకు తనమీద అంతటి నిర్దయ ఎందుకు కలిగిందో అర్థంకాకుండావుంది.

ఆవేళ శేఖర్ వచ్చి వెళ్ళగానే పని గట్టుకొనివచ్చిన పక్కింటి కాంతమ్మను ఆప్యాయంగా ఆహ్వానించింది మధు. "రా పిన్నీ రా!" అంటూ! లోపలికి తొంగిచూస్తూ "ఆ వస్తున్నాలే...ఎవరిదో మగ గొంతు విన్పిస్తేనూ చంద్రం

బావేమో ! ఓ మాట చెప్పిపోదామని వచ్చాన్లే" అంది యింకా అనుమానంగా లోపలికి చూస్తూ.

కాంతమ్మ మహా తెలివైంది.వచ్చింది శేఖరనీ తెలుసు. అతను వెళ్ళిపోయాడనీ తెలుసు పూరికే విషయం రాబట్టాలని ప్రయత్నం. ఆ సంగతి గ్రహించలేనంత పిచ్చిదికాదు మధు. అయినా సౌమ్యంగానే జవాబిచ్చింది "చంద్రం బావ కాదు పిన్నీ, శేఖర్ బాబు వచ్చి వెళ్ళారు" అంది.

తీరిగ్గా అరుగుమీద చతికిలబడుతూ "ఊ! నీ అదృష్టం బావుంటే ఈపాటికి మహారాణిలా చంద్రం యింట్లో వుండే దానివి దాని పేరేంటి ఆ వుషో! హుషో! పోసీలే ఏదో... దానిపేరు నాకు రాదు. ఏదైతే నాకే.గానీ దానికున్న మాత్రం తెలివితేటలు నీకు లేకపోయాయి. ఓ సారి యిలా వచ్చిందో లేదో బుట్టలో వేసుకుంది. కలుకుతోంది నువ్వూ వున్నావు ఎందుకూ..." యింకా ఏదో సాగదీయబోతున్న కాంతమ్మ మధు గట్టిగా అరచిన అరుపుతో వులిక్కిపడి ఆగిపోయింది. తననేమన్నా భరించేదేమో కానీ సుషమను అంత అసభ్యంగా, అసహ్యంగా చిత్రిస్తోంటే భరించలేకపోయింది మధు.

"పిన్నీ ! ఆపు ! ఏవిటా మాటలు. చంద్రం బావ నా కన్నయ్యతోసమానం. అయినా పెళ్ళైనవాళ్ళను గురించి అలా మాట్లాడటం నీలాంటి పెద్దదానికి తగదు" అంది మృదుత్వాన్ని స్వరంలో బలవంతంగా తెచ్చుకుంటూ.

"అయినా నాకెందుకులే అమ్మా ! ఏదో చిన్నపిల్లవి,అనవసరంగా అవస్థలు పడుతున్నావే అని చెబుతున్నాను. ఆ శేఖరం బాబునైనా గట్టిగా పట్టుకున్నావంటే నీకష్టాలు గట్టెక్కుతాయి.ఆయన నిన్ను పెళ్ళి పెటాకులూ ఎలాగూ చేసుకోడు. జీవితాంతం భుక్తికేం లోపం వుండదులే. జమిందారుగారుకూడా ఆ వయసులో మంచి రసికుడే. ఓ అమ్మాయిని ఇలాగే చేరదీసి కొంత పొలం, పుట్రా కూడా పెట్టారని చెప్పుకుంటారు తెలివిగా ఉన్నావంటే నీకూ ఆ శేఖర్ బాబు కూడా ఏం తక్కువచేయడు" అలా ఎంతసేపైనాఆవిడ వాక్ప్రవాహం సాగిపోయి వుండేదేమో ? అప్పటికే లోపలికెళ్ళి తలుపులు భడాల్న మూసుకున్న మధు మంచంమీద పడి భోరుమంది.

మూసిన తలుపులవైపు నిరసనగా చూస్తూ "ఏవీ లేకపోయినా ఎంత అహంకారం! ఈ కాంతమ్మ ముఖాన తలుపులు మూసేంతటిదాని వయ్యావన్నమాట ! ఇంక నీకు గంగాపూర్‌లో గంగాజలం కూడా పుట్టదు." అని పళ్ళుకొరుక్కుంటూ వెళ్ళిపోయింది కాంతమ్మ.

కాంతమ్మ నోటిపుణ్యమా అని

అంతక్రితం వచ్చే ఒక రిద్దరు పిల్లలు కూడా రావడం మానేశారు. చంద్రం వరకూ పుకార్లు వెళ్ళాయి. వూరంతా గోలగా చెప్పుకొంటున్నారు.

తన మూలంగా మధుమీద అంతటి అపవాదులు పడ్డందుకు బాధపడుతూ, మధుకు ధైర్యంచెప్పాలని గుమ్మంలో కెళ్ళిన శేఖర్‌ను చూసి వెంటనే లోపలి కెళ్ళి తలుపులు మూసుకొనే వాటికి ఆనుకొని ఎంతోసేపు అలాగే ఏడుస్తుండి పోయింది మధు. చేసేదేమీలేక ప్రక్క నుంచి చోద్యం చూస్తున్న కాంతమ్మను చూసి, మూసిన తలుపులవైపు బాధగా చూసి వెళ్ళిపోయాడు శేఖర్. ఆ పరిస్థి తుల్లో మధును పిలిచే సాహసం చేయ లేకపోయాడు.

అనాధ, అబల, అందులోనూ అంద మైన ఆడపిల్లంటే అందరికీ అలుసే. మధుమీద లేనిపోని అపనిందలు వేసిన కాంతమ్మ, కక్షతో ఏవేవో అసహ్యకర మైన వార్తలు కల్పించి కథల్లి గంగాపూర్‌లో యింటింటికీ వార్త అంద టానికి చాలా శ్రమపడింది. మధుమీద సానుభూతితో ఏదైనా మాట్లాడబోయిన వాళ్ళ నోళ్ళు తక్కున మూయించింది. కాంతమ్మ మాటలు నమ్మినా నమ్మక పోయినా ఈ గొడవలన్నీ మనకెందుకు లెమ్మని అందరూ పిల్లల్ని మధు దగ్గరకు పంపడం మానేశారు.

విపరీతంగా బాధపడ్డారు. సుషమ మధును గురించి బాధపడుతున్న చంద్రంతో "నాకో ఉపాయం తట్టిం దండీ" అంది ఆశగా చంద్రం ముఖం లోకి చూస్తూ. ఏవిటన్నట్లు చూసిన చంద్రంతో, "మీరూ, నేనూ కలిసి శేఖరన్నయ్యను ఒప్పించి మధుని పెళ్ళి చేసుకోమని చెబితే" అంది.

"పిచ్చిసుషమా! శేఖర్ పెళ్ళిచేసుకో దని అతనికిష్టంలేదనినీ అభిప్రాయమా?" శేఖర్ ఎప్పుడూ సిద్ధమే. వాడు మన స్ఫూర్తిగా మధుని ప్రేమిస్తున్నాడు. అందుకే వచ్చిన సంబంధాలన్నీ ఏదో సాకుతో తప్పిస్తున్నాడు."

"మరి ? ఇంక అడ్డేముంది ? ఆలస్య మెందుకు ? అమ్మా నాన్నగారు వొప్పు కోడం లేదా ?" అంది సుషమ అనుమా నంగా. చిన్నగా నవ్వాడు చంద్రం.

"వాళ్ళను నేను వొప్పించగలను చందూ !" అంది ముఖిపెంగా రింగులు తిరిగిన జుట్టులోకి వేళ్ళుపోనిస్తూ. సుషమ చేయిపట్టుకొని ముందుకులాగి కూర్చో బెట్టి "ఎంత అమాయకురాలివి సుషమా! నీతో ప్రేమగా వున్నంత మాత్రాన నీ మాట కాదనరని అంత నమ్మకంగా ఎలా చెప్పగలుగుతున్నావు ? నాన్న గారి పట్టుదలవిషయం నీకు తెలీదు. అమ్మ అంగీకారం పొందటం అంత

కష్టమైన విషయంకాదు. కానీ నాన్నగారు తాము జమిందార్లమన్న విషయం ఎప్పటికీ మరిచిపోరు. అయినా అసలు సమస్య అ కాదు. మధు అసలు పెళ్ళికి సుముఖంగా లేదు. నేనూ, శేఖర్ ఎంతగా నచ్చజెప్పినా తను ఒప్పుకోలేదు "శ్యాం భవిష్యత్ నే నెవ్వరి చేతుల్లోనూ పెట్టలేను. ఈ విషయంలో నే నెవర్నీ నమ్మలేను. నా చేతులమీదుగా వాడినో పెద్ద పైలట్ ఆఫీసర్‌ను చేయాలి. నాన్నగారి ఆశయం నెరవేర్చాలి" అంటూ కలలు కంటోంది మధు ఇప్పుడున్న ఆ ఒక్క జీవనాధారమైన స్కూలూ పోయింది. మనం సహాయంచేస్తామన్నా, చేద్దామని ప్రయత్నించినా తీసుకోదు. ఎవర్నీ చెయ్యిచాపి అడగదు. అంతులేని ఆత్మాభిమానం. ఎలా బ్రతుకుతుందో, చివరికేమవుతుందో నాకు బోధపడటం లేదు సుషీ !" అంటూ తలపట్టుకున్న చంద్రంవైపు దీనంగా చూసింది సుషమ ఏంచేయాలో తోచక.

ఊరంతా అదో పెద్ద వార్తలాగా చెప్పుకుంటున్నారు. కానీ ఎదుటపడి రఘుపతిరావుగారిముందు అనగల ధైర్యం ఆ ఊళ్ళో ఎవరికుంది? ప్రొద్దుటే మధు యింటిదగ్గరనుంచీ పనిలోకి వచ్చిన రామి అన్నాళ్ళుగా ఆ యింటి వుప్పుతిని బ్రతుకుతున్నది కనుక, ఆ యింటిని గురించి, వాళ్ళ చినబాబుగారిని గురించి అంత అసహ్యంగా చెప్పుకుంటుంటే దానికి ఎలాగో వుంది. మనసులో. గుబులు దాచుకోలేక నెమ్మదిగా భయపడుతూనే శ్యామలాదేవితో చెప్పింది. "అమ్మగారూ ! మీరు కోపగించుకోనంటే ఓ యిసయం చెబ్దామని వుంది" అంది నసుగుతూ. "ఏవిటే యివాళ కొత్తగా మాట్లాడుతున్నావు ? మధుకు తోడు పడుకోడానికి వెళ్ళి నువ్వుకూడా పాఠాలు నేర్చుకుంటున్నావేంటి ?" అన్నారు చిన్నగా నవ్వుతూ. "అది కాదమ్మగోరూ ! మాధవమ్మగారు ఎంత మంచారో మీకు తెల్దా ! చినబాబుగారు ఎట్టాంటారో మీకు తెల్దా? ఈ వూరోళ్ళకు ఏదో పోయేకాలం వచ్చిందమ్మా. నేకపోతే అబంసుబం తెలీని ఆ మాధవమ్మగోరిమీద మన చినబాబుగారి మీదా అట్టాంటి నిందలేత్తారా ? ఆళ్ళకు కల్లుపోతాయమ్మగోరూ ! సత్తెపెమానంగా సెబుతున్నా, ఆ కాంతమ్మగోరికి మట్టుకు అందరికంటే ముందే పోతాయి. ఆరే కదండీ యింత గోలా లేవదీసింది వూళ్ళో !" ఒక్కవూపులో అంతలు విషయం చెప్పేసి అమ్మగారివైపు భయంగా చూసింది రామి.

శ్యామలాదేవి ముఖాన నెత్తురుచుక్క లేదు తెల్లగా పాలిపోయింది ముఖమంతా. "సరే నువ్వు పని చూసుకొని యింటికి వెళ్ళిపోవే యీ పూటకు" అంటూ గబగబా లోపలికెళ్ళిపోయారు.

ఎంతోసేపు తనలోతానే మధనపడి యింక అంతటి అపవాదును, ఆసహ్యకరమైన వార్తను తనలో దాచుకోలేక నెమ్మదిగా రఘుపతిరావుగారి చెవిన వేశారు.

ఆయన తారాజువ్వలా లేచారు. "ఇంతటికీ నువ్వే కారణం. వాడిని నీ గారాబంతో అడ్డగాడిదలా తయారు చేశావు. ఏ దిక్కూ మొక్కూ లేనిదాన్ని కట్టుకొని వూరేగుదామనుకుంటున్నాడేమో! నా బొందిలో ప్రాణముండగా అది జరగనివ్వను" అంటూ గంతులేసి, "ఆ మహిపూర్ సంబంధం ఖాయంచేస్తున్నానని నీ ముద్దుల కొడుక్కు చెప్పు" అంటూ ఆ భారం శ్యామలాదేవిమీద వేసి తన గదిలోకెళ్ళి తలుపు లేసుకున్నారు రఘుపతిరావుగారు.

* * *

తనూ వయసులో వుండగా ఓ అమ్మాయిని చేరదీసిన మాట వాస్తవం. కానీ ఎప్పుడూ ఆ అమ్మాయిని పెళ్ళిచేసుకుంటానని పిచ్చిగా అనుకోలేదు పిచ్చిగావచ్చిన మంచి సంబంధాలన్నీ శేఖర్‌లా తిప్పి కొట్టలేదు. ఆ అమ్మాయి. పెళ్ళిచేసుకుంటాననే ఆశలు కల్పించలేదు. ఇద్దరికీ ఇష్టమైంది. దగ్గరయ్యారు. తనకు పెళ్ళి కాగానే ఆ అమ్మాయి కన్యాయం చేయలేదు. కొంత నగదు, కొంత పొలం తండ్రినడిగి తీసుకొని ఆ అమ్మాయికో దారిచూపించాడు. తన తండ్రి

బాధారహిత ప్రకృతిసిద్ధమైన ఆరోగ్యము మీదే!
స్త్రీల బాధలు ప్రత్యేకమైనవి
లోధ్ర
75 సంవత్సరములకు పైగా
సుఖజీవనమునకు
లోధ్ర టానిక్‌ను
వాడిన స్త్రీలు ఎందరో!
ఉచిత వైద్య సలహాకు
ఈ క్రింద పేర్కొనబడిన విలాసమునకు
ఈ కూపన్‌ను పూర్తిచేసి మీ జాబుతో పంపండి.
పేరు: ____________
విలాసము: ____________
____________ PIN ____________




కేసరి కుటీరం (ప్రైవేట్) లిమిటెడ్ రాయపేట, మద్రాసు-14
ఏజంట్లు: శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్ విజయవాడ — సికిందరాబాద్ — బెంగుళూరు

మీసాలు మెలేస్తూ తను వయసులో వుండగా చేసిన అల్లరిపనులను గొప్పగా చెబుతుండేవారు. అది జమిందార్లకు అనవాయితీగా, గొప్పగా వర్ణించి చెప్పేవారు. ఆయన మాటల ప్రభావం తనమీద పనిచేసిందోలేదో కానీ తనూ ఓ అమ్మాయికి ఆశ్రయమిచ్చాడు శేఖర్ ముందు తనెప్పుడూ వయసులోవుండగా చేసిన తుంటరిపనుల గురించి చెప్పలేదు. అయినా వాడికి తన సాలే వచ్చిందా ? తరతరాలుగా వస్తున్న అనవాయితీ శేఖర్‌కు కూడా వచ్చిందా ? అంతటితో ఆగితే ఫర్వాలేదు. పెళ్ళి చేసుకుంటానంటేనే పెద్ద చిక్కు. తమ అంతస్థెక్కడ దిక్కూమొక్కూలేని ఆ దిక్కుమాలిందెక్కడ ? శేఖర్ అంత పిచ్చిగా ఆలోచించడు. వాడు నా కొడుకు" అని తనకు తాను ధైర్యం చెప్పుకున్నా ఏ మూలో, ఒకవేళ పెళ్ళిచేసుకుంటానంటే ఏం చేయాలనే భయం పట్టుకుంది. ఆలోచనలతో ఆ సాయంత్రంవరకూ బెంగగా అలాగే పడుకున్నారు రఘుపతిరావుగారు. శ్యామలాదేవికి కాళ్ళూ చేతులూ ఆడటంలేదు. ఆయన్ని భోజనానికి పిలిచే ధైర్యంకూడా లేక తనూ ఆ గది బయట అలాగే అభోజనంగా కూర్చుండిపోయారు.

* * *

సాయంత్రం పొలంనుంచీ యిల్లు చేరిన శేఖర్ మనసంతా చికాగ్గా వుంది. "మధు మూర్ఖపు మంకుపట్టువల్ల అనవసరంగా అపవాదులు మోయాల్సివచ్చింది. తను చెప్పినట్టు వినివుంటే యిప్పుడు వీళ్ళంతా యిలా మాట్లాడగలిగే అవకాశమే వుండేదికాదు. అనవసరంగా మధు తను బాధపడి నన్నూ బాధపెడుతోంది " యిలా ఏవేవో ఆలోచనలతోనే స్నానం ముగించి, అలవాటుకు విరుద్ధంగా ఏదో పుస్తకం తీసుకొని కూర్చున్న శేఖర్‌కు ఆలోచనలతో ఒక్కపేజీ కదలడంలేదు. ఈ సమయంలో మధుతో కబుర్లు చెబుతూ కూర్చొని వుండాల్సింది. ...తను మరీ రోజూ అలా మధును చూడటానికి పోకుండా వుండివుండాల్సింది. మధును చూడకుండా మధుతో మాట్లాడకుండా వున్న రోజు పిచ్చెత్తినట్లుండేది. ఫలితంగా మరు రోజు పెందలాడే వెళ్ళి, మరికాసేపు కబుర్లు చెప్పి వచ్చేవాడు.

వారం రోజుల్నుంచీ మధును చూడలేకపోయాననే మాట్లాడలేకపోయాననే అనే బాధ మరీ వేధిస్తోంది. ఒకటి రెండుసార్లు మధు నీళ్ళకెళ్ళే టైమ్‌కు మావిడితోట కెళ్ళి చెట్ల చాటునుంచి చూసి, మధు తనవైపు తిరగ్గానే ప్రక్కకు తప్పుకొని వచ్చేశాడు. అయినా మనసుకు తృప్తి, శాంతి లేవు. ఆ రోజు మధు తన ముఖంమీదే తలుపులు మూసినప్పుడు అంతులేని బాధ గలిగినా...అలా చేయడానికి మధు మనస్సెంత క్షోభించివుంటుందో !

ఎంత ఆక్రోశించివుంటుందో! వూహించు కొని, మధు నిర్దాక్షిణ్యంగా చేసిన ఆ పనిని క్షమించగలిగాడు." అలా ఆక్రో చనలో మునిగి మంచంమీద వాలిగిన శేఖర్‌కు టైమెంత గడిచింది తెలీలేదు.

భోజనానికి పిలుస్తున్న తల్లి పిలుపుతో యీ లోకంలో కొచ్చి నెమ్మదిగా తల్లి ననుసరించి హాల్లో కెళ్ళి టేబుల్ ముందు కూర్చున్నాడు. అన్నం వడ్డించిన శ్యామలాదేవి ఎదురుగా కుర్చీలాక్కొని కూర్చొని శేఖర్ భోజనం చేసే లక్షణాన్ని పరిశీలిస్తోంది. అన్నం కెలుకుతున్నట్లుందే గానీ ఓ ముద్దా నోట్లో పెట్టుకున్నట్లులేదు. ఎదురుగా తల్లి కూర్చొనివుందన్న స్పృహలేదు. ఏవిటో ఆలోచనలు, ఎక్కడో శూన్యంలో చూపులు, పళ్ళెంలో చేయి.


ఇంక సహించలేకపోయిన శ్యామలా దేవి "భోజనం చేయి శేఖర్! తర్వాత తీరిగ్గా ఆలోచించుకోవచ్చు." అంది కొంత విసుగూ కొంత కోపం మేళవిం చిన స్వరంతో.

"నువ్వూ నన్ను అసహ్యించుకుం టున్నావామ్మా!" అన్నట్లు జాలిగా ఓసారి తల్లివైపు చూసి, గబగబా రెండు ముద్దలు తినేసి, చెయ్యి కడుక్కుని లేచిపోతున్న శేఖర్‌వైపు బాధగా చూసిన శ్యామలాదేవి, అర్ధాకలితో లేచి పోయిన కొడుకును తలచుకొని, తనుతొందరపడి విసుక్కోకుండా వుండ వలసింది. "బాబు అన్నం తినకుండా లేచిపోయాడు." అని ఎన్నోసార్లు తనని తాను నిందించుకుంటూ అప్పటికే పైకి వెళ్ళి మంచంమీద పడుకొని పుస్తకం చేతిలో, ఆలోచన ఎక్కడో సారించి వున్న శేఖర్ గదిలోకి ఓ గ్లాసుపాలు, అరటిపళ్ళు తీసుకెళ్ళింది. ఇవి తీసుకో బాబూ. భోజనం సరిగ్గా చేయలేదు." అంది తల్లి. ఆమెను బాధపెట్టడం యిష్టం లేక, పాలుతీసుకొని త్రాగేసి "ఇక చాలమ్మా, యింక యిప్పుడేమీ తిన లేను." అన్నాడు. పళ్ళ సజ్జ పక్కన పెట్టి ఎదురుగావున్న కుర్చీలో కూర్చుం టున్న తల్లివైపు ప్రశ్నార్థకంగా చూశాడు శేఖర్.

రఘుపతిరావుగారు చెప్పిన మాటలు సౌమ్యంగా శేఖర్‌తో చెప్పి "శేఖర్! మీ నాన్నగారి ఆరోగ్యంకూడా అంత బావుండటం లేదు. మాకింకెవరు న్నారు? మా ఆశలన్నీ నీ మీదే పెట్టుకొని బ్రతుకుతున్నాం, ఆ మహి పూర్ సంబంధానికి ఒప్పుకో బాబూ! నా మాట విను." అంది తల్లి.

(సశేషం)

Printed and Published by A. Chandra Sekar Rao at 5-9-88, Public Garden Road Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor: A. SUDHAKARA RAO




# ప్రేమవాహిని

ఆమెవైపు మౌనంగా చూస్తున్న శేఖర్‌ను చూసి ఫర్వాలేదు మెత్తబడ్డాడు. ఈ సంబంధానికి ఒప్పుకునేట్లే వున్నాడు అని ఆ తల్లి హృదయం ఆనందపడింది. ఆశగా శేఖర్ వైపు చూస్తుంది శ్యామలా దేవి.

"క్షమించమ్మా !" నా అసహాయత మిమ్మల్ని చాలా బాధపెడుతోంది. నాకు పెళ్ళిచేసుకోవాలని లేదమ్మా !" అంటూ ముఖం దిండులో దాచుకున్నాడు శేఖర్. అతని దగ్గరగా వచ్చి తలమీద చేయి వేసి ఓ దృఢ నిశ్చయంతో.

"బాబూ ! నీ మనసు మధుమీద వుందని ఆలస్యంగానైనా తెలుసుకున్నాను. పోనీ ఆ పిల్లనే పెళ్ళి చేసుకో. మీ నాన్నగారి కాళ్ళావేళ్ళా పడి ఎలాగో ఒప్పిస్తాను. కానీ నువ్విలా అన్నీ పోగొట్టుకున్న విరాగిలా తిరుగుతుంటే నేను చూడలేనురా" అంటున్న తల్లి చేతుల్లో ముఖం దాచుకొని ఓ అయిదునిమిషాలు అలాగే ఉపశమనం పొందిన శేఖర్, నెమ్మదిగా లేచి కూర్చొని ముఖం తుడుచుకున్నాడు.

"అమ్మా ! నాకు తెలుసమ్మా ! నా కోసం మీరేమైనా చేస్తారనీ, చేయగలరనీ నమ్మకముంది. అయినా నాకా అదృష్టం లేదమ్మా! మధు వివాహానికి సుముఖంగా లేదు." అంటూ లేచి బయటకు వెళ్ళిపోతున్న కొడుకువైపు ఆశ్చర్యంగా చూస్తూ నిలబడిపోయారు శ్యామలాదేవి. మధు ఈ యింటికి కోడలయ్యే భాగ్యాన్ని

కాదనగలగటం ఆమె వూహ కందటం లేదు.

* * *

చంద్రం, సుషమ వెళ్ళి మధుకు ధైర్యం చెప్పాలనీ, వీలైతే ఏదైనా సహాయం చేయాలనీ అనుకున్నారు. వాళ్ళు వెళ్ళేసరికి యిల్లు వూడుస్తున్న మధు చీపురు లోపల పడేసి, నవ్వుతూ వచ్చి వాళ్ళను ఆహ్వానించింది లోపలికి. అంత అపవాదుపడిన ఆడపిల్ల, అసహాయురాలు ఎంత బాధపడుతుందో ఓదార్పుగా మాట్లాడి ధైర్యం చెప్పాలని వచ్చిన సుషమకు నిరాశే ఎదురైంది. ధైర్యంగా నవ్వుతూ తిరుగుతున్న మధును చూసి ఓ రకమైన అసూయ కలిగింది. "ఏం చూసుకొని అంత ధైర్యం ?" అని తనలో తాననుకుంటూ చంద్రం వైపు చూసింది. చంద్రం కూడా మామూలుగా నవ్వుతూ, ఏమీ జరగనట్లే మాట్లాడుతున్నాడు. అసలే మానసికంగా దెబ్బతినివున్న మధుకు మళ్ళీ అవన్నీ జ్ఞాపకంచేసి బాధ పెట్టడం చంద్రాని కిష్టంలేదు. అందుకే కావాలనే ఆ విషయం తప్ప మిగతా విషయాలన్నీ మాట్లాడుతున్నాడు. శేఖర్ పేరు కూడా ఎత్తలేదు.

సుషమకు విసుగ్గా వుంది. పొలాల గురించీ, పంటల గురించీ, శ్యాం చదువు గురించీ యివే కబుర్లు.

"శాంతను ఎప్పుడు తీసుకొస్తున్నారు బావా ! గర్భిణితో వుందట కదూ !" అని అడుగుతోంది మధు. యింక వూరికే కూర్చోవడం అసాధ్య మనిపించిన సుషమ "ఈ నెల్లో ఎలాగూ శేఖరన్నయ్య పెళ్ళి వుంటుందిగా అప్పుడు వస్తుంది. యింక ప్రసవించేవరకూ ఇక్కడే వుంచేస్తాం," అంది.

చంద్రానికి జీవితంలో మొట్టమొదటి సారిగా సుషమమీద అంతులేని కోపం వచ్చింది.

మధులో ఎంత నిబ్బరం, ఎంత ప్రశాంతత ! అదేదో అతి సాధారణ విషయమైనట్లు చిన్నగా నవ్వుతూ "లగ్నాలు పెట్టుకున్నారా సుషమా ?" అంది. ఏదో కష్టంగా, చెప్పాలని చెప్పింది కానీ చంద్రం తన వైపు చూసిన చూపుకు సుషమ తల వంగిపోయింది. తప్పని సరిగా మెల్లగా సమాధానం చెప్పింది "లేదు. యింకా పెట్టుకోలేదు మహిపూర్ సంబంధం నిశ్చయం చేసుకుంటున్నారని విన్నాను." పైకి నవ్వుతూ అడిగినా మధు అంతరంగంలో ఎలాంటి తుఫాను చెలరేగిందో ముఖంమీద నిలిచిన స్వేద బిందువులే చెప్పక చెబుతున్నాయి.

వెంటనే టాపిక్ మార్చిన చంద్రం "మధూ యీ సంవత్సరంతో శ్యాం చదువు యిక్కడ అయిపోతుంది కదూ! కలకత్తా వెళ్ళిపోవచ్చు. నిన్ననే మావయ్య గారు లెటర్ వ్రాశారు. పరీక్షలైపోగానే మీ యిద్దరినీ కలకత్తా తీసుకెళ్ళి ఆయన

కప్పగించే బాధ్యత నా కప్పగించారు," అని నెమ్మదిగా "మధూ ! ఈలోగా ఏం కావలసినా నన్నడగటానికి మొహమాట పడకు" అన్నాడు మధు ముఖంలోకి చూస్తూ.

ఏవీ అడగదని తెలుసు. అయినా ఏదో ఆశ. యిప్పుడు యిల్లు ఎలా గడుస్తుందనే ప్రశ్న ఎలా వేయాలో అర్థంకాక తన సహాయం తీసుకొమ్మని పరోక్షంగా సూచించాడు.

"తప్పకుండా అడుగుతాను బావా ! నాకీ ప్రపంచంలో మిగిలిన ఆత్మీయు లెంతమంది ? వాళ్ళను కూడా దూరం చేసుకొని నేనెలా బ్రతగ్గలను ?" అని ఓ క్షణ మాగి "బావా ! ఓ సహాయం చేసి పెట్టు." అంటూ లోపలి కెళ్ళి ఓ భరిణ తీసుకొచ్చి చంద్రం చేతి కిచ్చింది.

మూత తీసి చూసిన చంద్రం ఆశ్చర్యంతోనూ, అవమానంతోనూ అలాగే చూస్తుండిపోయాడు. అందులో మధు చేతిగాజులు రెండు; ఓ లాకెట్ గొలుసూవున్నాయి. బొమ్మలా కూర్చొని జరుగుతూన్న త మా షా చూస్తోంది సుషమ.

"బావా ! వాటిని అమ్మించి వచ్చి నంత డబ్బు తీసుకురా ! ప్రస్తుతం అదే నువ్వు నాకుచేయవలసినసహాయం"అంది మధు చిన్నగా నవ్వుతూ. అలాంటి పరిస్థితుల్లోకూడా మధు అలా ఎలా నవ్వ గలుగుతోందో సుషమకూ, చంద్రానికి బోధపడటంలేదు. "మధూ ! నువ్వు నన్నిలా అవమానిస్తావని నేననుకోలేదు. ఏమిటిది? అంటే, నీకు కావలసిన డబ్బు నేను సర్దలేననా, నీ వుద్దేశ్యం?"అన్నాడు ఆవేశాన్ని అపుకోవాలని ప్రయత్నిస్తూ.

"కాదు బావా ! నిన్నవమానించాలని కాదు. నువ్వు సర్దగలవనీ నాకు తెలుసు. అయినా యిప్పుడా గొలుసూ, గాజులూ లేకపోతేనేం జరగదా ? అవసరానికి వుపయోగపడనప్పుడు అవెందుకు ? నా సంగతి నీకు పూర్తిగా తెలుసు బావా ! నన్ను అర్థంచేసుకున్న వాళ్ళెవరైనా వున్నారంటే అది నువ్వేనని నా నమ్మకం. నా మీద నీకున్న అభిమానంతో, నా అభిమానాన్ని చంపుకోమని చెప్పకు. దయచేసి నేను చెప్పినట్లు చెయ్యి బావా ! ఈ పని నువ్వు తప్ప నాకు చేసిపెట్టగల వాళ్ళెవరూ లేరు ఈ వూళ్ళో !" అంటున్న మధు స్వరం వణకడం గమనించి,మారు మాట్లాడకుండా ఆ భరిణ తీసి జేబులో వేసుకొని, లేచి నుంచున్నాడు చంద్రం. ఆశ్చర్యంగా మధు వైపు, చంద్రం వైపూ చూస్తున్న సుషమ-

"మధూ" అంటూ ఏదో చెప్పబోయే లోపల-

"పద వెళ్దాం !" అంటూ, దాదాపు సుషమను చేత్తో లాక్కొని వెళ్ళిపోతున్న చంద్రం కళ్ళలో మెరిసిన సన్నటి నీటి పొర, అతనెంత బాధపడుతున్నాడో మధుకు తెలియజెప్పింది. అలాగే

వాళ్లు వెళ్లిన వైపే చూస్తూ శిలాప్రతిమలా నిలబడిపోయిన మధు కళ్ళు ధారా పాతంగా వర్షించడం మొదలుపెట్టాయి.

* * *

తండ్రి యాక్సిడెంట్‌లో చనిపోవ డానికి సరిగ్గా నెల ముందు తను స్కూల్ ఫస్ట్ వచ్చిందని విని, ఒకేసారి మధుకు ఆ రెండు గాజులూ, లాకెట్ గొలుసూ కొనిచ్చాడు. బాంక్‌లోవున్న కొద్ది డబ్బూ తీసి, కూతురికి నగల రూపంలో అలంకరించాడు ఆ ఆనందంలో తను బ్రతికుండగా పిల్లలకు తల్లి జ్ఞాపకం రాకూడదనీ, ఆడపిల్లలకు ఆభరణాలు అవసరమనీ తల్లిలా, తండ్రిలా తనే ఆలోచించి ఆ పని చేశాడు శ్రీరాం.

ఈ రోజు వాటికీ, తనకూ రుణం తీరిపోయింది. ప్రాణం లేని ఆ వస్తువుల మీద తీపిలేకపోయినా, ప్రాణ మున్నపుడు తండ్రి కొనిచ్చిన తీపి గురుతుగా యిన్నాళ్ళూ వాటిని ప్రాణాంలా దాచు కుంది. తను కలకత్తా వెళ్ళి శ్రీధర్ మావయ్య దగ్గరుంటే...శ్యాం చదువుకు, తన ఖర్చులకు సరిపడ తను సంపాదించ గలదా? ఆప్యాయంగా ఆదరించే చంద్రం బావని యివాళ అవి అమ్మిపెట్టమని చెప్పడం తప్పనిసరైంది. అవి ఎలాగూ అమ్మక తప్పదు. తనంతట తను ఎవరికీ అమ్మలేదు. మరొకరికి ఆ పని చెప్పడం యిష్టంలేదు. బాధపడ్డా తన అత్మాభి మానాన్ని అర్థంచేసుకొని అమ్మిపెట్టగల వాడు చంద్రం ఒక్కడే అందుకే ఆ పని అతనికే అప్పజెప్పింది.

* * *

చంద్రం డబ్బు తీసుకొచ్చియిచ్చాడు. అయితే మధు చెప్పినట్లు వాటిని అమ్మ లేదు. వాటిని అతిప్రియంగా దాచుకునే వ్యక్తి చేతికి వాటిని అందించి తృప్తిగా నిట్టూర్చాడు. మధు కవసరమైన డబ్బు చేతి కందింది. రోజులు కొంత ప్రశాం తంగానే గడిచిపోతున్నాయి. శేఖర్ అసలు కనిపించడం లేదన్న బాధ తప్ప మరోవిధమైన బాధలేవీ లేవనే చెప్పాలి.

అపవాదులు వేసినవాళ్ళకు కూడా అదేపనిగా ఒకేవిషయాన్ని చెప్పుకోగా, చెప్పుకోగా విసుగుపుడుతుంది. చివరికి వాళ్ళంతట వాళ్ళే మానేస్తారు. శేఖర్, మధులను గురించి చెప్పుకునేవాళ్ళ నోళ్ళకు, కొంత విశ్రాంతి దొరికింది. అదీగాక వాళ్ళ నోళ్ళ ప్రభావానికి దడిసి శేఖర్ మధు యింటికి రావడం మానేశా డని గర్వంగా నవ్వుకునేవాళ్ళు. అసలు నిజం తెలీదు వాళ్ళిద్దర్నీ, వాళ్ళు కలుసు కోదలుచుకుంటే ఎవ్వరూ ఆపలేరని !

శేఖర్ మధును బాధపెట్టడం యిష్టం లేక ఆమె కంటబడటం మానేసినా, మాన సికంగా ఆ వ్యధ అతణ్ణి కృంగదీసి మంచం పట్టించింది. ప్రయివేట్ డాక్టర్ యింటికొచ్చి ట్రీట్‌మెంట్ యిస్తున్నారు. మనోవ్యాధికి మందేముంది ? ఎన్ని మందు లిచ్చినా మనిషి రోజు రోజుకూ నీరసించిపోవడం తప్ప గుణం కనిపిం

చడంలేదు. శేఖర్‌ను ఆ పరిస్థితిలో చూస్తున్న రఘుపతిగారి గుండెల్లో అంతులేని బాధ నింపుకొని, ఆ పరిస్థితుల్లో వివాహ మేవిటని ? మహిపూర్ వాళ్ళకు కబురు చేశారు క్షమించి మీరు మరో సంబంధం చూసుకోండని.

ఒక్కగా నొక్క కొడుకు, కుల దీపకుడు. వాడికంటే తనకు ఆస్తి అంతస్థులు ముఖ్యం కావు. వాడిష్ట ప్రకారమే కానివ్వాలనే నిశ్చయానికి వచ్చారు. పుత్రవాత్సల్యం ముందు, ఆస్తీ అంతస్థూ, పరువూ ప్రతిష్టా, అన్నీ తృణప్రాయాలుగా కనిపించాయి. ఎన్ని మందులు వాడినా రోజు రోజుకూ క్షీణించిపోతున్న శేఖర్‌ను చూసి డక్టర్‌కు కూడా అతని జబ్బేమిటో అంతుబట్టకుండా వుంది. పోనీ ఓ సారి కలకత్తా తీసుకెళ్ళి స్పెషలిస్ట్‌లకు చూపిస్తే ఏమైనా పయోజన ముంటుందేమోననే అభిప్రాయం వెలిబుచ్చారు. శేఖర్ తను గంగాపూర్ వదలి వెళ్ళనని మొండి కేశాడు.

ఊళ్లో అందరూ యిప్పుడు శేఖర్ అనారోగ్యం గురించే చెప్పుకుంటున్నారు. సుషమ, చంద్రం రోజూ ఏదో ఒక టైమ్‌లో వెళ్ళి శేఖర్‌ను చూసి వస్తున్నారు.

ఓ రోజు చంద్రం మధు దగ్గర కొచ్చాడు. ఏదో అడగాలని వచ్చిన చంద్రం మధు ముఖం చూసి సంశయించడం చూసిన మధు తనే పలకరించింది.

"శేఖర్‌బాబు దగ్గరకు వెళ్ళావా బావా ? యిప్పుడెలా వున్నారు ?" అంది. ఎంత మామూలుగా అడగాలని ప్రయత్నించినా, మనసులోని బాధ మాటల్లో ధ్వనించింది. చంద్రానికి సమస్య తేలికైంది, కొంచం ధైర్య మొచ్చింది.

"మధూ! నవ్వొకసారి రాకూడదూ! వాడు రోజూ నిన్ను గురించి అడుగుతున్నాడు. చాలా బలహీనంగా తయారయ్యాడు. వాడిని చూస్తే మన శేఖరేనా అనే అనుమానం కలుగుతోంది. తినే మందులేమైపోతున్నాయో తెలీదు. మామూలుగా వున్నట్లే కన్పిస్తున్నా ఆ నవ్వులో జీవం లేదు. ఆ ముఖంలో మునుపటి కళాకాంతులు లేవు. ఒక్కసారి వెళదాం రా మధూ!" అంటున్న చంద్రం వైపు కళ్ళెత్తి చూసిన మధు, అతను అంతగా బాధపడుతున్నాడంటే, బాధగా గొంతు చలిస్తోందంటే, కళ్ళ వెంట నీళ్ళు కారుతున్నాయంటే...నిజంగా శేఖర్ పరిస్థితి చాలా ప్రమాదంగా వుందేమో, అన్పించింది. అంతే ఆ ఆలోచన రావడమే తడవుగా యింక ఆపుకుందామన్నా ఆపుకోలేక రెండు చేతుల్లో ముఖం దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చేసింది, చంద్రం అక్కడే వున్నాడనే విషయం కూడా మరిచిపోయి. అలా

ఏడుస్తున్న మధును చూసి తనను తాను కంట్రోల్ చేసుకుంటూ, కళ్ళు తుడుచుకొని, మధు ముఖం మీదనుంచి చేతులు తొలగిస్తూ "పద మధూ! ముఖం కడుక్కొనిరా వెళదాం" అన్నాడు బొంగురుపోతున్న స్వరంతో.

"లేదు బావా! నేను రాను. నా గాలి తగిలితే ఆయనింక కోలుకోరు. నా దురదృష్టం నా ఆత్మీయులందరినీ పొట్టను పెట్టుకుంది. నేను రాను బావా! నా నీడ కూడా ఆయనమీద పడకూడదు. నేను రాను...నేను రాను..." అంటూ వెళ్ళి మంచం మీద పడి భోరుమని ఏడుస్తున్న మధుకు ఏమని చెప్పాలో ఎలా ఓదార్చాలో అర్థంకాక కొంచంసేపు అలాగే నిలబడి, నెమ్మదిగా వెనుదిరిగి వెళ్ళిపోయాడు, చంద్రం. మనసులోని బాధ కన్నీళ్ళ రూపంలో బయటపడటమే మంచిదనిపించి మధు ఏడుపుకు అంతరాయం కలిగించకుండా వెళ్ళిపోయాడు చంద్రం

చంద్రం వ్రాసిన లెటర్ ద్వారా శేఖర్ అనారోగ్యం విషయం తెలిసి శ్రీధర్‌గారు కూడా వచ్చి ఓ నాలుగు రోజులుండి వెళ్ళారు "కలకత్తా వెళదాం శేఖర్?" అని ఆయన కూడా అన్నారు. "వద్దు అంకుల్. అయామాల్‌రైట్," అని కలకత్తా వెళ్ళడానికి ఒప్పుకోలేదు, శేఖర్. ఎవరు వచ్చి చూసినా చేయగలిగిందేముంది? ఏదైనా కాలమే నిర్ణయించాలి. శేఖర్ పెళ్ళికి వస్తుందనుకున్న శాంత శేఖర్ అనారోగ్యం విషయం తెలిసి చూడటానికి వచ్చి శేఖరింటికి వెళ్ళింది. పాలిపోయిన ముఖంతో, తెచ్చిపెట్టుకున్న జీవంలేని నవ్వుతో-

"ఏమ్మా శాంతా! బావున్నావా?" అంటూ పలకరిస్తున్న శేఖర్‌ను చూసి కన్నీళ్ళాగలేదు శాంతకు. తను పెద్దగా శేఖర్‌తో ఎప్పుడూ మాట్లాడింది లేదు. సుషమ వాళ్ళు మొట్టమొదటిసారిగా గంగాపూర్ వచ్చినప్పుడు కలిగిన చనువుతో అప్పుడప్పుడూ మాట్లాడుతుండేది. ఎంతో ఆప్యాయంగా పలకరించేవాడు. మధుతో కలిసి తన పెళ్ళి హడావుడిలో పాల్గొన్న శేఖర్, జమిందారు గారబ్బాయనే భావం, ఆ తర్వాత శాంతకెప్పుడూ కలగలేదు. చంద్రంతో మాట్లాడినంత చనువుగానూ మాట్లాడేది. ఇప్పుడు శేఖర్‌ను. అలా చిక్కిపోయి, రూపం మారిన శేఖర్‌ని చూడటం ఎంతో బాధగా వుంది. నోరు విప్పి శేఖర్‌ను అలా చూస్తూ మాట్లాడలేకపోయింది. అయిదునిముషాలు కూర్చొని యింటికి వచ్చేసింది. అలా చూస్తూ ఎలా వుందని ఎలా అడగటం? అప్పుడు కూడా ఓపిగ్గా నవ్వుతూ, తనే శాంత మంచి చెడ్డలు అడిగాడు శేఖర్. ప్రత్యక్షంగా పూర్తిగా మారిపోయిన శేఖర్‌ను చూస్తూ అతని పరిస్థితి ఎలా వుందని ఎవర్ని

అడగలేక మౌనంగా "వస్తానన్నయ్యా" అని మాత్రం అనేసి వెళ్ళి పోయింది.

* * *

ఒంటరిగా యింటి కప్పుకేసి చూస్తూ పడుకున్న శేఖర్‌కు నిశ్చయంగా అనిపించింది. తనను అంటిపెట్టుకొని వెంటాడుతున్న యీ మానసికావేదన నుంచీ ఆలోచనల నుంచీ పారిపోవాలి రకరకాలుగా పయనిస్తూ గమ్యం చేరుకోలేకపోతున్న ఆలోచనలకు ఓ మార్గదర్శి కావాలి. తన మధు కావాలి. ఆమె సమక్షంలో తప్ప తన బాధను మరిచిపోలేడు. ఎందరో వచ్చారు తనని చూడటానికి. కానీ మధు తన దగ్గరకు రాదు. మరి ఎలా! ఓసారి ఆమెను కళ్ళారా చూసి, ఆమెతో మాట్లాడితే తప్ప మనస్సుకు శాంతి, విశ్రాంతి వుండదు." చాలాసేపటి నుంచీ పడుకొనివున్నాడేమో, మరీ చికాగ్గా అనిపించి లేచి నుంచున్నాడు నెమ్మదిగా. గిర్రున కళ్ళు తిరిగాయి. మంచం పట్టుకొని అలాగే కూర్చున్నాడు ప్రక్కనే వున్న గ్లూకోస్ వాటర్ తాగి మంచానికి తలానించి కిటికీలో నుంచి కనిపిస్తున్న చిక్కబడుతున్న చీకటిని చూస్తున్నాడు. అలా చీకట్లోకి చూస్తున్న శేఖర్‌కు కిటికీ దగ్గర ఏదో నీడ కదలాడినట్లైంది. ఆ సమయంలో అప్పుడు ఎవరలా కిటికీలో నుంచి చూస్తున్నారా?" అని వెళ్ళి పక్క గుమ్మం తలుపు తీసిన శేఖర్ త్వరగా తప్పించుకొని వరండా మెట్లు దిగబోతున్న ఆ ఆకారాన్ని చేత్తో పట్టుకోబోయి ముందుకు తూలాడు.

వెళ్ళబోతున్న ఆ ఆకారం అప్రయత్నంగా వెనక్కు తిరిగి శేఖర్‌ను పడిపోకుండా పట్టుకుంది.

ఆ స్పర్శ శేఖర్ శరీరంలో ఎక్కడలేని శక్తినీ యిచ్చింది. తడబడుతున్న గొంతుతో "మధూ! నువ్వా? నువ్వేనా? చాటుగా వచ్చి చూసి వెళ్ళిపోతున్నావా? యిన్నాళ్ళకు నన్ను చూడాలనిపించిందా మధూ! యిప్పుడైనా యింక నేను ఎలాగూ చచ్చిపోతానని విని, ఓసారి చూసి వెళ్దామని వచ్చావు కదూ! ఇంక ఫర్వాలేదు...నేను హాయిగా, తృప్తిగా ప్రాణాలు వదిలేయగలను. ఇంకా బ్రతికుండి నిన్ను బాధపెట్టను మధూ!" అంటూ ఆవేశంగా మాట్లాడుతూ నీరసం వల్ల ఆయాసపడుతున్న శేఖర్ నోటిపై చెయ్యి వుంచి–

"అంత మాటనకండి. మీరు తప్పకుండా కోలుకుంటారు. నాకు నమ్మకుంది. మరో వారానికి మామూలుగా లేచి తిరుగుతారు. ఇంక లోపలికెళ్లి పడుకోండి మళ్ళీ ఎవరైనా లేస్తే, గొడవవుతుంది. నే వెళ్ళొస్తాను" అంటూ ఆయాసపడుతూ వుద్వేగాన్ని అణచుకోలేకపోతున్న శేఖర్ గుండెలమీద చేత్తో రాస్తూ, శేఖర్ ముఖం వైపు చూసిన మధు, ఆ చీకట్లో కూడా మిలమిలా

మెరుస్తున్న శేఖర్ కళ్ళలోని కాంతికి తనను తాను నిగ్రహించుకోలేక శేఖర్ కాళ్ళ పైకి జారి, కన్నీళ్ళతో శేఖర్ కాళ్ళను అభిషేకిస్తోంది. నెమ్మదిగా మెట్టు మీద కూర్చున్న శేఖర్, మధు తల రెండు చేతులతో పైకెత్తుతూ-

"మధూ ! ఏవిటిది ? పిచ్చి ? ఎందు కేడుస్తున్నావు ? నాకిప్పుడేమైందని ? మరో వారానికి నువ్వన్నట్లు లేచి తిరుగు తాను చూడు" అంటూ మధు కన్నీళ్ళు తుడిచాడు. ఆ పదినిముషాల్లో ఒకళ్ళ నుంచీ ఒకళ్ళకు, కావల్సినంత శక్తీ, మనోధైర్యం సరఫరా అయ్యాయి.

నెమ్మదిగా లేచి కన్నీళ్ళు తుడుచుకుంటూ వెళ్ళిపోతున్న మధు వైపు చూస్తూ కూర్చున్న శేఖర్ నెమ్మదిగా లేచి లోపలికెళ్ళి తలుపులు వేసుకున్నాడు.

శేఖర్ మనసు తృప్తితో నిండి పోయింది. ఎవరేమనుకున్నా, తనేమైపోయినా, మధు మనస్సు తనది అనే తృప్తి చాలు భవిష్యత్ మీద ఆశతో బ్రతకడానికి. కొద్దో గొప్పో ఒకరిని గురించి ఒకరికి సందేహాలేవైనా వుంటే అవి ఆ క్షణంలో కలసి కురిసిన కన్నీటిలో కరిగిపోయాయి.

తెల్లవారి నిద్రలేచిన శేఖర్‌కు కొంత తేలిగ్గా వున్నట్లనిపించింది. మరి రోజూలా పక్కమీదే వుండిపోలేదు. మరో పదిరోజులకు లేచి తిరుగుతున్న శేఖర్‌ను చూసి ఆశ్చర్యపోయిన డాక్టర్ "శేఖర్ ! నా అనుభవంలో యిలాంటి విచిత్రమైన కేసు చూళ్ళేదోయ్. అంత దేంజరస్‌గా కనిపించిన నువ్వు మళ్ళీ యింత త్వరగా కోలుకుంటావనుకోలేదు. ఎంత భయపెట్టావు మమ్మల్నందరినీ.ఏ అమృతశక్తి వరమిచ్చిందో ? యూ బికేమ్ ఆల్‌రైట్. అసలు జబ్బేమిటో తెలీకుండా, రోజు రోజుకూ డౌన్ అయిన నువ్వింత త్వరగా కోలుకోడం రియల్లీ లక్కీ. ఎనీహౌ గాడ్ ఈజ్ గ్రేట్" అంటూ లేచి శేఖర్‌తో కరచాలనం చేసి జమిందారుగారికి నమస్కరించి నవ్వుతూ వెళ్ళిపోయాడు డాక్టర్.

చినబాబుగారు లేచి తిరుగుతున్నారంటే యింట్లో అందరికీ మళ్ళీ కన్నుల పండువగా వుంది. అసలు రహస్యం, శేఖర్ గది కిటికీ తీసి వుంచిన రామికి తప్ప ఎవరికీ తెలీదు. ఆ రాత్రి మాధవిని తప్పకుండా చూట్టానికి రమ్మని చినబాబు గారు, కింద గదిలోనే పడుకొని వున్నారని, ఎవరూ చూడకుండా నేను చూసుకుంటానని అభయమిచ్చిన రామితో రానని చెప్పినా వస్తుందనే నమ్మకంతోనే అది ఆ రోజు, చినబాబు గది కిటికీ తలుపులు వేయకుండా తీసి వుంచింది.

"మాదవమ్మగారి దయవల్లే మళ్ళీ మా చినబాబుగారు మామూలు మడిసయ్యారు" అనుకుంది రామి సంతోషంగా.

శేఖర్ లేచి తిరుగుతున్నాడనే వార్త విని మధుశివాలయానికి వెళ్ళి తన మొర ఆలకించిన విశ్వేశ్వరుడికి అర్చన చేయించింది. మధు మనసుకు కొంత నిశ్చింత ఏర్పడింది.

శ్యాం శ్రద్ధగా చదువుతున్నాడు. రాత్రులు దగ్గిర కూర్చొని చదివిస్తూ వాడికి తెలీనివి తనకు తెలిసినంత వరకూ చెబుతూ, తన సర్వశక్తులూ ధారపోసైనా సరే వాడు ఆ సంవత్సరం మంచి మార్కులతో పాస్ అయ్యేలా చూడాలని తంటాలు పడుతోంది. ఈ సంవత్సరం పరీక్షలైపోతే, యింక కలకత్తా వెళ్ళి, ఏదో వుద్యోగం సంపాదించవచ్చు.

వూళ్ళో ఎదురుగా తి రు గు తూ శేఖర్‌ను తప్పించుకొని తిరగటం ఓ శాపంలా మధును క్షోభపెడుతోంది. తను కళ్ళకు కనిపించకుండా దూరంగా వెళ్ళిపోతే కొంతకాలానికి మర్చిపోయి మరో అమ్మాయిని పెళ్ళిచేసుకోగలడని మధు అభిప్రాయం. అలా అనుకున్నపుడల్లా మనసులోని మరోభాగం "అబద్ధం! శేఖర్ నిన్ను తప్ప వేరే ఎవరినైనా పెళ్ళాడడ మనేది, ప్రేమించడ మనేది కల్ల" అంటుండేది.

ఎదుట మాట్లాడుతూ వెనక్కు తిరగ్గానే వెక్కిరించేవాళ్ళ మనస్తత్వాలు అర్థమైన తర్వాత సాధ్యమైనంతవరకూ అలాంటివాళ్ళను తప్పుకు తిరుగుతోంది. తప్పనిసరిగా మాట్లాడినా మనసు విప్పి మాట్లాడలేకపోతోంది. కుళ్ళు మనసు నిండుగా నింపుకొని నవ్వుతూ పలకరించాలని చూసే కాంతమ్మలాంటి వారికి సాధ్యమైనంత దూరంగా తిరుగుతోంది.

పరీక్షలు మొదలయ్యాయి. శ్యాం ఎప్పటి కంటే ఎక్కువగా కష్టపడి చదువుతున్నాడు. రోజూ తెల్లవారు ఝామున నాలుగు గంటలకే లేపి చదివించడం మధు డ్యూటీ. తనకు మిగిలిన ఆ ఒకే ఒక్క వెలుగు కోసం తన జీవితమంతా ఖర్చుచేయడానికైనా సిద్ధంగా వుంది మధు.

ఆ రోజు శ్యాం ఎందుకో చాలా దిగులుగావున్నట్లు కనిపించాడు. కారణమడిగితే "ఏమీ లేదక్కా!" అని తేల్చేశాడు. ఆ రోజు పేపర్ సరిగా ఆన్సర్ చేయలేదేమోనని భయం పట్టుకుంది మధుకు. అనుమానంగా అడిగింది "ఇవ్వాళ పేపర్ సరిగా ఆన్సర్ చేయలేదా శ్యాం?" అని.

"బ్రహ్మాండంగా చేశానక్కా! ఆప్షనల్ మాత్స్ నూటికి నూరు మార్కులు గ్యారంటీగా వస్తాయి," అని చెబుతున్న వాడి మాటల్లో వుండవలసిన వుత్సాహం కనిపించలేదు.

"ఏవిటో యీ పిల్లాడు ఏవీ అర్థం కాడు" అనుకుంటూ, "పొద్దుపోయింది, యీ పూటకు చదివింది చాల్లేరా, పడుకో మళ్ళీ తెల్లవారుఝామున లేపుతా"నంది.

"సరే !" అని పడుకున్నాడు శ్యాం.

మధ్యాహ్నం పరీక్ష వ్రాసి వచ్చిన శ్యాం యింకా దిగులుగా కనిపించాడు. మళ్ళీ మధు అడిగిన ప్రశ్నకు అదే జవాబిచ్చాడు. "చాలా బాగా వ్రాశానక్షా!" అని. గబగబా ఏదో ఒకటి తినేసి స్కూలుకు పరుగెత్తే శ్యాం, అన్నం గెలుకుతూ కూర్చున్నాడు. మాటిమాటికీ కళ్ళు తుడుచుకుంటున్నాడు. మధుకు ఖంగారు ఎక్కువైంది. వాడిని దగ్గరకు తీసుకొని "ఏవిటిరా ? ఏవైంది నీకు ?" అని అడుగుతున్న మధును రెండు చేతుల్తో చుట్టేసి బావురుమన్నాడు. కానీ ఏడవటానికి కారణం చెప్పలేదు. ఇంతలో స్కూల్ బెల్ విన్పించింది.

"ముందు అన్నం తినరా! మళ్ళీ పరీక్ష కెళ్ళాలి. యివ్వాళ నీకేమైందిరా శ్యాం ?" అంటున్న మధు కళ్ళలో నీళ్ల నిలిచాయి. వాడి చేతులు తననుంచి విడదీసి గబగబాతనే అన్నంకలిపినోట్లో

# మార్చి నెల క్విజ్

## సమాధానాలు

| | | |
|---|---|---|
| 1 — బి | 2 — సి | 3 — డి |
| 4 — బి | 5 — ఎ | |

6. ఆంధ్రజ్యోతి 7. ఖేమర్ రిపబ్లిక్ 8 గుంటూరు
9 గోల్కొండ 10. 1936

అలక రెక్టుగా పంపినవారు చాలా ఎక్కువగా ఉండటంవల్ల, మా నిబంధనలలో పేర్కొన్నట్టు, లాటరీవేసి, 10 మందికి ఒక్కొక్కరికి రూ 11-60 చొప్పున బహుమతిసొమ్ము మొత్తాన్ని పంచడం జరిగింది. లాటరీలో వచ్చినవారి పేర్లను కింద ఇస్తున్నాం.

1. పి. రమ, సికింద్రాబాద్ 2. అంగర వెంకటసుబ్రహ్మణ్యం, వాల్తేరు 3. సి. విజయకుమార్, హైదరాబాద్ 4. లక్ష్మీవల్లి కార్తికేయ, శ్రీకాకుళం 5. సి. రాధాబాయి, గుంటూరు 6. ఎం. సుందరి, కాకినాడ 7. ఎం. పున్నయ్య, గుంటూరు 8. ఎస్. వి. ఆర్. వి. ప్రసాద్, గుంటూరు 9. సి. అజయ్‌కుమార్, వరంగల్ 10. వై. విజయలక్ష్మి, తిరుపతి.

పెట్టింది. ఆప్యాయంగా అన్నం కలిపి పెడుతున్న అక్కను చూస్తూ, ఓ ప్రక్క కన్నీళ్ళు కారుస్తూ, అన్నం ఎలాగో తినేసి పాడ్ తీసుకొని బయలుదేరాడు శ్యాం.

వీధివరకూ వెళ్ళిన మధు వెళుతున్న శ్యాంని చూస్తూ నుంచుంది. శ్యాం చొక్కాతో మాటిమాటికీ కన్నీళ్లు తుడుచుకుంటూ, వెనక్కు తిరిగి తిరిగి చూస్తూ స్కూల్‌వైపు వెళ్ళిపోయాడు. వాడు కనుమరుగయ్యేంతవరకూ చూసిన మధు లోపలికొచ్చి పళ్లెంలో అన్నం పెట్టుకుంది. ఒక్క ముద్దకూడ తినలేకపోయింది. ఆఖరి పరీక్షరోజు శ్యాం ఎందుకలా వున్నాడో అర్థంకాక మనసంతా వికలమైంది. వివరంగా అడిగి తెలుసుకోడానికి టైమ్ లేకపోయింది. చెయ్యి కడిగేసుకుంది అన్నం తిన కుండానే. అన్నీ సర్దేసి, లోపలి గదిలో కెళ్లి చంద్రం దగ్గరనుంచి తెచ్చుకున్న నవల తీసుకుంది చేతుల్లోకి. మనసు పుస్తకంమీద లగ్నం కావడంలేదు మధుకు. ఏవేవో ఆలోచనలు. తనకు వూహ తెలిసినప్పటినుంచీ జరిగినవన్నీ ఒక్కటొక్కటే మనసులో మెదులు తున్నాయి.

* * *

ఆరోజు తను స్కూల్‌నుంచి రాగానే ఎదురుగా కూర్చుని వున్న తండ్రి దగ్గరగావెళ్లి "నాన్నా! నన్ను డాక్టర్‌ని చదివించాలి నాన్నా" అంది డిమాండ్ చేస్తూ. "అలాగేనమ్మా!" అంటున్న తండ్రి దగ్గరకొచ్చి ఒళ్ళో కూర్చుంటూ "నాన్నా! మరి నన్నేమో! పేద్ద... ఆఫీచర్‌ని చేయాలి... అక్కయ్యకంటే పే...ద్ద ఆఫీచర్ని" అటూ చేతులు చాపి అభినయిస్తూ చూపిస్తున్న శ్యాంని చూసి తండ్రీ కూతుళ్ళిద్దరూ తనివితీరా నవ్వుకున్నారు.

వాళ్ళ నవ్వులు చూసి మూతి ముడుచుకున్న శ్యాంని రెండుచేతుల్తో పైకి ఎత్తి గాలిలో గిరగిరా తిప్పి అప్పుడే వినువీధి కెగసి మేఘాల్ని చీల్చు కుంటూ పోతున్న ఏరోప్లేన్ చూపించి "శ్యాం నిన్ను పే...ద్ద పైలట్ ఆఫీసర్‌ను చేస్తానురా! అల్లదిగో అలాంటి ఏరోప్లేన్స్ నడుపుతూ ప్రపంచమంతా తిరగొచ్చు." అంటూంటే ఆశగా ప్లేన్ వెళుతున్న దిశగా చూస్తూ "బలే బలే నేను పైలత్ ఆపీచర్‌నవుతా!" అంటూ గంతులేస్తున్న శ్యాంని చూసి వెక్కి రిస్తూ,

"ఔనవును. పైలత్ ఆపీచరు!" అంటూ నవ్వుతున్న కూతుర్ని మంద లించి,

"తప్పు మధూ! తమ్ముడినలా ఏడి పించకూడదు వాడు తప్పకుండా పైలట్ ఆఫీసరవుతాడు. చూస్తూండు నువ్వు" అంటోన్న శ్రీరాం బుగ్గల్ని ముద్దుపెట్టు కొని "మంచినాన్న" అంటూ మధును

చూసి వెక్కిరిస్తూ పోతున్న తమ్ముడిని చూసి నవ్వుతూ నిల్చున్న మాధవిని దగ్గరకు తీసుకొని

"మధూ! ఇప్పుడు చెప్పమ్మా! నువ్వు డాక్టరెందుకు చదవాలనుకుంటున్నావ్" అని అడుగుతున్న నాన్నగారిని చూసి సిగ్గుపడి తలవంచుకొని

"ఏమో నాన్నా! పక్కింటి జతిన్ అన్నయ్యను చూసినప్పుడల్లా నాకూ డాక్టర్ చదవాలనిపిస్తుంది. అన్నయ్య కూడా 'మధూ! నువ్వు డాక్టరైతే బావుంటావమ్మా' అన్నాడు ఇవాళ స్కూల్‌నుంచి వస్తుంటే తెల్లటి కోటు వేసుకొని అన్నయ్యతోపాటు వెళుతున్న ఓ అక్కయ్య కనిపించింది. అన్నయ్య నన్ను పిల్చి


'చూడు మధూ! ఈ డాక్టరమ్మ ఎలా వుంది?' అంటూ ఆ అక్కయ్యని చూపించాడు.

'చాలా బావుందన్నయ్యా' అన్నాను ఆ అక్క నన్ను చూసి నవ్వింది. నేను నెమ్మదిగా 'మీ పేరేమిటి?' అన్నాను. 'వసుధ' అని చెప్పి, 'మరి నీ పేరేమిటి?' అంది చిన్నగా, గడ్డం పట్టుకొని. నేను 'మాధవి' అన్నాను. అయితే మా జతిన్ చెప్పే 'డాక్టర్ మాధవి' నువ్వేనన్నమాట". అంటూ నవ్వుతూ చెయ్యివూపి అన్నయ్యతో కలసి వెళ్ళిపోయింది జతిన్ అన్నయ్యతో వున్న వసుధ అక్కయ్యను చూసిన దగ్గర్నుంచీ నాకు కూడా తప్పకుండా డాక్టరే అవ్వాలనిపిస్తోంది నాన్నా!'' అంటూ అంతా ఒక్క గుక్కలో చెప్పేసి మళ్ళీ తండ్రి గుండెల్లో తల దాచుకుంది మాధవి.

"అలాగేనమ్మా! నాకు మీ ఇద్దరూ రెండు దీపాలు, నా కంటిపాపలు, మీ యిష్ట ప్రకారం చదువుదురు గాని. అందుకు నేనెంత కష్టపడాల్సి వచ్చినా పడతాను, పదమ్మా లోపలికెళ్దాం'' అంటూ లోపలికి తీసుకెళ్ళారు.

(సశేషం)

Printed and Published by A. Chandra Seker Rao at 5-8-88, Public Garden Road Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor : A. SUDHAKARA RAO



# ప్రేమవాహిని

తండ్రి ప్రియమైన జ్ఞాపకాలు, ఆయన ఆదరణ, ఆప్యాయతల మధ్య శ్యామూ తనూ గడిపిన మధురమైన బాల్యం జ్ఞాపకం వచ్చి మధు కళ్లవెంట అవిరళంగా కన్నీళ్ళు కారిపోతున్నాయి. అలాంటి మధురస్మృతులెన్నో, ఎన్నెన్నో కోరికలు ఒక్కటీ తీరలేదు, తీర్చడానికి తండ్రీ మిగల్లేదు.

ఇక తనకు మిగిలిన ఒకే ఒక ఆశా జ్యోతి శ్యాం. వాడిని తండ్రి కోరిక ప్రకారం పైలట్ ఆఫీసర్‌ను చేయ గలిగితే... ఆ తర్వాత తనేమైపోయినా బాధలేదు. ఆలోచనలతో టైమెంత గడి చిందీ చూడలేదు. అప్పుడే చుట్టూ చీకటి ముసురుకోబోతోంది. అయిదుగంటలు దాటినట్లుంది.

శ్యాం యింకా రాలేదేమా ? అని చూస్తూ, ముఖం తుడుచుకొని వీధివాకిట్లో నిలబడింది. ప్రక్కింటి మనోహర్ వచ్చేడు. బయట పిల్లలతో చేరి ఆడుతున్నాడు... "ఒరే మనూ ! శ్యాం కనిపించాడా ?" అని అడిగింది మధు.

"లేదక్కా, నేను చూడలేదు. అంతా వెళ్ళిపోయారే యిళ్ళకు" అన్నాడు. వాడి ప్రక్కనే వున్న రాజేంద్ర "అక్కా! వాడు స్కూల్‌నుంచి గంగానదివైపు వెళుతుంటే చూశా. ఇంటికి రావురా అంటే, తర్వాత వస్తాను నువ్వెళ్ళరా

అన్నాడు" అంటూ మళ్ళీ వాడు తన ఆటలో మునిగిపోయాడు.

'పరీక్షలు అయిపోయినవనే వుత్సాహంతో పిల్లలంతా కలసి నదీతీరానికి వెళ్ళారేమో' అనుకొని లోపలికొచ్చి అన్నం వండి, అంతక్రితం రోజు తమ దొడ్లో కాసిన సొరకాయ తీసుకొచ్చి "అక్కా, ఇవ్వాళ కూర, రేపు పులుసు." అంటూ క్రితం రోజు శ్యాం అందించిన సొరకాయ జ్ఞాపకం వచ్చి, సొరకాయ చెక్కుతీసి ముక్కలు కోసి, పులుసు పెట్టింది. ప్రొద్దుగూకింది బాగా. ఇంకా శ్యాం జాడ లేదు. మళ్ళీ వీధిలోకొచ్చింది మధు. ఆ దారిన పోయేవాళ్ళందరినీ అడిగింది. ఎవర్నడిగినా "మేం చూడ లేదు" అంటున్నారు.

క్రితం రోజునుంచీ వాడొకమాదిరిగా వుండటం, మధ్యాహ్నం తనని రెండు చేతుల్తో చుట్టేసి ఏడవడం అన్నీ గుర్తొచ్చాయి. రాజా చెప్పినట్లు వాడు గంగాతీరానికి వొంటరిగా పోలేదు కదా! పరీక్ష సరిగ్గా వ్రాయక తనేమైనా అంటుందని భయపడ్డాడేమో! కొంపదీసి ఏ అఘాయిత్యమన్నా చేయడుకదా ?' ఆ ఊహరాగానే మధు నవనాడులూ కృంగిపోయాయి. భయంతో వళ్ళంతా కంపించింది. తలుపులైనా మూయకుండా భయంగా చంద్రం యింటివైపు పరుగెత్తింది.

ధాన్యం బస్తాల కానుకొని 'కూర్చొని తీరిగ్గా లెఖ్ఖలు వేసుకుంటున్నాడు చంద్రం. పరుగెత్తుకుంటూ, తలుపు త్రోసుకొని లోపలికొచ్చిన మధును చూసి,

"ఏవిటి మధూ ?" అన్నాడు ఆదుర్దాగా లేస్తూ.

"బావా ! ... శ్యాం ... శ్యాం కనిపించడంలేదు బావా !" అని అంతక్రితం రోజునుంచీ అప్పటివరకూ జరిగినదంతా వివరించింది. మౌనంగా విన్న చంద్రం చెప్పులేసుకుంటూ "నువ్వింటికి వెళ్ళు మధూ! నేను చూస్తాను. ఒకవేళ యీపాటికి యింటికి వచ్చాడేమో !" అంటూనే హడావుడిగా బయలుదేరాడు.

మధుతో అనలేదుగానీ చంద్రానికి మనసులో భయంగానే వుంది. యిలాంటి కథలెన్నో విన్నాడు. పరీక్షపోయిందని తెలిసి ఆత్మహత్య చేసుకునే పిల్లలెందరో ? వీడేమిటి ? పరీక్షవ్రాయగానే కనిపించకుండా పోయాడేవిటి? పరీక్ష ఫలితం వాడి వూహకు ముందుగానే అందిందేమో ! ఒకవేళ ఏ ఫ్రెండ్స్‌తోనైనా కలిసి ఆడుకుంటున్నాడేమో ! మధు ఖంగారుపడి అనవసరంగా నన్ను ఖంగారుపెడుతోంది" అనుకుంటూ ముందుకు నడుస్తున్న చంద్రం, తనను అనుసరించి వస్తున్న మధుని చూసి,

"మధూ ! నువ్వింటికెళ్ళమ్మా! నేను తీసుకొస్తాను. వాడు నిజంగానే పరీక్ష సరిగ్గా వ్రాసి వుండకపోతే నిన్ను చూసి నువ్వు కోప్పడతావని భయపడొచ్చు.

నేను బుజ్జగించి తీసుకొస్తాను. నువ్వు పద" అని గంగాతీరం వైపు అడుగులు వేశాడు. దారిలో కనిపించిన రాజేంద్రను తీసుకొని వాడు చెప్పినవైపుగా వెళ్ళి నదీతీరమంతా గాలించారు. బ్యాటరీ సాయంతో మావిడితోటంతా వెదికారు. బస్సుస్టాండ్ దగ్గర, స్కూల్‌దగ్గర, పిల్లలు సాధారణంగా ఆడుకునే అన్ని ప్రదేశాల్లోనూ గాలించారు.

"ఇటు వెళుతుంటేనే చూశాను మావయ్యా! ఒక్కడే వెళ్ళాడు," అంటూ బిక్కముఖం వేసిన రాజేంద్ర భుజం తడుతూ వాడిని వాళ్ళింటిదగ్గర వదిలేసి తను నెమ్మదిగా నడుస్తూ మధు యింటికి చేరుకున్నాడు. ధారాపాతంగా కారుతున్న కన్నీళ్ళతో శోకదేవతలా అరుగుమీద కూర్చొని వున్న మధు చంద్రాన్ని చూడగానే పరుగెత్తుకుంటూ ఎదురొచ్చింది. చంద్రం వెనక దాక్కున్నాడేమో నని చంద్రాన్ని దాటి ముందుకు పరుగెత్తి, నిరాశగా వెనుదిరిగి చంద్రాన్ని చూసింది. ఆ చూపులో కదలాడిన భావానికి చలించి పోయిన చంద్రం నెమ్మదిగా—

"ఎక్కడా కనిపించలేదు మధూ! అంతా వెదికి చూశాను. వాడి ఫ్రెండ్సందరినీ అడిగి చూశాను," అంటూండగానే హృదయం బ్రద్ధలయ్యేలా ఏడుస్తూ—

# ఏప్రిల్ నెల క్విజ్

## సమాధానాలు

1 — బి 2 — సి 3 — సి

4 — ఎ 5 — ఎ

6. హిక్కీస్ కలకత్తా గెజిట్ 7. క్వినైన్ 8 లౌడ్

9 అనంతపూర్ 10. నాసిక్.

ఆల్ కరెక్టుగా పంపిన కిందివారికి ఒక్కొక్కరికి రూ 16-57 చొప్పున బహుమతి సొమ్ము పంచడం జరిగింది.

1. వి. నారాయణమూర్తి, కడప 2. కె. ఎం. నటరాజన్, సికింద్రాబాద్ 3. కె. ఇందిర, హైదరాబాద్ 4. కె. జ్యోతి, హైదరాబాద్ 5. కె. సాంబశివ నాయుడు, వెలమవారిపల్లె 6. కాలెపు నమశ్శివయ్య, రాజమండ్రి 7. ఎస్. వి. చలమారెడ్డి, పులివెందల.

"లేదు... లేదు. అలా జరగటానికి వీల్లేదు. వాడు నాకు దూరమవడానికి వీల్లేదు. వాడూ దూరమైతే యింక నా బ్రతుక్కి అర్థమేముంది? నేను వెళ్ళి వెదుకుతాను. నువ్వు సరిగా చూసి వుండవు వాడు గంగాతీరానే వుండి వుంటాడు," అంటూ ఆ చీకట్లో గంగా తీరంవైపు పరుగెడుతున్న మధును ఆపాలని చంద్రం చేసిన ప్రయత్నం ఫలించలేదు. గుండె లవిసేలా ఏడుస్తూ పరుగెడుతోంది. అప్పటికే రాజాద్వారా విషయం విన్న చాలామంది మధు ఏడుపు విని బయటకు వచ్చారు.

"శ్యాం గంగానదిలో పడి చచ్చిపోయాడట!" అనే వార్త అప్పటి కప్పుడే వూరంతా వ్యాపించింది! "మధు కూడా గంగాతీరానికి పరుగెడుతోందట చచ్చిపోవాలని" అనే వార్త క్షణాలమీద పాకిపోయింది వూరంతా.

జరిగిందొకటైతే ఆ వార్త అంచె లంచెలుగా పాకి ఆ వార్తకు మరో విరుద్ధమైన రూపాన్ని ఆపాదించే ప్రచారం చేసే ప్రబుద్ధుల ప్రచార ఫలితంగా ఆ వార్త అలా రూపు దిద్దుకుంది. వాళ్ళు విన్నది నిజమే ననిపించే ట్లుగా వుంది. ముందు మధు, వెనక చంద్రం గంగాతీరం వైపు పరుగెట్టడం చూస్తే...మరికొంతమంది చంద్రాన్ని నుసరించారు, మధు ఏ అఘాయిత్యం చేయకుండా ఆపాలని.

మధు తీరానికి చేరుకొని అంతా వెదుకుతూ "శ్యాం ... శ్యాం...బాబూ శ్యాం, ఒరేయ్ నిన్నేమీ అననురా ... వచ్చేయరా ... శ్యాం నువ్వు రాకపోతే నీ కళ్ళ ముందే ఈ గంగలో దూకు తాను ..." అంటూ ఏడుస్తూ, హృదయ విదారకంగా శ్యాం...శ్యాం...అంటూ చుట్టుప్రక్కల మారు మ్రోగేట్లు పిలుస్తోంది. ఎదురుగా నిండుగా పారే గంగమ్మతల్లి ఎలాంటి బదులూ ఇవ్వ లేదు. మధుకు ప్రక్కనే వున్న సరుగుడు చెట్లు ఏవో శబ్దాలు చేశాయి. మావిడాకులు గలగల మన్నాయి. మళ్ళీ ఆశగా అటు పరుగెత్తి "శ్యాం...శ్యాం తమ్ముడూ" అని పిలిస్తూ అక్కడేం బదులు దొరక్క నిరాశగా మళ్ళీ తీరానికి వచ్చింది. అప్పటికే అక్కడికి చేరి మధు పిలుస్తుంటే మౌనం వహించిన చంద్రం,

"మధూ నా మాట విను. వాడెక్కడో దాక్కొని వుంటాడు. రేపటికల్లా కన్పిస్తాడు. పద యింటి కెళదాం" అని చేతులు పట్టుకొని బ్రతిమాలాడు.

"లేదు బావా! నాకు తెలుసు. వాడింక నాకు కనిపించడు. మిగిలిన ఆ ఒక్కడూ గంగమ్మ ఒళ్ళో తలదాచుకున్నాడు. నువ్వెళ్ళు. నేను రాను - వాడొచ్చేంత వరకూ యిలాగే పిలుస్తాను. రాకపోతే నేనూ ఆ గంగమ్మతల్లి చల్లటి కడుపు లోకి వెళ్ళిపోతాను. అంతేగాని వాడు

లేకుండా నేను మళ్ళీ గంగాపూర్‌లోకి రాలేను బావా!" అంటూ ఏడవటం మొదలెట్టింది

చంద్రాన్ని అనుసరించి వచ్చిన వాళ్ళంతా ఎన్నో రకాలుగా చెప్పి చూశారు. మధు వినలేదు ఆ యిసుకలో పడి హృదయం పగిలిపోయేలా కుమిలి కుమిలి ఏడుస్తోంది. శ్యాం...శ్యాం... అని స్వరపేటిక తెగిపోయేలా ఆక్రోశిస్తోంది. ఎవరి మాటా వినడంలేదు. చంద్రం మధు దగ్గర మోకాళ్ళమీద కూర్చొని "మధూ! నా మాట వినమ్మా! వాడు రేపటికి తప్పకుండా తిరిగివస్తాడు. యింటికెళ్దాం రామ్మా!" అంటూ గడ్డం పట్టుకొని బ్రతిమాలుతున్న చంద్రం చేతుల్ని ఒక్కసారిగా విదుల్చుకొని లేచి దూరంగా పరుగెత్తి ఎత్తుగా ఉన్న వొడ్డును చేరింది. లేచి మధును అనుసరించబోయిన చంద్రాన్ని చూసి పెద్దగా ఏడుస్తూ బావా! అక్కడే ఆగిపో బావా! నా గాలి సోకితేనే నా అనుకునేవాళ్ళంతా దూరమయిపోతున్నారు. నేను నష్ట జాతకురాలిని బావా! నా దగ్గరకు రాకు, నువ్వూ మసైపోతావు. నా నీడ కూడా ఎవరిమీదా పడకూడదు. నా మాట కాదని నువ్వు నా దగ్గరకు వచ్చావంటే నేను గంగానదిలోకి వురుకుతాను. నా దగ్గరకు రాకు బావా!

"నాకు మిగిలినఒక్కరక్తసంబంధం ఈ రోజుతో పోయాడు. ఆత్మీయుడవైన నిన్ను పోగొట్టుకోడానికి సిద్ధంగా లేను బావా! నన్ను వదిలెయ్! నువ్వెళ్ళిపో. మీరంతా వెళ్ళిపోండి."

"నా మాట విను మధూ!" అని దీనంగా అర్థిస్తున్న చంద్రాన్ని మరోసారి హెచ్చరించింది, నువ్వు నా దగ్గరకు వస్తే నేను గంగానదిలో దూకుతానని ఏడుస్తున్న మధుని నిస్సహాయంగా చూస్తూ దూరంగా నిలబడ్డాడు చంద్రం. వచ్చినవాళ్ళలో ఎవ్వరూ అడుగు ముందుకు వేయడానికి సాహసించ లేదు. అలా అని మధునక్కడ ఒంటరిగా వదిలేసి వెళ్ళిపోవడానికి ఎవ్వరికీ మనసొప్పడంలేదు. గుండె లవిసిపోయేలా ఏడుస్తున్న మధునలాగే వదిలేస్తే ఏడ్చి ఏడ్చి పిచ్చిదైపోతుందేమోనని భయంగా వుంది చంద్రానికి ఇంకా శ్యాంని పిలుస్తోంది. ఎదురుగా వున్న మనుషులెవ్వరూ కన్పించడంలేదు. "శ్యాం ... ఒరే శ్యాం. ... వచ్చేయ్ నాన్నా!" అంటూ పిచ్చెత్తినదానిలా పిలుస్తూ ఏడుస్తోంది. చంద్రం కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి. కానీ కాళ్ళు భూమికి కట్టి పడవేసినట్లు నుంచున్న చోటునుంచీ కదల్లేక పోయాడు తను అడుగు ముందుకు వేస్తే మధు నదిలో దూకే ప్రమాదముంది. మధు దీనావస్థ చూస్తున్న వాళ్ళందరికీ కళ్ళు చెమ్మగిల్లాయ్. దూరంగా నిలబడే బ్రతిమాలుతున్నాడు చంద్రం "మధూ! వచ్చేయమ్మా" అని.

అసలు అతని మాటలు మధుకు వినిపిస్తున్నట్లు లేదు. తన లోకంలో తనుండి ఏడుస్తోంది మధు.

ఇంతలో ఎక్కడినుంచి వచ్చాడో ఎలా వచ్చాడో మధు వెనగ్గా వచ్చి రెండు భుజాలూ గట్టిగా పట్టుకున్నాడు శేఖర్. ధైర్యంగా సంతోషంగా అడుగు ముందుకు వేశాడు చంద్రం శేఖర్‌ను కూడా రెండుచేతుల్తో విదిలించి పారే స్తోంది. ఏడుస్తోంది. ఆ ఏడుపు మాత్రం ఆపడంలేదు. వినేవారి కడుపు తరుక్కు-పోయేలా వుంది. ఏడుపు ఆపితే బావుండు నని వుంది. కానీ ఆపడంలేదు. వో చేత్తో శేఖర్‌ను విదిల్చి ముందుకు పరుగెత్తా లని ప్రయత్నిస్తోంది. శేఖర్ పట్టునుంచి విడిపించుకోడం మధుకు సాధ్యంకావడం లేదు. అయినా తప్పించుకుపోవ డానికి శతవిధాల ప్రయత్నిస్తోంది. శేఖర్ పిలుస్తున్నాడు.

"మధూ! మధూ! ఏవిటిది ? ఏడుపు ఆపు" అంటున్నాడు.

శేఖర్ అరుపులు,అంతకంటే పెద్దగా ఏడుస్తున్న మధు! ఏడుపు విచిత్రంగా చూస్తున్నారు జనం. మళ్ళీ మొదలెట్టింది మధు

"నేను నష్టజాతకురాల్ని, దుర దృష్టవంతురాల్ని, నన్ను ముట్టుకోకండి, దూరంగా పొండి. నా గాలి సోకనంత దూరంగా పోండి" అని అరుస్తూ, ఏడుస్తోంది. ఆ ఏడుపులో ఏవంటున్నదో కూడా అర్థంకాకుండా వుంది. శేఖర్ నుంచి తప్పించుకోవాలనే ప్రయత్నం కొనసాగుతూనే వుంది. శేఖర్ బలం

---

## గడువు పొడిగింపు

శ్రీ చక్రపాణి అవార్డులు–1978 కు చేరవలసిన నవలల, కథల ఆఖరు తేదీ మే 1, 1978 గా రచయితలూ, రచయిత్రులూ గమనించ ప్రార్థన. ఈ పొడిగింపును రచయితల, రచయిత్రుల అర్థింపుపై చేయడం జరిగింది.

సంపాదకుడు
యువ

ముందు మధుకు అది సాధ్యంకావడం లేదు. అయినా ప్రయత్నం మానకుండా పోరాడుతూనే వుంది. ఏడుస్తూనే వుంది. ఆ ఏడుపుకు అంతంలేదేమో ననిపిం చేంత భయంకరంగా ఏడుస్తోంది.

"మధూ! మధూ! నా మాట విను. ముందా ఏడుపు ఆపు" అని అరుస్తున్న శేఖర్‌కు కూడా అంత చల్లటిగాలిలోనూ ముచ్చెమటలు పోశాయి చమటతో బట్టలు తడిసిపోయాయి. జడ విడిపోయి మోకాళ్ళవరకు జారి చెదిరిన జుట్టుతో చెమటకు తడిసి చెదరిన కుంకుమతో, శేఖర్‌ను తప్పించుకొని ముందుకు దూకాలని ప్రయత్నంలో అలసిపోతుంది మధు. గొంతు జీరబోతోంది. యింకా ఏడుస్తూనే వుంది. ఒక్కసారి చెయ్యి చాచి మధు చెంప అదిరిపోయేలా ఒక్క దెబ్బ కొట్టాడు శేఖర్ ... అంతే ... అప్పటి వరకూ ఎవరి మాటా వినకుండా, పిచ్చి పట్టిన దానిలా ఏడుస్తూ అందర్నీ ఖంగారుపెడుతున్న మధు ఒక్కసారే ఏడుపు ఆపి తలెత్తి శేఖర్ వైపు చూసి ది. మసక వెన్నెల్లో మిలమిలా మెరుస్తున్న ఆ కళ్ళలో ఏ భావం కనిపించిందో ఒక్కసారిగా శేఖర్ హృద యంలో తలదాచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది.

మధు భుజాలచుట్టూ చేతులు వేసి దగ్గరకు తీసుకుంటూ తల, వీపు నిము రుతూ "వూరుకో - వూరుకో మధూ," అంటున్న శేఖర్ గొంతు అస్పష్టంగా వినిపించింది. మధు ఏడుపు వుధృతం తగ్గింది. వెనక్కి తిరిగి చూసిన చంద్రం, నోళ్ళు వెళ్ళబెట్టుకొని ఆ విచిత్రాన్ని వినోదంగా తిలకిస్తున్న వాళ్ళవైపు తిరిగి, "పదండి పోదాం" అంటూ ముందుకు అడుగు వేశాడు. అప్పుడే ఆ సీన్ వదలిపోవాలని వాళ్ళకు లేకపోయినా, ముందుకు వేగంగానడుస్తూన్నచంద్రాన్ని చచ్చినట్టు అనుసరించక తప్పలేదు.

అంతా వెళ్ళిపోయారు. శేఖర్ గుండెల్లో ఒదిగి వెక్కిళ్ళు ఆపుకోడానికి ప్రయత్నిస్తున్న మధును నెమ్మదిగా నడిపించుకుంటూ తీరంవైపు సాగి పోయాడు. కొంత దూరం వెళ్ళిన తర్వాత అక్కడ యిసుకలో కూర్చుంటూ మధును కూర్చోబెట్టి నెమ్మదిగా గడ్డం పైకెత్తి

"మధూ! నీకునేను ఏమీకానా?చెప్పు. నా కోసమైనా నువ్వు బ్రతికుండాలని ఎందుకనుకోలేదు? నువ్వు పోతే నేను సుఖంగా బ్రతికుండగల ననుకున్నావా? శ్యాం యిలా ఎందుకు చేశాడో నా కర్థం కావడంలేదు. తమ్ముడు కనిపించకుండా పోయాడంటే బాధ ఉండదని నేననను. కానీ మరీ పిచ్చెత్తిపోయేలా ఏడుస్తూ నదిలో దూకుతాననడం వెర్రితనం. క్షమించు మధూ! నా చేత్తో నిన్ను కొట్టాను. పువ్వులా చూసుకోవలసిన నిన్ను కర్కశంగా నా వేలిముద్రలు

పదేంత గట్టిగా కొట్టాను. ఆ క్షణంలో నిన్నుపడం నా తరం కాదనిపించింది. పాపం! నువ్వలా మోకాడికెత్తి ఏడుస్తుంటే చంద్రం ఎంత బాధపడి వుంటాడు? నేను రావడం మరో రెండు నిముషా లాలస్యమైవుంటే ఏమై వుండేది" అంటూ మృదువుగా మందలిస్తున్న శేఖర్ మాటలు వింటూ,

"నేనేం చేయను? నా కింక యీ ప్రపంచంతో పని లేదనిపించింది. ఆ క్షణంలో శ్యాం ఒక్కడు తప్ప నా కెవ్వరూ జ్ఞాపకం రాలేదు" అంటూ కన్నీళ్ళు కారుస్తున్న మధు కన్నీరు తుడుస్తూ "అలా ఎప్పుడూ అనుకోకు మధూ! నీ కోసం అనుక్షణం ఆరాటపడే హృదయముందని జ్ఞాపకం పెట్టుకో. అన్నయ్యలా ఆదరించే చంద్రం వున్నాడని గుర్తు తెచ్చుకో. నీకు నువ్వు వొంటరిదాన్నని అనుక్షణం అనుకుంటూ బాధపడవలసిన పని వుండదు. పద, ప్రొద్దుపోతోంది." మధుకు చెయ్యి ఆసరాగా యిచ్చి యింటివైపు అడుగులు వేయించాడు

చంద్రం వాళ్ళింటి ముందే నుంచొని ఎదురుచూస్తున్నాడు శేఖర్ ... చంద్రాన్ని, సుషమను వాకిట్లో చూడగానే "సుషమా! మధును యింట్లోకి తీసుకెళ్ళు" అని మధు భుజం పట్టుకొని ముందుకు తీసుకెళ్ళాడు శేఖర్. సుషమ మధు భుజాల చుట్టూ చేయివేసి, "రా మధూ!" అంటూ లోపలికి తీసుకెళ్ళింది. కళ్ళనిండా నీళ్ళతోనే సుషమ ననుసరించింది మధు


చంద్రం, శేఖర్‌లు మిగిలారు వాకిట్లో. "పద, నిన్ను యింటివరకూ పంపి వస్తాను" అంటూ శేఖర్ భుజాన చేయివేసి ముందుకు నడిచాడు చంద్రం. దారిలో ఎన్నో విషయాలు మాట్లాడా లనుకొన్న యిద్దరూ ఏమీ మాట్లాడుకో లేకపోయారు. మౌనంగా ముందుకు నడుస్తున్న వాళ్ళను వింతగా చూస్తున్నారు కొందరు ఇళ్ళముందు నుంచొని. శేఖర్ ఇల్లు రాగానే ఆగిపోయాడు చంద్రం. "శేఖర్! ఎన్నో మాట్లాడాలను కున్నాను. కానీ ఒక్కటీ గొంతుదాటి రావడంలేదు. మనం ఎన్ని రకాలుగా అనుకున్నా, ఈ రోజు సమయానికి నువ్వు రాకపోతే మధు మనకు దక్కేది కాదు. అంతమట్టుకు నిజం. ఏవిటో మాట్లాడబోయి మరేవిటో మాట్లాడు తున్నాను. ప్రొద్దుపోతుంది. వెళ్ళు, నాన్నగారు కోప్పడతారేమో!" అంటున్న చంద్రాన్ని అప్యాయంగా చూస్తూ "నాన్నగారు ఈరోజేవూరెళ్ళారు అమ్మ ఆదుర్దా పడుతుంటుంది. రామి పరుగెత్తుకుంటూ వచ్చి చెప్పకపోతే నాకు విషయం తెలిసేదికాదు. నేను యింట్లోనే వున్నా నివాళ. బయటకు రాలేదు. రామి చెప్పిన విషయం వినగానే ... క్షణం ఆలోచించకుండా, అమ్మ

పిలుస్తున్నా వినిపించుకోకుండా గంగా తీరానికి చేరాను. అటు రాగానే ఆ జనం, నీ వేడికోలు, మధు ఏడుపూ అటు ఎత్తుగావున్న వొడ్డు వైపు పరుగెత్తడం అన్నీ కనిపించాయి. మరో నిముషం నిలవకుండా వెనక్కి తిరిగి, సరుగుడు తోట మీదుగా ఆ వొడ్డుకు చేరుకున్నాను" అని తృప్తిగా అంటున్న శేఖర్ మాటలు పూర్తి కాకుండానే శ్యామలాదేవి బయటకు వచ్చి "చంద్రం మధు ..." అంటుండగానే "యింటికి తీసుకొచ్చాము అమ్మా! మా యింట్లోనే వుం——స్తా నమ్మా! వస్తారురా శేఖర్! సుషమ ఒక్కతే వుంది. అమ్మ కూడా లేదు యింట్లో మధు ఏ అఘాయిత్యానికి పాల్పడుతుందోనని భయంగా వుంది" అంటూ ముందుకు వెళుతున్న చంద్రాన్ని చూస్తూ "ఇక నీ కా భయంలేదు చంద్రం. మధు అలాంటి పిచ్చిపనులు చేయదు నేను బ్రతికుండగా" అనుకుంటూ, తల్లి ననుసరించి యింట్లోకి వెళ్ళిపోయాడు శేఖర్. హృదయం నిండిన ఆత్మవిశ్వాసంతో.

* * *

వారం రోజులకు గంగాపూర్ చేరిన రఘురామయ్యగారు, శ్యామలాదేవి ద్వారా కథంతా విని చిన్నగా నవ్వుకున్నారు.

"మధు యిప్పుడెక్కడ వుంది?" అని అడిగారు.



అంతటి అశుభవార్త విని నవ్వ గలుగుతున్న ఆయన అంతర్యమేమిటో అర్థంకాని శ్యామలాదేవి విసుగ్గా ఆయన వైపు చూసి,

"పాపం ! దానికి యింకెవరు మిగిలారు ? వాళ్ళ చంద్రం బావ యింట్లోనే వుంది. వాళ్ళ ఒక్కతే వుంటే తమ్ముడినీ, మావయ్యను, అత్తయ్యను తలుచుకొని దిగులుపడుతుందని సుషమ, చంద్రం వాళ్ళింట్లోనే వుంచారు," అన్నారు. మధును తలచుకొని సానుభూతిగా రామి ద్వారా గంగాతీరాన జరిగిన సంఘటనంతా విన్న తర్వాత మధుమీద అభిమానాన్ని మరింత పెంచుకున్నారు శ్యామలాదేవి. మధు అంటే ఆమె కెప్పుడూ యిష్టమే. కాకపోతే అంతస్థుకు తగదనే ఆలోచనతో మధును కోడలిగా చేసుకునేటందుకు అంతరంగం అంతగా అంగీకరించకపోయినా మధు మీద కావల్సినంత అభిమానం, సానుభూతి ఉన్నాయి. కొడుకు ఆరోగ్యం దెబ్బ తిన్నప్పుడే తప్పకుండా ఎలాగైనా రఘుపతిగారిని వొప్పించి మధును కోడలిగా చేసుకోవాలనుకునారు. ఒక్కగానొక్క కొడుకు ,వాడు అమితంగా కోరుకున్న మధును కాదనడానికి ఆమెకు మనసొప్పలేదు. ఇంతలో శ్యాం పోవడమనే అవాంతరం వచ్చిపడింది. రఘుపతిగారు వూళ్ళో లేకపోవడంవల్ల ఆ విషయాలు ఆయన ముందు సంప్రదించే అవకాశం కలగలేదు.

"మీరు వెళ్ళిన పనేమైంది? ఎందుకట అంత అర్జంటుగా రమ్మని కబురుచేశారు శ్రీధర్ గారు ?" అంది.

"ఆ ఏదో వాళ్ళ శిరీష్ విషయం మాట్లాడ్డానికి పిలిపించారులే. అసలు విషయం ఒక్కరోజులో తేలేది కాదు. ఇన్ని రోజులు పొద్దుపోవడం లేదట. నాలుగు రోజులు సరదాగా నాతో గడిచిపోతుందని పిలిపించాడు" అంటూ లోపలికెళుతున్న రఘుపతిగారి వంక విచిత్రంగా చూసింది శ్యామలాదేవి ఆమె యిన్నేళ్ళ కాపురంలో ఎప్పుడూ ఆయనలా ఒకరి కోసం కలకత్తా వెళ్ళి వాళ్ళతో సరదాగా నాలుగు రోజులు గడిపి వచ్చానని చెప్పగా వినడం యిదే మొదటిసారి

ఏమిటో ఎన్నాళ్ళైనా ఈ మనిషిని అర్థం చేసుకోలేక పోతున్నాను అనుకుంటూ చిన్నగా నిట్టూర్చి, వంటగదిలోకి వెళ్ళిపోయారు. వంటమనిషికి ఏమేం చేయాలో పురమాయించే పనిలో మునిగిపోయారు.

* * *

మరోవారం ఏ విశేషాలూ లేకుండానే గడిచిపోయాయి. మధు శ్యాంని తలుచుకొని రోజూ తనలో తానే కుమిలిపోతోంది. అయినా మధుకంట తడి పెట్టకుండా సాధ్యమైనంతవరకూ, ఏవేవో కబురు చెబుతూ సుషమ, చంద్రం; శేఖర్ వంతులు వేసుకొని కాలం దొర్లిస్తున్నారు. శేఖర్ తన సమ

క్షణంలో వున్నప్పుడు మధుకు తను అతని కోసమే బ్రతుకుతున్నాననే భావన కలిగేది. 'అంత ఆత్మీయంగా వున్న వ్యక్తి ఆ రోజు అంత గట్టిగా ఎలా కొట్ట గలిగాడా?' అని ఆశ్చర్యపోయేది అయితే ఆ చెంపదెబ్బే తనను స్పృహ లోకి తీసుకురాగలిగింది. తనకోసం ఆరాటపడే మరో హృదయముందని గుర్తుచేసింది. అందుకే ఆధారంగా నిలబడ్డ ఆ గుండెల్లో తల దూర్చి తన ఆవేదన్ని చెప్పుకోడానికి ప్రయత్నించింది." ఆలోచనలలో వున్న మధు శేఖర్ మాట వినిపించి లేచి నుంచొని గుమ్మంవైపు చూసింది అప్పుడే లోపలి కొస్తున్న శేఖర్-

"మధూ! చంద్రం ఎడీ! వాడి నెందుకో అర్జంటుగా రమ్మని చెప్పారు నాన్నగారు" అంటూండగానే, లోపలి నుంచి బయటకు వచ్చిన సుషమ, "ఎందుకన్నయ్యా? స్నానం చేస్తున్నారు. అయిపోయినట్లుంటే, పిలుస్తానుండు" అని వెనక్కి తిరగ్గానే-

"కానీయ్ సుషమా! ఫర్వాలేదులే మరీ అంత తొందరేం లేదు నువ్వెళ్ళి నాన్నగారు పిలుస్తున్నారట" అని చెప్పావా! అలాగే వచ్చేసినా వచ్చేస్తాడు వాడు. డ్రస్ చేసుకొని రానీ" అన్నాడు చిన్నగా నవ్వుతూ శేఖర్ నవ్వుతో శృతి కలిపింది సుషమ మధు తల వంచుకొని బొమ్మలా నుంచుంది దగ్గరగా వెళ్ళి కుర్చీలాక్కొని కూర్చుంటూ-

"నుంచున్నావేం మధూ! కూర్చో" అంటూ చేయిపట్టుకొని బల్లమీద కూర్చోబెట్టాడు

"కాఫీ తెస్తానన్నయ్యా! మీరు మాట్లాడుతూండండి" అంటూ లోపలి కెళ్ళింది సుషమ. ఇంతలో షర్ట్ వేసుకొని హాల్లోకి వస్తూ వంటగదిలోకి వెళుతున్న సుషమకు ఓ డాష్ యిచ్చి "అరెరే పడిపోతావ్" అంటూ ఆ వంకతో దగ్గరకు లాక్కోబోతున్న చంద్రాన్ని ఒక్క తోపు తోసి-

"అన్నయ్య వచ్చాడు" అంటూ చిన్నగా నవ్వుతూ లోపలికి పరుగెత్తింది సుషమ

అప్రయత్నంగా ఆ దృశ్యం చూసిన మధు శేఖర్‌లు చిన్నగా నవ్వుతూ తలలు వంచుకున్నారు.

"ఏంరా శేఖర్! పెళ్ళికొడుకులా తల వంచుకు కూర్చున్నావేమిటి?" అంటూ నవ్వుతూ ప్రక్కన కూర్చోబోతున్న చంద్రాన్ని.

"ఒరేయ్! చంద్రూ! నాన్నగారు నిన్నర్జంటుగా రమ్మని చెప్పమన్నార్రా. పద పద" అంటూ లేచిన శేఖర్‌ను చూసి, కాఫీ పట్టుకొస్తున్న సుషమ-

"ఆయనే కదన్నయ్యా రమ్మన్నది. నువ్వెందుకూ మళ్ళీ ఆయన వెళతారులే. నువ్వు కూర్చో కాసేపు కబుర్లు చెప్పు

కుందాం" అంటూ ముగ్గురికీ కాఫీ అందించి తనూ ఓ గ్లాసు తీసుకొని వచ్చి కూర్చుంది కాఫీ తాగి చంద్రం శేఖర్ గదివైపు వెళ్లిపోయాడు "నువ్వు కూర్చోరా" అని శేఖర్‌ను ఆపేసి

సుషమ, శిరీష్ అమెరికానుంచి వ్రాసిన లెటర్ తీసుకొచ్చి శేఖర్‌కు చూపించింది కొంతసేపు శిరీష్ గురించి, ఫ్లారెన్స్ గురించి మాటలతో కాలక్షేపం చేశారు "యిప్పుడు అన్నయ్య లెటర్స్ చాలా బాగా వ్రాస్తున్నాడన్నయ్యా" ఇండియాలో వున్నప్పుడు ఎంత బద్ధకించేవాడో నీకు తెలుసుగా. యిప్పుడు ప్రతి విషయం వివరంగా వ్రాస్తున్నాడు యిది అమెరికా వనిత ప్రభావమో, ఆ వాతావరణ మహాత్మ్యమో తెలీడంలేదు. కానీ నాకు చాలా సంతోషంగా వుంది," అంది సుషమ.

"పరాయిదేశం వెళ్ళాడు కదమ్మా! యిప్పుడు సహజంగానే అసలైన ఆత్మీయతలన్నీ బయటపడతాయి. నాకు కూడా అలాగే చాలా వివరంగా వ్రాస్తున్నాడు వాడి మనసులో వున్న ప్రేమాభిమానాలు, పరాయిదేశం వెళ్ళాక గానీ పొంగి ప్రవహించలేదన్నమాట."

"ఈ మధ్య డాడీ లెటర్స్ వ్రాయడం తగ్గించారు ఆరోగ్యమెలావుందో ఏమో! ఒంటరిగా వున్నారు" అంటోన్న సుషమ గొంతు వణికించడం గమనించి-

"ఈ మధ్య అంకుల్‌కూ నాన్నగారికీ మంచి దోస్తీ అయిందిలే. ఆ వయసులో ఫ్రెండ్స్ దొరికితే యింకెవ్వరూ కనిపించరు. మొన్నీమధ్య ప్రత్యేకంగా కలకత్తా వెళ్ళి నాన్నగారు, కలకత్తాలో వారంరోజులు వుండగలిగారంటే చాలా ఆశ్చర్యకరమైన విషయమే నాన్నగారికి నిన్న అంకుల్ దగ్గరనుంచి లెటర్ వచ్చినట్లుంది 'శ్రీధర్‌కు యింక కొడుకును గురించిన బెంగ తీరిపోయిందిలే' అని అమ్మతో అంటున్నారు. బహుశా శిరీష్ త్వరలో వస్తానని వ్రాసి వుంటాడు అందుకే ఆ సంతోషంలో తాత్కాలికంగా కూతురికి లెటర్ వ్రాయడం మర్చిపోయివుంటారు పోనీ నువ్వే వ్రాయకపోయావా?" అన్నాడు శేఖర్.

"ఇవ్వాళే వ్రాస్తానన్నయ్యా!" అంది సుషమ వాళ్ళ మాటలు వింటూ కూర్చుంది మధు కొంచెం సేపు శేఖర్‌తో ఏవో కబుర్లు చెబుతూ కూర్చొని "మీరు మాట్లాడుతూ వుండండన్నయ్యా! లోపల కొంచెం పనుంది మధూ! మరీ అలా మూగలా కూర్చోకు. మా అన్నయ్య బోర్ కొట్టి పారిపోతాడు" అంటూ మధుకి కొంచెం మొహం ఎర్రబారేలా సమస్యగా పరిస్థితిని చెప్పి, ఏదో వివరాలు చూస్తూ చిరునవ్వు నవ్వుకుంటూ లోపలికెళ్ళిపోయింది సుషమ.

మధు, శేఖర్ వొంటరిగా మిగిలారు మళ్ళీ మధు తలవంచుకుని చేతిలోని పుస్తకంపైపు దృష్టి సారించింది చిన్నగా నవ్వుతూ ఆ పుస్తకం తన

చేతుల్లోకి తీసుకున్నాడు శేఖర్. అప్పటికీ తల ఎత్తకుండా కూర్చున్న మధు వైపు ఓ క్షణం చూసి, "మరి నే వెళ్లొస్తాను" అంటూ చిరుకోపంతో లేచి నుంచున్నాడు.

అప్రయత్నంగా శేఖర్ చేయి పట్టుకొని అంతలోనే వదిలేసింది మధు. కానీ పెదవి కదపలేదు. నవ్వుతూ మళ్ళీ కూర్చున్నాడు శేఖర్.

"మధూ! ఇంకా సంకోచమేనా? యింకా ఆలోచిస్తున్నావా? నవ్వు మాట్లాడకుండా అలా వుంటే నేనెలా కూర్చోను?" అంటుంటే నెమ్మదిగా కళ్ళెత్తి శేఖర్ వైపు చూసి—

"ఏం మాట్లాడను? జీవితాశ నశించిన నన్ను 'నా కోసం జీవించు మధూ!' అని బ్రతికించారు. అయినా ఎప్పుడూ ఏవేవో ఆలోచనలతో నా మనసు నా స్వాధీనంలో వుండటంలేదు. ఎంత వద్దనుకున్నా శ్యాం జ్ఞాపకాలు..." అంటున్న మధు కళ్ళనిండుగా నీళ్ళునిలిచి చెంపల మీదుగా జారిపోయాయి.

"ఛ! ఛ! ఏవిటిది మధూ! నా ముందెన్నడూ కంట తడిపెట్టనని అన్నమాట మర్చిపోయావా? కళ్ళు తుడుచుకో. నీకు మనశ్శాంతిగా వుండటానికి నేనూ, చంద్రం కలిసి ఓ ప్రోగ్రాం వేశాం?" 'ఏవిటది?' అన్నట్లు కళ్ళెత్తి చూసింది మధు కళ్ళు తుడుచుకుంటూ.



"అదేమిటంటే... నువ్వు యింతకు ముందు ప్రారంభించిన ఆ కిండర్‌గార్టన్ స్కూల్ మళ్ళీ ఓపెన్ చేయబోతున్నాం. అయితే ఈసారి పిల్లలు మట్టుకే కాదు సాయంత్రాలు పెద్దలు కూడా వచ్చి చదువు నేర్చుకుంటారు ఇంతగా అన్ని విధాలా అభివృద్ధిని సాధించిన మన దేశంలో వయోజన విద్య ఎంత అవసర మన్నది మన గంగాపూర్ జనానికింకా అంతుబట్టటం లేదు ఒక్కో పల్లెటూరు ఎంతో అభివృద్ధి చెందిందో వీళ్ళకింకా తెలీదు

"నాకు ఎన్నాళ్లుగానో ఈ కోరిక వుంది. ప్రకృతి సంపదకు ఆలవాలమైన మన గంగాపూర్‌ను మనకు చాతనైనంతగా అభివృద్ధిపరచాలనీ, ఈ అమాయక పల్లె ప్రజలకు బస్తీలమీద వుండే వ్యామోహాన్ని పోగొట్టాలనీ సాధ్యమైనన్ని వసతులు కల్పించి, పల్లెలు పట్టణాల కేవిషయంలోనూ తీసిపోవని ఋజువు చేయాలనే నా కోరికకు, నిన్ననే నేనూ చంద్రం కూర్చొని ఓ ప్రణాళిక తయారుచేశాం. ఓ రూపకల్పన చేశాం. మనకు తోడు సుషమ, చంద్రం వున్నారు మధూ! ఎవరికి టైమున్న పుడు వాళ్ళం ఈ అభివృద్ధి కార్యక్రమంలో ఓ చెయ్యివేసి ముందుకు నడిపిద్దాం.

ఉదయం నువ్వూ, సుషమా, పిల్లల క్లాసులు నడపండి. సాయంత్రం నేనూ, చంద్రం పెద్దవాళ్ళను కూర్చోబెట్టి, వాళ్ళకు తెలీని విషయాలు తెలియ జెప్పతూ, ప్రతి ఒక్కరూ కనీసం పేపర్ చదవగలిగేంత జ్ఞానమైనా సంపాదించగలిగేటట్లు చేయడం మన విధిగా, కర్తవ్యంగా నిర్వహిద్దాం. ఇందులో కష్టనష్టాలు సహజం ఒకళ్ళ కొకళ్లు తోడుగా వాటిని తట్టుకొని నిల బడదాం. కొన్ని వ్యతిరేక శక్తులు మన ప్రయత్నాలను ఆటంకపరచవచ్చు. మనం మన ధ్యేయం సాధించడానికి కావలసిన ఆత్మస్థైర్యంతో, దీక్షతో వుంటే చాలు ఏమంటావ్ మధూ ?" అంటూ ఆవేశంగా అడుగుతున్న శేఖర్ వైపు మెరిసేకళ్ళతో చూస్తూ తన అభి నందనలు కళ్ళతోనే కురిపిస్తూ—

"అలాగే ! మీరు చేసే ప్రతి మంచి పనికి నా సహకారం ఎప్పుడూ వుంటుంది మీ నీడలా మిమ్మల్ని అనుసరిస్తాను. మీరేం చెబితే అది చేయ డానికి సిద్ధంగా వున్నాను." మెల్లగా దృఢంగా చెబుతున్న మధువైపు తృప్తిగా చూశాడు శేఖర్. అంతకంటే ఆతనికి కావలసిందేముంది ?

మరో వారానికి శేఖర్ అనుకున్న కార్యక్రమం ఆరంభమైంది. మొదట ఓ నాలుగు రోజులు పెద్దవాళ్ళను వచ్చి చదువుకోమంటే సిగ్గుపడ్డారు కొందరు విరక్తిగా మాట్లాడారు, యిప్పుడేం చదువని ? అయినా అందరికీ చదువు

ప్రయోజనాల్ని చెబుతూ శేఖర్, చంద్రం చాలా శ్రమపడ్డారు.

చెప్పేది చంద్రం, శేఖర్ కనుక వాళ్ళ మాటను కాదనలేక కొందరు వచ్చి కూర్చుంటే, నలుగురూ వెళుతున్నారు కదా మన మెళితే ఏవుంది! ఏం చెబుతారో చూద్దామనే వుత్సాహంతో మరికొందరు చేరారు.

రోజు రోజుకూ వచ్చే పెద్దవాళ్ళ సంఖ్య ఎక్కువ కావడంతో శేఖర్‌లో వుత్సాహం వురకలు వేసింది. మధు కూడా యిప్పుడు ముందుకొచ్చి వుత్సాహంగా చిన్నపిల్లల్లా బుద్ధిగా కూర్చొని పాఠాలు నేర్చుకుంటున్న పెద్దవాళ్ళను ఆత్మీయంగా చూస్తూ, వాళ్ళకు తెలీనివి "అలా కాదు బాబాయ్! యిలా కాదు మావయ్యా!" అంటూ చిన్నగా నవ్వుతూ వాళ్ళ చేత అక్షరాలు దిద్దిస్తుంటే అలౌకికమైన ఆనందం కలిగేది. ఓ పక్క మళ్ళీ ప్రారంభించిన మధు, సుషమల స్కూలుకు పిల్లలు బాగానే హాజరవుతున్నారు. ఇంతకు ముందనుకున్న న్నీ మరిచిపోయి పిల్లల్ని పంపుతున్నారు.

"మాకు మీరేమీ యివ్వక్కర లేదు. మాకు ఖాళీగా వున్న టైమ్‌లో చదువు చెబుతాం." అనేసరికి ఆ వూరి మీదా ఓ మంచి అభిప్రాయం ఏర్పడింది. అందరికీ సుషమా మధు శ్రద్ధగా పాఠాలు చెబుతున్నారు.

మరో రెండు మూడు నెలలు గడిచే సరికి శేఖర్ పెట్టిన పిటిషన్ ఫలితంగా గంగాపూర్‌లో చక్కటి రోడ్లు వేసే కార్యక్రమం ఆరంభమైంది. శేఖర్ శ్రమ ఫలించి గంగాపూర్ గ్రామంలో హాస్పిటల్ నిర్మాణానికి గవర్నమెంట్ కొంత లోన్ యివ్వడానికి అంగీకరించింది. చుట్టుప్రక్కల రెండు మూడు మైళ్ళ దూరంలో వున్న రాంపూర్ లాంటి గ్రామాలకు చక్కటి రోడ్లు పడ్డాయి. ఎలక్ట్రిక్ దీపాలు వెలిశాయి. నామకహాగా వున్న బస్సుస్టాండ్, రూపం దిద్దుకుంది, షెడ్లతో.

అంత క్రితం ప్రతి చిన్న విషయానికీ పార్టీలు, కక్షలూ, వైషమ్యాలు పెంచుకునే అందరూ గ్రామాభివృద్ధి కార్యక్రమంలో చేతులు కలిపి పనిచేశారు శేఖర్ మీద వున్న విశ్వాసంతో. ప్రతి చిన్న పనికీ కలకత్తా పరుగెట్టవలసిన పని లేకుండా కొత్తగా కోఆపరేటివ్ స్టోర్స్ ఒకటి వెలిసింది. అన్ని వసతులూ అందాల బృందావనం లాంటి పల్లెలో వుండే, నిరంతరం, పరిశ్రముల ఫలితంగా నిండి వుండే పొగతో, విపరీతమైన జనాభాతో, సరైన నీడా తిండీ దొరకని, అనుక్షణం ఆకలి బాధలతో, యాక్సిడెంట్లతో మునిగి వుండే రణగొణ ధ్వనులతో హోరెత్తించే పట్నం వెళ్ళాలని ఎవరు కోరుకుంటారు?

(సశేషం)

Printed and Published by A. Chandra Seker Rao at 5-9-88, Public Garden Road Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor : A. SUDHAKARA RAO




మధు, సుషమ, చంద్రం ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో అమితోత్సాహంతో పాల్గొని, అన్ని విధాలా శేఖర్‌కు అండగా నిలిచారు.

శేఖర్ చదువుకు కలకత్తా వెళ్ళిన కొత్తలో అనుకునేవాడు. "పల్లె ప్రజలంతా కలకత్తామీద యింత మోజు చూపుతా రెందుకు? పట్నం, పట్నం అని పడి చస్తారెందుకు? ఏముందిక్కడ? క్షణం విశ్రాంతిలేని జీవితాలు. మెకానికల్‌గా మారిపోయిన మనుషులు ఆప్యాయమైన పిలుపులకు, ఆదరణకు, ముఖంవాచి నట్లుండే పిల్లలు. ప్రొద్దున తాము లేవక ముందు వురుకులు పరుగులతో, ఆఫీసులకు పరుగెత్తిన తండ్రి, మళ్ళీ రాత్రి పిల్లలు నిద్రపోయాక యింటికి చేరే తండ్రిని, ఆ పిల్లలు కొన్ని రోజుల తరబడి చూసే అవకాశం వుండదు. అదే తమ గంగాపూర్ ఎంత బావుంటుంది? ఒకళ్ళమీద ఒకళ్ళకు విపరీతమైన ప్రేమలు. ఆపేక్షలు. గ్రామంలో ప్రతి ఒక్కరూ మరొకర్ని ఏదో వరసతో తప్ప వేరే విధంగా పిలవగా తను చూడలేదు. అంతా ఒకే కుటుంబంలోని సభ్యులేమో అని పరాయివాళ్ళు అనుకునేంత ఆపేక్షగా పిలుచుకుంటారు. ఈ కలకత్తాలో వున్న కొన్ని వసతులు మాత్రం గంగాపూర్‌లో వుండే గ్రామాలు పట్టణాలకు ఏ విధంగానూ తీసిపోవని నిరూపించవచ్చు." అలా అనుకొని గంగాపూర్ అభివృద్ధి కార్యక్రమాలను గురించి కలలు కనేవాడు. ఆ కలలు కొంతవరకూ సమిష్టి

వ్యవసాయం ద్వారా ఫలించి తమ గ్రామానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు రావడంతో శేఖర్ కన్న మిగతా కలలు సాకారంగా నిలవడానికి ఎక్కువ టైమ్ పట్టలేదు. అందుకు మధు తోడ్పాటు ఎంతో వుంది ఏదో ఓ పని చేస్తూ తనని తాను మర్చిపోయేది మధు.

చంద్రం, శేఖర్‌లు పగలంతా పొలం పనులు. ఏకాస్త టైమ్ దొరికినా గ్రామాభివృద్ధిని గురించిన చర్చలతో, కొత్త ప్రణాళికలతో, అవి ఫలించే ఏర్పాట్లలో మునిగిపోయేవారు. మధు మనస్ఫూర్తిగా ఆ కార్యక్రమాల్లో మునిగి చాలావరకూ విషాదమైన గతాల్ని మర్చిపోయిందనే చెప్పవచ్చు. అంతగా ఏకాగ్రతతో కృషి చేసి పిల్లలకే కాకుండా పెద్దవాళ్లకు కూడా ప్రీతిపాత్రురాలైంది. చెవిగా చెప్పుకున్న నోళ్ళే, మళ్ళీ మధు గురించి ఎంతో గొప్పగా చెప్పుకుంటున్నాయి.

* * *

ఓ రోజు, శ్యాం పోయిన సంవత్సరం న్నర దాదాపు గడిచిన తర్వాత... రఘుపతిరావుగారు చంద్రాన్ని పిలిపించి మధు శేఖర్‌ల వివాహం గురించి మాట్లాడారు. సంతోషంగా విన్న చంద్రం నాన్నగారి ఔన్నత్యానికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకొని, వురుకులు పరుగులతో శేఖర్ దగ్గరకు వెళ్ళి, "ఒరేయ్ శేఖర్! అత్యంత శుభవార్త! శ్రీమాన్ రావుబహద్దూర్ రఘుపతిరావు గారు... నీకూ, మధుకూ వివాహం చేయాలనుకుంటున్నార్రా! బహూశా యిప్పుడు మధు నీ మాట కాదనదు. నీ కలలు ఫలించబోతున్నాయిరా!

గంగాపూర్ అభివృద్ధి అంటూ మొద లెట్టి, ఆ అభివృద్ధితోపాటు మధును మానసికంగా గట్టిపడేశావు. యిప్పుడు పాతవిషయాల్ని గురించి ఆలోచించ డానికి మధుకు టైముండటంలేదు. ఇంత త్వరలో అన్నీ మరచిపోయి మధు యింత ధైర్యంగా నిలబడిందంటే ఆ క్రెడిటంతా నీదేరా!" అంటూ తట్టుకోలేని ఆనందంతో అభినందిస్తూ "అంతే కాదురా! ఈ సంవత్సర కాలంలో నాన్నగారి పరీక్షల్లో కూడా నెగ్గి కాబోయే కోడలయ్యే అర్హత సంపాదించిందంటే మధు నిజంగా అదృష్టవంతురాలు" అని తృప్తిగా అంటున్న చంద్రం చేయి పట్టుకొని ఆప్యాయంగా నొక్కుతూ —

"ఈ విషయం యిప్పుడే మధుకు చెప్పకు. నెమ్మదిగా నేనే అడుగుతాను," అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"సరేలేరా! ఆ శుభవార్తేదో నీ నోటితో నువ్వే చెప్పుకో, మధ్య నేనెందుకు చెప్పడం? పోనీ సుషమతోనైనా చెప్ప వచ్చా? అదీ కూడదా?" అన్నాడు చిలిపిగా నవ్వుతూ.

"సుషమతో చెప్పవే...నేను వద్దంటే మట్టుకు నువ్వూరు

కోగలవా ?" అంటూ వుత్సాహంగా యింటివైపు బయలుదేరాడు శేఖర్.

సుషమ చంద్రం ద్వారా వార్త వినగానే "ముందు డాడీకీ, అన్నయ్యకూ వుత్తరాలు వ్రాస్తాను. అన్నయ్య వచ్చే టైమ్ కూడా దగ్గరికి వచ్చింది కనుక వాడొచ్చే టైమ్‌కు ముహూర్తాలు పెట్టించుకోమని శేఖరన్నయ్యతో చెప్పాలి. అంతా వుంటే సరదాగా వుంటుంది," అంటూ చిన్నపిల్లలా సంతోషంగా గంతులు వేస్తూ, "మధు ఏదీ ? మధూ !" అంటూ ముందుకు వెళ్ళబోతున్న సుషమ చేయి పట్టుకొని చంద్రం లాగిన విసురుకు, చంద్రం గుండెలకు అతి సమీపంగా వచ్చిపడింది. అలాగే రెండుచేతుల్తో సుషమను చుట్టేస్తూ, "ష్! నే చెప్పిన మాటలు మధుతో చెప్పకు. ఇది మీ శేఖరన్నయ్య ఆర్డర్. అయినా మీ ఆడవాళ్ళ నోట్లో నువ్వుగింజ నానదు కదా! యిలా చెప్పానో లేదో అలా మధుకు ట్రాన్స్‌ఫర్ చేయాలని పరుగు," అంటూ నవ్వుతూ కౌగిలి బిగిస్తున్న చంద్రం, ఎదురుగా మధు రావడం గమనించి సుషమను వదిలేశాడు. వాళ్ళిద్దరినీ అలా చూసి వెంటనే వెనుదిరిగిన మధు సుషమ పిలుపుతో ఆగిపోయింది. చంద్రం మరోసారి నవ్వుతూ తనవైపు చూసిన సుషమను కళ్ళతోనే హెచ్చరించాడు, బెదిరించాడు. చిన్నగా నవ్వుతూ తల వూపిన సుషమ,

"మధూ ! మా అన్నయ్యా, పదినా వచ్చేనెలలో వస్తున్నారట తెలుసా ?" అంది.

"ఆ విషయం నిన్ననే చెప్పావుగా సుషమా !" అంది మధు నవ్వుతూ.

"చెప్పేశానా ?" అని నాలుక కొరుక్కుంటున్న సుషమను అలాగే వదిలేసి నవ్వుతూ ముందుకు వెళ్ళిపోయింది మధు

మధు వెనకే తలుపులు మూసిన చంద్రం కౌగిట్లో నుంచీ తప్పుకోలేక అలాగే నవ్వుతూ వొదిగిపోయింది సుషమ గువ్వ పిట్టలా.

* * *

"మధూ!" ఏవో ఆలోచనల్లో తేలిపోతున్న మధు వులిక్కిపడి తలెత్తి చూసింది. ఎదురుగా నవ్వుతూ కనిపించిన శేఖర్‌ని చూసి, నవ్వుతూ లేచి "కూర్చోండి" అంటూ కుర్చీ ముందుకు జరిపింది.

"ఊహు! అలా పొలాల వైపు వెళ్దాం రా!" చేయి పట్టి ముందుకు అడుగు వేసిన శేఖర్ స్పర్శతో తడబడింది మధు. చాలా రోజులయిన తర్వాత తనకంత దగ్గిరగా నిలబడి తన కళ్ళలోకి చూస్తున్న శేఖర్ కళ్ళలోకి చూసి ఆ మాటను ధిక్కరించగల ధైర్యంలేక, నెమ్మదిగా శేఖర్‌ను అనుసరించింది. మధు అనుసరించగానే చెయ్యి వదిలేశాడు శేఖర్.

మధుకు శరీరమంతా తేలిపోతున్నట్లుగా వుంది. అతనలాగే చేయిపట్టుకొని నడిపించుకెళ్తే బావుండు ననిపించింది కానీ శే ఖ ర్ ముందుకు నడిచాడు శరీరాన్ని స్వాధీనంలోకి తెచ్చుకొని శేఖర్ వెనకే నడిచింది.

పచ్చగా పెరిగి తల లూపుతున్న చెరుకుతోటల ప్రక్కనుంచి నడిచి, నిమ్మతోటను చేరుకున్నారు. అక్కడనుంచి పొలం గట్లమీదుగా నడుస్తూ శేఖర్ ఎప్పుడూ కూర్చొనే చోట, ఓ గట్టుమీద కూర్చున్నాడు. పక్కనే కొద్ది దూరంలో కూర్చుంది మధు ఇద్దరూ మౌనంగా కూర్చున్నారు. శేఖర్‌కు మనసు నిండిన ఆనందంతో మాటలు రావడంలేదు.

గమ్మత్తేమిటంటే రెండు విరుద్ధ పరిస్థితుల్లో మనిషి ఒకే అనుభవాన్ని పొందుతాడు హృదయం ఆనందంతో నిండిపోయినప్పుడు, హృదయం బాధతో నిండిపోయినప్పుడు ఈ రెండు పరిస్థితుల్లోనూ మనిషికి ఆత్మీయుల దగ్గర మాట పెగలదు. శేఖర్ కొంతసేపటికి మాటలు కూర్చుకుంటూ,

"మధూ!" ఆశ్చర్యంగా కళ్ళెత్తి చూసిన మధు మరింకేమీ వినకుండా శేఖర్ హృదయంలో తలదాచుకుంది. ఆ పిలుపులోని ఆత్మీయత మధును కట్టేసింది. అలా తనను పిలిచింది మొదట తండ్రి. ఆ తర్వాత శ్రీధర్ మావయ్యా, యిప్పుడు శేఖర్. కొంతసేపు అలాగే శేఖర్ గుండెలయల్ని వింటూ, విశ్రాంతి తీసుకున్న మధు నెమ్మదిగా లేచి సర్దుకుని కూర్చుంది. తన తొందరపాటుకు ఏమాత్రం సిగ్గుపడటంలేదు మధు. శేఖర్ తనకు పరాయివాడని అనిపించడంలేదు. నెమ్మదిగా మధు భుజంమీద చేయివేసి "ఇప్పటికైనా నన్ను గ్రహిస్తావా మధూ! నాన్నగారు సాధ్యమైనంత త్వరలో మన వివాహం చేయాలనుకుంటున్నారు," అన్నాడు చిన్నగా నవ్వుతూ. మౌనంగా కూర్చున్న మధువైపు రెప్ప వాల్చకుండా చూస్తున్నాడు శేఖర్. మళ్ళీ తనే అన్నాడు. "మధూ! నీ కిష్టంలేకపోతే మరో పధి సంవత్సరా లాగటానికైనా నేను సిద్ధమే. ఈ మధ్య నాన్నగారి పరిస్థితి ఏమంత బావుండటంలేదు. అనారోగ్యంతో బాధపడుతున్నారు. వయస్సు కూడా ఆయన శక్తిని, సహనాన్ని పోగొడుతోంది. ఆయన చిరకాలవాంఛ నా వివాహం చూడాలని. అమ్మ కూడా రోజూ అదే విషయం చెప్పి బాధపడుతోంది. ఇన్నాళ్ళూ నీ మనసు స్థిమితంగా లేదనీ, మానసికంగా నువ్వు దెబ్బతిని వున్నావనీ ఈ విషయం యింతకాలం నీ దగ్గర ఎత్తలేదు. ఇప్పుడైనా నీ అంగీకారం లేకుండా ఏమీ జరగదు," అంటున్న శేఖర్ వైపు చూసిన మధు కళ్ళు కృతజ్ఞతతో నిండుకున్నాయి.

'తన మంచికోసం, తన మనసు కోసం, అంతగా ఆలోచించే ఆప్తుడిని, ఆత్మీయుణ్ణి, యిన్నాళ్ళూ తను ఎంత గానో బాధపెట్టింది? అతను తన మూలంగానే యిన్నాళ్ళూ ఒంటరిగా వుండిపోయాడు. అయినా ఓ చిన్న నిందకూడా తనమీద వేయకుండా, యిప్పుడు కూడా తన యిష్టానికి వ్యతిరేకంగా జరగదని హామీ యిస్తున్నాడా ప్రేమమూర్తి! అతనికి ఏమిచ్చి తను అతని ఋణం తీర్చుకోగలదు?' కన్నార్పకుండా తన వైపే చూస్తున్న మధును చూసి తలవంచుకొని,

"మధూ! వెళ్ళిపోదాం!" అంటూ మౌనంగా లేచి నుంచున్న శేఖర్ వైపు కళ్ళెత్తి చూస్తూ "సమాధానం అక్కర్లేదా బావా?" అంది చిన్నగా నవ్వుతూ. మధు వైపు ఆశ్చర్యంగా చూసిన శేఖర్‌కు ఆ కళ్ళలో కదలాడుతున్న కొంటెతనం కన్పించింది. మళ్ళీ గట్టు మీద కూర్చుంటూ,

"అక్కర్లేదు, మరదలుపిల్ల దారిలో పడిందని తెలిసిపోయింది" అంటూ మధు చేయి చేతుల్లోకి తీసుకొని ఆపేక్షగా నిమురుతూ చటుక్కున పెదవుల కానించుకొని ఆ చేయి పట్టుకొని అలాగే లేచి నిలబడ్డాడు. యిద్దరూ నవ్వుతూ నడకసాగించారు.

అన్నాళ్టికి మళ్ళీ మొట్టమొదట తనకు గంగాపూర్‌లో అడుగు పెట్టగానే దర్శనమిచ్చిన...మధు, కొంటెతనంగా చేసిన దిష్టి తీయడం సీను, మామిడితోట, మా మావయ్యగారి దన్న దబాయింపూ, అన్నీ జ్ఞాపకం వచ్చి శేఖర్ పగలబడి నవ్వాడు. ఆ నవ్వు చూసి బిత్తరపోయిన మధు–

"ఏవిటది? ఏమైంది? ఎందుకంతలా నవ్వుతున్నారు?" అంది ఖంగారుగా.

"ఏం లేదు. యిటునుంచిటు మీ మావయ్యగారి తోట కెళ్దామేవిటి? చెట్లెక్కి మామిడికాయలు కోసి, సగం తిని నాకు విసురుదువుగాని" అన్నాడు, మధు చేయి మృదువుగా నొక్కుతూ ఎగతాళిగా.

అప్పటి తన ప్రవర్తన గుర్తుకు రావడంతో మధు కూడా శేఖర్ నవ్వుతో శృతి కలిపింది. పక్షులు కిలకిలారావాలతో గూళ్ళకు చేరుతూ వాళ్ళ నవ్వులతో శృతికలిపాయి

పల్చటి నీరెండలో ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ, కొత్తగా కడుతున్న హాస్పిటల్ భవనం ముందుగా వూళ్ళోకి ప్రవేశించే దగ్గర చెట్టా పట్టాలేసుకున్న రెండుచేతులూ విడిపోయాయి.

"సార్! యింక మీ దారి అటు, నా దారి యిటూ" అంటూ ముందుకు అడుగులువేస్తున్న మధు చేయిపట్టుకొని,

"మధూ! యింక మనిద్దరి దారీ ఒక్కటే! పద! చెయ్యి పట్టుకుంటే బావుండదు గాని ముందు చంద్రంతో

ముహూర్తాలు పెట్టించమని చెప్పాలి. పద" అంటూ మధును అనుసరించాడు.

సుషమ చెప్పిన ప్రకారం మరో నెల రోజుల్లో వున్న ముహూర్తం నిశ్చయం చేసుకున్నారు. శ్రీధర్ గారు తన ఆనందాన్ని తెలియజేస్తూ, కొన్ని పనుల వత్తిడివల్ల తను ముందు రాలేకపోతున్నానని ముహూర్తం సమయానికి తప్పక వస్తామని లెటర్ వ్రాశారు. పెళ్ళిపనులు అత్యంత ఉత్సాహంగా చేస్తున్నాడు చంద్రం. శాంత పెళ్ళికంటె ఘనంగా జరగాలని శతని ప్రయత్నం రఘుపతి గారు తన యింటి దగ్గర ఏర్పాటు చేయిస్తానంటే,

"నాన్నగారూ! మీ అంత గొప్పగా నేను చేయలేకపోయినా మా చెల్లెలి పెళ్ళి మా యింట్లో జరగటమే న్యాయం," అంటూ రఘుపతిగారిని ఒప్పించాడు చంద్రం.

మధు, శేఖర్‌ల పెళ్ళి అని తెలిసి వూళ్ళో కుర్రకారంతా చేరి పెళ్ళి పనుల్లో తలా ఓ చెయ్యేవేసి, చంద్రం కోరిక ప్రకారం గోపాలంగారింటి ముందు పెద్ద పందిరితో పాటు బ్రహ్మాండమైన కళ్యాణ మండపం తయారుచేశారు. రంగు రంగుల కాగితాలతో, పూలతో, పందిరికి వేలాడగట్టిన మావిడాకుల తోరణాలతో ఆ యింటికే ఒక చక్కటి కళ వచ్చింది. గంగాపూర్ అభివృద్ధికి ఎంతో శ్రమించిన మధు, శేఖర్, చంద్రం గంగాపూర్ పిల్లలందరికీ మార్గదర్శకులుగా కనిపించారు. అందుకే యువకులంతా నడుం కట్టి చంద్రానికి సాయంగా వచ్చారు. తమ తోబుట్టు పెళ్ళిలాగే సంబరపడుతున్నారు వాళ్ళు పైగా ఓ సామాన్యమైన కుటుంబంలో పుట్టిన మధు ఆ వూరికే ఆధిపతిలాంటి రఘుపతిరావుగారి కోడలు, తమకు అతి ప్రియమైన శేఖర్‌కు భార్య కాబోతోందంటే వాళ్ళకు చెప్పలేని ఆనందంగా వుంది.

శాంత, సుషమ తీరికలేకుండా జమీందారుగారింటికీ, పెళ్ళింటికీ తిరుగుతూ మహా హడావుడి పడిపోతున్నారు. అసలు తీరికే లేనట్లుంది వాళ్ళను చూస్తే. చంద్రం తల్లి శాంత కొడుకును చూస్తూ వాడి బాధ్యత తను వహించి వాడి మంచి చెడులు చూస్తుంటే, శాంత మళ్ళీ ఎప్పటిలా, చిన్నపిల్లలా గంతులు వేస్తూ సుషమతోపాటు తిరుగుతూ, మధ్య మధ్య మధును, సుషమనూ అల్లరి పెడుతూ కొడుకును కూడా మరచి, సందడిగా తిరుగుతోంది. రాజేశ్వర్ కూడా పెళ్ళికి నాలుగురోజులు ముందుగానే వచ్చి పెళ్ళి పనుల్లో యింటల్లుడి హోదాతో, మధు అన్న హోదాతో పాల్గొన్నాడు.

అనుకున్న రోజొచ్చింది. ముహూర్తం రోజు ప్రొద్దుటే శిరీష్, ఫ్లారెన్స్ దిగారు. శ్రీధర్‌గారు వెనక ట్రెయిన్‌లో వస్తానన్నారని చెప్పారు. అన్నా, వదినా

వచ్చేసింతర్వాత కూడా తండ్రికి అంత తీరికలేని పనులేమిటో తెలీక విసుక్కొంది సుషమ. తనని పలకరించ డానికి వచ్చిన శిరీష్‌తో,

"మావయ్యను మీతోపాటు తీసుకు రావల్సింది" అంది నెమ్మదిగా మధు. ఆయన రాలేదంటే మనసులో చాలా బాధగా వుంది. ఏదో వెలితిగా వుంది. శిరీష్, ఫ్లారెన్స్‌లకు ఘనస్వాగతం ఇచ్చాడు శేఖర్. చంద్రం వచ్చిన వాళ్ళను తమ యింటికి లాక్కెళ్ళాడు శేఖర్‌తో పోట్లాడి.

"ఒరే చందూ! వాళ్ళు నా పెళ్ళికి వచ్చార్రా ఫూల్" అంటుంటే-

"కాదు నా మరదలి పెళ్ళికి వచ్చారు. పెళ్ళి మా యింట్లో. మీ యింట్లో కాదు" అంటూ శిరీష్‌ను చెయ్యి పట్టుకు లాక్కె ళుతున్న చంద్రం వైపు విచిత్రంగా చూస్తున్న ఫ్లారెన్స్‌కు విషయం వివరించి, నవ్వుతూ ఫ్లారెన్స్‌తో చంద్రం యింటికి చేరుకున్నాడు శిరీష్. ఎదురుగా వచ్చిన చెల్లెల్ని కళ్ళనిండుగా చూస్తూ ఫ్లారెన్స్‌కు పరిచయం చేశాడు శిరీష్. ఆ తర్వాత యిద్దరూ మధు వున్న గదిలోకి వెళ్ళారు. మధుకు కూడా ఫ్లారెన్స్‌ను పరిచయం చేసి ఫ్లారెన్స్‌ను సుషమ కప్పగించి, చీర కట్టించమని చెప్పి వాళ్ళందరికోసం తెచ్చిన డజను చీరలు సుషమ కిచ్చాడు.

కబుర్లతో, జోక్స్‌తో యిల్లంతా సందడిగా వుంది. సరదాగా టైమ్ తెలీ కుండా గడిచిపోతోంది.

అంత గొప్పగా షామియానాలు కట్టడం ఎప్పుడూ చూడని గంగాపూర్ ప్రజలకు వింతగా విచిత్రంగా వుండ టమే కాకుండా, ఆ పెళ్ళికి అందరికీ ఆహ్వానముందని తెలిసి సంతోషంగా వుంది.

రాత్రి ముహూర్తం సమయానికి దిగారు శ్రీధర్‌గారు. సరాసరి రఘుపతి రావుగారింటికి వెళ్ళారు. అప్పటికే అంతా పెళ్ళికి తరలివెళ్ళడంవల్ల తన వెంటవచ్చిన యువకుడిని, శేఖరింటి దగ్గరే వదలి, తను పెళ్ళిజరిగే చోటుకు చేరుకున్నారు

మధు, శేఖర్‌ల వివాహం ఘనంగా వైభవోపేతంగా జరిగింది. చంద్రం శేఖర్ కాళ్ళు కడిగి కన్యాదానం చేశాడు. అప్రయత్నంగా చంద్రం కళ్ళలో నీళ్ళు తిరిగాయి. బాబాయి చెయ్యాల్సిన పని తను చేయవలసి రావడం తలుచుకొని అంతలోనే కళ్ళు తుడుచుకొని, నవ్వుతూ పురోహితుడడిగినవన్నీ అందిస్తున్నాడు. సూత్రధారణ జరిగిపోయింది. మాధవి, శ్రీమతి మాధవి అయింది. మాధవీ శేఖ రయింది. దంపతులిద్దరూ లేచి అందరికీ నమస్కరిస్తున్నారు రఘుపతిరావుగారు ఆనందంగా కళ్ళు తుడుచుకున్నారు కాళ్ళకు నమస్కరిస్తున్న మధును శేఖర్‌ను పైకి లేపుతూ.

మధు ముందుకు ఓ అడుగువేసి శ్రీధర్‌గారి కాళ్ళకు నమస్కరించింది.

శేఖర్ కూడా నవ్వుతూ శ్రీధర్ గారికి పాదాభివందనం చేశాడు. యిద్దర్నీ దగ్గరకు తీసుకొని

"మాధూ! శేఖర్! యివాళ నాకెంత ఆనందంగావుందో తెలుసా? యిన్నాళ్ళకి నా కోరిక ఫలించింది." అంటున్న ఆయన కళ్ళు చెమ్మగిల్లటం చూసిన మధు కళ్ళలో నీళ్లు చిప్పిల్లాయి. అతికొద్ది పరిచయంతో అంత ఆపేక్షగా తన మంచిచెడ్డల్ని గురించి ఆలోచించి బాధ పడ్డ ఆయనమీద భక్తిభావం కలిగింది. అక్కడినుంచి ఎదురుగా నవ్వుతూ చూస్తున్న చంద్రం దగ్గరకెళ్ళి క్రిందకు వంగిన మధును మధ్యలోనే భుజాలుపట్టి పైకి లేపి కళ్ళు తుడుచుకుంటున్న చంద్రాన్ని ఆప్యాయంగా కౌగిలించు కున్నాడు శేఖర్. సారధిలా నిలచి తన ప్రతి పనిలో ఓ సోదరుడిలా తోడ్పడ్డ తన బహిఃప్రాణం చందూకి అంతకంటే ఎలా కృతజ్ఞతలు తెలియజేయాలో తెలీలేదు శేఖర్‌కు.

చంద్రం వెనగ్గా నుంచొని ఆతృతగా చూస్తున్న రెండుకళ్ళు మధును ఆకర్షిం చాయి. ఆ కళ్ళలో ప్రతిఫలిస్తున్న బాధా, ఆనందం సమ్మిళితమైన భావం మధు మనసును లాగినట్లైంది. చంద్రాన్ని దాటి ముందుకెళ్ళి చూసింది. ఫుల్ గ్రీన్ సూట్‌లోవున్న ఆ యువకుడిని ఎంతమంది మధ్య వున్నా గుర్తించ గలదు మధు. ఆ యువకుడిని, అలాగే రెండు క్షణాలు దిగ్భ్రాంతితో చూస్తూ నిల్చున్న మధు.

"అక్కా!" అంటూ ముందుకు వచ్చిన శ్యాంని దగ్గరకు తీసుకుంది. చెంపలమీదుగా కట్టలుతెగిన నీటి ప్రవాహం. ముఖంలో అంతులేని ప్రసన్నత.

అక్కమీదవున్న ప్రేమాభిమానాలు గంగాజమునల్లా ప్రవహిస్తున్న కన్నీళ్ళ రూపంలో బయటపడ్డాయి శ్యాం కళ్ళ నుంచి.

మధు పరిస్థితీ అలాగేవుంది. అంతటి ఆనందాన్ని తట్టుకోలేకుండా వుంది. శ్యాం ... శ్యాం అని సన్నగా వణుకు తున్న కంఠంతో అంటూ ధారావాహినిలా కారిపోతున్న కన్నీళ్ళను తుడుచు కునే ప్రయత్నంకూడా చేయకుండా శ్యాం తలా, చంపలు నిమురుతూ తనివి తీరా ఒక్క సంవత్సరంన్నరలో ఎంతో గొప్పగా ఎదిగినట్లున్న శ్యాంని చూస్తోంది

నిజానికి శ్యాం అంతగా ఏమీ ఎదగ లేదు. అయితే నిక్కరు, షర్టుకు బదులుగా, చక్కటి సూట్, అందంగా కత్తిరించిన క్రాప్. మునుపటికంటే దృఢంగా అందంగా పెరిగిన శరీరంతో మరో మనిషిలా కనిపిస్తున్నా అతను శ్యాం అని అర్థమైన అందరికీ అదో అద్భుతంలా కనిపిస్తోంది. అంతా విచిత్రంగా ఆనందంగా కళ్ళు పెద్దవిచేసి



యువ

శ్యాంవైపే చూస్తున్నారు. అక్కను వదిలి ఆశ్చర్యంగా చూస్తున్న చంద్రం, శేఖర్‌ల దగ్గరకు వచ్చాడు శ్యాం. చంద్రం యింకా ఆశ్చర్యంనుంచి తేరుకోకముందే "అలా ఎవరికీ చెప్పకుండా వెళ్ళిపోయినందుకు నన్ను క్షమించు బావా! మిమ్మల్నందరినీ చాలా బాధపెట్టాను" అంటూ తలవంచుకున్నాడు శ్యాం.

అప్పటివరకూ అందరినీ గమనిస్తున్న శ్రీధర్‌గారు ముందుకొచ్చి,

"ఒరే నిన్నప్పుడే ఎవరురమ్మన్నారురా? నా పర్మిషన్ లేకుండా ఎందుకొచ్చావ్! నేను కబురుపెట్టేంతవరకూ రావద్దని చెప్పలేదూ! నేనిటురాగానే, నువ్వూ మెల్లగా జారుకుని వచ్చేశావన్నమాట!" అంటూ ఆప్యాయంగా మందలించడం చూసి మరింత ఆశ్చర్యపోయారు.

చిన్నగా "క్షమించు మావయ్యా! మా అక్కయ్య పెళ్ళి జరుగుతుంటే— వూళ్ళోవుండి చూడకుండా వుండటం నాకు సాధ్యంకాలేదు అందుకే మీ వెనకే వచ్చేశాను. ఇంతవరకూ ఎలాగో చాటున వుండి చూడగలిగాను కానీ అక్కయ్యను యింత దగ్గరలో యిన్నాళ్ళకు చూస్తుంటే మనస్సాగలేదు," అన్నాడు తలవంచుకుంటూ.

"ఫర్వాలేదులేవోయ్! నువ్వు కన్పిస్తే మధ్యలో మీ అక్క లేచెక్కడ వస్తుందోనని మా భయం. అందుకే తర్వాత చూపిద్దామనుకున్నాం" అంటూ శ్యాం భుజం తడుతున్న రఘుపతిరావుగారిని చూసి చంద్రం, శేఖర్ ముఖాలు చూసుకున్నారు.

మధు, శాంత, శిరీష్, సుషమ, ఆ పంక్తిలోవున్న ఏ ఒక్కరికీ ఆ మిస్టరీ ఏమిటో అర్థంకాలేదు చంద్రం ధైర్యం చేసి రఘుపతిగారి దగ్గరకెళ్ళి—

"నాన్నగారూ! విషయమేమిటో మాకెవరికీ అర్థంకావడంలేదు. మీరూ మావయ్యగారూ జంటకవుల్లా మాట్లాడే మాటలు అసలు అర్థంకావడంలేదు. వాడిన్నాళ్ళూ ఎక్కడ వున్నాడు? మీకు తెలుసా? ఎక్కడ కనిపించాడు? మావయ్యగారెలా తీసుకొచ్చారు? మీరెప్పుడు చూశారు?" అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్న చంద్రాన్ని "అబ్బ! ఆగరా చందూ! ఒక్కసారే అన్ని ప్రశ్నలు వేస్తే సమాధానం ఎలా చెప్పనురా. ఒక్కటొక్కటే అడిగితే చెబుతాం సరే అడిగేశావు కనుక విను.

* * *

"ఆ రోజు శేఖర్‌కు జబ్బుగావున్నప్పుడు శ్రీధర్ చూడటానికి వచ్చాడు జ్ఞాపకం వుందా? అప్పుడే మేమిద్దరం కలసి మీ కుర్రకారు చేస్తున్న అపకతవక పనులను గురించి మాట్లాడుకున్నాం. అమ్మాయిమీద మనసుతో ఆరోగ్యం పాడుచేసుకున్న అవివేకి ఒకడైతే...

అమ్మాయికోసం అందర్నీ వదలి అమెరికా దాకా ఆరాటంగా పరుగెత్తిన అభాగ్యుడు మరొకడు." అంటున్న రఘుపతిగారి మాటలకు శిరీష్, శేఖర్ తలలు వంచుకున్నారు. అందుకిప్పుడు సిగ్గుపడ వలసినపని లేదనుకో, అన్నీ ఆనంద కరంగా ముగిశాయి.

ఇంక ఏదో వో ఆదర్శాన్ని పెట్టుకొని గుడ్డిగా అందమైన జీవితాన్నే ఫణంగా పెట్టి అది సాధించాలనుకున్న మధు విషయం కూడా ఆలోచించాం. పరిష్కార మేమిటాని తలలు బద్దలుకొట్టుకున్నాం. అప్పుడే ఓ అయిడియా వచ్చింది. శ్యాంని యిక్కడలేకుండా చేస్తే... ఆదర్శాన్ని నమ్ముకున్న అమ్మాయికి ఆధారానికి అల్లుకుపోవలసిన ప్రకృతి సత్యం గుర్తొస్తుందని." క్రీగంట మధును చూసిన రఘుపతిగారు చిన్నగా నవ్వారు మధు తలవంచుకుంది. సరే యిద్దరం కల్సి ప్లాన్‌వేశాం. ఎలాగూ పరీక్షలు దగ్గరకొచ్చాయి కనుక అవి అయ్యేంతవరకూ వుంచి, ఆ తర్వాత తనదగ్గర వదిలివేయమని శ్రీధర్ చెప్పాడు. అది సమంజసంగానే కనిపించింది.

తెల్లవారితే పరీక్షలైపోతాయనగా స్కూల్‌దగ్గిర కాపువేసి. పరీక్షవ్రాసి వుత్సాహంగా బయటకు వస్తున్న శ్యాంని పట్టుకున్నాను "నీతో మాట్లాడాలి రారా బాబూ" అంటే భయపడుతూనే నన్ననుసరించాడు. మా తోటదగ్గరకు తీసుకెళ్ళి ఓ చెట్టుక్రింద కూర్చుంటూ వాడినీ కూర్చోబెట్టాను. వాడు భయం భయంగా చుట్టూ చూస్తున్నాడు. యింత పెద్దమనిషికి నాతో మాటలేమిటానిపించి వుండవచ్చు... సరే కూర్చోబెట్టి 'నీకేం భయ లేదురా నాన్నా' అని విషయం వివరించాను "కలకత్తా తీసుకెళ్తాను వస్తావా? శ్రీధర్ మావయ్య నిన్ను చదివించి గొప్ప ఆఫీసర్‌ను చేస్తారట.

అయితే యీ విషయం మీ అక్కయ్యతో అన్నావంటే నువ్వనుకున్నట్లు జరగదు. మీ అక్కయ్య నిన్ను తన దగ్గిరే అట్టిపెట్టుకోవాలని చూస్తుంది అప్పుడు మీ అక్కయ్యకు పెళ్ళికాదు, నువ్వు ఆఫీసరువీ కాలేవు" అని సాధ్యమైనంతవరకూ వాడి బుర్రలోకి వున్న నిజాన్ని కలకత్తా వెళ్ళడంవల్ల కలిగే రెండు మంచిపనులను ఎక్కించడానికి ప్రయత్నించాను. కొంచెంసేపు ఆలోచించి...

"మరి... నన్ను పైలట్ ఆఫీసర్‌ని చేస్తారా?" అన్నాడు... "ఓ యస్" అన్నాను.

"మరి......మరి......అక్కయ్య ఒక్కతీ ఎలా వుంటుందండీ... నే వెళ్ళిపోతే ఒక్కతీ అయిపోతుందిగా, బాగా యేడుస్తుంది" అని చెబుతున్న వాడి కళ్ల వెంట నీళ్ళుచూసి ఓ క్షణం నా మనసు చలించింది. అక్కా తమ్ముళ్ళను వేరు

చేసిన పాపం నాకు తగులుతుందేమో! అనిపించింది. అయినా మనసు దృఢం చేసుకుంటూ చెప్పాను "మీ అక్కయ్యకేం ఫర్వాలేదు. శేఖర్‌ని పెళ్ళిచేసుకొని మా యింట్లో వుంటుంది. నువ్వు ఆఫీసరువైన తర్వాత తిరిగొచ్చి మీ అక్కయ్యను, బావను చూద్దువుగాని" అన్నాను. వాడే మనుకున్నాడో "సరే" అన్నాడు. "మరి ఈ విషయం ఎవరితో చెప్పవద్దు. రేపు సాయంత్రం పరీక్షకాగానే స్కూల్ నుంచి సరాసరి బస్‌స్టాండుకు రా! అక్కడ దారిన వచ్చేసెయ్. రాత్రిబండి పట్టుకొని కలకత్తా వెళ్ళిపోదాం" అన్నాను.

అన్నమాట ప్రకారం శ్యాం వచ్చాడు. నేను మామూలుగా శ్రీధర్ లెటర్ వ్రాశాడు,ఏదో పనుందట. కలకత్తా వెళ్ళి వస్తానని యింట్లో చెప్పి బయలుదేరాను. అదృష్టవశాత్తూ ఆ రోజు మన వూరివాళ్ళెవరూ మేమెక్కిన బస్సు ఎక్కలేదు. బస్సులో స్టేషన్ చేరి, వెంటనే ఆ రాత్రి బండిలో కలకత్తా చేరుకున్నాం.

అక్కడ వాడిని కాలేజీలో చేర్పిద్దామన్నాడు శ్రీధర్ వాడిని మళ్ళీ అడిగాను "ఏంరా శ్యాం! కాలేజీలో చేరతావా? పైలట్ ఆఫీసర్‌వి అవుతావా?" అని. వాడు రెండోదే కోరుకున్నాడు. తొందరగా ఆఫీసరైపోతే గంగాపూర్ వచ్చేయవచ్చని. శ్రీధర్ ఇన్ఫ్లుయన్స్‌తో వాడిని ఫ్లైయింగ్ సెంటర్‌లో మెంబరుగా చేర్చుకున్నారు. సంవత్సరంనుంచీ ఓ ప్రక్క చదువుకుంటూ, ఓ పక్క ఫ్లైయింగ్ సెంటర్‌లో ట్రైనింగ్ అవుతున్నాడు. మొన్న జరిగిన పైలట్స్ యింటర్వ్యూకు ఎటెండయి అన్ని టెస్ట్‌లూ నెగ్గాడు ప్రస్తుతం మనవాడు, యిండియన్ ఎయిర్ ఫోర్స్‌లో పైలట్" అంటూ నవ్వుతూ శ్యాం కథ ముగించారు రఘుపతిరావుగారు. ఈ క్రెడిట్ అంతా శ్రీధర్‌ది. శ్రీధర్, శ్యాం నాన్నగారు శ్రీరాం ఆప్తమిత్రులట ఒకప్పుడు. ఆ అభిమానంతో ప్రాణస్నేహితుడి పిల్లలమీద మమకారం పెంచుకున్నాడు.

'నా కొడుకు అమెరికా వెళ్ళిపోయినా మరో కొడుకు దొరికినందుకు పొంగిపోతున్నాను' అంటూ లెటర్స్ వ్రాసేవాడు శ్రీధర్. అంటున్న రఘుపతిగారి భుజంమీద చేయివేస్తూ "ఆపండి, మీ పొగడ్తలు. మీరు శ్యాంని అంత జాగ్రత్తగా మరో కంటికి తెలీకుండా అప్పగించకపోతే నేనేం చేయగలిగే వాణ్ణి," అంటున్న శ్రీధర్ దగ్గరగా వస్తూ "నేనింతటివాడిని కావడానికి మీ యిద్దరూ కారకులే మావయ్యా!" అంటూ యిద్దరికాళ్ళకూ నమస్కరిస్తున్న శ్యాంని చూసి గర్వంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకొని నవ్వుకున్నారు శ్రీధర్ రఘుపతిరావుగార్లు.

వాళ్ళకు దగ్గరగా వచ్చిన మధు, ఓ క్షణం వాళ్ళిద్దర్నీ చూసి "మీ ఋణం

ఎలా తీర్చుకోగలం మావయ్యా!" అంటు యిద్దరినీ వుద్దేశించి.

"అది చాలా తేలికమ్మాయ్! అతి త్వరలో ఓ అందమైన మనవణ్ణి అందించావంటే... మేమే నీకు ఋణపడిపోతాం" అంటున్న రఘుపతిగారి మాటలు అప్పటి వరకూ మౌనంగా ఆయన చెబుతున్న కథా జరుగుతున్న కథా చూస్తున్న అందరికీ నవ్వు తెప్పించాయి. ఆ కళ్యాణ మండపం ఓసారి నవ్వులతో మార్మోగింది.

"కంగ్రాచ్యులేషన్స్ బావగారూ!" అంటూ చెయ్యి చాపిన శ్యాం వీపున ఒక్కటి చరిచి దగ్గరకు లాక్కున్నాడు శేఖర్.

గర్వంగా మెరుస్తున్న శేఖర్ కళ్ళు చూసి, సిగ్గుతో మధు కళ్ళు వాలిపోయాయి. మధురంగా నవ్వుతున్న మధు పెదాలవైపు నవ్వుతూ చూశాడు శేఖర్.

మధు మమత నిండిన ఆ మనుషుల మంచితనాన్ని, మధురానురాగంతో తనను బంధీని చేసి బ్రతికించుకున్న శేఖర్ కళ్ళలో ప్రవహిస్తున్న ప్రేమ వాహినినీ చూసి తనలో తాననుకుంది- మొట్టమొదటిసారిగా ప్రపంచంలో తనంతటి అదృష్టవంతు లెవ్వరూ వుండరని

ఇంతలో "మరో శుభవార్త ఈ సంవత్సరంతో రిటైర్ కాబోతున్న శ్రీధర్ మన 'గంగాపూర్' వచ్చేసి యిక్కడే వుండిపోవాలనే నిశ్చయానికి వచ్చాడు" అన్నారు రఘుపతి నవ్వుతూ శ్రీధర్ వైపు చూస్తూ. సుషమ, మధు ఆనందంగా చూశారు.

"చూడు మధూ! నన్ను ఒక్క శుభవార్తైనా చెప్పనిస్తున్నారేమో! అన్నీ తనే చెప్పేస్తున్నారు" అంటున్న శ్రీధర్ వైపు కళ్ళ నిండా ఆప్యాయత నింపుకొని చూస్తూ "పోనీ గంగాపూర్ లోనే వుండాలనే అభిప్రాయానికి నువ్వెందుకొచ్చావో నువ్వు చెప్పు మావయ్యా!" అంది నవ్వుతూ.

అందరూ ముందుకు సర్దుకున్నారు కుతూహలంగా ఏం చెబుతారోనని. గర్వంగా రఘుపతిరావుగారి వైపు చూసి "ఏముందీ నా కొడుకు శేఖర్, అల్లుడు చంద్రం, కోడలు మధు, కూతురు సుషమా కలసి కృషిచేసి సకల వసతులూ కల్పించారు గంగాపూర్‌కు. అంతేకాక యింక కలకత్తాలో ఏముంది గనుక యిక్కడ లేంది? దుమ్మూ, ధూళీ వున్నాయి. అవి మనకక్కరలేదు. కనక పరిశుభ్రమైన పల్లెలో పంటపొలాల్ని చూస్తూ, అపురూపంగా దొరికిన మిత్రులు రఘుపతిగారితో గంగాతీరానికి షికార్లు వెళుతూ, నా వాళ్లందరి సమక్షంలో హాయిగా నా శేషజీవితాన్ని గడపాలన్నదే నా కోరిక" అంటున్న శ్రీధర్ మాటలకు మధు శాంతకు సైగచేసి, చప్పట్లు

కొట్టింది అంతా లయబద్ధంగా చప్పట్లు కొడుతుంటే తెల్లబోయి చూశారు శ్రీధర్.

"ఇక పదండి, భోజనాలకు వేళ మించి పోతోంది పదరా శ్యాం! పనులన్నీ తప్పించుకున్నా వడ్డన పని నీకు తప్పదు. ముందా సూటూ, బూటూ విప్పి పంచ కట్టుకొని లాల్చీ వేసుకురా, వడ్డించేద్దాం అందరికీ" అంటుంటే "బావా! మొత్తానికి పల్లెటూరి బావ వనిపించావు." అంటున్న శ్యాంని కొట్టబోతే తప్పుకొని యింట్లో దూ రా డు... అంతా నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటూ ముందుకు కదిలారు భోజనాలకు

* * *

ఆ రాత్రి తెల్లటి వెన్నెలతో పోటీ పడుతున్న పాలనురగలాంటి చీర కట్టుకొని ముఖమంతా వెలుగు నింపుకొని, మనసు నిండిన సంతోషంతో శేఖర్‌ని సమీపించిన మాధవి, శేఖర్ అనురాగంతో చాచిన చేతుల్లో మనస్ఫూర్తిగా ఒదిగిపోతూ అతని కౌగిలిలో కరగిపోతూ మరోసారి అనుకుంది, తనంత అదృష్టవంతురాలు ప్రపంచంలో మరొకరు వుండరని. అంతేకాక మరో విషయం నిశ్చయంగా తెలిసింది. ఆ ప్రేమ వాహినిని తప్పుకుపోగం శక్తి తనకు లేదని, ఆ ప్రేమ జలధిలో మనస్ఫూర్తిగా మునగటంలో వున్న తృప్తి మరెందులోనూ లేదనీ... ఆ అనురాగానికి వారధి కట్టిన మెరుస్తున్న మంగళసూత్రాలు తీసుకొని కళ్ళకద్దు కుంటున్న మధును మరింత దగ్గరగా తీసుకుంటూ, చెవిలో గుసగుసగా "గంగాతీరానికి వెళ్దామా గంగమ్మా!" అంటుంటే సిగ్గుగా అతని గుండెల్లో తలదాచుకుంది మధు.

అదే సమయంలో పౌర్ణమి వెన్నెల్లో గంగాతీర సౌందర్యాన్ని చూడాలని అభిలాషపడుతున్న సుషమను తీసుకొని చంద్రం గంగాతీరం చేరుకున్నాడు.

"ఇన్నాళ్టికి నాకున్న ఓ పెద్ద బాధ్యత తీర్చుకోగలిగాను సుషమా! యింక మనం తీరిగ్గా ప్రేమించుకోవచ్చు" అంటూ నవ్వుతున్న చంద్రం ఒళ్ళో పడుకొని "ఇన్నాళ్ళూ ప్రేమించడానికి తీరిక దొరక్క, వదిలేశారా సార్?" అంటూ నవ్వుతూన్న సుషమ నవ్వుతో స్మృతి కలుపుతూ వెన్నెల్లో మిలమిలా మెరుస్తున్న ఆ కళ్ళమీద సున్నితంగా ఓ ముద్ర వేశాడు చంద్రం. "చందూ" అని పిలుస్తూ అతని మెళ్లో రెండు చేతులూ హారంలా వేసిన సుషమను, యింక మాట్లాడనివ్వలేదు చంద్రం.

(సమాప్తం)

Printed and Published by A. Chandra Seker Rao at 5-9-88, Public Garden Road Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Garden Road, Hyderabad-500 001. Editor : A. SUDHAKARA RAO